స్వగృహాన్ని మించిన సర్వసుఖనిలయం
మరొక్కటిలేదు. కానీ రోజురోజుకు
పెరిగిపోతున్న ధరలతో వ్యయంతో
సొంత ఇల్లు కట్టుకోవటం అనేది
సామాన్యులకు కలగానే మిగిలిపోతోంది
అయితే... మీ కలకు వాస్తవరూపం ఇవ్వటం
అసాధ్యంకాదు. సరైన పద్ధతిలో సరైన
పొదుపుతో మీరు ముందడుగువేస్తే
మీ కలల్లోని అందాల భవనం
మీ సొంతమవుతుంది.


సరైన పద్ధతిలో పొదుపు చేయటమంటే
మార్గదర్శి ద్వారా పొదుపు
చేయటమనే అర్థం!!

మీ అవసరాలన్నిటికీ తగిన విధంగా
మార్గదర్శిలో ఎన్నెన్నో పథకాలున్నాయి.
మీ డబ్బుకు మార్గదర్శిని మించిన
భద్రతలేదు.

మార్గదర్శి చిట్‌ఫండ్‌కు 25 సంవత్సరాల
చరిత్ర ఉంది. సాలీనా 120 కోట్ల
రూపాయల బిజినెస్ టర్నోవర్‌తో,
80 కోట్ల రూపాయల ఆక్షన్ టర్నోవర్‌తో
భారతదేశంలోకెల్లా నంబర్ 1 చిట్‌ఫండ్
సంస్థగా మీముందు నిలుస్తోంది- మార్గదర్శి.

అన్నిటా అగ్రగామి అయిన మార్గదర్శితో
కలిసి నడవండి. మరిన్ని వివరాలకు
మా ఏజెంట్లను కలవండి లేదా
మమ్మల్ని సంప్రదించండి.

డబ్బుకోసమేనా మీ చింత? మార్గదర్శి ఉన్నది మీ చెంత!




No.1 Chit Fund in India

మార్గదర్శి

చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్టర్డ్ మరియు సెంట్రల్ ఆఫీస్:
అబిడ్ సెంటర్, హైదరాబాద్- 500 001
బషీర్‌బాగ్, హైదరాబాద్ లక్డీకాపూల్, హైదరాబాద్ చిక్కడపల్లి, హైదరాబాద్ అమీర్‌పేట్, హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ హైదరాబాద్ ఎమ్.జి.రోడ్, సికింద్రాబాద్ ఎ.ఎమ్.సి. కాంప్లెక్స్, విజయవాడ బంగర్‌రోడ్, లబ్బీపేట, విజయవాడ జగదాంబా జం. విశాఖపట్నం స్టేషన్‌రోడ్, గుంటూరు జె.పి.ఎన్.రోడ్, వరంగల్ టి.నగర్, రాజమండ్రి సుభాష్‌రోడ్, కాకినాడ నెహ్రూరోడ్, కర్నూల్ వైరారోడ్, ఖమ్మం నరసింహారావ్‌పేట్, ఏలూరు ఆర్.ఆర్.స్ట్రీట్, నెల్లూరు.

గృహమే కదా స్వర్గసీమ...
కానీ గృహనిర్మాణం అంటే మాటలతో పనా!



IRON/MCH/10389

మనలో మాట

అన్నిరకాల విఘ్నాలను తొలగించమని అందరూ పూజలు చేసే మహాపర్వదినం వినాయక చవితి. ఇదే మంచి రోజున 81 సంవత్సరాల నాడు (1908 లో) బొంబాయిలో ప్రారంభమైన ఆంధ్రసచిత్ర వారపత్రిక నిరాఘాటంగా తెలుగు ప్రజల మనస్సులను దోచుకుంటూ 82 వ జన్మదినోత్సవం చేసుకుంటున్న శుభ సమయాన యింత కాలం జనజీవన స్రవంతిలో కలిసి యింటింటా అభిమాన పత్రికగా రాణించిన రీతి– ఆదరించిన ఆదరిస్తున్న వారందరికి ఋణపడి వున్నాము! ఏజెంట్లకి, ప్రకటనకర్తలకు, రచయితలకు, పాఠకులకు శుభాకాంక్ష లందిస్తున్నాము. ఆంధ్రప్రదేశ్‌లో, 'ధాన్యాగారం'గా వాసికెక్కిన ప్రాంతాలన్నీ యిప్పుడు 'జల ప్రళయం' ముంపునకు గురియై వున్నాయి! మిన్నూ మన్నూ ఏకం చేస్తూ కురిసిన అతివృష్టి ప్రభావంతో రైళ్లు నడవవు, బస్సులు పరిగెత్తవు– పండుగ వేడుకగా గాక– వినాయకునికి ప్రత్యేక వేడుకోలుగా, కడగండ్ల బారి నుంచి తప్పించమని చేసే పూజగా జరుగుతున్నది! ఆంధ్ర సచిత్ర వారపత్రికను ఈ 82 వ సంవత్సరపు మా సేవలో యితోధికంగా ఆదరిస్తారని ఆశిస్తున్నాము!–

నిజమా?

ఇటీవల రాజీవ్‌గాంధీగారు తిరుపతిలో ఒక బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించబోవు చుండగా చిత్తూరు జిల్లా మదనపల్లిలోని "సుగాలీతాండా" అనే సుగాలీ మహిళలు కొంత మంది నేరుగా ప్రధాని దగ్గరకు వెళ్లి ఆయనకు ఒక వస్త్రాలతో చేసిన మాలను సమర్పించి మాకు కనీస వసతులు ఇల్లు, కూడు, గుడ్డ లేవని విన్నవించు కున్నారట. వెంటనే ప్రధాని మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి తరువాత ఢిల్లీ వెళ్లిన వెంటనే ఆ ప్రాంతానికి అధికారులను పంపి తగు చర్యలు తీసుకొనమని ఆదేశించాడు. ఆ ప్రాంతంలో సుగాలీయులకు ఇళ్ల కాలనీకీ, రెండు బోర్లకు కూడ అనుమతించి మాట నిలబెట్టుకున్న ప్రధానిని అక్కడి సుగాలీ మహిళలు నాయకులు అభినందించారు. ఇలా దేశనాయకులు ఏ ప్రాంతానికైనా ఎక్కడికైనా వస్తే ఆ ప్రాంతపు స్త్రీలు తమ గోడు విన్నవించుకుంటే వారి వారి ప్రాంతమే కాకుండా క్రమంగా దేశం కూడా అభివృద్ధి చెందుతాదని నేననుకొంటున్నాను.

–కొరబండి శ్రీనివాసరావు (ఒంగోలు)


కొత్త శీర్షికలు

"ఆంధ్ర సచిత్ర వారపత్రిక" రోజు రోజుకూ క్రొత్త క్రొత్త అందాలతో ముస్తాబై, సకాలంలో మార్కెట్‌లోకి అడుగిడడం ఎంతో సంతోషం. అలాగే సీరియల్స్, కథల విషయంలో కూడా మూస పోసినట్లు కాకుండా, వైవిధ్యముండేటట్లు జాగ్రత్త తీసుకోవడం అభినందించదగ్గ విషయం. అయితే ఓ చిన్న విషయం. పాఠకుల ఆదరణ ఇంకా పెరగాలంటే ఇవి మాత్రమే సరిపోవు. "టిట్‌ఫర్ టాట్" లాంటి ఇంకొన్ని క్రొత్త శీర్షికలకు రూపకల్పన చేసినట్లయితే, పాఠకులు విపరీతంగా పాల్గొని నూతనోత్సాహంతో ఎదురు చూస్తుంటారు.

–కోరా నాగేశ్వరరావు (తిరుపతి)

జీవితానికి దగ్గరగా ఉండాలి!

11-8-89 సంచికలో వీరాజీగారి ఎడిటోరియల్



వీక్లీ పోస్ట్

'పార్టీ స్వామ్యమా? ప్రజాస్వామ్యమా?' చాలా బాగుంది. అన్ని వర్గాల వారిని నిశితంగా విమర్శించారు. 'ఫొటో వ్యాఖ్య పోటీ'కి ప్రచురించిన ఫొటో చాలా అద్భుతంగా ఉంది. 'ఆమె కాపురం', 'కాలాబూస్' కథలు బాగున్నాయి. ఇటీవల వచ్చే సీరియల్స్ (చాలా పత్రికలలో) మనలను ఊహా లోకంలో తిప్పడం తప్ప, పాఠకులు తెలుసుకునేది ఏమీ ఉండదు. అలాంటివాటిని ప్రోత్సహించక జీవితానికి దగ్గిరగా ఉండేవి, కనీస ప్రయోజనం చేకూర్చే కథలను, సీరియల్స్‌ను ప్రోత్సహించగలరని ఆశిస్తాను.

–ఎస్. ఆషాబేగం (మాచర్ల)

ఎగిరి...

ఇటీవల మన పత్రిక చూస్తుంటే ఉత్సాహంతో ఎగిరి గెంతాలనిపిస్తూంది. ప్రతీ వారం ఎన్ని పోటీలో! కథల వర్క్‌షాప్‌తో ఇప్పటికే కొందర్ని రచయితలుగా మార్చేసారు. మళ్ళీ దెయ్యాల కథల పోటీలా? ద్రౌపది సీరియల్‌కి మరో కొత్త పోటీనా? ఓహ్! ఎడిటర్‌జీ! ఈ పోటీలతో పాఠకుల బుర్రలు ఖాళీ లేకుండా ఎన్నో ఆలోచనలు, బోలెడు వూహలు రేకెత్తించేలా చేస్తున్నారు. ఈ పోటీల తీరు చూస్తుంటే - మీ ఉత్తరాల పాఠకులందర్నీ అతి త్వరలోనే రచయిత్రు(త)లుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో కంకణం కట్టుకున్నారనిపిస్తోంది. మీ ఈ ప్రయత్నం తప్పక నెరవేరుతుంది. నూతన రచయిత్రు(త) లెందరో మీకు ఋణపడివుంటారు. పత్రిక అంతా బాగానే వుంది కానీ - ఒక్కటే లోపం - ప్రతి శుక్రవారం వచ్చేది ఇటీవల సోమ లేక మంగళవారం వస్తోంది. ఈ ఆలస్యం భరించటం కించిత్ కష్టంగానే వుందండీ. ప్లీజ్! శుక్రవారమే వచ్చేలా చేయండి.

–ఎమ్. కళ్యాణి (బెండమూర్లంక)

తెలుగు

తెలుగుభాష: తెలుగుభాషా ప్రోత్సాహమును, మనసులో ఉంచుకొని, పత్రికకు పంపే ఉత్తరాలకు మా అడ్రసులు తెలుగులో వ్రాయమని, ప్రకటన ఇచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కాని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలు, రాష్ట్ర రాజధాని హైద్రాబాదుకు ఏదైనా పనిమీద వెళ్లినపుడు, రైలు లేక బస్సు దిగగానే వారు అనుకొన్న చోటుకి వెళ్లాలన్నా (సిటీబస్సు లేక రిక్షా లేక ఆటోవాళ్లతో) తెలుగు మాట్లాడితే పనిజరగదు. లాడ్జికి వెళ్లినా, హోటలుకి వెళ్లినా, తెలుగులో మాట్లాడితే సమాధానంరాదు. మన రాష్ట్ర ప్రజలు మరో రాష్ట్రానికి వెళ్లి, ఇబ్బందిపడితే వేరే విషయం. మన రాష్ట్రంలో ఉంటూ, మన రాష్ట్ర రాజధానికి వెళ్లి పడేపాట్లు మనకి తొలగేలా చేస్తే, ముందు మంచిదేమో అనిపిస్తోంది.

-శ్రీపాద సాయిబాబా, రాజమండ్రి.

(78 వ పేజీ చూడండి)

విదేశాలలో

వేద మంత్రోక్తుడై అనాదిగా ప్రాచుర్యాన్ని పొందిన వినాయకుడు హిందువులందరూ ఆరాధించే ప్రధానదైవం. ఏ కార్యం తల పెట్టినా నిర్విఘ్నంగా కొనసాగుటకు తొలుత వినాయకుని ఆరాధించడం ఆ సేతుసీతాచల వాసులైన భారతీయులకు సంప్రదాయసిద్ధమైన ఆచారం. ఇలా మన అందరి కార్య కాలాపాల్లో విశిష్టస్థానాన్ని పొందిన వినాయకుడు విదేశాల్లోనూ వ్యాపించి ఆరాధింపబడుతున్నాడంటే మనకు కలిగే ఆనందం వర్ణనాతీతం.

పూర్వం భారతీయులు విదేశాలకు వలస వెళ్లనపుడు తమ వెంట వినాయకుని విగ్రహరూపాన్ని కూడా తీసుకువెళ్లేవారు. అలా ఆయా దేశాల్లో వినాయకారాధన పెంపొందిందని కొందరి భావన. విదేశాల్లో కనిపించే గణేశ విగ్రహాలు చాలావరకు బౌద్ధమతానుయాయులు రూపొందించిన వేనని చరిత్రకారుల అభిప్రాయం. మహాయాన బౌద్ధ మతస్థులు వినాయకుని తమ దేవతగా స్వీకరించి ఆలయాల్లో స్థానం కల్పించారు.

ఈ బౌద్ధ మత ప్రభావం వల్లనే మన పొరుగున గల శ్రీలంకలో వినాయకుని ఆరాధించడం ప్రసిద్ధమైంది. ఇచట 'కటరిగం' అనే ప్రాంతంలో ఒక కుమారస్వామి ఆలయం ఉన్నది. అందులోని గణపతి క్రైస్తవులచేత, మహమ్మదీయులచేత కూడా పూజలందుకొనడం చెప్పుకోదగిన విశేషం. నేపాల్‌లో ఐదుతలలు, పదిచేతులు గల వినాయకుడు హేరంబగణపతిగా ప్రసిద్ధి పొందాడు. అశోకుని కుమార్తె ఈ దేశంలో వినాయకుని పరిచయం చేసిందని కొందరి అభిప్రాయం. బర్మాలో వినాయకుని 'మహాపిన' అను పేరుతో వ్యవహరిస్తున్నారు. కంబోడియాలో 'ప్రావాగణేష్,' ప్రాక్ సెన్ అనే పేర్లతో మన గణపతియే ఆరాధింపబడుచున్నాడు.

13వ శతాబ్దికి ముందే టిబెట్‌లో వినాయకుని ఆరాధన మొదలైంది. రెండు తలలు గల వినాయకుని రూపం ఈ దేశంలో 'తొస్క-ప్రాక్' అని పిలువబడుతోంది. గతంలో ఈ దేశాన్ని పాలించిన 'ఫాగ్స్-పా' అతని తండ్రి కూడా గణపతి భక్తులుగ చెప్పబడుచున్నారు. వీరినుండే మంగోలియాదేశంలో కూడా వినాయకుడు వ్యాపించాడు. ఒక కథ ప్రకారం ఒకనాడు గణపతి ఫాగ్స్‌పా తండ్రిని తొండంతో చుట్టి మేరుపర్వత శిఖరం వరకూ తీసుకువెళ్లి మంగోలియా దేశాన్ని చూపిస్తూ 'నీ కొడుకు ఆ దేశాన్నంతటినీ లోబరచుకొంటాడు' అని చెప్పాడట. అందువల్లే ఫాగ్స్-పా మంగోలియా చక్రవర్తి ఐన కుబ్లయ్‌ఖాన్‌ను వశపరచుకొని అతనిని బౌద్ధునిగా మార్చాడని చాలా మంది విశ్వాసం. ఇచట వినాయకుని 'దోతేకార్' అను పేరుతో వ్యవహరిస్తారు. జపనీయులు అదృష్టానికీ, శృంగారానికీ వినాయకుని పూజిస్తారు. వీరికి 'కొబ్బోదెసి' అనే బౌద్ధ సన్యాసి గణపతిని పూజించే విధానం తెలిపాడు. మూడు తలలు, తలకు మూడు కండ్లు కల వినాయకుడు ఇచట గలడు. "వినాయక్ షొత్, కాంగ్‌టన్, కొనే-కిటెన్" అని ఇచట గణపతికి పేర్లు. ఇచట "బినాయికియా" అచ్చం మన గణపతి లానే ఉంటాడు. అష్టదళ చెబుతున్నారు. దీన్ని బట్టి విదేశాలలో గణపతి ప్రాచీనత ఎంతటిదో వూహించవచ్చు.

గ్రీసు దేశంలోనూ గణపతి పూజలున్నాయి. గణపతి భక్తుడైన హెలియస్ అనే గ్రీకు రాజు గణపతిని బొమ్మతో నాణేలు కూడా విడుదల చేసాడట. ఇచట 'డెమెటర్' 'జర్మినస్'లు గణపతి నామ రూపాంతరములే. రోమన్ల కెరస్, గణిచ్, లేక జేనస్ అనే దేవుని రూపం చాలావరకు మన వినాయకుని లాగే ఉంటుంది. మెక్సికోలో విఘ్నేశ్వరుని ధ్యానదేవతగా ఆరాధిస్తారు. ఈజిప్టులోని గుచీస్ కూడా విఘ్ననాశమడే. జంబూద్వీపంలో 'వినాట్' అను పేరుతోను, టోంగా దీవులలో "ఆలో-ఆలో" అను పేరు తోను గణపతిని వ్యవహరిస్తారు.



జావాద్వీపంలో గల వినాయకుని విగ్రహం-ఒకే శిలలో ఒక వైపు గజముఖం రెండవవైపు యక్షుని ఆకృతి ఉండటం ఈ విగ్రహ విశేషం.

ఓ బొజ్జగణపయ్యా!


నిస్థాన్‌లో కూడా వినాయక విగ్రహాలు లభించాయి. ఈనాటికి అవి అచటికి వెళ్లిన హిందువుల పూజలందుకుంటున్నాయి. క్రీ.శ. 531 లోనే చైనారాజు 'సే' పెద్దరాతిని వినాయక విగ్రహంతో సహా దేవాలయంగా రూపొందింపజేశాడు. ఇచట మన దేవునికి 'క్వాన్ -సిటిఇక్' అని పేరు.

ఇరాన్‌లోని 'టారిస్థాన్' లో వినాయకుని గుడి ఉంది. ఇచటి వినాయకుడు పంట్లాము, కోటు ధరించి కుడిచేతిలో పద్మమును చేతిలో పట్టుకున్నాడు. పశ్చిమ ఇరాక్ త్రవ్వకాల్లో మాల్కకీయా ప్రదేశంలో గజముఖ గణపతి కల శిలా ఫలకం లభించింది. అది క్రీ. పూ. 1200-1000 కాలంనాటి

ఇవేగాక థాయిలాండ్, ఇండోనేషియా, టర్కిస్తాన్‌లోనూ, జావా, చంప, బాలి, బోర్నియో, సయాం దీవుల్లోనూ గణపతి ఆరాధింపబడుచున్నాడని తెలుస్తోంది. ఒక నక్షత్ర మండలాన్ని వినాయక మండలంగా కూడా విదేశీయులు పరిగణిస్తున్నారు.

మన పద్ధతులను మన పొరుగు వారు ఆచరిస్తున్నారంటే మనకో అభిమానం, ఆప్యాయతా వారిపై కలుగుతుంది. మరి విదేశాల్లోని ఈ వినాయక ఆరాధన సర్వమానవ సమైక్యతకు దోహదం చేస్తుందని ఆశిద్దాం.

-డా. పి.పి.వి.డి. నాగత్రిశూలపాణి


ప్రతి ఒక్క మోడల్
ఉత్కృష్టమైన
సాంకేతికతకు ప్రతిబింబం
అందాల దృశ్యాలకు ఆలవాలం
500 036.
42778, 552663.
INTEEN
0425–6979 VVRR IN
ITE
బ్లాక్ & వైట్
మరియు
కలర్
టీవీలు

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

విజయవాడ
8-9-1989

ఎడిటోరియల్ అడ్వయిజర్: శివలెంక రాధాకృష్ణ

ఎడిటర్: వీరాజీ

ముద్రాపకుడు, ప్రచురణకర్త : శివలెంక నాగేశ్వరరావు

శక సం. 1911
భాద్రపదమాసం 17వ తేదీ

'వెఱ్ఱి కుదిరింది.... రోకలి తలకి చుట్టమన్నాడట!'

'వెయ్యి తుపాకులు నన్ను చుట్టుముట్టినా నేను భయపడనుకాని నాలుగు పత్రికలు నన్ను ఎదుర్కొంటే జంకుతాను' అన్నాడట నెపోలియన్ బోనాపార్టె!- ప్రజాస్వామ్యం వున్న దేశంలో పాలకులు యీ మాటలను యింకా ఎక్కువగా గుర్తించాలి- ప్రజాస్వామ్య పరిరక్షణలో- కాపలా కుక్కల్లాంటివి పత్రికలన్నాడో పెద్ద మనిషి. పత్రికల యొక్క అత్యంత విశ్వాస పాత్రతనూ ప్రాణాలకు లెక్కచేయని గొప్పతనాన్ని ధ్వనించే శ్లేష వాచకంగానే "కుక్క" లన్న మాటను ఆయన ప్రయోగం చేశాడు!

ప్రజల చేత ఎన్నుకోబడిన గవర్నమెంటు వుంటేనే అది ప్రజాస్వామ్యం. అలాగే ప్రజల తరఫున యీ గవర్నమెంటు సక్రమంగా పనిచేసేలాగ చూసే 'వ్యవస్థ' పత్రికల్సు! అయితే యీ దేశంలో చాలా సార్లు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వాటి వెనకాతల ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా పత్రికల నోళ్లు కుట్టేసి- వాటిని కేవలం "కమర్షియల్ ర్యాగ్స్"లాగా మార్చివేసే విఫల ప్రయత్నం చేశాయి! ఈ ఘన కీర్తిని మూటగట్టుకున్న రాష్ట్రాలలో బీహారు, కర్నాటక, ఆంధ్ర, తమిళనాడులున్నాయి కాని దేశంలో ఉవ్వెత్తున లేచిన వ్యతిరేక వెల్లువ ముందు యీ బిల్లులు బ్రతికి బట్టకట్టలేదు. పత్రికా వ్యవస్థకు ఆ విధంగా "నిండు నూరేళ్లు" అంటూ ప్రజలు తమ ఆశీస్సులందించారు. కేంద్రం తలపెట్టిన పరువు నష్టం బిల్లు- ఎదురుతిరిగి అది ప్రవేశపెట్టజూసిన పెద్ద మనుష్యుల పరువు తీసే దశకి ప్రజల అండదండలతో చేరుకొన్నది. దాంతో అది కాస్తా తోక ముడిచింది! కాని డా. ఫారూక్ అబ్దుల్లా యిప్పుడు యీ చరిత్ర నుంచి గుణపాఠాలేవీ నేర్చుకున్నట్లుగా లేదు. కనీసం కాశ్మీర్‌లో యీ షేక్ అబ్దుల్లా కుమారుణ్ని గద్దెమీద కూర్చోబెట్టి కాప లాకాస్తున్న కాంగ్రెసు పార్టీ కూడా వివేకం ప్రదర్శించలేదు!

అల్లకల్లోలమైపోయింది కాశ్మీరం. పాకిస్తాన్ నుంచి దొంగచాటుగా ప్రవేశించినట్లుగా చెప్పబడుతున్న సాయుధ దుండగులు- మత దురహంకార ఛాందసశక్తులు- సంఘ వ్యతిరేక కిరాతక గుండాలు- వీరంతా దేశద్రోహ చర్యలకు హింసాత్మక ఆగడాలకు పెట్రేగిపోయి పాల్పడుతూ వుంటే- కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం- యీ "వాస్తవాలను" పత్రికలలో పడకుండా దాచిపెట్టడమే తక్షణ కర్తవ్యమనుకొని- "1989 కాశ్మీర్ ప్రెస్ బిల్లు" అంటూ ఒక కిరాతక చట్టాన్ని అత్యవసర ప్రాతిపదిక మీద చేసింది. సభ్య ప్రపంచం ముక్కున వ్రేలేసుకొని చూస్తూ వుండిపోయింది!- కాశ్మీర్‌లో శాంతిభద్రతలు, ప్రజా సంరక్షణ ఒక్కటేకాదు అక్కడి ప్రభుత్వ కర్తవ్యం- దేశ విద్రోహక చర్యలను అరికట్టే భారత దేశ సమగ్రతని సర్వసత్తాక ప్రతిపత్తిని కూడా పరిరక్షించాల్సిన గురుతర బాధ్యత ప్రత్యేకించి సరిహద్దు రాష్ట్రమైన కాశ్మీర్ మీద అదనంగా వున్నది.

దేశమంతటా "దేశభక్తికి" "జాతీయ సమైక్యతకు" వున్న అర్థాలు వేరు కాశ్మీర్‌లో వేరూ కాదు- కాశ్మీర్ రాష్ట్రంలో భారత స్వతంత్ర దినోత్సవంనాడు- జాతీయ జెండా రెపరెపలాడుతూ 'జైహింద్' నినాదాలు ఆకాశాన్ని వెలిగిస్తూ వుండవలసిన నాడు మరో దేశం జెండాలు ఎగరడం- యింకో రాజ్య శ్రేయస్సును కోరుతూ జిందాబాద్ నినాదాలు చెలరేగడం- బాంబులు ప్రేలడం కన్నా బంద్‌లు జరిగిన దాని కన్నా ఘోరం- రాష్ట్ర అసెంబ్లీకి ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులలో నలుగురు- యీ అల్లరి మూకలను స్వాతంత్ర్య పోరాట వీరులుగా అభివర్ణించారట. ఇది యింకా నేరం!

అటువంటి బీభత్స భూమిమీద రాష్ట్ర అసెంబ్లీలో తక్షణ చర్య లేమిటున్నది? ఆలోచించడం పోయి- పత్రికలు గవర్నమెంటు అధికారుల అనుమతి లేనిదే కొన్ని వార్తలను ప్రచురించరాదని- అలా ప్రచురించినవారికి కఠిన జైలుశిక్షలు- భారీ జుల్మానాలు విధించడమే కాక 'ప్రెస్సు' స్వాధీనం చేసుకుంటామని- చట్టాలు చేయడమా?- ఇది ఒక రకంగా "యమర్జెన్సీ"ని విధించటమే అవుతుంది. దీన్ని బట్టి కాశ్మీర్‌లో పరిస్థితులు ఎంత ప్రజా కంటకంగా- ప్రజా బాధాకరంగా దిగజారిపోయాయో తతిమ్మా దేశంలోని ప్రజలు అంచనా కట్ట వీలు అవుతున్నది- డా. ఫారూక్ అబ్దుల్లా కాశ్మీర్ కేసరిగా వాసికెక్కిన షేక్ అబ్దుల్లా కుమారుడు. అతని కిట్టి దుస్సాహస-నిర్లజ్జాకరమైన ఉద్దేశాలు రావడం విడ్డూరం! ఇది పత్రికా స్వేచ్ఛ మీదనే కాదు ప్రజా స్వేచ్ఛమీద- ప్రజాభిమతం మీద గొడ్డలిపెట్టు- దీనిని ప్రజలు హర్షించకపోగా తిరగబడి వ్యతిరేకించి తీరుతారు- ఇది కాశ్మీర్ రాష్ట్రంలో వున్న మిశ్రమ ప్రభుత్వ దివాళాకోరుతనాన్ని- దుష్ట దేశ ద్రోహశక్తులు చేస్తున్న బ్లాక్‌మెయిలుకు ఆ గవర్నమెంట్ లొంగిపోడాన్ని సూచిస్తున్నది.

కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ దుష్ట చట్టం ఆ ప్రభుత్వానికి అంతిమ ఘడియల ఘంటారావం- ఇది తథ్యమని యిటీవలి చరిత్ర చాటి చెబుతున్నది. అందుకు సందేహం అక్కరలేదు కాని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు దరిదాపుల్లో వున్న యీ దుష్ట శాసనం అమలు కాకుండా- కాశ్మీర్ గవర్నర్- కేంద్రప్రభుత్వం- తదితర రాష్ట్ర ప్రభుత్వాలు- డా. ఫారూక్ అబ్దుల్లాకి హిత బోధ చేయడం యిప్పుడు దేశంలో ప్రజాస్వామిక శక్తుల వికాసానికి చాలా అవసరం. రోగమొక చోట అయితే చికిత్స మరొకచోట- అన్న తీరున- వున్న యీ చర్యను ఎలా వ్యాఖ్యానించాలి? అందుకే "వెర్రి కుదిరింది రోకలితలకు చుట్ట మన్నాడట వెనకటికో ఉన్మాది" అన్న సామెతను దీనివల్ల "ప్రొటెస్టు"గా శీర్షికగా వుంచాము! ఈ పత్రికా స్వేచ్ఛను చిత్ర వధ చేసే చర్యను ఖండించే ఉద్యమంలో అక్షరాన్యులు మాత్రమే కాదు- ఆత్మాభిమానమున్న యావత్ భారతవాసులూ పాల్గొంటారని ఆశిస్తున్నాము! ●

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

విడిప్రతి వెల రు. 4-00

సంపుటము 82 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 3

వ్యవస్థాపకులు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారు

(1938-1972 సంపాదకులు) శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్‌లు: 75667, 61247, 61248.

పదండి లోపలికి!

ముఖచిత్రం:
శివశివమూర్తి వి గణనాధా!
(బొమ్మ : కాశీ)
(4వ పేజీ చూడండి)

ఫై వారం :
'కథల కాణాచి'

ఈవారం హాస్యం ప్రత్యేకం:–

కథలు :–

సీరియల్ నవలలు :–

వ్యాసాలు, శీర్షికలు :

తాజాకాలమ్ వీరాజీ

జలరక్కసి విలయతాండవం!

ఎట్టకేలకు కేంద్ర బృందం వరదల వల్ల నష్టం అంచనా వేయడానికి కృష్ణా, గోదావరి ప్రాంతాలకు వచ్చేసరికి, మరోసారి వరదలు విలయతాండవం చేస్తూ వారిని వెక్కిరించాయి! వెయ్యి కోట్ల రూపాయిల దాకా యిటీవలి వరదల వల్ల నష్టం అని రాష్ట్ర అంచనాలు తెలియజేస్తున్నాయి- ఇంకా ఆ వరదల భీభత్సం వదిలిపోయిన కన్నీరు యింకనే లేదు. ఆకాశం భూమ్మీద సస్యశ్యామలమై నిత్య కళ్యాణమై పచ్చ తోరణమై- అన్నపూర్ణగా వాసికెక్కిన ఆంధ్రప్రదేశ్ డెల్టా ప్రాంతం మీద నిష్కారణ వైరంతో నిరంతర కుండపోత ధారలతో దండయాత్ర చేసి, కొంపా గోడూ, కూడూ గుడ్డా, పంటపొలమూ, దారీడొంకా అన్నింటినీ ముంచెత్తింది!

ఈ వరదలు తీస్తే తప్ప నష్టం అంచనా కష్టం- నిన్నటి వరదలు 90 లక్షలమందిని కొద్దిగానో గొప్పగానో ప్రత్యక్షంగా దెబ్బతీశాయి. అవి పరోక్షంగా రాష్ట్రమంతటినీ దెబ్బకొట్టాయి. ఇక్కడ వరదలొచ్చి జనం కడగండ్ల పాలైతే అనంతపురంలో దిగి వరంగల్‌దాకా వచ్చి ఆంధ్రదేశంలో మైనారిటీలకి స్త్రీలకి, పిల్లలకి, కొండ జాతులకి విపరీతంగా అన్యాయం జరిగిపోతున్నదని రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైందని అంటూ 21 కోట్ల రూపాయలు విదిలించి ప్రధానమంత్రి వెళ్ళిపోతే- ఆ వెంటనే (పాపం! విలేఖర్లు!) ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ముఖ్యమంత్రి నోరు పారేసుకున్నారు. ఇదీ వీరిరువురి ప్రజా సేవల తత్వం! వానకి వరదకి ఆదుకోవడంలో నైనా కేంద్ర రాష్ట్రాలు ప్రజలకి ఏకోన్ముఖమైన- సమదృష్టితో సేవ చేయనక్కరలేదా?

నాలుగు దిక్కులూ మూసుకు పోయి సూర్యోదయ సూర్యాస్తమయాలు రెండూ లేని సమయంలో 'కోస్తా' అంతా విలవిల్లాడుతున్న దశలో అక్టోబర్, నవంబర్‌లలో - వాయుగుండాలు, గాలివానలు యింకా యెక్కువ అని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా కట్టి చెబుతున్నారు! పంచాంగాలు ఘోషిస్తున్నాయి- ఇప్పటి నుంచే అప్రమత్తంగా వుండాలని నిర్వాసితులై- నిరాశ్రయులై నిలువ నీడ లేక మెట్ట ప్రాంతాలకి చేరుకుని- ఆశతో ఆకసం వైపు చూస్తున్న వారికి ఏమని చెప్పగలం?- గవర్నమెంటు కూడా "యంత్రం" కాదు "యంత్రాంగమే" అక్కడా మనుషులే పనిచేయాలి- కాకపోతే మనుషులులాగా కరుణార్ద్ర హృదయంతో వారిని విధి నిర్వర్తించమని వేడుకోవడం కన్నా ఏమి చేయగలం?!- రాజకీయవేత్తల కన్నా అధికారులైనా మన మాట వింటారేమో? వారికివే ప్రజల విన్నపాలు!

కొన్నాళ్ళు కాంట్రాక్టులు కట్టిపెట్టమని తారలకు వేడికోలు!

వెండితెర మీద వాళ్ళ "బొమ్మలు" చూసి జనాలు వెర్రెత్తిపోతారు. నిర్మాతలు లాభాల కుప్పలు పోసుకుంటారు. ఆ తారలు "బంగారం బిస్కట్లు" చేసుకుంటూంటారు అని చాలామందికి నమ్మకం! కాని జాతీయ భాష- అఖిలభారత భాష- అఖండ హిందూస్తానీ భాషల్లో చిత్రాల డబ్బాలు బూజులు పడుతున్నాయట. ప్రస్తుతం 400 హిందీ బయస్కోపులు- విడుదల కోసం ఎదురు చూస్తున్నాయి. మరో 400 దాకా స్టూడియోల్లో "తారల" దయాధర్మ భిక్షయిస్తున్నట్లు యిచ్చే "కాల్‌షీట్"ల కోసం ఎదురుతెన్నులు చూస్తూ తాబేటి నడక నిర్మాణంలో



వున్నాయట.

సూపర్‌స్టార్స్- మహాస్టార్‌లు, యమాస్టార్స్- యమ యమా స్టార్స్- అంటూ అంతరిక్షంలో తారామణులను- తారా రత్నాలను పొదిగి "బాక్సాఫీసు" దగ్గర ప్రేక్షకులను ఆ విధంగా దోచుకోవడం మొదలెట్టిన నిర్మాతలు- ఎడాపెడా పెద్ద తారల దగ్గర సంతకాలు




తాజా కాలమ్







పెట్టించేసుకొని- డిస్ట్రిబ్యూటర్ దగ్గర పైకం లాక్కొని- నిర్మాణ రంగంలో పెట్టేశారు! తారలు కూడా ''భలే ఛాన్సులే'' అనుకొని ఆటో గ్రాఫ్‌లు యిచ్చినట్లు- కాంట్రాక్టు అడ్వాన్స్‌లు తీసుకొని సంతకాలు చేసి పారేశారు. వారి రేట్లు కూడా అంతరిక్షానికి పెరిగిపోయాయి! ఇప్పుడు నిర్మాతల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది. ఎవరు తీసుకున్న గోతిలో వారేనన్నట్లు బజారున పడ్డారు. కాల్‌షీట్ 9 గంటలయితే అందులో 90 నిమిషాల పాటైనా హీరో హీరోయిన్‌లు రారు. వేషం కట్టరు- మొర్రోమంటూ ప్యాకప్ చేసి- స్టూడియో వోనరుకు మొత్తం ''అద్దె'' కట్టేసి నిర్మాతలు నెత్తిన కొంగు వేసుకోడానికి కూడా అది లేక చేతులెట్టుకుని యిళ్ళకు పోతున్నారట! అంచేత బొంబాయిలో వారంతా వో నిర్ణయానికి వచ్చారు- అమితాబ్‌బచ్చన్ నుంచి- సన్నిదేవేల్‌దాకా ''రేషన్'' పెట్టేశారు! ఫిలిమ్ ప్రొడ్యూసర్స్ కంబైన్ సంఘం తరఫున విజయానంద్ (గోల్డీ) శ్రీరామ్‌బోహ్రాలు ఒక ప్రకటనలో, శ్రీదేవి, మాధురీదీక్షిత్, అమితాబ్‌బచ్చన్, ధర్మేంద్ర వగైరా తారలను పేరు పేరున చెప్పి- వీరంతా కొత్తగా కాంట్రాక్టులు సంతకాలు పెట్టకూడదు అన్నారు. మొత్తం తారాపథంలో డజన్‌ల కొలది సినిమాల మీద సంతకాలు పెట్టి- ''సినిమాల కుప్పల'' మీద కూర్చున్న కళాసామ్రాట్‌లు 40 మంది వున్నారు! వీరందరి మీద ''ఆంక్ష''లు విధించామని నిర్మాతల సంఘం చెపుతున్నది!



కోటాలు

హీరోకి 12 కన్నా ఒకేసారి సినిమాలుండరాదు! హీరోయిన్‌కి 15 దాకా వుండవచ్చును- అలాగే అనుపమ్‌ఖేర్, అమ్రేష్‌పురీ బాపతు క్యారెక్టర్ ఏక్టర్‌లకి కూడా యీ 'నియంత్రణ' వర్తిస్తుంది. వారు కూడా ఒక్కోసారి ఒక్కొక్కరు 15 సినిమాల కన్నా యెక్కువ నటించకూడదు.

ఈ లిస్టులో అనిల్‌కపూర్, శత్రుఘన్‌సిన్హా, అమీర్‌ఖాన్, జితేంద్రా వగైరాలంతా వున్నారు. ఆంక్షలు పెట్టారు బాగుంది కాని తారలను దొడ్డి గుమ్మంలో నుంచి వెళ్లి కలుసుకుని ఆటో గ్రాఫ్‌లు అడిగినట్లు అడిగి తీసుకుని వారికి ''ముడుపులు'' కట్టేవారినెలా ఆపుతారు?- ''డోంట్ కేర్'' అన్న తారలను ఎలా శిక్షిస్తారు, వీళ్ళు?

''ఏ బాత్ హమేఁ దేఖ్నాహై''!

24-8-89

పుష్పవిలాపానికి పేరడీ
వారకాంతా విలాపం!



నేనొక వారకాంత వాకిట నిలచి
తటాలున తలుపు త్రోసి
లోనికి ఏగినంత లోన
కురులువిడిన కోమలి జాలిగ గొంతు విప్పి
"నా ప్రాణము తీతువా ?" యనుచు
బావురు మన్నది క్రుంగిపోతి
నా మానసమందపుడు తళుకు మన్నదిదో
వారకాంత విలాప కావ్యమై...

పరువము గల పది ఘడియల్
కనుపించిన వారికెల్ల కనుగీటి కౌగిలివ్వ
మా పరువము పోయినంతనే
మమ్మావల నెట్టి వేతురు గదా ?
మా జాతికి ప్రగతి యున్నదా ?

పూలు మిఠాయిలను మా పొందు కెరగజూపి
గుండె మండే వలపులో ముంచి చంపి
మురిసిపోదురు తమ మగసిరిని జూచి
అకటా ! మగ జాతికి నీతి యున్నదా ?

వారకాంతల వాడలో పుట్టి నాను
సహజమగు మోహము నాలోన చచ్చిపోయె
అందమును జూచి భ్రమ సెడమాయ కుండ
మైల పడిపోయెనోయి మా మగువ జన్మ....!

(డాక్టర్ కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి పుష్ప విలాపానికి పేరడీ...వారి అనుమతితో)

- కె. సూర్యం

మాటకారుల పేజీ

మూడక్షరాల మాట

మనసు

పత్రిక వీక్లీని అద్దెకు తెచ్చుకుని చదువుతాము.

ఎస్. శ్రీనివాసమూర్తి(నెల్లూరు)

తెలుగు

[ఇది బాధిస్తోందా? మిమ్మల్ని? ఎడిటర్]

వీక్లీని ప్రతివారం కొని చదువుతాము.

కాళిదాసు సుబ్బలక్ష్మి (కందుకూరు)

దాహము

'వీక్లీ'ని కొని చదువుతాను.

పి.శ్రీదేవి (కడప)

తుపాను

ఆంధ్రసచిత్ర వార పత్రిక ప్రతివారం చదువుట నా జీవితావసరాలలో ఒక భాగంగా ఎంచి స్వంతంగా కొని చదువుతున్నాను.

సామినేని సావిత్రి (హైదరాబాద్)

సినిమా

నేను ఆం.స.వా.ప.ను అద్దెకు తీసుకుగా లేదు. లైబ్రరీలో సంపాదించలేదు. నా కష్టంతో సంపాదించిన దాంట్లో వారం వారం రు. 4/- పెట్టి కొంటున్నాను. యిది వాస్తవం.

టి.శ్రీనివాసరావు (తుని)

చిరాకు

కె.జయచంద్ర (సూళ్లూరుపేట)

విరహం

లైబ్రరీ నుంచి, అప్పుడప్పుడు కొని చదువుతాను.

కె.ఆర్. రావ్ (హైదరాబాద్)

కోపము

చలపాక ప్రకాష్ (విజయవాడ)

దారిద్ర్యం

వీక్లీ కొని చదువుతాము.

ఆర్.ఉమాబాల (విజయవాడ)

"సవతి"

మా రెంటెడ్ లైబ్రరికి 'కొని'......

ఎస్.విజయలక్ష్మి (కర్నూలు)

కోరిక

వీక్లీని మేమే కొంటున్నాం. అద్దెకు తీసుకోలేదు. లైబ్రరీలోనిది కాదు. మరే విధంగాను వీక్లీని సంపాదించడంలేదు.

శీసెట్టి శ్రీనివాసరావు (అనకాపల్లి)

"అబద్ధం"

కొని సంపాదించెదము.

కాకరపర్తి వరలక్ష్మి (తెనాలి)

శత్రువు

కొని చదువుతాము.

కాకరపర్తి సుబ్రమణ్యం (తెనాలి)

అసూయ

'వీక్లీ'ని వారం వారం కొంటున్నాను.

జి.విజయలక్ష్మి (నాగార్జునసాగర్ డామ్)

ఎమ్.బి.కళ్యాణి (బెండమూర్లంక)

ఆవేశం

వీక్లీని నేను కొని చదువుతాను. ఇప్పుడే కాదు తరతరాల నుంచి మా కుటుంబ సభ్యులతో సహా మేము ఎక్కువగా ఇష్టపడే వీక్లీ ఇది.

చోడవరపు నాగేశ్వరరావు (సికిందరాబాద్)



అదో శుభోదయం.

మెల్ల మెల్లగా తూరుపు తలుపు తెరుచుకుంది.

ఫక్కున నవ్వాడు పగటి చుక్క సూరీడు.

"గుడ్మార్నింగ్!" అని ప్రకృతి కాంతను విష్ చేసి, "హల్లో వౌ ధుయుడూ!" అంటూ భూదేవిని పరామర్శించి, సప్తాశ్వరథారూఢుడై వస్తున్న ప్రభాత భానుడి కళ్ళు ఆ మేడ మీద కూడా పడ్డాయి.

అంతే!..... అప్రయత్నంగా "థూ!" అంటూ థూత్కారం చేసాడు బాల భాస్కరుడు.

ద్వితీయ విఘ్నం కాకుండా "ఛీ!" అని ఛీత్కారం కూడా చేసాడు సన్‌గాడ్.

అంతటితో ఆగక ముచ్చటగా మూడో సారి "బ్లడీ బఫెలో!" అంటూ మ్లేచ్ఛభాషలో తిట్టాడు ఆ మేడ మీద నిద్రిస్తున్న ఓ జీవాన్ని చూసి దినకరుడు.

ఇంతకూ....

"డూ యూ నో హూ ఈజ్ దట్ బ్లడీ బఫెలో...?" ఆ... ఎవరో మీకు తెలుసా?

మరెవరో కాదు... మన కథా నాయకుడు అప్పారావు.

సూర్య భగవాన్లు అప్పారావును బ్లడీ బఫెలో అని ఇంగ్లిషులో చీవాట్లు పెట్టడం వెనుక ఓ బలమైన కారణ ముంది.

లోకాని కంతా తెల్లవారినా, అప్పారావు మాత్రం వారలేదింకా.

"కుక్కకు మంత్రాలైనా నేర్పొచ్చుగాని ఈ నిత్య దరిద్రుడికి బుద్ధి నేర్పడం నావల్ల కాదురా దేవుడా!" అనుకున్నాడు సూర్యుడింకో మాటు:

అప్పటికే ఎనిమిది గంటలు దాటింది. సూర్యుడు వేసిన అక్షింతలకు అప్పారావు అంతరాత్మ కించిత్తు కించపడి "గురూ! ఇహ మేలుకో" అంది. వెంటనే హీరోగారు మేల్కొని అంబోతు రంకె వేసినట్టు ఆవులించి మేడమీది నించి కిందికి దిగాడు.

ఇక్కడ కాస్త అప్పారావు తాలూకు బయోడేటా ఇవ్వాల్సిన అవసరముంది.

పేరు: తెలిసిందే.... అప్పారావు. ఇంటి పేరు: దప్పులవారు. తండ్రిపేరు: దప్పుల గరుడాచలంగారు. తల్లి పేరు: డిటో తాయారమ్మగారు. శరీరచ్ఛాయ: చీకట్లో మనిషి కనిపించడు! ఆకారం: చిన్న సైజు రోడ్డు రోలరంత మాత్రమే. చదువు: డిగ్రీ అఘోరిస్తున్నాడు. ఆచారం: పరీక్ష పేపర్లు కాపీ కొట్టడం! మెయిన్ హాబీ: చెత్త కవిత్వాలు రాసి, జనాలకు వినిపించి బుర్రలు చెడగొట్టడం!

ఇంకా చెప్పాలంటే అప్పిగాడు అలియాస్ అప్పారావు అవలక్షణాల మీద మనుచరిత్రంత గ్రంథం చెప్పొచ్చు.

హాల్‌లోకి వచ్చా డప్పారావు. అక్కడ తన పితృదేవుడు గరుడాచలం రాక రాక వచ్చిన మిత్రుడు నిక్షేపరాయుడితో అర్థమైన గప్పాలు కొడుతున్నాడు.

నేరుగా అప్పారావు కాలు విరిగిన కోడిలా వంట ఇంట్లో కెళ్ళి "మమ్మీ!" అని మాతృదేవత తాయారమ్మను పిలిచాడు గోముగా.

కాఫీ కలుపుతున్న ఆంధ్రమాత తాయారమ్మ కుమార రత్నం పిలుపుకు గాలి గొట్టిన ఫుట్‌బాల్‌లా ఉబ్బి పోయి, "ఇద్దాయి లేచావుట్రా ముద్దుల బంగారం... వెళ్ళి అప్ప పోసుకురా నాన్నీ, ఉప్మా తిందువు." అంటూ కిలోల లెక్కన ప్రేమ కురిపించింది!

మాతృ వాక్య పరిపాలనాదక్షుడు అప్పారావు గునగునా బాత్‌రూమ్ కేసి నడిచాడు.

హాస్య నవలిక


తలుపులు బిగించుకొని వజ్రదంతి టూత్‌పేస్ట్‌తో పాచిపళ్ళు బరబరా తోముకున్నాడు.

తరువాత....

సంపూర్ణ వస్త్ర విసర్జన చేశాడు.

ముందో బిందె నీళ్లతో శరీరాన్ని తడుపుకొని, ఆపైన బట్ట లుతికే డిటర్జెంట్ సబ్బుతో ప్రాథమిక స్నానం అయిందనిపించాడు.

దెన్.... అనగా అటు పిమ్మట సువాసన సబ్బుతో రెండో సారి నీళ్లాడాడు.



జలక్రీడ ముగిసింది ఆ విధంగా.

ఆఫ్టర్ దట్... తదుపరి డ్రెస్సింగ్ రూమ్‌లో కెళ్లి బట్ట తేసుకొని, అద్దంలో చూసుకొంటూ నల్లటి ముఖానికి పది గ్రాముల రోజ్ పౌడర్ పులిమాడు.

గమనిక:- పౌడరు పూతలో అప్పారావు చూపరులకు బఫూన్ వలె కన్పించును!.... స్వస్తి!

సర్వాలంకారం పూర్తి చేసుకొని వంటింట్లో కొచ్చాడు అందగాడు.

తాయారమ్మ ముద్దుల కొడుక్కు జీడిపప్పు దిట్టంగా దట్టించి చేసిన ఉప్మా పెట్టింది.

ఆరగింపు మొదలెట్టాడు బకాసురుడు. ఇక్కడ మరో ముఖ్య గమనిక: అప్పారావు తింటుంటే పశువులు నెమరు వేసినట్లుండును. స్వస్తి!

ఇక హాల్లో....

నిక్షేపరాయుణ్ణి కబుర్లలో పెట్టి అతగాడి మెదడు నంజుకుంటున్నాడు అప్పారావు ఫాదర్ గరుడాచలం.

"అదో యీ నిక్షేపం బావా విషయం... అబ్బాయి అప్పారావు వున్నాడు చూసావ్... అంతా మా నాన్న పోలికే ననుకో!" అంటూ పొడి దగ్గు దగ్గాడు గరుడాచలం.

"....తాతగారి పోలికలు మంచివే!" అయిష్టంగానే కాంప్లిమెంటు పారేశాడు నిక్షేపరాయుడు.

"బాగా చెప్పావోయ్! నీకో విషయం తెలుసో తెలీదో గాని రాయుడు బావా...!" అంటూ నస మొదలెట్టాడు.

"ఎలా తెలుస్తుంది... మనం కలుసుకొని దాదాపు ఒకటిన్నర దశాబ్దం దాటిందిగా" అంటూ సాగదీశాడు రాయుడు బావ.

"అవునవును. పెద్దైన తర్వాత మా అప్పిగాణ్ణి అసలు చూడనే చూళ్లేదు... ఇప్పుడబ్బాయి మహా చాకులా తయారైనాడులే"

అంచెలంచెలుగా గరుడాచలం ఇచ్చే కాష్టాయిల్ కోటింగుకు నిక్షేపరాయుడికి కపాల మోక్షమైంది.

అసలు రాయుడొచ్చిన పని వేరు. అతనికో పెళ్లీడు కెదిగిన కూతురుంది. వీలైతే తన కూతుర్ని గరుడాచలం కొడుకుకి ఇవ్వాలనే ఆలోచనతో వచ్చాడు!

అందుకే.... ఆడపిల్ల తండ్రిగా గరుడిడి సోదిని ఓర్పుగా భరించాడు.

"మరో గొప్ప విషయం బావా!" అంటూ కంటిన్యూ చేసాడు గరుడాచలం.

"... ఈ మధ్య అబ్బాయి సాహిత్యం మీద మాంచి కృషి చేసి, కవిత్వాలు కూడా చెడ రాసి పారేస్తున్నాడు సుమా!"

"కుర్రాణ్ణి చూడ్డానికొస్తే ఈ తద్దినమేందిరా దేవుడా!" గొణుక్కున్నాడు రాయుడు.

"వచన కవిత్వంలో దిట్టమైన చెయ్యి...."

".... వల్లకాటి మిట్ట". (తనలో)

"అబ్బాయి రచన మహా మధురం...."

".... నా శ్రాద్ధం!"(తనలో)

"ఒక్క మాటలో చెప్పాలంటే నిక్షేపం బావా.... తింటే గారెలు తినాలి.... వింటే మన అప్పడి కవిత్వమే వినాలి..."

గరుడాచలం "గ్యాస్" దెబ్బకి నిక్షేపరాయుడికి శ్వాసాలు బందైనాయి. ఓపిక పూర్తిగా చచ్చింది. ఇక తట్టుకోలేక, "ఒక్కసారి అబ్బాయిని పిలిస్తే చూసిపోతా చలం బావా!" అన్నాడు నీరసంగా.

".... తప్పకుండానూ!" అంటూ, "ఒసేవ్ తాయారూ!" అని ఊళ వేసాడు గరుడాచలం.

"ఓయ్....!" వంటింట్లోంచి తిరిగి ఊళ వేసింది తాయారమ్మ.

"అప్పిగాడేం చేస్తున్నాడూ?"

"ఉప్పిండి తింటున్నాడు".

"త్వరగా రమ్మను... పాపం నిక్షేపం బావ బుజ్జిగాణ్ణి చూడాలని తహతహలాడుతుంటేనూ....!"

"ఇదిగో.... వచ్చేస్తున్నాడు".

"అమ్మయ్య". అనుకున్నాడు నిక్షేపరాయుడు.

సాహిత్య హంతకోపాఖ్యానం

చిరంజీవి అప్పారావు ఉప్పిండి మేసి, గేదె కుడితి తాగినట్టు స్టీలు గిన్నెడు ఫిల్టర్ కాఫీ అవలీలగా తాగేసి, మదమత్తేభంలా రావడం, ఆ అవతారాన్ని క్లోజప్‌లో చూసిన నిక్షేపరాయుడికి కంపరం పుట్టడం ఏకబిగిని జరిగాయి. అప్పారావును ఆపాదమస్తకం శల్యపరీక్ష చేసిన రాయుడికి, "వీడు పుడ్డు తింటున్నాడా, పుష్టి బ్రాండ్ పెన్సిళ్ళు తింటున్నాడా....?" అని అనుమానమొచ్చింది.

కొడుకును నిక్షేపరాయుడికి పరిచయం చేసాడు గరుడాచలం.

"ప్రాతఃకాల వందనాలండీ". తోక తెగిన కుక్కలా అచ్చ తెలుగులో నమస్కార బాణం వేసాడు అప్పబ్బాయి.

ఆ కంఠస్వరానికి రాయుడికి శరీరం జలదరించింది.

సమయం చూసి పెళ్ళి ప్రస్తావన తేవాలనుకుంటున్న నిక్షేపరాయుడు, "బ్రతికాంరా దేవుడా.... నోరు జారి ముందే పెళ్ళి విషయం ఎత్తలేదు. నా కూతురు ఈ దున్నపోతు చేతుల్లో పడితే ఇంకేమైనా ఉందా!" అనుకొని, ఇక అక్కడ ఉండడం అనవసరమని భావించాడు.

మళ్ళీ గరుడాచలం రికార్డు మొదలేస్తూ,

"చూసావుగా బావా నా కొడుకును.... ఇహ వాడి కవిత్వం కూడా విని ఆశీర్వదించి పారెయ్యాలి". అంటూ కవిత్వాలు తెచ్చి వినిపించమని అప్పారావుకు ఫైఆర్డర్ వేసాడు.

వెంటనే వెళ్ళి ఓ మోపు కాగితాల కట్ట తెచ్చి టేబుల్ మీద పడేసాడు అప్రావ్.

"ఊ! మామయ్యకు మచ్చుకొకటి చదివి వినిపించు!"

డాడీ ఇచ్చిన సెకెండ్ ఫైఆర్డర్‌తో పేట్రేగి, ఓ కవిత తీసి చదవడం మొదలేసాడు అప్పిగాడు.

"పంది బురద మెచ్చును!.... ఎందుకు?... అదంతే!

కుక్క బూట్లు నాకును!... ఎందుకు?... అదంతే!

గాడిద ఓండ్ర పెట్టును!.... ఎందుకు?.... అదంతే!

ముచ్చటగా చదివిన ఆ మూడు ముక్కల దెబ్బకు నిక్షేపరాయుడి బుఱ్ఱ గిర్రున తిరిగింది.

"ఎలా వుంది అబ్బాయి చేతి పని". అడిగాడు గరుడాచలం.

"నీ పాడెలా ఉంది". అనుకొంటూ ఫార్మాలిటీగా "అద్భుతం చలం బావా నీ కొడుకు కవిత్వం. ఎత్తిన కలం దించకుండా ఇల్లాగే మరో పది కట్టలు రాస్తే సరి.... వాడి పేరు ఆంధ్రా అంతా అంటువ్యాధిలా వ్యాపిస్తుంది" అంటూ ఎక్కువసేపు అక్కడుంటే పిచ్చి పడుతుందని, "ఇహనే ఉంటా!" అని చెప్పి, గరుడాచలం ఆ పూట ఉండి భోంచేసి పొమ్మన్నా ఆగకుండా ఇంట్లోంచి ఢౌడు తీశాడు నిక్షేపరాయుడు.

2

అప్పారావును కవిని చెయ్యాలనే దుర్బుద్ధి గరుడాచలానికి కలగడానికి వెనుకో భాగోతమంత కథుంది.

గరుడాచలం పితృదేవత పేరు అప్పయ్య. సదరప్పయ్యకు కవిత్వం నేర్చుకోవాలని మాచెడ్డ తెగులుండేది.

అందుకని ఆ రోజుల్లో మంచి పేరున్న ఓ కవిగార్ని ఆశ్రయించి, ఆయనచేత చీవాట్లు, చెప్పు దెబ్బలు తిని ఓ మోస్తరుగా కవిత్వం వ్రాయడం నేర్చుకున్నాడు.

ఏవో కొన్ని రచన్లు కూడా చేసాడు. కానీ ఆ రచనలను ఆంధ్రాలో మెచ్చుకున్నాధుడే లేడు.

కాగా....

అప్పయ్య లైఫ్ హిస్టరీకి కాలదోషం పట్టింది.... రోజులు మూడాయి.

ఇవాళో రేపో హరీ అనేట్టున్నాడు. అప్పటికి గరుడాచలానికింకా సంతానోత్పత్తి కాలేదు.

ఆ రోజు సాయంత్రం....

గరుడాచలాన్ని దగ్గరికి పిలిచాడు అప్పయ్య.

"ఒరే! గరుడా నాదొక్క కోరికరా!" అంటూ సీరియల్‌గా యాభై దగ్గులు దగ్గాడు.



హాస్య నవలిక

"నాన్నా! అనవసరంగా ఈ క్లయిమాక్స్ సీన్‌లో ఇలా ఇంటర్‌వల్ తరవాత దేవదాసులా దగ్గక నీ కోరికేందో చెప్పు".

"తప్పకుండా తీరుస్తానని చేతిలో చెయ్యి వేసి ప్రమాణం చెయ్యి". గొడవపెట్టాడు అప్పయ్య.

"ఇదిగో! నీ మీద ఒట్టు! ఏం చెయ్యమంటావో త్వరగా చెప్పు".

"అదే...! పద్యంలో చెప్పేదా?.... గద్యంలో చెప్పేదా?"

"అర్థమయ్యేలా తెలుగులోనే చెప్పు!"

"ఎంత చెడ్డా కవిని కదర్రా. ఏ కందంలోనో. సీసంలోనో చెప్తే కాస్త ఘనంగా ఉంటుందని...."

"అయ్యో నాన్నా! అసలు పద్యాలే వద్దు దేవుడో అంటుంటే ఇంకా కందమేంది నా బొంద. అనవసరంగా ఆయాసపడితే వైతరణి దాటలేవు... అందుకే క్లుప్తంగా రెండు ముక్కల్లో నీ కోరికేందో చెప్పు" అంటూ అబ్బ చావక ముందే పెడబొబ్బలు పెట్టి ఏడ్చేశాడు గరుడాచలం.

అయినా అప్పయ్యకు నోటి తెగులు తగ్గక, "పోనీ... ఒక్క చిన్న చంపక మాలలో..." అంటూండగానే గరుడాచలం డాడీ డైలాగ్‌ను కట్ చేసి "ఇదెక్కడి ఖర్మ నాన్నా! నీ ఈడు వాళ్ళంతా ఎంచక్కా కోమాలో పడి కామ్‌గా ఛస్తుంటే నువ్వింకా నన్ను చంపకమాలలంటూ ఛెడ చంపుకు తింటున్నావు". అంటూ తల బాదుకున్నాడు. గరుడాచలానికి ఓర్పు సన్నగిల్లిందని తెలుసుకొన్న అప్పయ్య, కవిత్వానికి గుడ్‌బై కొట్టి, సామాన్యమైన వ్యావహారిక భాషలో, "నీకు కొడుకు ఫుడితే నా పేరే పెట్టి, నా అంత కవిగా చేస్తానని మాటివ్వు". అని కోరాడు.

"ఈ మాత్రం సంబడానికి నా తాట తీసావు గదు నాన్నా.... నీ మీద ప్రమాణం చేసి మరీ చెప్తున్నా.... నాకే ఓ కొడుకు పుడితే నీ పేరే పెట్టుకొని, వాణ్ని కూడా కవిని చేస్తా.... ఇకనైనా నీ కవిత్వాలు మాని క్రిష్ణా రామా అనుకుంటూ లక్షణంగా వెళ్ళిపో!" వాగ్దానం చేసింది గరుడపక్షి.

అప్పటికి గాని అప్పయ్య ఆత్మ శాటిస్‌ఫై కాలేదు.


ఆ రాత్రే అప్పయ్య టపా కట్టాడు. అతగాడు గుటుక్కుమన్న సంవత్సరం తరవాత గరుడాచలానికి పుత్రోదయమైంది.

తండ్రికిచ్చిన మాట మేరకు కొడుక్కి అప్పారావని పేరు పెట్టుకున్నాడు.

తండ్రిగారిలానే పుత్రరత్నాన్ని గొప్ప కవిని చేయాలన్న తాపత్రయంతో అక్షర జ్ఞాన విషయంలో అక్కుపక్షిగా మారిన అప్పారావు చేత శునక, వరాహాది జంతువులమీద కవిత్వాలు రాయించి, సాహిత్యాన్ని ఖరాబు చేయించడం మొదలెట్టాడు గరుడుడు.

3

అప్పుడప్పుడు అప్పారావు తాలూకు అమాం బాపతు కవిత్వాలు కాలేజీ కుర్రాళ్ళు వినడం, ఎగతాళి పట్టించడం కూడా జరుగుతూ ఉంది.



తొండం

ఏనుక్కి వుంటుంది తొండం
దోమకీ వుంటుంది తొండం !
ఏనుక్కి వుంటే తొండం
మనకేంలేదు నష్టం !
దోమకి వుంటేనే తొండం
మనకెంతో నష్టం !
ఏనుగుతాగుతుంది చెర్లో'జలం'
దోమ పీల్చుకుంటుంది మన వొంట్లో
బలం !

☆☆☆

ఆ విషయం గరుడాచలం నోటీసుకు వెళ్ళడం, ఆ వృద్ధ జంబుకానికి ఒళ్ళు మంటడం కూడా సైమల్టేనియస్‌గా జరిగింది.

ఎలాగైనా తన పుత్రరత్నం కెలికిన కవిత్వాలు విని గొప్ప గొప్ప వాళ్ళంతా మెచ్చుకొనేటట్లు చెయ్యాలనే నీచాలోచన కలిగింది గరుడుడికి.

మధ్యాహ్నం సుష్టుగా నవకాయ పిండి వంటలతో మెక్కుతు మెక్కి అబ్బాకొడుకులిద్దరూ బుఱ్ఱలు బద్దలు కొట్టుకునిఆలోచించసాగారు.... ఎలా చేస్తే పేరొస్తుందని!

ఆ సమయంలో.... అప్పారావు తల పంచులో తళుక్కున మెరిసిందో ఆలోచన.

అప్పడి ఆప్త మిత్రుడు కె. డి.

కె. డి. అంటే.... పగమెరిగిన పగుల్చాటీ అనికాదు! కచ్చూరాల దామోదరం.... అదా కుర్రవాడి పేరు. కాలేజీయుల నోళ్ళలో పడి దామోదరం కె. డి. గా రూపాంతరం చెందాడు. అప్పబ్బాయికున్న కవిత్వపు దురదను ఆసరాగా తీసుకుని, ఆ నికృష్టుణ్ని లెస పొగిడి డబ్బు కాజేసితన అవసరాలు తీర్చుకోవడం కె. డి. గాడి ఆనవాయితీ.

చావు తెలివిలో కె. డి. గుంటనక్క కంటే ఘనుడు.

అందుకే కె. డి. ని ఓ మంచి ఉపాయం చెప్పమని అడగాలన్న ఆలోచన వచ్చి, తండ్రితో అదే విషయం చెప్పాడు అప్పారావు.

కె. డి. గరుడాచలానికి బాగా తెలుసు.... అంతేగాక కె. డి. వాళ్ల నాన్న కచ్చూరాల కంసబ్రహ్మ రాజకీయపరంగా గరుడుడికి కుడి భుజం.

"సమయానికి గుర్తు చేసావు! తక్షణం వెళ్ళి యకాయకి కె. డి. అబ్బాయిని తోలుకురా!" అని ఉత్తర్వు ఇచ్చాడు.

తండ్రి ఆజ్ఞ మేరకు కె. డి. ఇంటికి దౌడు తీసాడు అప్పారావు.

అక్కడ కె. డి.తో పాటు, అతగాడికి సాక్షాత్తు తోక లాంటి సందేహరావు కూడా ఉన్నాడు.

చొంగలు కారుస్తూ కె. డి. కి టూకీగా సంగతంతా చెప్పి, కె. డి. ని, సందేహరావును ఇంటికి పిల్చు కెళ్లాడు.

గరుడాచలాన్ని చూడగానే, నక్క వినయం నటిస్తూ, "నన్నాశీర్వదించండి బాబాయ్". అంటూ కాళ్ల మీద బోర్లాపడ్డాడు కె. డి.

ఆ దెబ్బకు పొంగిపోయిన గరుడాచలం కె. డి. ని లేవనెత్తి గాఢాలింగనం చేసుకున్నాడు.

అందరూ కుర్చీలో సుఖాసీనులైనారు. తాయారమ్మ కూల్ డ్రింకు తెచ్చిస్తూ "బాగున్నావర్రా కె. డి. బంగారం". అంటూ పరామర్శించి, వంటింట్లోకెళ్ళింది బజ్జీలు చెయ్యడానికి.

ఓ పావు గంట పిచ్చాపాటీ అయింతరువాత గరుడాచలం తన మనసులో కోరిక చెప్పి, "ఎల్లాగైనా సరే! మన అప్పిగాడు గొప్ప కవిగా పదిమంది చేత భేష్ అనిపించుకొనే యమప్లాను ఏదన్నా ఉంటే చూడు కె. డి. అబ్బాయ్!" అని మూలిగాడు.

కె. డి. కార్యదక్షుడు.... వాస్తవానికి అప్పారావు పరమ శుంఠనీ, గరుడాచలం కూడా కొడుక్కో మాత్రం తీసిపోని 'ఏ' గ్రేడ్ తుగ్లక్కనీ తెలుసు....

అందుకే....అల్లాంటి మూర్ఖ శిఖామణులకెలా మస్కా కొట్టాలో కూడా బాగా తెలుసు....

పది నిమిషాలు జుట్టు పీక్కొని, తెగ ఆలోచించి సట్టు పోజులు కొట్టి, "మన అప్పా వున్నాడు చూసారూ... వాడు సామాన్యుడు కాదు బాబాయ్..... కవిత్వం చెప్పడంలో మల్టీ జీనియస్." అనేసాడు కె. డి. తన నటనకు అంకురార్పణగా. ఈ భూ ప్రపంచంలో.... ఈ క్రీస్తుశకంలో.... ఈ ఇరవయ్యో శతాబ్దంలో.... అప్పారావును ప్రప్రథమంగా 'మల్టీ జీనియస్' అన్న మొట్టమొదటి సుముడు కె. డి.

పాచిక బాగా పారింది.

గాలి బుడగల్లా ఉబ్బి తబ్బిబ్బైనారు గరుడాచలం అండ్ హిజ్ డియర్ సన్.

అది కనిపెట్టి ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా పావు

సాహిత్య హంతకోపాఖ్యానం

గంటపాటు అప్పారావును అతి భయంకరంగా పొగిడిపారేసి, "... సో! బాబాయ్! మన అప్పణ్ని ఇంకాస్త పాలిష్ చేస్తే ఆంధ్రానంతా కవిత్వంతో ఉతికి పారేస్తాడు." అని ఊదరకొట్టాడు.

అంతవరకూ సైలెంట్‌గా వాళ్ల మాటలు వింటున్న సందేహరావుకో ధర్మసందేహ మొచ్చింది. కె. డి. చెవి దగ్గర నోరు పెట్టి, "ఒరే! అప్పిగాణ్ని పాలిష్ చెయ్యాలంటున్నావ్! వాడేమన్నా బాటావారి బూటు(టా". అని గొణిగాడు.

"బిరడా ముయ్యి.... వెధవ ప్రశ్న వేస్తే మక్కెలు విరిగేట్టు తంతా!" గరుడపక్షి వినకుండా సందేహ రావును చీవాట్లేసాడు కె. డి.

కానీ పాలిష్ చెయ్యడమంటే ఏందో అబ్బా కొడుకులకు్కూడా అర్థంకాలేదు.

'పాలిష్ అంటే మరేదో కాదు బాబాయ్. మనవాడు కవిత్వంలో ఉద్దండపిండమైనా, కొట్టకపోతే వాతలు పడనట్టు కొత్త రచన్లు చదవకపోతే న్యూ ఐడియాస్ రావు. సో!.... కొత్తగా మార్కెట్‌లో కొచ్చిన పుస్తకాలు తెప్పించి అప్పారావు చేత చదివిస్తే సరి. ఇహ చూస్కోండి. శరపరంపరలుగా కవిత్వాలు గోకేస్తాడు" అనుమానం తీర్చాడు కె. డి.

ఆ ప్లాను కూడా సమంజసంగానే తోచిన గరుడాచలం, "మరా పుస్తకాలు కొనడానికి ఎంత ఖర్చవుతుందో?" అనడిగాడు.

పిట్ట వల్లో పడిందనుకొంటూ, "ఎంత! జస్ట్.... ఫైవ్ హండ్రడ్ రుపీసే!" అన్నాడు చాలా వినయంగా కె. డి.-

'సరే!.... మరైతే మనవాడు...'

"... ఆగండి! అర్థమైంది మీ సందేహం.... మనవాడు కవిగా పదిమంది చేతా పొగడబడాలి!.... అందుకో వచ్చే ప్లానుంది!"

'అదేదో త్వరగా చెప్పవయ్యా?" ఆత్రపడ్డాడు గరుడుడు.

'చూసారూ!.... మన టౌన్‌లో ప్రతిసారిలాగే ఈసారి భోగిపండక్కు కూడా సత్కవి మండలి వారి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగుతుంది గదా! అందులో అప్పడు కవిత్వం చదివాడనుకోండి! వాడికి బోల్డు పేరొస్తుంది.... ఏమంటారు?"

"నీ ఐడియా బాగానే ఉంది గాని కె. డి. అబ్బాయ్. ఆ సత్కవి మండలిని నడిపేది మీ తెలుగు పంతులు శాస్త్రిగారాయె.... రాజకీయాల్లో శాస్త్రుర్లు మన పార్టీకి ఎగస్పార్టీ గదా. మరి మన వాడికి ఛాన్సిస్తాడంటావా?"

"వాట్ మై డియర్ బాబాయ్! మీరు వెళ్ళి అడగండి.... కాదంటే మన ఎమ్మెల్యే కుప్పిగంతుల కుంభకోణం గారి చేత రికమెండు చేయిద్దాం!"

కె. డి. తెలివికి గరుడాచలానికి చెమటలు పట్టి, గట్టిగా వాటేసుకొని, "నువ్వు నిజంగా ద్వాపరయుగం నాటి శకునంతటి వాడివోయ్!" అంటూ ఆనందం పట్టలేక ఏడ్చేశాడు.

హ్యాండ్ కర్చీఫ్‌తో గరుడాచలం కన్నీళ్ళు తుడుస్తూ "ఈ సమయంలో మీరిలా యంగ్ విడో బుచ్చమ్మలా ఏడవకండి.... శుభస్య శీఘ్రం.... వెంటనే వెళ్ళి శాస్త్రి గార్ని కలవండి.... మరి కొత్త రచన్లు తెప్పించడానికి ...." అంటూ నసిగాడు.


".... అవునవును.... డబ్బు తెస్తానుండు!" అంటూ అప్పారావుతో పాటు గదిలో కెళ్లాడు గరుడుడు.

కె. డి. వేసిన చీవాట్లు కడుపు నిండా ఆనందంగా మేసి, అప్పటిదాకా మౌనంగా ఉన్న సందేహరావు

"అవున్రా! ఇందాక గరుడాచలంగార్ని యంగ్ విడో బుచ్చమ్మలా ఏడవొద్దన్నావు.... ఆయన పుంలింగం గదా.... స్త్రీలింగంతో ఎందుకు పోల్చినట్టు?" అని ద్వితీయ సందేహం వెలిబుచ్చాడు సందేహుడు.

కె. డి. కి కడుపులో మండి, "వాడే లింగమైతే నీకెందుకురా పుండాకోరు వెధవా! ఇక్కణ్నుంచి వెళ్లేదాకా నోరు తెరిచావంటే నాలిక మీద వాతలు పెడతా!" అంటూ సెకెండ్ వాయింపు వాయించాడు.

ఇంతలో గరుడాచలం ఐదొందలు తెచ్చి కె. డి. కిచ్చాడు.



పద్మనాభం

కలియుగ భీముడు

"ఈ కాలంలో భీముడు ఉండి, కీచకుడ్ని మట్టి కరిపిస్తే! తన జబ్బలు చరుచుకుంటూ ఏమనేవాడో తెలుసా?"

"ఏమనేవాడు?"

"బూస్ట్ ఈస్ట్ ది సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ!"


చక్కని కిటుకు

"ఏమిట్రా నీ కళ్ళు ఎర్రగా ఉన్నాయి? రాత్రి నిద్రపోలేదా?"

"ఏం చెప్పమంటావురా! ఈ మధ్య నాకు గుర్రుపెట్టడం ఎక్కువైంది. నా గదిలో నాగుర్రుకు నేనే మేల్కొనాల్సి వస్తోంది. ఏం చేయమంటావురా?"

"పక్కగదిలోకి వెళ్లిపడుకో. అంతే!"

జి. ఎ. జి.



లటుక్కున డబ్బు తీసి జేబులో కుక్కుకొని, "మరినే ఉంటా బాబాయ్.... మీరు వెంటనే వెళ్ళి శాస్త్రిగార్ని కలవండి.... నే వెళ్ళి మంచి మంచి పుస్తకాలు తెస్తాను. ఎనీహౌ...!ఈసారి మన వాడికి తప్పకుండా మహర్దశ పట్టిందనే అనుకోండి!"అని అతి తెలివిగా సోప్ కొట్టి, మిష్టర్ అండ్ మాస్టర్ గరుడాచలానికి టాటా చెప్పి, వాలతుల్యుడు సందేహరావుతో పాటు తుర్రుమన్నాడు జగత్‌కిలాడి జేమ్స్‌బాండ్ కె. డి.

4

మరునాడు పొద్దున వర్జంలేని టైం చూసి, తెలుగుపండిట్ శాస్త్రిగారింటిని పావనం చేసాడు గరుడాచలం. అతగాణ్ని సాదరంగా ఆహ్వానించారు శాస్త్రిగారు. లోలోపల సంకోచిస్తూనే విషయం వెళ్ళగక్కాడు గరుడుడు...."కావున ఎల్లాగైనా ఈమాటు కవిసమ్మేళనంలో అబ్బాయికో ఛాన్సివ్వం చాలి".

కొంతసేపాలోచించాడు శాస్త్రి.

తరువాత చిరునవ్వు నవ్వుతూ, "చూడండీ!.... మా సత్కవి మండలి కార్యక్రమాల్లో చక్కగా కవిత్వం వ్రాయగల యువకులకే ఎక్కువ అవకాశాలిస్తున్నాం. అదే విధంగా అప్పారావుక్కూడా ఓ అవకాశాన్నివ్వడానికి మాకేఅభ్యంతరమూ లేదు".

ఆ మాటలు గరుడపక్షికి కర్ణపేయాలైనాయి.

"... కాకుంటే, ఈ మధ్య మీ వాడు కాలేజీకి సరిగా హాజరు కావడంలేదు. అటెండెన్సు తగ్గుతోంది. కాస్త మందలించండి. ఇకపోతే!....స్వయంగా మీరే వచ్చి అడిగారు కాబట్టి కవిసమ్మేళనంలో అప్పారావుకు తప్పకుండా అవకాశమిస్తాము".

శాస్త్రిగారిచ్చిన హామీతో గరుడాచలం రిక్షాలో చంద్రమండలానికెళ్లినంతగా సంతోషపడి, సునాయాసంగా పని పూర్తయినందుకు మహా ఇదైపోయి, పండిట్ గారి దగ్గర సెలవు తీసుకొని చొంగలు కార్చుకుంటూ ఇంటికి దౌడు తీసాడు. ఆయాసపడే డాడీని చూసి, "ఏమైంది నాన్నా! కాయా.... పండా!" అని ఆత్రంకొద్దీ అడిగాడప్పుడు.

పుత్రరత్నాన్ని చూసేసరికి గరుడాచలానికి వాత్సల్యం పొంగిపోయి గట్టిగా వాటేసుకొని "నీ దశ తిరిగిందిరా బుజ్జిగా.... నిజంగా నువ్వు...." అని ఆవేశంలో ".... నా కడుపున చెడ బుట్టావురా!" అని ఆనందబాష్పాలు రాల్చాడు.

సరిగ్గా అప్పుడే ఎంటరైనాడు కె. డి. కొన్ని పుస్తకాలతో. గరుడాచలం గూడలెగరేస్తూ కె. డి. కి శాస్త్రిగారిచ్చిన అభయాన్ని గురించి చెప్పాడు.

".... మొత్తానికి అబ్బాకొడుకులకు టౌనులో బజీతు పట్టే రోజులు దగ్గరపడ్డాయి". అనుకున్నాడు మహాజ్ఞాని కె. డి.

పైకి మాత్రం చాలా భయంకరమైన ప్రేమ ఒలకబోస్తూ, అప్పారావుకి కంగ్రాచ్యులేషన్స్ చెప్పి, తను తెచ్చిన పుస్తకాలిచ్చి, "..... వీటిని బాహా రుబ్బి, సారాన్ని పిల్చిపారేసి, సరికొత్త పంథాలో చిత్ర విచిత్ర కవిత్వం గోకి పారెయ్యి". అని దిక్కుమాలిన సలహాయిచ్చాడు, కె. డి. ది గ్రేట్.

5

మిట్ట మధ్యాహ్నం ఒంటి గంట....

మేడమీద రూంలో కూర్చొని కె. డి. తెచ్చిచ్చిన పుస్తకాలు రుబ్బడం మొదలేసాడు హీరో. ముందు 'కుక్కగొడుగుల కుక్కుటమూర్తి' రాసిన 'కుక్కలోయ్ కుక్కలు!" అన్న కథ చదివాడు. ఆ కథలో హీరో నించి, విలన్‌దాకా అన్నీ కుక్కలే.

"అసలీ కథకూ, కవిత్వం రావడానికీ కనెక్షనేమిటీ చెప్మా?" అనుకొని మరో పుస్తకం తెరిచాడు.

అది "ఎట్లాంటాక్కికబెకా అనే పాశ్చాత్య రచయిత్రి రాసిన "లవ్ ఈజ్ యానోల్డ్ షుమార్ట్!' అనే యింగ్లీషు పుస్తకానికి 'పనసతొనల పరంతపరావు' రాసిన తెనుగుసేత "ప్రేమంటే పాత చెప్పుల షాపు!".

నాలుగు పేజీలు చదివాడు అప్పుడు.

అంతే.

ఒళ్లంతా చెమటలు పట్టాయి.

తలపోటు పుట్టింది

ఆఖరికి కన్నీళ్లొచ్చాయే గాని, కవిత్వమొచ్చే సూచన్లు మచ్చుకు కూడా కనిపించలేదు.

కె. డి. మీద కాస్త కోపం కూడా వచ్చింది.

"ఈ అప్పగాడిద అయిదొందలు పుచ్చుకెళ్లి ఇల్లాంటి అల్లాటప్పా పుస్తకాలు తెచ్చాడేవిటో?.... అయినా ఏ ప్రయోజనం లేకుండానే ఇలాంటి పుస్తకాలు తెచ్చివ్వడు సో!.... వీటిల్లో ఏదో గొప్పతనం ఉండే ఉండాలి పోయి వాణ్ణే అడిగితే సరి" అనుకొని కె. డి. ని కలుసుకోడానికి బయల్దేరాడు అప్పారావు

దారిలోనే బీడి దమ్ము కొడుతూ కనిపించిన కె. డి. కి తన పాట్లు చెప్పాడు.

కె. డి. మహాజ్ఞానిలా పోజు పెట్టి, చిరునవ్వు నవ్వి, "ఒరే అమాయక శిఖామణీ! అదేరా ఆ పుస్తకాల్లో గొప్పతనం.. ఈజీగా అర్థంకావు.... అలా అర్థం కానిపుస్తకాలు రాయబట్టే ఆ బుక్స్ రాసిన రచయితల పేర్లు ఆంధ్రాలో లంగరు చుట్టల్లా వెలిగి పోతున్నాయ్. సో మైడియరప్పడూ! వెంటనే వెళ్లి ఒకటికి నాలుగు సార్లు చదువు." అంటూ జ్ఞానోపదేశం చేశాడు.

"రే చదువుతాననుకో ... అయినా కవిత్వం రాయడానికీ, ఈ పుస్తకాలు చదవడానికీ సంబంధమేందంటావ్?"

అప్పారావు వేసిన ప్రశ్నకు కాస్త కంగుతిన్నాడు కే. డి.

గరుడాచలం దగ్గర తీసుకున్న అయిదు వందల్లో ఓ వంద ఖర్చుపెట్టి కుళ్లు కథల పుస్తకాలు తెచ్చిచ్చి మస్కా కొట్టాడు. ఆ విషయం

హాస్య నవలిక — సాహిత్య హంతకోపాఖ్యానం

అప్పారావుకు అర్థమైతే ఇక తనకు పైసా డబ్బులు కూడారావు.

"అప్పిగాడు తెలివి మీరాడు.... వెంటనే ప్లేటు మార్చెయ్యాలి" అనుకొన్నాడు.

"...ఓ: కే! నీ కంతగా ఆ పుస్తకాలు అర్థం కాకపోతే వాటిని వదిలేసి, వేరేవి తెప్పించి చదువుదాం! నేను సాయంకాలం మీ ఇంటికొస్తాను. అప్పుడు బాగా డిస్కస్ చేద్దాం! అయినా నీకేం రా.... కాయితం మీద కలం పెట్టావంటే చాలు.... ఆటో మేటిక్‌గా వచ్చే సెయ్యాలి.... కవిత్వం!" పావుగంట పాటు గ్యాస్ కొట్టి అప్పారావును ఇంటికి పంపి "హమ్మయ్య! ఓ చిన్న గండం గడిచింది!" అనుకున్నాడు కె. డి.

ఇంటి దగ్గరి కొచ్చేసరికి కవిత్వం బరకడానికి కాగితాల్లేవని గుర్తుకొచ్చింది అప్పిగాడికి.

మళ్ళీ వెనక్కొచ్చి ఓ బుక్‌షాపులో దస్తా తెల్ల కాగితాలు కొన్నాడు.

అదే సమయంలో భయంకరమైన గమ్మత్తొకటి జరిగింది.

అప్పారావు కళ్ళకు మహాకవి శ్రీశ్రీ వ్రాసిన మహాప్రస్థానం కనిపించి, అతగాడి బుఱ్ఱలో సరికొత్త ఆలోచన మెరిసింది.

వెంటనే మహాప్రస్థానం కూడా కొనేసి, నేరుగా ఇంటికొచ్చాడు.

మేడమీదికి వెళ్ళి, రూంలో కూర్చొని ఆలోచించ సాగాడు.

"మహాప్రస్థానం మీద రీసెర్చి చేస్తే ఎలా ఉంటుంది?" అదే అప్పారావు ఆలోచన.

ఆ ఆలోచనలో మనస్సు రెండు ముక్కలైంది. ఓ ముక్క, "దౌర్భాగ్యుడా! పిచ్చి వేషాలు వేసి మహాకవుల కవిత్వాలతో తమాషాలాడకు.... తాట ఊడుతుంది!" అని హెచ్చరించింది.

కానీ....

రెండో ముక్క, 'ఊ! చిక్కింది లక్కీఛాన్స్.... చదివెయ్యి పుస్తకాన్ని.... డోంట్ వర్రీ... గొప్ప గొప్ప సినిమా యాక్టర్లనెంతమంది ఇమిటేట్ చెయ్యడం లేదు.... ఫరవాలేదు! నువ్వూ మహాప్రస్థానాన్ని చదివి, అవసరమైతే అక్షరాలు మార్చేసి కాపీ కొట్టు! నీ పేరు ఆటం బాంబులా మోగుతుంది." అని దుర్బోధ చేసింది.

ఆవేశ మొచ్చేసింది కవికి.

మహాప్రస్థానంలో ఒక్కో పేజీని అతి జాగ్రత్తగా చదవడం మొదలెట్టాడు.

ఎంత చదివినా కవితా సారం బుఱ్ఱకెక్కలేదు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా వదల కుండా చదివేస్తున్న అప్పారావుకు ఒకపేజీలో ఉన్న కవిత కారు చీకట్లో దీపంలా తోచింది.

"అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ, కుక్కపిల్ల, కావేవీ కవిత కనర్హం!" ఒకటికి వందసార్లు చదివాడా నాలుగు ముక్కల్నీ. చదవగా చదవగా ఎప్పుడూ రాని ఆలోచనొచ్చింది. "ఇదే విధంగా మరికొన్ని ముక్కలు ముక్కితే....?" వెంటనే కాగితం, కలం తీసుకొన్నాడు.

శ్రీశ్రీ గారి కవితకు ప్యారడీలు రాయడం మొదలెసాడు. మొదట, "గుడ్డి కుక్క, గుంటనక్క, బీడీ ముక్క." అనిరాసాడు.

కానీ నచ్చలేదు.

రెండో సారి, "కటకట, కిటకిట, లటపిట" అని అఘోరించాడు.

"... ఐనా ఇవి చాలా లోతు భావాలు.... పామరులకు అర్థం కావు." భ్రమపడ్డాడు.

"పేపర్స్, కాపర్స్, లోఫర్స్."

".... తెలుగు వాళ్ళు అండర్‌స్టాండ్ కాలేరు!"

అర్థ గంట అదే బాణీలో నవనాడులు పీక్కున్న దరిమిలాను అప్పారావు బుఱ్ఱలోకి చీడ పురుగుల్లా మూడు ముక్కలు దూరాయి.

"వేలి ఉంగరం... పులిబొంగరం... పేలాల మంగలం." సదరు వినూత్న వికార ప్యారడీ కవితా సృష్టికి అప్పబ్బాయికి ఆనందం ఓవర్ ఫ్లో అయి రోమాంచితం కూడా అయింది.

ఓ మాటు షైలాక్‌లా దిక్కుమాలిన నవ్వు నవ్వి, కంటిన్యూయిటీ దెబ్బ తినకుండా పెద్దగా ఏడ్చేసాడు.

కవిత్వాలను తీసుకొని చకచకా మేడమించి దిగొచ్చి గదిలో నిద్రపోతున్న పితృదేవుణ్ణిలేపి, తన కవితల్ని వినిపించాడు మహాగంభీరంగా.

కొడుకు చేసిన కొత్త చెత్త కవితా సృష్టికి గరుడాచలం మైమరచిపోయి, ముద్దులతో అప్పారావు దేబె మొహాన్ని ఖరాబు చేసాడు.

అనుకోని అతిథిలా, కాలదోషం పట్టకుండా అదే టైంకు వచ్చాడు కె. డి. గాడు అసిస్టెంటు సందేహరావుతో సహా.

అప్పారావు రాసిన ఇమిటేషను కవిత్వం విని, మనసులో నవ్వుకొని, పైకి దురభిమానాన్ని నటిస్తూ, "ఇలాంటి కవిత్వం నువ్వుతప్ప ఈ ఆంధ్రదేశంలో ఎవ్వడూ డేర్ చేసి రాయలేడ్రా అప్పా!" అని తెగ మెచ్చేసుకున్నాడు కె. డి.

".... కాబట్టి, పులి బొంగరాలు కూడా కవిత్వంలో ఓ భాగమే నంటారా?" అని సహజబాణీలో సంకోచం వెలిబుచ్చాడు సందేహరావు.

ఆ సందేహానికి అందరూ నవ్వేసారు. ఆ పూటకు సభసంతోషంగా ముగిసింది.

6

గరుడాచలాని కిచ్చిన మాట మేరకు శాస్త్రిగారు 'సత్కవి మండలి' ఆధ్వర్యంలో భోగి పండుగ రోజున జరుగబోయే కవిసమ్మేళనంలో పాల్గొంటున్న కవుల లిస్టులో అప్పారావు పేరును కూడా జోడించి, ఆహ్వాన పత్రం కూడా పంపారు.

అది చూసిన గరుడాచలం ఆనందం పట్టలేక అవ్వాయి చువ్వలా గంతులేసాడు.

బజార్లో కనిపించిన ప్రతి సన్యాసికీ తన సుపుత్రుణ్ణి గురించి చెప్పి తెగ మురిసి పోయాడు.

గరుడాచలం మూడ్సను కనిపెట్టిన కె. డి. అప్పారావు బొమ్మను రాయించిన వాల్‌పోస్టర్లు గోడల మీద అతికిస్తే గొప్ప పబ్లిసిటీ వస్తుందని తైరుకొట్టి, మరో ఐదువందలు కాజేసాడు.

భోగి దగ్గరికొచ్చింది.


అప్పారావు కూడా విపరీతంగా చెలరేగి రోజుకో దస్తా కాగితాలు ఖరాబు చేస్తున్నాడు.

టౌన్‌లో పాంప్లెట్లు పంచబడ్డాయి.


కవుల లిస్టులో అప్పారావు పేరు చూసి, కాలేజీ కుర్రాళ్ళు విరగబడి నవ్వుకున్నారు.

కాస్త తెల్లగా కనిపించిన ప్రతిగోడ మీద 'సాహిత్య హంతకుడు అప్పారావు నశించాలి!'

'కవి భయంకర అప్పిగాడు డౌన్‌డౌన్!' లాంటి



నాట్యగణపతి



ఏ స్పజన్, విజయవాడ

గణేశా ! !

నీ పండుగరోజున సంబరమాయెను
భక్తితో కొలుతుము గణేశా
మా భారము నీదే గణేశా !!

పెరుగుతున్న జనాభా ఆకాశాన్నంటు ధరలతో
సాగని మా బ్రతుకుల భారము నీదే గణేశా !!

కన్యల వివాహగాధలు తండ్రులకు పరకట్నబాధలు
మా ఇక్కట్లనుబాపే భారమునీదే గణేశా !!

ధర్మము నశించెను ద్వేషము పెరిగెను
ఇక నీతిని నిలిపే భారము నీదే గణేశా !!

సఖ్యత సమసెను కక్షలు పెరిగెను
ప్రశాంతత నిలిపే భారము నీదే గణేశా!!

పిల్లల చదువులు చల్లగ చూడుము
సక్రమ మార్గమున నడిపే భారము నీదే గణేశా !!

దేశరక్షణ ప్రజల పాలన
ప్రగతి సాధన భారము నీదే గణేశా !!

ఆది దేవుడవు ఆంధ్రపత్రికను
అభివృద్ధిపరిచే భారము నీదే గణేశా !!

-శ్రీకంఠం కామాక్షమ్మ

హాస్య నవలిక

రాతలు రాయడం, అది చూసిన గరుడాచలానికి అరికాలి మంట నెత్తికెక్కడం కూడా జరిగింది.

కానీ వ్యవహార దక్షుడు కె. డి. మత్తు మాటలు చెప్పి గరుడాచలాన్ని చల్ల బరచడం కూడా అయింది.

7

'అభ్యాసేన నలభ్యంతే చత్వారః సహజాగుణాః దాతృత్వం ప్రియ వక్తృత్వం కవిత్వ ముచితజ్ఞతా!'

దానగుణం.....

ప్రియ భాషణం.....

కవిత్వం.....

ఉచితానుచిత జ్ఞానం...

ఇవి అనుకరిస్తే అబ్బేవి కావు!

సహజంగా రావాలి.

'వాక్యం రసాత్మకం కావ్యం!'

వ్రాసే ప్రతివాక్యం లోనూ రసస్ఫూర్తి ఉన్నప్పుడే ఆ రచన కలకాలం నిలుస్తుంది.

ఆంధ్ర సాహిత్యమనే విశాల విశ్వాన్ని తజోమయం చేసిన ముగ్గురు సూర్యులు నన్నయ, తిక్కన, ఎఱ్ఱన....

శ్రీనాధ కవిరాజు సీసపద్యాలు సాహితీ సౌధ గవాక్షాలకు మణితోరణాలు.

సహజ కవి పోతన ఘంటం అంటి భాగవతం పలికిందీ గడ్డలో.

అది ఆ నాటి మాట....

నిన్న గాక మొన్న...

'విశ్వనాధ' వారి ఎదలో 'రామాయణ వంశవృక్షం' పుష్పించి ఫలించింది.

కృష్ణపక్షంలో సైతం 'దేవులపల్లి' వారి 'కృష్ణపక్షం' శుక్లపక్ష చంద్ర చంద్రికలు వెదజల్లింది.

'శ్రీశ్రీ' విశ్వప్రేమ 'మహాప్రస్థానం' అందుకొంది.

అలాగే ఈనాడు....

మహాకవుల హృదయాంత రాళాల నించి జాలు వారుతున్న కవితాగంగ పాలు పొంగే తెలుగు గడ్డను పునీతం చేస్తోంది.

కాగా.....

ఆయా కవి రత్నాలు ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఏ సాంఘిక చైతన్యం కోసం కవితా సృష్టి చేసారో తెలియక.....

అటు భాషను, ఇటు భావాన్ని హతం చేసి, అనుకరణ విధానాన్ని ఆచరణలో పెట్టి, తమ కవితలతో 'కవి తలలు' బొప్పి కట్టేలా కు కవిత్వాలను సృష్టించే అప్పారావు లాంటి కవి రాక్షసులకు....

ఆఖరికేగతి పడుతుంది....?

8

మరునాడే భోగి....

టౌన్ హాల్‌లో కవితాగానం జరపడానికి ఏర్పాటు చేసారు సత్కావి మండలి వారు. గరుడాచలం తెలిసిన వాళ్లందరికి పనీ బడ రమ్మని చెప్పొచ్చాడు.

మధ్యాహ్నం మేడ మీద అందరూ కలిసి అప్పారావును టౌన్ హాల్‌కు ఎలా తీసుకు వెళ్తే ఘనంగా వుంటుందని దురాలోచన చెయ్యడం మొదలెట్టారు.

ఉన్నట్టుండి కె. డి. గాడిలో బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

"బాబాయ్! మన అప్పూను టాప్‌లేని టాక్సీలో తీసుకెళ్తే అందరూ చూడ్డానికి వీలుగా వుంటుందంటాను. మీరేమంటారు." అని అడిగాడు.

ప్లాన్ నచ్చిన గరుడాచలం "ఓకే" అన్నాడు.

"యావండోయ్! అల్లాగే మాంఛి సన్నాయి మేళం పెట్టిస్తే ఎల్లా వుంటుందీ!" అంటూ లొడ బెట్టింది తాయారమ్మ.

సతీమణి సలహా అద్భుతంగా తోచింది గరుడుడికి.

"అదే విధంగా మన అప్పడి మీద పూలు, డబ్బులూ చల్లుకుంటూ తీసుకు వెడితే అత్యద్భుత ట్రిబ్యుల్‌గా ఉంటుందని నా అభిప్రాయం". ఉచిత సలహా విసిరాడు సందేహరావు. జీవితంలో మొదటి సారి సందేహుడు ఇచ్చిన ఉత్తమ సలహా అదే!

గరుడాచలాని కది మరి మరీ నచ్చింది. టాక్సీని, మేళాన్ని ఏర్పాటు చెయ్యడానికని గరుడాచలం దగ్గర మళ్ళీ ఐదు వందలు పుచ్చేసుకొని, "పొద్దున్నే మన కవి చక్రవర్తిని రెడీగా వుంచండి!" అని పరాకు చెప్పి సందేహరావుతో సహా అంతర్ధాన మైనాడు కె. డి. శవంతో భేతాళుడిలా.

9

భోగి రోజు...

మాతృశ్రీ తాయారమ్మ కుమార రత్నానికి తలంటు పోసింది.

స్నానానంతరం సర్వాలంకారం చేసుకున్న అప్పారావు చూసే వాళ్లకు చింపాజీ కోతిలా కనిపించేటంత అందంగా ఉన్నాడు.

అప్పటికే సన్నాయితో అప్పలసామి, మెడకో డోలు తలిగించుకొని గుర్లింగం వాకిట్లో రెడీగా ఉన్నారు.

ఇంతలో కె. డి., సందేహరావు టాప్ లేని టాక్సీ తెచ్చేసారు.

అందరూ అల్పాహారం సేవించారు. తరువాయి కవికుంజరం అప్పారావు మందగమనంతో టాప్ లేని టాక్సీ దగ్గరికి అతి ఠీవిగా నడిచాడు.

సందేహరావు పూల బుట్టను తీసుకున్నాడు. కె. డి. గాడు చిల్లర డబ్బుల సంచీని లంకించు కున్నాడు.

అప్పారావుతో పాటు గరుడాచలం, తాయారమ్మ టాక్సీలో కూర్చోగానే ఎవరో పుటుక్కున తుమ్మారు.

తాయారమ్మకు కోప మొచ్చి, "వీళ్ల ముక్కులు తెగ.... వీళ్ల తుమ్ములు తగలెయ్య." అంటూ శాపనార్థాలు మొదలేసింది. నెమ్మదిగా గరుడాచలం, తాయారమ్మను శాంత పరిచి భజంత్రీలకు

సాహిత్యహంతకోపాఖ్యానం

వాయించమని ఆర్డరిచ్చాడు.

వెంటనే గుర్లింగం తన మార్దంగిక విద్యా నైపుణ్యాన్నంతా ప్రదర్శించాలనే దుర్బుద్ధితో "డుముకు, డుముకూ.... డుడ్డుముకు డుముకూ....." అని కర్ణభేరి చిల్లులు పడేట్టు వాయింపు మొదలెట్టాడు.

దానికి అనుగుణంగా అప్పలసామి తన పాతికేళ్ల సంగీతానుభవాన్నంతా తగలేసి, "పిరిపి, పిరిపి... పిప్పిరిపి పిరిపి." అంటూ సన్నాయి రొద మొదలేసాడు.

టాప్ లేని టాక్సీ డ్రయివరు భజగోవిందం "పాయ్.... పాయ్!" మంటూ హారన్ కొట్టి టాక్సీని స్టార్ట్ చేసేడు.

అదే సమయానికి నెత్తిన చెంగు సవరించుకుంటూ ఎదురొచ్చింది పూర్వసువాసిని మాచమ్మ.

శుభమా అని కదిల్తే విధవ ఎదురొచ్చినందుకు తాయారమ్మ మహా కోపంతో బొబ్బలు పెడుతూ, టాక్సీని ఆపించి మాచమ్మ దగ్గరి కెళ్లి, "ఒసి నీ తాడు తెగా! అబ్బాయి కవిత్వం చదవడానికి వెడుతుంటే కాస్త పక్కకు తప్పుకోడం తెలీదటే ముండ మోపీ!" అంటూ ఆరున్నొక్క రాగంలో చీవాట్లు పెట్టింది.

మాచమ్మ కూడా వాగ్యుద్ధంలో తాయారమ్మ కేమాత్రం తీసి పోకుండా-

"ఏం కూస్తావే!.... నా తాడు ఎప్పుడో తెగిందే!.... ఇంక తెగాల్సింది నీ తాడేనే! ఎప్పటికో ఒకప్పటికి నీ మొగుడూ ఛావక పోడు.... నువ్వూ ముండ మొయ్యక పోవే గూడూరి కుంకా!" అంటూ ఎడాపెడా ఉతికి ఆరేసింది.

ఇద్దరూ ఒకర్నొకరు సరికొత్త తిట్లు తిట్టుకోడమే కాక వ్యవహారం ముదిరి ముష్టి యుద్ధం దాకా వచ్చింది.

పావు గంట పాటు నిరవధికంగా జరిగిన మహిళా సంగ్రామాన్ని ఆపడానికి గరుడాచలానికి తల ప్రాణం తోక కొచ్చినంత పనైంది.

తిరిగి అప్పారావుతో పాటు మిష్టర్ అండ్ మిసెస్ గరుడాచలం టాక్సీ ఎక్కారు.

టాక్సీ కదలగానే సందేహుడు అప్పారావు మీద పూలు చల్లుతూ, "జిందాబాద్ అప్రావ్!" అని కేకలేస్తూ టాక్సీ పక్కన మార్చ్ చెయ్యసాగాడు.

జిత్తులమారి కె. డి. గాడు చిల్లర డబ్బుల సంచీలోంచి రూపాయి బిళ్లలు, అర్ధలు, పావలాలు ఏరి గుట్టుగా జేబుల్లో వేసుకొని, పదిపైసలు, ఐదుపైసలు అప్పడి మీద విసుర్తూ, "కవి భయంకర అప్పారావ్! వర్ధిల్లాలి!" అంటూ టాక్సీకి మరో ప్రక్కన నడుస్తున్నాడు.

నాలుగు రోడ్ల సెంటరు కొచ్చింది టాక్సీ. అతితీవిని ప్రదర్శించాలనే తప్పుడు బుద్ధి పుట్టి మాతాపితల మధ్యన దహనానికి నోచని పీనుగులా నీలుక్కొని కూర్చున్నాడు అప్పబ్బాయి.

అల్లంత దూరం నించి పూలు, డబ్బులు చల్లడం చూసిన జనం "పండగ పూట ఎవడో మహాపాపి కాలంతీరి, నికృష్టపు చావు చచ్చినట్టుంది!" అనుకొంటూ, దగ్గరికొచ్చి, ఆ మతిమాలిన తతంగం చూసి గరుడాచలం అండ్ ఫ్యామిలీ వారి బుద్ధి తక్కువ తనాన్ని తల్చుకొని పొట్టలు ఉబ్బేలా నవ్వసాగారు.

తాయారమ్మకు అనుమాన మొచ్చి "అదేవిటండీ! అలా నవ్వుతున్నారూ!", అంటూ కీచురాయిలా గీపెట్టింది.

".... అదంతా మన అప్పు తల్లి మీద అభిమానమే పిచ్చిపక్షీ!" అని అతి నీచంగా నవ్వాడు గరుడాచలం.

పది నిమిషాల్లో టాక్సీ టౌన్‌హాల్ చేరింది. అప్పారావుతో పాటు తాయారమ్మ, గరుడాచలం మహా దర్పంగా టాక్సీ దిగి హాల్లోకి నడిచారు.

బాడీగార్డుల్లా కె. డి. గాడు, సందేహుడు వాళ్లననుసరించారు.

ఆహూతులంతా అప్పటికే హాజరుగా ఉన్నారు.

వెంటనే కార్యక్రమం మొదలైంది.

శాస్త్రిగారు సభాధ్యక్షులు.

డి. ఇ. ఓ. గారు ముఖ్య అతిధిగా వచ్చారు.

ఒక్కొక్క కవిని పేరు పేరునా పిలిచి వేదిక మీదికి ఆహ్వానించి పూల హారాలు వేస్తున్నారు.

అంత వరకూ బాగున్న అప్పారావు తాలూకు తాటికాయంత గుండె కాయలో ప్రైవేటు బస్సులు పరిగెత్తసాగాయి.

చెమటతో చొక్కా, ప్యాంటు జాయింటుగా తడిసాయి. అది గమనించిన గరుడ పక్షి, "కంగారు తినకురా బంగారం.... మోత మోగిచ్చు...." అని ధైర్య బోధ చేసాడు.

".... నా సవర్లకొండకేం భయం లేదు.. మహాధాటిగా కవిత్వాలు చదివి జనాన్ని పీకి పాకాన పెడతాడు." అంటూ కొడుకును గారాబు చేసింది తాయారమ్మ.

ఇంతలో అప్పారావును వేదిక మీదికి ఆహ్వానించారు.

బిక్కు బిక్కుమంటూ వేదిక ఎక్కాడు యువకవి. మెళ్లో పూల హారం వేసారు.

చచ్చిన దాసరి పామును చుట్టినట్టు ఫీలైనాడు చిత్రకవి.

నిమోనియా రోగిలా వణుకుతూ ఓ కుర్చీలో కూలబడ్డాడు.

అప్పారావు పడే అవస్థను గమనిస్తూనే పుస్తు గరుడాచలం కె. డి. ని, సందేహరావును దగ్గరికి పిలిచి, ".... ఎందుకైనా మంచిది. మీరూ వెళ్లి అబ్బాయి దగ్గర ఉండండి." అని ఉత్తర్వు వేసాడు.

గరుడుడి ఆజ్ఞ మేరకు వంది మాగధు లిద్దరూ వేదిక మీదికి వెళ్లి సైడ్‌కర్టన్ దగ్గర నిలబడ్డారు.

కవులు కవితాగానం చెయ్యడం మొదలేసారు.


మంచి మనుషులకు....

మంచి కవులకు.....
అందరూ అభిమానులే!

సత్కవుల కవిత్వాలు వింటున్న ప్రేక్షక శ్రోతలు చేసే కరతాళ ధ్వనులతో టౌన్ హాల్ ప్రతిధ్వనిస్తోంది.

ఇలా ఐదారుగురు కవులు కవిత్వాలు చదివిం తరువాత కథానాయకుడు అప్పారావు ఖర్మ కాలింది. తడబడుతూనే మైకు దగ్గరి కెళ్లాడు.... నెమ్మదిగా ఓ

శ్రీ బిట్రగుంట సాయిబాబా పరిచయం



ఆంధ్రసచిత్ర వార పత్రికలో హాస్య నవ
రికల పోటీలో ప్రధమ బహుమతి పొందిన
"సాహిత్య హంతకోపాఖ్యానం" నవలిక రచ
యిత శ్రీ బిట్రగుంట సాయిబాబా (36)
ఒంగోలు సి. ఎస్. ఆర్. శర్మ కళా
శాలలో పి. యు. సి. చదివారు. శ్రీ
బిట్రగుంట బాలకృష్ణారావు, శ్రీమతి అన్న
పూర్ణమ్మ గార్లు వీరి తల్లిదండ్రులు.
సత్సాహిత్య పఠనం, కథలు, కవితలు
వ్రాయడం శ్రీ సాయిబాబా గారి హాబీ.

హాస్య నవలిక — సాహిత్యహంతకోపాఖ్యానం

సకిలింపు సకిలించాడు.

కానీ ఎలా మొదలెట్టాలో అర్థం కాక గింజుకుంటున్న అప్పారావు దగ్గరికెళ్ళి "ఊ! త్వరగా మొదలెయ్యి..." అంటూ హెచ్చరించాడు కె. డి.

"ఆలస్యం చెయ్యకుండా నీ కవిత్వంతో జనాన్ని చెండుకుతిను" ధైర్యం చెప్పాడు సందేహరావు.

"అదే! ఎలా మొదలెట్టాలో .." అంటూ లొట్టలేసాడు అప్పబ్బాయి

'వెరి సింపుల్! బులో స్వతంత్ర భారత్కీ జై' అని కేక పెట్టమని దిక్కుమాలిన సలహా యిచ్చాడు సందేహుడు.

ఆ సలహా విన్న కె. డి. కి కడుపు మండి "ఇదేమన్నా పార్టీ మీటింగనుకున్నావా పింజారీగాడిదా... అల్లాటప్పా 'ఎట్వాయిజాలియ్యక బిరడాముయ్యి!" అని సందేహరావును చివాట్లేసి. "మహా జనులారా!" అని మొదలెట్టమని అప్పారావును హుషారు చేసాడు.

కె. డి. కొట్టిన పంపుకు కాస్త తెప్పరిల్లి ఓ ఫాడిదగ్గు దగ్గి, "మహాజనాభాలారా!" అంటూ మకరపు దున్నలా అరిచాడప్పారావు.

ఆ అరుపు విని సభంతా ఒక్కసారిగా ఘొల్లుమంది. నవకవి గుండె కంగారుతో ఝల్లుమంది.. భయంతో వణికి పోతూనే, "నె నె నేను... మన శ్రీశ్రీ గగగ్గారి మీద... బొబొబ్బొచ్చెడు తయారు చేసేశా! అని శ్లోకండాలు పెట్టాడు.

"ఏం తయారు చేసావురా పిడకలు... ముందెు రాసిన కవిత్వం చదివేడు." సభలోంచి ఎవరో కేక పెట్టారు.

"యాబ్బే! నేను తయారు చేసింది పిడకలు కాదు "కంగారుతో పిలుపెట్టాడు అప్పుడు.

కొడుకు పడే పాట్లు చూసి గరుడాచలం సపత్నీ సమేతంగా వేదిక మీదికొచ్చి అప్పారావు భుజం తట్టి, "భయపడకురా పక్కారకొండా! .. మోత మోగిచ్చెయ్యి. . చచ్చి నరకంలో నానా గడ్డి తింటున్న మీ తాత అప్పయ్యకు ఆత్మశాంతి చేకూర్చు!" అని గీతోపదేశం చేసి, పెళ్ళాంతో పాటు సైడు కర్టన్ చాటు కెళ్ళాడు.

అప్పటికే సభలో కలకలం జాస్తయింది.

డి. ఇ. ఓ గారు కూడా విసుక్కోడం గమనించిన శాస్త్రిగారు అప్పారావును కంగారు పడకుండా కవిత్వం చదవమని ధైర్యం చెప్పారు.

అంతే......

ఒక్కసారిగా ఎక్కడలేని ధైర్యాన్నంతా కూడదీసుకొని కీచుగొంతుతో "దబ్బాలు... అబ్బాలు . .సుబ్బాలు" అనేసాడు.

మళ్ళీ టౌన్‌హాల్ నవ్వులతో. చప్పట్లతో రీసౌండిచ్చింది.


"ఇప్పుడు నేను మరోటి...." అంటుండగానే సభలోంచి ఓ పేపర్ రాకెట్‌వచ్చి అప్పారావు ముక్కుకు తగిలింది

బిక్క చచ్చాడు అప్పుడు.

"అబ్బబ్బ! ఆలస్యం చెయ్యక ఆ పులిబొంగరం మీద రాసిన బిట్టును చకచకా చదివెయ్యి.. బొచ్చెడు అప్లాజొస్తుంది" అని వెనకనించి అప్పిగాణ్ణి ఓ పోటు పొడిచాడు కె. డి.

"వేలి ఉంగరం... పులిబొంగరం... పేలాల మంగలం."

"పోయి పులిబొంగరాల బిజినెస్ పెట్టుకోక నీకు కవిత్వాలెందుకురా అంట్ల వెధవా" ఘోషించింది.



భావకవి అప్పారావుకు బ్యాటరీ డౌనైంది. నీరసంగా, "కచ్చాలు.... బచ్చాలు... లుచ్చాలు!" అన్నాడు.

అంతే...!

సభలోంచి కొందరు కుర్రాళ్ళు కుళ్ళిన టొమేటో పండ్లను అప్పారావు మీదకి విసిరేసారు.

ముఖమూ, గుడ్డలూ ఖరాబైనాయి. సభంతా గగ్గోలైంది.

"ఇలాంటి అప్రాచ్యుల్ని సభలకు రానివ్వగూడదు" అన్నారు కొందరు.

"తెలివి తక్కువ సన్నాసులంతా కవిత్వాలేడిస్తే ఇంతే!" ఇంకొందరు విమర్శించారు.

మొత్తానికి అప్పారావు చదివిన దిక్కుమాలిన కవిత్వానికి అందరికీ చిరాకేసింది.

"ఆ భడవా చోరు వెధవను దిగే దాకా దంచండి!" అని కొందరు కేక లేసారు.

"కవి రాక్షసుడు నశించాలి." ఇంకొందరి గోల. ఆ హంగామాకు అప్పారావు పూర్తిగా భయపడి పోయాడు.

పనికర్లొచ్చినట్టు కళ్ళు పచ్చబడి, ఒళ్ళు తూలింది. మూర్ఛ వచ్చి కింద పడబోతున్న అప్పారావును గరుడాచలం పగ్గెరాలు పట్టుకొని కింద పడుకోబెట్టారు.

వేదిక మీది వారంతా అప్పుడు చుట్టూ గుమిగూడారు.

కొడుకు మూర్ఛపోవడంతో తాయారమ్మకు దడ జాస్తి అయింది. అప్పారావు మీద పడిపోయి "ఇదేం దిక్కుమాలిన కవిత్వం రా దేవుడో... నా నానిగాణ్ణి పొట్టన పెట్టుకున్నట్టుంది... నేనింకెట్టా బతికేదిరో నాయనో!" అంటూ హైపిచ్‌లో ఏడుపు రికార్డు పెట్టింది.

ఆ సంగీత మాధుర్యానికి గరుడాచలానికి కంపరం పుట్టి, "నీ పిండం పిల్లులు తినా! పండగ పూట అపశకున పక్షిలా ఏడ్చి ఛావకు..." అంటూ పెళ్ళాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు.

ఈలోగా శాస్త్రిగారు సందేహరావును పంపి గ్లాసుతో నీళ్ళు తెప్పించి అప్పారావు ముఖం మీద చల్లారు.

కానీ...

కవి కుంజరం లేవలేదు...

చీఫ్ గెస్టు డి. ఇ. ఓ. గారు, "ముందా కుర్రాడికి పల్స్ చూడండి." అన్నారు, కాస్త కంగారు పడి.

శాస్త్రిగారు పల్స్ చూసారు.

అది మాత్రం కొట్టుకుంటూనే వుంది.

"... అతిగా కంగారు పడ్డ కారణంగా అప్పారావుకు మూర్ఛ వచ్చినట్టుంది. వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్ళండి" సలహా ఇచ్చారు శాస్త్రిగారు.

అది విన్న తాయారమ్మ పూనక మొచ్చినట్టు గంతు లేస్తూ, నానా హంగామా చెయ్యసాగింది.

అలస్యం చేస్తే లాభం లేదని గరుడాచలం అప్పారావు కాళ్ళు పట్టి ఎత్తాడు.

కె. డి., సందేహరావు చెరో రెక్క పట్టి లేపారు.

నెమ్మదిగా మహాకాయుణ్ణి మోసుకెళ్ళి టాక్సీ బ్యాక్‌సీట్‌లో పడేసారు.

తాయారమ్మ వాల్యూం బాగా పెంచి, లయబద్ధంగా హై పిచ్‌లో ఎక్కిళ్ళు పెడుతూ కొడుకు తలను ఒళ్ళో పెట్టుకొని నిమర సాగింది.

గరుడాచలం కాళ్ళ దగ్గర కూర్చొని సుపుత్రుడి అరికాళ్ళు రుద్ద సాగాడు.

"పాపం అప్పిగాడి కేమౌతుందో రా కె. డి" అమాయకంగా అన్నాడు సందేహుడు.

"...ఏం మాయ రోగం లేదు... కొడుకో క్రాకు... అబ్బొక అంట్ల వెధవ... ఇద్దరికీ తగ్గ శాస్తి జరిగింది" అంటూ సందేహరావును చూసి విషపు నవ్వు నవ్వాడు కె. డి.

"వాళ్ళ డబ్బులు తిని, వాళ్ళనే తిడుతున్నాడేమిటి చెప్మా వీడు" అనుకొంటూ జుట్టు పీక్కున్నాడు సందేహరావు.

జనమంతా వాళ్ళనే చూస్తూ పొట్టలు చెక్కలయ్యేలా నవ్వుతూంటే, సిగ్గుతో గరుడాచలం ముఖారవిందం పాతకాలపు చిల్లికానీ లా చిన్నబోయింది.

డ్రైవరు భజగోవిందం అలవాటు ప్రకారం "పాయ్... పాయ్" అని హారన్ మోగించి, టాక్సీ స్టార్టు చేసాడు.

మిగిలిన పూలను చల్లుతూ సందేహరావు, చిదంబరంగా చిల్లర డబ్బులు విసురుతూ కె. డి. గాడు టాక్సీకి ఇరువైపులా ఇస్పేట్ జాకీ ఫేసులు పెట్టి నడవసాగారు.

అప్పలసామి సన్నాయి మీద, "జగమే మాయ, బతుకే మాయ" అని విషాద గీతాన్ని మహా హుషారుగా వాయించేస్తుంటే....

మార్దంగికుడు గుర్లింగం డోలు మీద దొంగ దరువు తియ్యసాగాడు.

స్వంత తెలివి లేకున్నా....

అనుకరణతో... అనుసరణతో...

టక్కరు కవిత్వాలు రాసి..., ఆఖరికి అభాసు పాలైన సాహిత్య హంతకుడు అప్పారావును మోస్తూ, డాక్టర్ పస్తుల పైత్యాంతకం గారి హాస్పిటల్ కేసి కదిలింది టాప్‌లేని టాక్సీ, చాలా టిప్ టాప్‌గా!

(అయిపోయింది)

శ్రీలక్ష్మి

వల్లమాలిన దిగులు

"ఏమేవ్! కొంపమునిగిందే! పొరబాటున మైక్‌ను మింగేశానే!"

"దానికెందుకు భయం?"

"నా అంతరాత్మ అనుకున్నే మాటలను బయటపెట్టేస్తుందేమోనని."

అదీ సంగతి!

"ఏమేవ్! ఈ విషయం తెలుసా? ఎదురింటబ్బాయికి లెక్కల్లో నూటికి 99 మార్కులు వచ్చాయట."

"ఆ ఇంకొక్క మార్కునుకూడా వేసి ఉంటే, ఆ పేపర్లు దిద్దినతని సొమ్మేం పోయి ఉండేది?"

"దాన్ని కాస్తా మన పుత్రరత్నానికి వేసేశాడే!"

జి. వి. జి.





మహాకవి 'శ్రీశ్రీ' గార్కి...
స్మృత్యంజలులతో....
-రచయిత

ప్రశ్నావళి
- కె. రామలక్ష్మి

కె. గోపి, విజయవాడ

స్త్రీ గురించి కొంత కాకున్నా కొంతయినా తెలుసుకోవాలని వున్న మాలాంటి యువకులకు అవసరం. ఈ ప్రశ్నకి ఎన్నాళ్లనుండో సరైన సమాధానం దొరకటం లేదు. స్త్రీ తనకు కాబోయే భర్త తెల్లగా అందంగా డబ్బుంటే చాలు. ఎలాంటివాడైనా ఫరవాలేదనుకుంటుందా? మంచి మనసు కలవాడైతే చాలనుకుంటుందా?

* చూడండి గోపీ, స్త్రీ హృదయం ఆమె ఎన్నుకునే భర్తలో కన్పించడం ప్రతిఫలించడం- అసంభవమే. కోరుకున్న మగవాడిలో స్త్రీ తను చూడదల్చుకున్న గుణాలనే చూస్తుంది! అదీ చిక్కు. వున్న గుణాలని ఎన్నిక చేసి చూడడం- చాలా అరుదు- పెళ్ళికి ముందు- పెళ్లయ్యాక అన్న రెండు స్టేజీలలో మగవాడిలో- వచ్చే మార్పు యింతా అంతా కాదు. అంచేత- పెళ్లయ్యాకగాని- తెల్లగా అందంగా డబ్బున్నవాడైనా కాకపోయినా- ఒకటేనని అర్థం చేసుకుంటుంది. మంచి మనసు కంటికి కనబడదనీ- అనుభవం వల్ల తెలుసుకుంటుంది- అందుకే భర్త ఎన్నిక- చేతులుకాలాకగాని తేలదు! ఇకప్పుడు టూ లేట్ కద. అంచేత- మన పెద్దలు 'అబ్బాయికి నచ్చింది' అంటారేగాని, 'అమ్మాయికి నచ్చాడా' అని అడగరు. ఎప్పుడేనా గమనించారా?!

ఎం. గణపతిరావు, అంబుసోరి

ఆడదానికున్న హృదయం ఏ పురుషుడికీ వుండదు. మరి మీరేమంటారు?

* నిజమే- అందుకే ఆమె చిక్కులన్నీ! మగవాడు మెదడుతోటీ, ఆడది హృదయంతోటీ ఆలోచిస్తారు కనుకే- బ్రతికున్నంత కాలం- భిన్నత్వంలో ఏకత్వం సాధించాలని హైరానాపడిపోతూ వుంటారు!

స్నేహమైనా, ప్రేమైనా త్యాగాన్నే కోరుకుంటుంది అని- నా అభిప్రాయం.

* ఆడదానిపట్ల అది సత్యమేనేమో అనిపిస్తుంది.

వి. వి. రావు, కాకినాడ

అభ్యుదయానికి ఆటంకాలేమిటి?

* అభ్యుదయం అంటే ప్రోగ్రెస్ అనుకుంటే- దీనిలో అవసరమైనవి వదిలి మంచిని మిగులుస్తూ సాగడమే- పెద్ద సమస్య అంటాను.

చచ్చి బ్రతకాలంటే?

* రెండే దార్లు. చావగానే మరిచిపోకుండా వుండాలంటే- చదువదగ్గ రచనలేనా చేసి వుండాలి. లేదా- 'రాయ'దగ్గ పనులేనా చేసి వుండాలి! రెండోదే సులభం!

జి.వి.ఎస్. సుబ్బలక్ష్మి, హైదరాబాదు


కె. రామలక్ష్మిగారూ స్నేహానికి మీరిచ్చే నిర్వచనం?

* స్నేహం నిర్వచనాలకి అతీతం సోదరీ. మంచి ఎరువేసి పాతిన మొక్కే అయినా- చాలా త్వరగా ఎదగదు. నెమ్మదిగా ఇద్దరి తత్వాలలో ఐక్యత గుర్తిస్తూ వ్యక్తిత్వం గౌరవిస్తూ-మారాకు తొడుగుతూ సాగిస్తుంది. తీగెలు, స్నేహమనే మొక్కకి 'ఉయిర్‌తన్ని' ఒకరిపై ఒకరికున్న గౌరవంతో కూడిన అభిమానం. అంతేకాని 'ఒకరిలా' యింకొకరు అయిపోవడం కానే కాదు.

చలపాక ప్రకాష్, విజయవాడ

మన దేశంలో దాదాపు అందరు దేవుళ్లకీ గుళ్లు వున్నాయి. కాని సరస్వతీ దేవికి వున్నట్టు వినలేదు. మీకు తెలిస్తే చెప్పగలరు!

* నాకూ తెలియదయ్యా, టెంపుల్స్ ఆఫ్ ఇండియాలో మూరు మూలల గుళ్లు గోపురాలు వివరాలన్నీ వున్నాయిగాని సరస్వతి గుడి ప్రసక్తి కనబడలేదు. ఇంకేదైనా సోర్సులో కన్పిస్తే- చెప్తా.



ఫొటో వ్యాఖ్య పోటీ– 29 ఫలితాలు



బహుమతి పొందిన వ్యాఖ్య

ప్రాణాలతో పోరాటం
సామాన్లకై ఆరాటం!

– మహ్మద్ రఫీ (కాశీబుగ్గ)

వానల్లు కురియొద్దు వానదేవుడా!
మా బ్రతుకుల్ని ముంచొద్దు వానదేవుడా!

– తోట విజయలక్ష్మి (శ్రీశైలంప్రాజెక్టు)

నాడు లేదు చుక్క తాగడానికి
నేడు లేదు నీడ వుండడానికి!


– యం. శంకర్ రెడ్డి (బెల్లంపల్లి)

కాపురముంటాము పూరి గుడిశెల్లో
వలసపోతాము వరద రోజుల్లో!

– ఎన్. శ్రీకృష్ణ భగవాన్ (అంబాజీపేట)

లక్కీ పేర్లు

టి. వి. సుబ్బారావు (నిడదవోలు), జి. దుర్గారావు (గోపాలపురం), ఎం. ఎస్. నాయుడు (మచిలీపట్నం), ఎస్. శ్యాంప్రసాద్ (సికింద్రాబాద్), ఎన్. భాస్కర్‌బాబు (ఏలూరు), టి. గణపతిరావు (విశాఖపట్టణం), ఎం. శ్రీనివాస్ (తాళ్లపూడి), ఎస్. శ్రీనివాసరావు (పొదిలి), టి. ప్రసన్న లక్ష్మి (తిరుపతి), పి. రూపవతి (పార్వతీపురం), ఎన్. పద్మప్రియ (స్టూవర్టుపురం), జి. శ్రీదేవి (కాజీపేట).



"ఎర్రటోపి"

చందక రాజా రామమోహన రావు

యస్. పి. బెనర్జీ కుర్చీలో అసహానంగా కూర్చున్నాడు ఆర్టీసి బస్సులో ప్రయాణీకుడిలా. ఫ్రిజ్‌లోంచి వంపుకొని గ్లాసుడు నీళ్లు తాగేడు. అయినా చికాకు తగ్గలేదు.... దానికి కారణం కొద్దిసేపటి క్రితం హోమ్ మినిష్టరుగారి పి.ఎ. నుండి దిగుమతయిన మెసేజే....

హోమ్ మినిష్టరుగారికి విదేశీ బ్యాంకుల్లో సీక్రెట్ ఎక్కౌంటులాగే- స్వదేశంలో బ్రాందీలో నిద్ర పుచ్చి, బట్టతల్లో అక్కడక్కడ మెరుస్తున్న జుత్తు మధ్య వేళ్లు గుచ్చి, బుగ్గలపై గిచ్చి, అసహ్యపు రాజకీయ అలసట నుంచి ఆనందంలోకి లాక్కెళ్లడానికి- సీక్రెట్ ముద్దుగుమ్మ కూడా వుంది. మంత్రిగారికి ఆ కొమ్మపై బోలెడంత ముద్దు. నాలుగుసార్లు గెలిపించి నలభైరెట్లు హోదాను, నాలుగువందల రెట్లు ఆస్తిని పెంచేసిన తన నియోజక వర్గంలోని ప్రజలకంటె కూడా ముద్దు. ఎన్నికల్లో డబ్బులు సప్లయి చేసే చీకటి వ్యాపారుల కంటె కూడా ముద్దు. మందును మంచినీటిలా సప్లయి చేసే బ్రాందీ షాపులకంటె కూడా ముద్దు.

ప్రస్తుతం అగ్నిగోళంలా మండిపోతున్న మంత్రివర్యులు పూర్వాశ్రమంలోకొంతకాలం బ్రాకెట్టు కంపెనీ గుమస్తాగా తగలబడ్డారు. ఓపినింగులు క్లోజింగులుచెప్పి చాలా మంది జీవితాలకు క్లోజింగ్ చెప్పేసారు. ఈ పుణ్యకార్యాల్లో భాగంగా ఒకసారి జైలుకు వెళ్లే యోగంలో పడ్డారు... అక్కడే... అక్కడే.... జాతకం మారిపోయే మొదటి టర్నింగువచ్చింది... అదే జైలులో అనసూయమ్మ కంపెనీలో వ్యభిచారం చేస్తూ అరెస్టయిన 'రూపులమ్మ' సాక్షాత్కరించింది. ఆ రాత్రి యిద్దరూ ఒకరినొకరుచూసుకున్నారు. మర్నాడు ఒకరి గురించి ఒకరు ఆలోచించుకున్నారు. ఆ మర్నాడు మనసులు విప్పుకొని మాట్లాడుకున్నారు. విడివిడిగా వెళ్లి నోళ్లు కలిసి బైటకు వచ్చేరు. ఇంకేం,- ఉప్పుకు నిప్పు తోడైంది. త్రాచుపాముకు రెక్కలు కూడా వచ్చినట్టయింది. రూపులమ్మ ఆనాటి నుంచి అతని జీవితాన్ని మార్చేసింది, తనుకూడా మార్చేసుకుంది- అతనితో సారా కొట్టు పెట్టించింది. పక్కనే తను కోడిమాంసం అమ్మింది. మాంసంతోపాటే సాలా సాలా అమ్మింది. సరిగ్గా ఆ సమయంలోనే ఒక పార్టీ నాయకుడిని తన బరిలోకి లాక్కోగలిగింది. ఓట్లు ముష్టెత్తుకోడానికి వచ్చిన ఆ నాయకుడికి బ్యాలెటు పెట్టెలాగ నిండుగా వున్న రూపులమ్మ నచ్చింది. దాని ఎత్తు పల్లాలు యింకా నచ్చాయి. కప్ప కోసం పాములా, ఆకలిగా చూసేడు. అర్థంకాకపోవడాన్కి రూపులమ్మ ఎర్రిది కాదు, అనుభవం పండిన కుర్రది... అతగాడిని తన ఎత్తులు ఎక్కించింది. సల్లాల్లో దొర్లించింది.... అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసేసింది... ఆపై ఎంకణ్ణి వెంకటేశ్వరరావుగానూ, ఆపై నాయకుడిగానూ- యింకాపై మంత్రిగానూ మార్చేసింది.... తను కూడా రూపులమ్మ అవతారం చాలించి 'రూపాదేవి'గా వెలిగిపోయింది. నాటు సారా కంపు నుంచి విస్కీ వాసనలు చూపించిన సగరు రూపాదేవిగారి మాట మంత్రిగారికి మంత్రపుష్పంతో సమానం. అలాంటి దేవేరి ముద్దుగా 'కలకత్తాలో క్రికెట్ మ్యాచ్'కు విమానంలో పంపి- మళ్లీ విమానంలోనే దింపు. 'పార్లమెంటుకూ, అసెంబ్లీకి ఒక్కసారే ఎలక్షన్లొచ్చినట్టుగా విమానం సరదా, క్రికెట్టు సరదా జాయింటుగా తీరిపోతుంద'ని కోరేసింది. తోటమాలిని చక్రవర్తిగాని చేసిన దేవత "భక్తా! ఒక్క అరటిపండు నైవేద్యం పెట్టరా!" అని అడిగినంత సంబరపడిపోయేడు వెంకటేశ్వరరావు... వెంటనే తన కొలువు కూటకంలో ఉడిగం అనుభవిస్తున్న పోలీసు శాఖను పిలిపించేడు. కలకత్తా విమాన ప్రయాణం, అక్కడ స్టార్ హోటల్లో మకాం అన్నీ ఏర్పాటు చేసెయ్యండి అన్నాడు.... అంత పెద్ద మంత్రిగారు యింత మాత్రం ఖర్చు స్వంతంగా పెట్టుకోలేడా అని మనం ముక్కుమీద వేలేసుకోకూడదు. ప్రజాసేవలో ఉన్నవాళ్లు యాత్రలు చేసినా- పెళ్లిళ్లు చేసినా- మందు కొట్టినా ప్రజల డబ్బుతో మాత్రమే చేయాలి... లేకపోతే ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదం. ప్రజాసేవకు తీరని కళంకం....

బెనర్జీ ఆలోచించేది ఆ విషయం గురించే. తన వృత్తిని అడ్డం పెట్టుకొని అడుక్కు తినడమో- లాక్కు తినడమో తనకు యిష్టం వుండదు. అలా అని మానేద్దామా అంటే అవతల మంత్రిగారు... సాక్షాత్తూ తనున్న శాఖకు అధినేతలు. తను తన వృత్తిలో ఎవరినీ లెక్క చేయకుండా వుండబట్టే- ఏ స్మగ్లింగ్ గ్యాంగ్‌తోనూ సత్సంబంధాలులేకపోవడం వల్లనే, సోషల్ లేదా కల్చరల్ క్లబ్బు పేరుతో ఆడదాన్ని గుడ్డలిప్పించి గెంతించడానికి ఎవరికీ పర్మిషను యివ్వకపోవడం

వల్లనే, ఏ ఎలక్షన్లోనూ తప్పుడు కేసులు పెట్టించి అధికారంలో వున్న వారికి కిట్టని వారిని అరెస్టులు చేయకపోవడం వల్లనే, ఎప్పుడో ఐ.జీ. కావాల్సిన తను యస్.పి. గానే వుండిపోయేడు... తనకోసం కాకపో యినా పైవారికోసమైనా అవినీతి తప్పదు అనే కర్మ సిద్ధాంతాన్ని యిటీవలే బలవం తంగా వంట పట్టించుకున్నాడు... లేకపోతే తనకు ఖాకీ బట్టలు పోయి కాషాయ వస్త్రాలు మిగుల్తాయని గ్రహించేడు. అందుకే మంత్రి గారి మక్కువ తీర్చాలనుకున్నాడు. తన క్రింది ఉద్యోగికి ఫోనులో ఒకే ఒక్క ముక్క చెప్పేడు- యిప్పుడు తన మనస్సంతా ప్రశా తంగా వుంది జాతర అయిపోయిన తర్వాత అమ్మవారి గుడిలా....

*** *** ***

"ఏయ్! ఇక్కడేం పని నీకు?" ఆ గద్దింపు కానిస్టేబిల్ ఆశీర్వాదిది.....

నేను.... నేను... బిత్తరపోయిన ఆ అర్భకురాలికి మాటలు సాగలేదు.

అడిగిందానికి సరిగా సమాధానం చెప్ప వేమే దొంగముండా... పొగరా! లారీ ఝుళిపించేడు.

దాని చూపులు జాలిగా వున్నాయి. దాని పేగులు ఆకలితో ఖాళీగా వున్నాయ్. చేతిలో చిన్న సంచీ.. బాగా ముడతలు పడిపోయి వుంది దాని శరీరంలాగే.

"నేను అడుక్కు తినేదాన్ని బాబు"

అది చెప్పకుండానే ఎవరికైనా తెలు స్తుంది.... ఈ విషయాన్ని కాంగ్రెస్ వాళ్లు చెప్పినాసరే- తెలుగుదేశం వాళ్లయినా ఒప్పు కొని తీరాల్సిందే...

అయితే, యిలా నాలుగు రోడ్ల కూడ లిలో అడుక్కుని న్యూసెన్సు చేస్తావా?

"మారు మూలల్లో అడుక్కుంటే ఎవ రేస్తారు బాబూ!"

"అమ్మ ముండా! ఎంత తలబిరుసే నీకు? పోలీసోడికే ఎదురు చెప్తావా? నడి రోడ్డులో ఒంటిమీద జాకెట్టు లేకుండా జనా నికి ఒళ్లంతా సర్కస్‌లా చూపిస్తూ వాళ్ల మరెచ్చగొడ్తే నీ చూపుల్లో పడి, వెజలు కార్లు, మోటారుసైకిళ్లు యాక్సిడెంటులు చేసేస్తే, అమ్మ బాబోయ్, రక్తం, ఆసు పత్రులు, శవాలు, పోష్టుమార్టాలు, కోర్టులు, లావాదేవీలు, అమ్మ ముండా! నీ వల్ల మొత్తం దేశానికే పెద్ద ప్రమాదంగదే...

పద స్టేషనుకు...."

"బాబ్బాబు! దండపెడ్తాను. నన్నేమీ చేయకండి. కూటికే లేనోళ్లం. ఒంటి నిండా గుడ్డలెలా వత్తాయ్?" యమ ధర్మరాజును సావిత్రిలా బ్రతిమాలుకుంది.


"నోర్ముయ్యవే బరాచోర్ ముండా! నీలాంటి దాన్నిలా వదిలేత్తే మన జాతి పరువు పళ్లిగ్గా మంటకలిసిపోద్ది. నీ సంగతి... యిక్కడ కాదు, లాకప్పులోగాని తేల్దు. రా..." చేప ఎరను పట్టుకున్నట్టుగా దాని జుత్తు పట్టుకున్నాడు.

"మీకు దండపెడ్తాను. టేషన్ కెళ్లేనని తెలిత్తే మా మావ నన్నేలుకోడు. మీకు పున్నె ముంటాది". వీధిల్లో అడుక్కున్న చిల్లర మొత్తం బొడ్లోంచి తీసి చేతిలో పెట్టి మరీ వేడుకుంది.

"అదీ... అలారా దార్లోకి.... ఈసారి కొదిలేత్తన్నాను... మళ్లీ యిలా సెంటర్లో కనపడ్డావా నీ సెంటర్ చూసి లారీతో పొడు త్తాను... పో..." రెండుసార్లు హెచ్చరించి మూడుసార్లు చిల్లర లెక్కెట్టుకొని ముష్టిదాన్ని కనికరించి వదిలేసి హుషారుగా వెళ్లిపోయేడు కానిస్టేబిలు ఆశీర్వాదం.

*** *** **

అతను నెమ్మదిగా నడుస్తున్నాడు. అతని కళ్లు దేనికోసమో వెతుకుతున్నట్టుగా వున్నాయ్... అప్పుడప్పుడా చేతిలో రహస్యంగా దాచుకున్న కత్తికేసి చూసుకుంటున్నాడు. దారిని పోయే వాళ్లకేసి ఓరగానూ, తాపీగా నిల్చున్న- కూర్చున్న జనంకేసి తదేకంగానూ చూస్తున్నాడు... అతని చూపు ఒకచోట నిలిచింది. నిలిచిన చోట ఒక ధర్మస త్రముంది. సత్రం అరుగు మీద ఒకతను కూర్చుని వున్నాడు. అతని చూపులకరె క్టుగా అక్కడ ఆగిపోయేయి. కూర్చున్నవాడి జుట్టు బాగా పెరిగి వుంది భారతదేశం అప్పుల్లా. గెడ్డం కూడా పోటీపడి పెరిగి పోయింది దేశంలో అవినీతిలా. తనక్కావ లసిందిసరిగా అలాంటివాడే. తన అన్వేషణ ఫలించినందుకు తృప్తిగా నవ్వుకున్నాడు. చేత్తో కత్తిని ఒకసారి పరీక్షించేడు. మంచి పదు నుగా వుంది. పల్లె పడుచులా కసకసలా డుతోంది. మామూళ్ల కోసం సేల్సు టాక్స్



ఎర్రటోపి

వాళ్లల్లా నాలుక చాచుకొనివుంది. ఇప్పటికే పది, పదిహేనుచోట్ల వీరవిహారం చేసి రక్తం రుచి చూచిన ఆ కత్తిని మరోసారి ప్రేమగా చూసుకున్నాడు... నెమ్మదిగా సత్రంవైపు అడుగు వేయబోయేడు... ఇంతలో భుజం మీద ఏదో బరువైన చెయ్యి పడింది. వేసే అడుగు వెనక్కు తగ్గింది. కను చివర్లోంచి చూసేడు. ఆ చెయ్యి ఒక ఖాకీ శాల్తీదని గ్రహించేసరికి తత్తరపడ్డాడు.

"ఇందాకట్నుంచి నిన్ను చూస్తున్నాను. నీ ప్రవర్తన మొత్తం అనుమానంగా వుంది. ఎవర్ నువ్వు?" ప్రశ్నించేడు హెడ్ కాని స్టేబుల్ రామానుజాచారి. అతను పంగనామాలు పెట్టుకున్న పెద్ద పులిలా వున్నాడు. కాషాయ గుడ్డలేసుకున్న దెయ్యంలావున్నాడు.

"మాది పక్క పల్లెటూరండి.. టవున్లో బతుకుదామని వొచ్చేను..." జడ్జీగారి ముందు జూనియర్ ప్లీడర్లా చాలావినయంగా చెప్పాడు.

"ఏరోయ్! నా ముఖానికి నామాలున్నాయని చెవుల్లో పూలు కూడా వున్నాయనుకుంటున్నావా? నువ్వేదో కథ చెప్పేస్తే నమ్ముతాన్రా- నిజం చెప్పు వెధవా... ఇదేంట్రో... బాబోయ్... చేతిలో కత్తి. మారణాయుధం."



ముక్కుకి కాదా మళ్లీ పేసనే...
చెవులకి జూకాలు మళ్లీ పేసనే...
అంటున్న రమాప్రభ

(58 వ పేజీ చూడండి)

"ఇది మారణాయుధం కాదండి గెడ్డం గీసే ఆయుధం. ఈ వూళ్లో బ్రతుకుతెరువు కోసం వచ్చేనండి."

"చంపేస్తాను రాస్కెల్! నిజం చెప్పు... ఈకత్తితో ఎవర్ని మర్డర్ చేయాలనుకుంటున్నావ్?"

"మర్డర్లా! అమ్మ బాబోయ్... నాకు గెడ్డాలు చేయడం మాత్రమే వొచ్చండి."

"ఏరా! ఇంకా నన్ను ఎర్రోణ్ణి చేద్దామనే, ఈ కత్తి... బాప్‌రే... నువ్వు పంజాబ్ నుంచి వచ్చిన టెర్రరిస్టువో- అడవుల్లోంచి వచ్చిన నక్సలైటువో... నీ సంగతి తేల్చుకోవాల్సిందే పద స్టేషనుకు." ఉరిమేడు హెడ్.

"అయ్యో! నా కర్మగాలి మీకు ఎదురుబడ్డాను. ఇదుగో... పొద్దుట్నుంచి గెడ్డాలు చేసి... చేసీ... సంపాదించేను. ఉంచుకోండి. నన్ను వదిలెయ్యండి". జేబులో వున్నది మొత్తం తీసి పూజారి దేవుడికి నైవేద్యం పెట్టినట్లు చేతిలో పెట్టేడు... ఈసారికి వదిలేస్తున్నాను.... బ్రతికిపోయేవు... ఫో...డబ్బులు జాగ్రత్తగాజేబులోకి తోసుకొని వేట సాగిస్తూ వెళ్లిపోయేడు రామానుజాచారి.

** *** *** **

ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ హఠాత్తుగా తన లాడ్జింగు మీద రైడ్ చేసేసరికి చంద్రావుకు చాలా కోపమొచ్చింది. అంతకు మించి దుఃఖం కూడా వచ్చింది. తన లాడ్జిలో చాటుమాటు నిర్వాకాలు జరుగుతున్న మాట యీ దేశంలో ప్రజలకి తిండున్నా లేకపోయినా ఓటు మాత్రం వుండాలన్నంత పచ్చి నిజం... అందుకేగా ప్రతీనెలా ఫస్టు తారీఖుల్లా స్టేష

నుక. ఇవ్వాల్సిన మామూలు తిరుపతి డబ్బీలో వేసినట్లు వేస్తున్నది... నిన్ననేగా ఇన్‌స్టాల్‌మెంటు కట్టింది. మళ్లీ యీవేళ రైడింగా... దేనికైనా ఒక పద్ధతుండొద్దూ... దొంగోడైతే మాత్రం... రాత్రి కన్నంవేసిన యింటికి మర్నాడే వెళతాడా? ఆ మాటే పైకి కూడా అన్నాడు చంద్రరావు.

దాంతో ఎస్సయిగార్కి చిర్రెక్కిపోయింది.. తన నెత్తి మీద టోపీ... చేతిలో కర్ర- ఖాకీ బట్టలు. యివేమీ చూసుకోకుండా ఎంత మామూళ్లిస్తే మాత్రం, అంత యిదా... పాలుపోసి పెంచితే మాత్రం త్రాచుపాము నోట్లో వేలెట్టడమేనా? వీణ్ణో పట్టు పట్టాలి అనుకున్నాడు యస్సయి ప్రసాద్.

నాయకులు వేయాలనుకుంటే టోపీలకు కరువా? ఖాకీ బట్టలు తల్చుకుంటే కేసులు కరువా?

చంద్రరావ్వూ... నీ బోడి మామూళ్లు మాకేం అక్కర్లేదు... రెండునెల్ల క్రితం యీ లాడ్జిలో ఒకమ్మాయి చచ్చిపోయింది...ఆ విషయం మాట్లాడాలి... అందుకే వొచ్చింది.

"ఆ అమ్మాయి వురేసుకుంది... అయినా ఆ విషయంలో మీ మామూలు అప్పుడే యిచ్చేం కదా!" ఈసారి చంద్రరావులో కాస్త ఆందోళన, ఆశ్చర్యం చోటు చేసుకున్నాయ్.

"అది మామూలు ఆత్మహత్య అనుకున్నాం... నువ్విచ్చిన దాంతో సరిపెట్టుకన్నాం. కాని అది చావు కాదని- చంపబడిందని అందులోనూ రేప్ చేయబడి మరీ చంపబడిందని మా డిపార్టుమెంటుకు కొత్తగా తెలిసింది. దాని గురించి మాట్లాడాలి. స్టేషనుకురా." దక్షిణాఫ్రికాలో నల్లవాడిని ఆజ్ఞాపించే తెల్లవాడిలా హుంకరించేడు డిపార్టుమెంటు అనే పదాన్ని ఒత్తిపలికి....

స్టేషనుకెళ్లడం చంద్రరావుకిష్టం లేదు. అసలు యింతసేపు పోలీసులు తన లాడ్జిలో నిల్చోవడమే తన వ్యాపారానికి నష్టం... అందుకే స్టేషనుకెళ్లకుండా వుండాలంటే ఏం చెయ్యాలో చంద్రరావుకు తెలుసు. రాత్రి తన పార్టీలో తిన్న కోడిపలావ్ పూర్తిగా అరక్కుండానే- విస్కీ గొంతు దాటకుండానే మళ్లీ తన పైకి యస్సయి వచ్చేడంటే ఎందుకొచ్చాడో అతనికి తెలుసు. నోటులు సొరుగులో చెయ్యి పెట్టేడు. ఆ చేయిని యస్సయిగారి జేబులోకి నొప్పి కలగకుండా జాగ్రత్తగా తోశాడు. నవ్వుకుంటూ యస్సయి వెళ్లిపోయేడు... గండం గడిచి చంద్రరావు బ్రతికిపోయేడు.

*** *** ***

"ఏవయ్యోయ్! కడుపుతో వున్న నీ కూతురికి కోడి కూర కావాలట... అట్రా..."

"నోర్ముయ్యివే... క్రికెట్ పోటీలు రెండ్రోజులే వున్నాయ్... నీకు మాంసం కావాలా?" పెళ్లాన్ని విసుక్కున్నాడు కానిస్టేబుల్ ఆశీర్వాదం....

"ఏవండీ! మందులైపోయేయి. రాత్రి బాగా దగ్గొచ్చింది. మందులు తీసుకురండి."

"చాల్లే ఊర్కో. ముందు క్రికెట్టు... తర్వాతే మందులు". తన క్యాన్సరు భార్యను మందలించేడు హెడ్ కానిస్టేబిల్ రామానుజాచారి.

"ఏమండీ. ఎల్లుండి నా పుట్టిన్రోజు. కొత్త చీరె తేరూ?" ఎస్సయి ప్రసాద్ కొత్త పెళ్లాం (కొత్తగా పెళ్లయింది) తొలి కోరిక కోరింది మొగుణ్ణి.

"సారీ డార్లింగ్... ఎల్లుండే క్రికెట్ మ్యాచ్... నీ చీర తర్వాత..." హడావిడిగా వెళ్లిపోయేడు ఎస్సయి ప్రసాద్....

ఆ రాత్రికి రాత్రి యస్.పి. ఆధ్వర్యంలో మూడు క్లబ్బుల మీద దాడి జరిగింది... మళయాళం పేరుతో ఎక్కడెక్కడివో బూతు బొమ్మలు అతికించి ప్రదర్శించే నాలుగు థియేటర్లపై పోలీసుల బూట్ల చప్పుళ్లు వినిపించేయి. ఏడెనిమిది వ్యభిచార గృహాలపై లారీలు విరుచుకుపడ్డాయ్....

ఆ మర్నాడు ఎంచక్కా మంత్రిగారి అనుంగు ఆడవారు విమానం ఎక్కేసి క్రికెట్టు ఆటకోసం చెక్కేసారు. •

సీరియల్ పంచశూలమ్

విశ్వప్రసాద్

85

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ-21: పంచశూలమ్ పంపిన యువకుడు ఇన్‌స్పెక్టర్ 'షా'గా చెలామణీ అవుతూ జోషీ కేసు దర్యాప్తు చేస్తుంటాడు. గురూజీ కూతురు మీనాక్షి, జయరాజ్ కొడుకు మోహన్‌లు మరణిస్తారు. ఎం.ఎల్.ఎ. దీపాదేవిని-ఊర్వశి కాల్చి చంపుతుంది. జయరాజ్ భార్య పరిమళను మదన్ కాల్చి చంపి ఆమె శవాన్ని యింటి ముందు వ్రేలాడదీస్తాడు. కన్నతల్లి విశాలాక్షిని సుభాష్ క్రూరంగా చంపి పంచశూలమ్‌ని హతమార్చానని టైగర్ వేషంలో జయరాజ్-గురూజీలను నమ్మించి విశాలాక్షి శవపేటికను అందజేస్తాడు. అది చూసి వారు నిర్ఘాంతపోతారు.

పట్టపగలే పౌర్ణమి చంద్రుడు ప్రవేశించాడు మదన్ గదిలో!

మిట్టమధ్యాహ్నం నక్షత్రాలు మెరిశాయి!!

సెంటు వాసనలతోను, పూల పరిమళంతోను, యవ్వన సుగంధాలతోను మన్మథ సామ్రాజ్యం ప్రేమకలాపాలు సాగిస్తున్నది అతని గదిలో!!!

వెల్లకిలా మంచంమీద పడుకున్నాడు మదన్.

అతని కుడికాలు కింద నర్గీస్ అందాలు నలుగుతున్నాయి. ఎడమకాలు సుశీల సౌందర్యాన్ని స్పృశిస్తోంది. ఓ చేత్తో కమలను కౌగిలించుకున్నాడు. మరో చేత్తో ఎలిజబెత్ నడుముమీద రాస్తున్నాడు.

కాని, అతని దృష్టిమాత్రం-మంచం పక్కన నిలుచున్న ఊర్వశి మీదే ఉంది. అతని మనసు ఆమెకోసం తహ తహ లాడుతోంది. పెదవులు పిలుస్తున్నాయి. చూపులు ఆహ్వానిస్తున్నాయి. కోరికలు బుసలు కొడుతున్నాయి. "కమాన్, డార్లింగ్" అన్నాడు.

మాట్లాడలేదు ఆమె. రబ్బరు బొమ్మలా నిలబడింది.

ఇంతలో భళ్ళున తలుపు తెరుచుకుంది.

తృళ్ళిపడ్డారు యువతులంతా.

రివాల్వర్ పట్టుకుని, పర్వతంలా నిల్చున్నాడు సుభాష్. అతని పక్కనేఉంది సోఫియా.

చటుక్కున మంచంమీదనుండి లేచాడు మదన్. "లాంగ్‌కోట్" అన్నాడు.

హేంగర్‌కి వేలాడుతున్న కోటు యిచ్చింది. ఊర్వశి.

నర్గీస్, సుశీల, కమల, ఎలిజబెత్‌లు పక్కగదిలోకెళ్ళి తలుపు మూసుకున్నారు.

"బ్రదర్, ఊర్వశి తల్లి, చెల్లెలు ఉరేసుకుని రెండు రోజులుకూడా కాలేదు. ఆమె గుండెల్లో తగిలిన గాయం మానలేదు. ఆమె గురించి ఆలోచించకుండా నీ సరదాలు నువ్వు తీర్చుకుంటున్నావు..... టూబేడ్."

మాట్లాడలేదు మదన్.

"ఆమె బాధ అర్థం చేసుకో." చెప్పాడు సుభాష్.

"బాధ, దుఃఖం-అనే శబ్దాలకు నాకు అర్థం తెలియదు, భాయ్! నా బాధ ఏమిటో నాకే తెలీదు."

"నీ బాధ నీకు తెలియకపోయినా, యితరుల బాధ తెలుసుకోవాలి."

"అంత తెలివి లేదునాకు. అయినా ఏం చెయ్యమంటావోచెప్పు, చేస్తాను."

"వెంటనే, ఊర్వశిని తీసుకుని, హైద్రాబాదు విడిచి పెట్టి వెళ్ళిపో. కొన్నాళ్ళపాటు ఎక్కడైనా సుఖంగా జీవితాన్ని గడుపు. ఆమెకు మనశ్శాంతిని కలగజేయ్."

ఉలిక్కిపడ్డాడు మదన్. "నో....శూలమ్ సాబ్‌ని విడిచిపెట్టి వెళ్ళలేను." అన్నాడు.

"ఆయన్ని నేను కాపాడుకుంటాను."

"భాయ్! నిన్నుకూడా విడిచిపెట్టి వెళ్ళలేను," మదన్ కంఠంలో బరువుగా, భారంగా వెలువడ్డాయి ఈ మాటలు.

ఆశ్చర్యపోయారు ఊర్వశి, సోఫియా, సుభాష్‌లు. అగ్నిపర్వతం కరిగి మంచులా పారుతున్నట్లు అనిపించింది ముగ్గురికీ. నమ్మలేని ఓ నిజం ప్రత్యక్షమయినట్లు తోచింది. "బ్రదర్!" అన్నాడు అప్రయత్నంగా సుభాష్.

"ఔను, భాయ్! తెలియనప్పుడు నువ్వెవరివో, ఆయనెవరో పట్టించుకోలేదు నేను. నా సర్వీసుకు మీ యిద్దరి దగ్గర కిరాయిలు వసూలుచేశాను. కాని, మీరు నారక్త సంబంధీకులని తెలిసిన తర్వాత-మిమ్మల్ని విడిచిపెట్టి, దూరంగా వెళ్ళలేను. వెళ్ళను. మీతోపాటే నేనుకూడా చావో బతుకో తేల్చుకుంటాను."

మాపరాయిలాంటి మదన్‌లో కూడా మనసు, మానవత్వం, బంధుప్రీతి, భావావేశాలు ఉన్నాయని అప్పుడే గ్రహించారు ఊర్వశి, సోఫియా, సుభాష్‌లు.

"కాని, నీ జీవితం చాలా ఆపదలో ఉంది." అన్నాడు సుభాష్.

"ఆపదలతో ఆడుకోవడం చిన్నప్పటి నుండి నాకు అలవాటే. కాని, నేనొకమాట చెబుతాను-నువ్వు వినాలి."

"ఏమిటది?"

"నువ్వు, సోఫియా అర్జంటుగా యిండియా విడిచిపెట్టి వెళ్ళిపొండి. మీ జీవితాలకు యిక్కడ గ్యారంటీలేదు."

"నెవర్. డాడీని విడిచిపెట్టి వెళ్ళలేను, బ్రదర్!"

"నేనుకూడా అంతే భాయ్!"

ఇంతలో గేటు తెరిచిన శబ్దం వినిపిం

చింది.

నలుగురూ కిటికీలోంచి బైటకు చూశారు పోలీసు జీప్‌లోపలకు వచ్చి ఆగింది. అందులో ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, ఓ. ఎస్. ఐ. మరో నలుగురు కానిస్టేబుల్సు ఉన్నారు.

"ఆ రివాల్వర్ యిలా యివ్వు." అన్నాడు మదన్ కోపంగా.

"నాకు లైసెన్స్ ఉంది." సుభాష్ చెప్పాడు.


"నాకు వంద లైసెన్స్‌లున్నాయ్." అంటూ సుభాష్ చేతిలోని రివాల్వర్ లాక్కు న్నాడు మదన్.

86

జీప్‌లోంచి దుమికాడు అబ్దుల్లా. టక టక బూట్సు శబ్దం చేసుకుంటూ బంగ్లాలోకి వచ్చాడు. సుభాష్ పక్కకెళ్ళి నిలుచున్నాడు.

"మిష్టర్ మదన్! గూండా ఆక్ట్ క్రింద నిన్ను అరెస్ట్ చేస్తున్నాం" అన్నాడు.

గది ప్రతిధ్వనించేటట్లు పక-పక నవ్వాడు మదన్. "నన్ను అరెస్ట్ చేసే గుండెలు న్నాయా నీకు?" అన్నాడు.



"బక్‌వాస్ బంద్ కరో" చిన్నగా అరిచాడు అబ్దుల్లా.

"నీ అరుపులకు, బెదిరింపులకు అదిరిపోయే అర్భకులు లేరిక్కడ. మర్యాదగా, వచ్చినదారినే వెళ్ళిపో అబ్దుల్లా!"

"డేం డెకారం. వెళ్ళడానికి రాలేదు- నిన్ను అరెస్ట్‌చేసి తీసుకెళ్ళడానికే వచ్చాను."

సోవియట్ యూనియన్‌లో అతీంద్రియజ్ఞానం-విజ్ఞానశాస్త్రంగా పరిగణన

అతీంద్రియజ్ఞానం గల వ్యక్తులను సోవియట్ యూనియన్ దీర్ఘకాలంగా అధికారికంగా ఉపేక్షిస్తూ వచ్చింది. అట్టి వ్యక్తులను డంబాచారులుగా పేర్కొంటూ వచ్చాయి ప్రసార సాధనాలు అవి పాత రోజులు.

ఈనాడు అధికతర ప్రజాస్వామ్యం కోసం ఉద్యమం సాగుతుండడంతో పరిస్థితి మారుతున్నది. సోవియట్ టి.వి. అతీంద్రియజ్ఞాన పాఠాలను ప్రసారంగావిస్తున్నది. అతీంద్రియజ్ఞాను సేవలను వైద్యశాలలు వాడుకుంటున్నాయి. సోవియట్ వైద్యశాస్త్రంలో అతీంద్రియజ్ఞానం ఒక భాగమయింది. ఈ ప్రక్రియద్వారా ఒక వ్యాధికి సంబంధించిన సూచనలేవీ బహిర్గతం కాకముందే అంతర్గతంగానున్న రోగాన్ని గుర్తించి, దాని పెరుగుదలను నిరోధించి, ప్రత్యక్ష సంబంధంతోగాని, పరోక్ష సందేశం ద్వారాగాని దానిని కుదర్చగలుగుతున్నారు.

అతీంద్రియజ్ఞానాన్ని సోవియట్ రేడియో టెక్నాలజీ-ఎలెక్ట్రానిక్స్ అధ్యయన సంస్థలో అభ్యసిస్తున్నారు. అతీంద్రియజ్ఞానం అద్భుతాలను యమేమీకాదు. విజ్ఞానశాస్త్రం గుర్తించిన భౌతిక క్షేత్రాల సూత్రంపై ఇది ఆధారపడి పనిచేస్తుంది. మానవ శరీర భౌతిక క్షేత్రాలను ఎక్స్-రేలు, రసాయనాలు, ఇతర సాధారణ వైద్య ప్రక్రియల సాయంలేకుండా గుర్తించగల పరికరాలను సోవియట్ రేడియో టెక్నాలజీ-ఎలెక్ట్రానిక్స్ అధ్యయన సంస్థ రూపొందించింది. అంతర్గతంగా ఉన్న రోగాలను గుర్తించేందుకు వీలుగా వ్యక్తి భౌతిక క్షేత్రాల గతిశీల చిత్రాన్ని గీచేందుకు యీ ప్రక్రియను వినియోగిస్తున్నారు. దీని ఆధారంగా రూపొందే కంప్యూటర్ డయోగ్నిస్టిక్స్ మాత్రమే చివరిమాట కాబోవు. వివిధ విజ్ఞానశాస్త్రరంగాలను అభివృద్ధిపరచేందుకు అతీంద్రియజ్ఞాన అధ్యయనం ఉపయోగపడగలదని విజ్ఞులు భావిస్తున్నారు.

మీసాలు దువ్వుకుంటూ అన్నాడు అబ్దుల్లా.

"వారంటు తీసుకురా."

"తెచ్చాను."

"ఎవరి పేరుమీద ఉంది?"

"నీ పేరుమీదే."

"పొరపాటు. మీ డిపార్టుమెంటు వాళ్ళు పొరపాటున నాపేరురాసి ఉంటారు. ఆ వారంటుమీద ఉండవలసింది నా పేరుకాదు."

"మరెవరి పేరు?"

"నీ పేరు" రివాల్వర్‌తో అతని గుండెలమీద ఒత్తుతూ అన్నాడు మదన్.

"పోలీసుల్నే ఎదిరిస్తావా"?

"నీ తాతను కూడా ఎదిరిస్తాను."

"బద్మాష్!" కోపోద్రేకాలతో వూగిపోతూ, లాఠీ ఎత్తబోయాడు అబ్దుల్లా. "నాలుక అదుపులో పెట్టుకోరా, బచ్చా! మరోసారి నోరు జారావో, నాలుక పీకేస్తాను." మదన్ కంఠం గదిలో ప్రతిధ్వనించింది.

మిగిలిన పోలీసులతోపాటు సుభాష్‌కూడా కంగారుపడ్డాడు.

ఎత్తబోయిన లాఠీని కిందకు దించాడు అబ్దుల్లా.

రివాల్వర్ కోటుజేబులో వేసుకున్నాడు మదన్. పళ్ళు పటపట కొరుకుతూ "పోలీస్ డ్రస్ వేసుకుని ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న పక్కా గూండావి నువ్వు. డిపార్టుమెంటును అడ్డం పెట్టుకుని అర్భకులమీద అత్యాచారాలు చేస్తున్న రౌడీవి నువ్వు. అపరాధుల దగ్గర లంచాలు తీసుకుని నిరపరాధుల్ని హింసిస్తున్న రాక్షసుడివి నువ్వు. రక్షక భటుడిగా ఉండవలసిన నువ్వు భక్షకుడివిగా మారి అమాయకుల్ని రచ్చకెక్కిస్తున్న కిరాతకుడివి. వ్యభిచారం, తాగుడు, లంచగొండితనం, దౌర్జన్యం, మోసం-యిన్నీ సాగిస్తున్న నువ్వా గూండావి?-లేక నేనా? ఎవరు గూండా,అబ్దుల్లా!- నువ్వా, నేనా?" అన్నాడు కోపంగా.

"అరెస్ట్‌హిమ్!" సమాధానం చెప్పలేక అరిచాడు అబ్దుల్లా.

సంకెళ్ళు పట్టుకుని ఓ అడుగు ముందుకు వేశాడు ఎస్. ఐ.

మరో అడుగు ముందుకు వేస్తే, మదన్ జేబులోని రివాల్వర్ సింహ గర్జన చేసేది!

తలగడ కింద రివాల్వర్ తీసి తాండవ నృత్యం చేసేది ఊర్వశి.

అగ్ని హోత్రునిలా ఆగదిని కాల్చేసేవాడు సుభాష్.

కాని, అదే సమయంలో-

"ఆగండి" అన్న కంఠం గంభీరంగా వినిపించింది.

తుపాకి పేలినట్లే త్రుళ్లిపడ్డారు అక్కడి వారంతా. వెనక్కి తిరిగి చూశారు.

పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ అక్కడికి వచ్చాడు పంచశూలమ్.

గుర్రుగా అతని వంక చూశాడు అబ్దుల్లా. "ఇతనిమీద కూడా ఏంటిసిపేటరీ బెయిల్ తెచ్చారా?" అడిగాడు.

"ప్రతిసారి చేసిన పనే చేస్తే వెరైటీ ఉండదు. ఈసారి మీ కోసం యమకింకరుల్ని తీసుకొచ్చాను."

అర్థంకాలేదు అబ్దుల్లాకు. అయోమయంగా వెనక్కి తిరిగి చూశాడు.

పది పన్నెండు మంది గూండాలు గేటు బైట అటూ-యిటూ తిరుగుతున్నట్లు కనిపించారు.

ఇంతలో జీప్ దగ్గర కాపలా ఉన్న కానిస్టేబుల్ కంగారుగా లోపల కొచ్చాడు.

"సార్! రెండు మూడొందల మంది గూండాలు, రౌడీలు ఈ బంగ్లా చుట్టూ ఉన్నారు. వాళ్ళంతా పంచశూలమ్ శిష్యులే" అన్నాడు- అబ్దుల్లా చెవిలో.

అవమానంతోను, కోపంతోను అబ్దుల్లా తల తిరిగిపోయింది. నిప్పు తొక్కిన కోతిలా రంకెలు వేశాడు. "ఇంతవరకు మీరు పెద్ద మనుషులనుకున్నాను. గూండాల మురాకు నాయకులని తెలీదు. మీ అంతు చూస్తాను" అన్నాడు.

"ఆ పని తర్వాత చేద్దువుగాని ముందు... బైట ఉన్న ప్రజలు నిన్ను అరెస్టు చెయ్యకుండా మర్యాదగా వెళ్ళిపో."

"నన్నెవరు అరెస్టు చేస్తారు?"

"ప్రజలు తప్పు చేస్తే పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు అప్పగించి, శిక్ష వేయిస్తారు.. అలాగే, పోలీసులు అపరాధం చేస్తే పట్టుకుని, కోర్టుకెక్కించే అధికారం ప్రజలకు కూడా ఉండాలి, ఉంటుంది, ఉంది. నువ్వు చేసిన నేరాలన్నీ ఈ బంగ్లాబైట ఉన్న మనుషులకు తెలుసు. నిన్ను అరెస్టుచేసి, శిక్షించడానికే వాళ్ళు వచ్చారు."

"బెదిరిస్తున్నారా?"

"లేదు. వివరిస్తున్నాను."

"మదన్‌మీద అరెస్టు వారంటు తెచ్చాను."

"నీమీద డెత్‌వారంట్ తెచ్చారు వాళ్ళు."

"డేమ్ డెకారమ్! ఐ.జి.గార్కి ఫోన్‌చేసి, ఈ బంగ్లాని, మిమ్మల్ని- అందర్నీ స్మాష్ చేసేస్తాను."

"వెరీగుడ్. అలాగే ఐ.జి.గార్కి ఫోన్ చెయ్. విషయమంతా చెప్పు" అని గదిలో కెళ్ళాడు పంచశూలమ్. ఐ.జి. ఆఫీసుకు రింగ్ చేశాడు. అవతలి నుండి సమాధానం రాగానే రిసీవరు అబ్దుల్లా కిచ్చాడు.

అతను అంతవేగంగా ముందడుగు వేస్తాడనుకోలేదు అబ్దుల్లా. అసలు ఐ.జి.తో మాట్లాడే గుండె ధైర్యమేలేదు అతనికి. ఒణుకుతూ రిసీవరు పట్టుకున్నాడు. "నమస్కారాలుసార్! మదన్ గూండాయిజమ్ చేస్తున్నాడని చాలా రిపోర్టులు వచ్చాయి. అతన్ని అరెస్టు చెయ్యబోతుంటే, పంచశూలమ్‌గారు అడ్డుకుంటున్నారు. పైగా మూడువందల మంది గూండాలను తీసుకువచ్చి, మా మీద తిరగబడటానికి రెడీగా ఉన్నారు" అన్నాడు.

పంచశూలమ్

"యూ ఫూల్! మంచీ-చెడ్డా ఆలోచించకుండా మర్యాదస్తుల్ని రచ్చకెక్కించడానికంటే నీకు మరోపని లేదా? పంచశూలం అంటే ఎవరనుకున్నావ్?- సెంట్ పర్సెంట్ పక్కా జంటిల్ మెన్. రేపు ఆయనకు డిపార్టుమెంటు తరఫున సన్మానం చెయ్యబోతున్నాం. హోమ్ మినిస్టర్ అధ్యక్షత వహిస్తున్నారు. వెంటనే ఆయన్ని క్షమార్పణ కోరుకో. మరోసారి యిలా జరిగితే, నిన్ను డిస్మిస్ చేస్తాను. బి కేర్ ఫుల్..."

బాంబుల్లా వినిపించాయి ఐ.జి. మాటలు. నిలువెల్లా కంపించిపోయాడు అబ్దుల్లా. "అర్డర్ సార్!" అని రిసీవరు పెట్టేశాడు.

"ఏమన్నారు?" పైప్ పీలుస్తూ ప్రశ్నించాడు పంచశూలమ్.

"మాఫ్ కీజియే జనాబ్! నావల్ల తప్పు జరిగిపోయింది." గుటకలు మింగుతూ సమాధానం చెప్పాడు అబ్దుల్లా.

"నన్ను కాదు- మదన్ని కోరుకో క్షమార్పణలు." తాపీగా అన్నాడు పంచశూలమ్.

"మిస్టర్ మదన్! క్షమించండి." తడి ఆరిపోయిన గొంతుతో వేడుకున్నాడు అబ్దుల్లా.

"అబ్దుల్లా! నన్ను రచ్చకెక్కించి, నా గుండెల్లో చిచ్చు పెట్టావ్. అంతేకాదు- నువ్వు నేను అపరాధాలు చాలా ఉన్నాయి. నిన్నే కాదు నీ భార్యా పిల్లల్ని కూడా క్షమించకూడదు... అయినా, శూలం సాబ్ గారి మాటకు మర్యాద యివ్వాలి నేను. అందుకే, నిన్ను క్షమించడానికి నిశ్చయించుకున్నాను. నువ్వు వెళ్ళొచ్చు. కాని, వెళ్ళేముందు రెండు మీసాలు యిక్కడ కత్తిరించుకుని వెళ్ళిపో" అని, కోటుజేబులోంచి కత్తెరతీసి యిచ్చాడు మదన్.

నిస్సహాయ స్థితిలో దీనంగా అతని వంక చూశాడు అబ్దుల్లా.

"నేను మాటంటే మాటే-కోటి రూపాయలిచ్చినా ఆ మాట మార్చను. ఆ గుబురుమీసాలు కత్తిరించుకుంటావో, బైటకెళ్ళి, గూండాలచేత గుండు చేయించుకుంటావో, వెంటనే ఆలోచించుకో."

అదిరిపోయాడు అబ్దుల్లా. మదన్ని ఎదిరించి బైటకెళితే, గూండాలు తనకు గుండు చేసి, సున్నపుబొట్లు పెట్టి, గాడిదమీద ఊరేగిస్తారని నిశ్చయించుకున్నాడు. గత్యంతరం లేక కత్తెరతో రెండువైపుల ఉన్న మీసాలు కత్తిరించుకున్నాడు. చర చరా ఆ గదిలోంచి బైటకెళ్ళిపోయాడు.

ఎస్.ఐ. కానిస్టేబుల్స్ నవ్వలేక ఏడుస్తూ, ఏడవలేక నవ్వుతూ అతన్ని అనుసరించారు.

పోలీస్ జీప్ గేటులోంచి, బైటకు వెళ్ళేంతవరకు పైప్ పీలుస్తూ నిలుచున్నాడు పంచశూలమ్. తర్వాత వరసగా మదన్- ఊర్వశి, సుభాష్-సోఫియాల వంక పదేపదే తృప్తి తీరా చూశాడు. నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు. "బైసన్స్ అండ్ గర్ల్స్! పోలీసు డిపార్టుమెంటు వారు రేపు నాకు సన్మానం చెయ్యబోతున్నారు. కాని, సన్మానమే చేస్తారో, సరాసరి నన్ను శ్మశానానికే తీసుకెళతారో తెలీదు. ఏది ఏమైనా, ఆ సమయంలో మీరు నలుగురు నా కళ్ళముందు ఉండాలి" అన్నాడు శాంత గంభీర కంఠస్వరంతో.

నలుగురూ అతని వైపు ఆరాధనగా చూశారు.

"బెస్ట్ ఆఫ్ లక్" అని, పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు పంచశూలమ్.

87

సుఖంగా జీవితం గడిచి పోతున్నంతకాలం గతాన్ని ఎవరూ గుర్తు చేసుకోరు.

కష్టాలు, నష్టాలు, బాధలు ఎదురైనప్పుడే

పంచశూలమ్

గతం గుర్తుకొస్తుంది మానవుడికి.

శ్మశానంలా కనిపిస్తున్న భవనం చూసు కునేసరికి దుఃఖం పొంగి పోయింది జయారాజ్ కి.

పాతికేళ్ళ క్రితం దేవీ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్టు కంపెనీలో గుమస్తాగా ఉన్నప్పుడే హాయిగా ఉండేది. పరిమళను ఎరగా చూపి దీపాదేవి, గురూజీలు తనను కీలు బొమ్మగా చేసుకున్నారు. పరిమళమీద మోజు, డబ్బుపైన ఆశ-రెండూ కలిగాయి. అనుకున్న ప్లాను ప్రకారం బ్యాంక్ దోపిడీ జరిగిపోయింది. పరిమళను పెళ్ళి చేసుకున్నాడు. కోట్లు సంపాదించాడు. లక్షణమైన కొడుకు పుట్టాడు. పాతికేళ్ళు మహావైభవంగా గడిచిపోయింది జీవితం.

కాని, ఈనాడు గతంలో చేసుకున్న పాపమో, శాపమో తనని పీడిస్తోంది.

కొడుకును దారుణంగా హత్యచేశారు. భార్యను చంపి తనగేటుకే వేలాడదీశారు. ఆమె గత చరిత్రను బజారులో పెట్టారు. తనను అప్రతిష్టపాలు చేశారు.

తను ముద్దుచేసిన కొడుకు పోయాడు. అమితంగా ప్రేమించిన భార్యపోయింది. డబ్బు పోయింది. పరువుపోయింది. అన్నీ పోయాయి. అప్పులు, శ్మశానం లాంటి యిల్లు మిగిలాయి.

తను తెలివైనవాడు. కాని, వక్రమార్గాన్ని అవలంభించాడు!

తను అదృష్టవంతుడు. కోరిన స్త్రీని పెళ్ళి చేసుకున్నాడు-కాని, ఆమె చరిత్ర హీనురాలు!!

యోగ్యుడైన కొడుకు కలిగాడు. కాని, అతను ఘోరంగా హత్యగావింపబడ్డాడు!!!

ఇహ ఏం మిగిలింది తనకు?

ఏం సాధించాడు తను??

ఇంకా ఎందుకు జీవిస్తున్నాడు???

- ఆలోచిస్తున్న కొద్దీ మెదడు పగిలిపోతున్నట్లయింది జయరాజ్ కి. ఇంతలో ఫోన్ మోగింది. రిసీవరు అందుకున్నాడు. "హలో!" అన్నాడు.

"సార్! చిట్‌ఫండ్ కంపెనీకి యివ్వాళే ఏభై లక్షలు డిపాజిట్ చెయ్యాలి." అవతలి నుండి మేనేజర్ కంఠం వినిపించింది.

సమాధానం చెప్పే స్థితిలో లేదు జయరాజ్. రిసీవరు ఫోన్‌మీద పెట్టేశాడు.

అంతలోనే మరో ఫోన్ మోగింది. అయిష్టంగానే రిసీవరు తీసుకున్నాడు.

"సార్! సేర్ రమణలాల్ డిక్రీ తీసుకున్నాడట- లాయర్‌గారు ఫోన్ చేశారు" అవతలి వ్యక్తి చెప్పాడు.

నిర్లిప్తంగా రిసీవరు పెట్టేశాడు జయరాజ్.

మళ్ళీ మొదటి ఫోన్ రింగ్ అయింది.

"ఫ్యాక్టరీలోని కార్మికులు సమ్మె చేస్తున్నారు....."

ఇంకో ఫోన్ మోగింది.

"శంకర్ సింగ్ కిచ్చిన 10 లక్షల రూపాయల బేరర్ చెక్కు మారలేదట. పోలీసులకు రిపోర్ట్ యిచ్చి, అరెస్టు చేయించాలని ప్రయత్నిస్తున్నాడు...."

మరో నాలుగుసార్లు ఫోన్‌లు గణగణమన్నాయి. ఇలాంటి వార్తలే చెప్పారు అతని గుమస్తాలు.

తల తిరిగి పోయింది జయరాజ్ కి. పిచ్చిగా రెండు రిసీవర్లు నేలకేసికొట్టాడు.



కుర్చీలోంచి లేచాడు. గోడ దగ్గరకెళ్ళాడు. తల గోడకేసి కొట్టుకో నారంభించాడు.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. "కమిన్" అన్నాడు.

"టెలిగ్రాం సార్!" అంటూ లోపలకు వచ్చాడు డ్రైవరు!

టెలిగ్రాం తెరవబోతే, గుండెలు దడదడలాడాయి. వణు కుతున్న చేతులతోనే కాగితాన్ని విప్పాడు.

అందులో-

'జయరాజ్! నీ చావు దగ్గరకు వచ్చింది. ఇరవైనాలుగు గంటల్లో నీ ప్రాణాలు తీస్తాను!

- జోషి.

మొదటిసారి జోషి నుండి హెచ్చరిక అందింది. ఆ అక్షరాలు చూసేసరికి తల్లోని నరాలు తెగిపోయాయి. నవనాడులూ క్రుంగిపోయాయి. పిచ్చివాడిలా అరిచాడు. తడబడుతున్న అడుగులతో గదిలోంచి పరుగెత్తాడు. ఒగురుస్తూ కారులో కూర్చున్నాడు. "గురూజీ గెస్ట్ హౌస్‌కి పోనియ్" అన్నాడు.

అతని పరిస్థితి అర్థంకాలేదు డ్రైవర్ కి. అయినా, మారుమాటాడకుండా స్టీరింగ్ ముందు కూర్చుని యింజన్ స్టార్ట్ చేశాడు.

88

గెస్ట్ హౌస్‌లో, ఎయిర్ కండిషన్డ్ గదిలో కూర్చున్నాడు గురూజీ.

తన నీడను చూసుకుని తనే భయపడుతున్నాడు. కళ్ళెదుట- మృత్యువు తాండవ నృత్యం చేస్తున్నట్లు ఉలిక్కిపడుతున్నాడు. ప్రాణాలు పోతున్నట్లు గిజ గిజలాడి పోతున్నాడు.

'మీనా ఓడ మునిగిపోయింది.'

'బొంబాయి పంపిన సరుకు డౌనయిపోయింది.'

'బ్యూటీ ఐస్ షిప్‌లోని స్మగుల్డ్ గూడ్సు పట్టుకున్నారు.'

'కాటన్ మిల్లు కాలిపోతోంది.'

'అరెస్ట్ వారంట్ తయారుచేస్తున్నారు పోలీసులు....'

-ఇలాంటివే వరుసగా పది ఫోన్‌లు వచ్చాయి. అతని రక్తాన్ని తోడేశాయి. కొన్ని క్షణాల్లోనే జీవచ్ఛవంలా అయిపోయాడు గురూజీ.

ఇంతలో నౌకరు వచ్చి ఓ కవరు యిచ్చాడు. అందులో-

'గుర్నాధం!

నీ కూతురు కళ్ళు పోయాయి. మతి

చలించి చచ్చిపోయింది.

నీ అందాల భార్య విశాలాక్షి- కళ్లు పగలగొట్టి, ముక్కు, చెవులు కోసి ఘోరంగా చంపబడింది.

ఇహ నువ్వు మిగిలావు. నీ పాపం కూడా పండింది. ఇరవై నాలుగు గంటల్లో నీ తల పగలగొడతాను.

-జోషీ.... అని ఉంది.

అంతవరకు జోషీ బ్రతికిఉన్నాడో లేదో నిశ్చయించుకోలేకపోయాడు. పంచశూలామే జోషీ కావచ్చునని వూహించాడు. కాని, అక్షరాలా- జోషీనుండే ఆ ఉత్తరం వచ్చేసరికి గుండె పగిలిపోయింది. తనను తాను నిగ్రహించుకోలేక తెలివితప్పిపోయాడు గురూజీ.

నౌకరు కంగారు పడ్డాడు. "అయ్యగారూ! అయ్యగారూ!"అంటూ, అతని ముఖంమీద నీళ్ళు చల్లాడు.

అదే సమయంలో, లోపలకు వచ్చాడు జయరాజ్. తన ఆరాటాన్ని అణచుకుంటూ "ఏమయింది?" అడిగాడు.

"పోస్టులో ఓ ఉత్తరం వచ్చింది సార్! అది చదువుకోగానే తెలివి తప్పిపోయారు" చెప్పాడు నౌకరు.

గురూజీ చేతిలోని ఉత్తరాన్ని తీశాడు జయరాజ్. రెండుసార్లు చదువుకున్నాడు. విషయం అర్థమైపోయింది. "నువ్వెళ్ళు. నేను చూసుకుంటాను"అన్నాడు.

మారుమాటాడకుండా గదిలోంచి వెళ్ళిపోయాడు నౌకరు.

మళ్ళీ గురూజీ ముఖంమీద నీళ్ళు చల్లాడు జయరాజ్. జేబురుమాలుతో అతని ముఖంమీద తుడిచాడు. నిజానికి, అతనికి సేవ చేసే స్థితిలో లేడు జయరాజ్. కాని, తప్పదు. విశాలాక్షి శవాన్ని చూసినప్పటినుండి మానసికంగా కుంగిపోయాడు గురూజీ. ధైర్యాన్ని పూర్తిగా కోల్పోయాడు. వెంటనే బేలన్స్ తప్పిపోయాడు. ఆస్థితిలో అతన్ని పోలీసులు పట్టుకుని, రెండుసార్లు గదిమితే చాలు- పాతికేళ్ళ నుండి దాచిన రహస్యం భళ్ళున కక్కేస్తాడు. అతనితోపాటు తనకు కూడా ఉరివేస్తారు.


అందుకే, గురూజీ పరిస్థితి చూశాక బలవంతంగా తనకుతాను ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు జయరాజ్.

కొన్ని క్షణాలకు కళ్ళు తెరిచాడు గురూజీ. ఎదురుగా కనిపించిన జయరాజ్ ని చూసి, భోరున ఏడవ నారంభించాడు.

"అరేయ్ గురూ! 'రింగ్ మాస్టర్, మాస్టర్ బ్రెయిన్' అని పేరుపొందిన నువ్వే అధైర్యపడితే నేనేమవ్వాలి? ఎవరితో చెప్పుకోవాలి?? ఏమని చెప్పుకోవాలి??? నాకు



తూర్పు గోపురం



సిద్ధి వినాయకుడు

అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయకుడు

పుణ్యక్షేత్ర సమీపంలోను, నదీతీరంలోను, సముద్రతీరంలోను, నదీసంగమ ప్రదేశంలోను, పర్వతాగ్రంలోను, ఉద్యానవనములందూ ఆలయ నిర్మాణం శ్రేష్ఠమని వాస్తుశాస్త్రం చెప్పింది.

పవిత్ర గోదావరీమాత హస్తములమధ్య నమరిన కోనసీమలో అడుగడుగునా పై నుద హరించిన స్థలాలు గోచరిస్తాయి. అట్టి పవిత్ర కోనసీమలోని 'అయినవిల్లి'లో నెలకొనియున్నది 'శ్రీసిద్ధివినాయక దేవాలయం.'

స్థల పురాణం

దక్ష ప్రజాపతి దక్షయజ్ఞం నిర్వర్తించే ముందు విఘ్న వినాశకుడు వినాయకుని ప్రతిష్ఠించి, పూజించి పునీతుడైనట్లు క్షేత్ర పురాణం తెలుపుతోంది.

వ్యాసమహర్షి దక్షిణయాత్ర ప్రారంభంలో పార్వతీతనయుణ్ణి ప్రతిష్ఠించేడని మరొక కథ వ్యాప్తిలోనుంది. అతి పురాతనుడైన ఈ 'సిద్ధి' ప్రియుడు కోర్కెలనీడేర్చే సిద్ధి వినాయకునిగా పేర్గాంచేడు.

క్షేత్ర విశేషాలు

విశాలమైన ఆవరణలో, ఎత్తైన ప్రాకారంతో విరాజిల్లుతున్న ఈ దేవాలయంలో, క్షేత్రస్వామి శ్రీ విఘ్నేశ్వరుడు దక్షిణాముఖుడై నిలిచియున్నాడు.

రెండు గోపురాలు, సింహద్వారములతో అలరారే ఈ దేవాలయం దక్షిణ సింహద్వారముద్వారా క్షేత్ర ప్రభువును, తూర్పు గోపురంగుండా శ్రీ కాశీవిశ్వేశ్వరుని దర్శింపవచ్చు.

ఈ ప్రాంగణంలోనే, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామి నిల్చి, శివకేశవ తారతమ్యాలులేవని చాటిచెబుతున్నారు.

శ్రీ అన్నపూర్ణాదేవి, విశ్వేశ్వరాలయం ప్రక్కనే ప్రతిష్ఠింపబడినది.

క్షేత్ర పాలకుడు శ్రీ కాళభైరవస్వామి. ప్రతిమాసం శుద్ధచవితికి వినాయకచవితి నవరాత్రులూ, విశేషార్చనలూ జరుపబడతాయి.

కొబ్బరితోటలతో పులకించిపోయే కోనసీమ గణపతికి కోర్కెలు సిద్ధించిన సంతృప్తులు వెయ్యినూట పదహార్లవరకు నారికేళ అభిషేకం మ్రొక్కుకుని, సమర్పించుకుంటుంటారు.

ఏదైనా సాక్ష్యము, ఈ దేవునియందు ప్రమాణంచేసి చెప్పుట ఈ ప్రాంతీయుల నమ్మకం.

చరిత్ర

అతి పురాతనమైన ఈ ఆలయాన్ని తొలి దేవతలే నిర్మించేరని పెద్దల మాట. కాలక్రమేణా ఆలయ పునర్నిర్మాణాలు, అభివృద్ధి విజయనగరరాజులు, పూసపాటివారు నిర్వర్తించేవారు. ప్రస్తుతం ఎండోమెంట్సు వారి అధీనంలో ఆలయ నిర్వహణాభివృద్ధులు జరుగుతున్నాయి.

తూర్పుగోదావరి జిల్లాలో నెలకొనియున్న ఈ క్షేత్ర సందర్శనానికి అమలాపురంనుండి ప్రతీ అరగంటకొక బస్సు అందుబాటులో నుంది. మరొక పవిత్రక్షేత్రం 'కోటిపల్లి' తీరంనుండి లాంచీ పడవలు మున్నగు రవాణా సౌకర్యాలున్నాయి. పుణ్య గోదావరిపై ప్రయాణం పర్యాటకులకు ప్రశాంతతను, నూతనోత్సాహాన్ని కల్గిస్తాయి.

- ఎన్. ఆదిలక్ష్మీప్రసాద్

పంచశూలమ్

కలిగిన కష్టమే నీకూ కలిగింది. ఒకరికి ఎక్కువ మరొకరికి తక్కువ అన్న ప్రశ్నలేదు. నా కొడుకూ, భార్యా హత్యగావింపబడ్డారు. నీ కూతురు, భార్య చంపబడ్డారు. ఇహ మిగిలింది- మనిద్దరమే."

"మనం బతికి లాభమేమిటి?"

"నాన్‌సెన్స్. చచ్చినవాళ్ళతోపాటు మనమూ చస్తామా?"కోపాన్ని నటిస్తూ అన్నాడు జయరాజ్.

"ఎవరికోసం' బతకాలి?"

"నీ కోసం నేను, నా కోసం నువ్వు బతికితీరాలి." అని లిక్కర్ కేబిన్ దగ్గరకెళ్ళాడు. జానీవాకర్ బాటిల్ తీసి, రెండు గ్లాసుల్లో పోశాడు. సోడా కలిపాడు. ఓ గ్లాసు గురూజీకి యిచ్చాడు జయరాజ్.

ఎత్తిన గ్లాసు దించకుండా తాగేశారు యిద్దరూ.

"ఇప్పుడు చెప్పు. ఏం చేద్దాం?" అడిగాడు గురూజీ.

"ఇరవై నాలుగు గంటల్లో మన ప్రాణాలు తీస్తానని బెదిరించాడు జోషీ. ఈలోపునే అతని ప్రాణాలు మనం తీసెయ్యాలి."

మరో పెగ్గు వేసుకున్నాడు గురూజీ. గడగడా తాగేశాడు. పెదవులు తుడుచుకున్నాడు. "తీసేద్దాం. జోషీ ప్రాణాలు తీసేద్దాం. కాని, ఇంతకాలం అజ్ఞాతవాసంలో వుండి ఈనాడు తన పేరు ఎందుకు బైటపెట్టుకున్నాడో అర్థంకావడంలేదు. పైగా అతను ఎక్కడున్నాడో, ఏ రూపంలో ఉన్నాడో తెలియదే!" అన్నాడు.

"అతన్ని చంపలేకపోతే మనం ఈ దేశం విడిచిపెట్టి పారిపోవాలి"

"అదీ సాధ్యంకాదు."

"ఎందుకని?"

"నీ భార్య, కొడుకు, నా భార్య, కూతురు చంపబడ్డారు. లా ప్రకారం ఆలోచిస్తే, ఎవరో మనమీద కక్ష కట్టి ఈ దారుణాలకు పూనుకున్నారని అర్థమై పోతుంది. మనం ఏదో తప్పు చెయ్యకుంటే- ఎవరైనా మనమీద యింత ఘోరంగా ఎందుకు పగబూనుతారు- అనే ప్రశ్న హోమ్ డిపార్టుమెంటులో సుడులు తిరుగుతుంటుంది. ఈ దేశం కాదుగదా- హైద్రాబాదునుండి కూడా మనల్ని బైటకు పోనివ్వరు పోలీసులు."

గురూజీ ఆర్గ్యుమెంటు చాలావరకు కరక్టేననిపించింది జయరాజ్‌కి. రెండు గ్లాసుల్లో మళ్ళీ విస్కీ పోశాడు. ఇద్దరూ సగం-సగం తాగారు.

"ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవడంకంటే, మరో మార్గం లేదు." అన్నాడు తిరిగి గురూజీ.

తాగిన విస్కీ మొండి ధైర్యాన్ని కలిగించింది జయరాజ్‌కి. "నాన్‌సెన్స్. చావడానికి సిద్ధంగా వున్నప్పుడు తాడో, పేడో తేల్చుకుందాం"అన్నాడు దృఢంగా.

"ఎలా? మార్గం చెప్పు"

"పంచశూలమే జోషీ. అతనే తన పే బైట పెట్టుకుంటూ, మనకు ఉత్తరాలు ర శాడు. ఇందులో అనుమానం లేదు. వెం అతన్ని చంపిపారేయాలి."

"ఆ పనిలో మనం ఫెయిలయ్యాం."

"అప్పుడు మదన్ని, అబ్దుల్లాను నమ్మి మోసపోయాం. ఇప్పుడు మనమే స్వయంగా పంచశూలాన్ని కాల్చిపారేద్దాం."

అదే సమయంలో గదిలో అడుగుపెట్టాడు అబ్దుల్లా.

"నన్ను నమ్మినవాళ్ళు ఇంతవరకు మోసపోలేదు. ముమ్ముందు మోసపోరు" అన్నాడు.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"కేష్ బాక్స్ తెచ్చారా?" గురూజీ ప్రశ్నించాడు.

"అది పంచశూలమ్ చేతిలో పడిపోయింది."

"ఆ..!" ఆశ్చర్యపోయారు - గురూజీ, జయరాజ్‌లు.

"ఔను. దాన్ని తీసుకెళ్ళి ఐ.జీ.కి హేండోవర్ చేశాడు. అతని నీతిని, నిజాయితీని మెచ్చుకుంటూ, హోమ్ డిపార్ట్‌మెంటువారు ఈరోజు సాయంకాలం అతన్ని సన్మానిస్తున్నారు. హోమ్ మినిస్టర్ అధ్యక్షత వహిస్తున్నాడు- సభకు."

"మై గాడ్! ప్రత్యక్షంగా మమ్మల్ని, మీ డిపార్టుమెంటును బెదిరించి, హింసిస్తున్న ఆ గూండాకి పోలీసులు సన్మానం చేయడమా? షేమ్... షేమ్..." అన్నాడు గురూజీ.

"ఐదుకోట్ల రూపాయలు అప్పగించాడు పోలీసు డిపార్టుమెంటుకి. అతన్ని సన్మానించాలి- తప్పదు. కాని, అతను పక్కా గూండా, నెంబర్ ఒన్ రౌడీ" అని, మదన్‌ని అరెస్ట్ చెయ్యడానికి వెళ్ళినప్పుడు తనకు జరిగిన అవమానాన్ని వివరించాడు అబ్దుల్లా.

"మీ పోలీసువాళ్ళకు అసలు సిగ్గులేదు. ఇంత జరిగినా నోరు మూసుకుని వూరుకుంటారా మీరు?"

సమాధానంగా నోరు తెరిచాడు అబ్దుల్లా. నాలుగు గుక్కలు విస్కీ తాగాడు. అలవాటు ప్రకారం గుబురు మీసాలమీద చెయ్యి వేసుకోబోయాడు. కత్తిరించుకున్నట్లు గుర్తుకొచ్చి చెయ్యి కిందకు దించేశాడు. "వూరకే కూర్చోవడం అబ్దుల్లా చరిత్రలో లేదు. ఈ రోజు పంచశూలమ్ ప్రాణాలు--ఢాం...." అన్నాడు.

అదే సమయంలో కిటికీలోంచి తొంగి చూసి, పక్కకు తప్పుకున్నాడు నౌకరు.

"మైక్‌లో టైమ్ బాంబ్ పెడుతున్నాను. సరిగ్గా అతను ఉపన్యాసం యిస్తూఉండగా పేలుతుంది. అతని తల బద్దలవుతుంది."

"ఆ సమయంలో మరొకరు మాట్లాడుతుంటే...? " సందేహాన్ని వెలిబుచ్చాడు జయరాజ్.

"పక్కనే వుంటాను నేను. టైమ్ అడ్జస్ట్ చేస్తాను. మీరుకూడా వచ్చి ఆ వేడుక చూడండి"

"గుడ్... తర్వాత?"

"నా దగ్గర మూడు పాస్‌పోర్టులున్నాయి. మారువేషాల్లో మనం ఈ రాత్రే పాకిస్తాన్ వెళ్ళిపోతాము. అక్కడ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాం."

"వెరీ వెరీ గుడ్!" సంతోషంతో ఉక్కిరిబిక్కిరై, అమాంతంగా అబ్దుల్లాను కౌగిలించుకున్నారు - జయరాజ్, గురూజీలు.

(ఇంకా ఉంది)

పట్టాలెందుకు? పరశురామ ప్రీతికే!

ఆగస్టు ఏడున కొత్త ఢిల్లీలో ఒక డాక్టరు బూట్లను పాలిష్ చేసి, తరువాత తన డిగ్రీని తగులబెట్టాడు. రెండు వందల మంది నిరుద్యోగ యువకులు 'భారత ముక్తి మోర్చా' సంస్థ ఆధ్వర్యంలో, ఆగస్టు ఏడు ఉదయం కస్తూరిబా గాంధీమార్గ్‌లోని ఆ సంస్థ కార్యాలయంనుంచి ఊరేగింపుగా బయలుదేరి జంతర్‌మంతర్‌వద్ద చేరి, తమ డిగ్రీ సర్టిఫికెట్లను తగులబెట్టారు. జవహర్ రోజ్‌గార్ యోజన పథకాన్ని, అందులో జరుగుతున్న అవినీతిని దుయ్యబట్టారు.

నిరుద్యోగులైన పట్టభద్రులు "బూట్ పాలిష్" చేసి బ్రతకవలసి వస్తున్నదని, ఈవిధంగా వచ్చిన డబ్బును మానవ వనరుల శాఖ మంత్రికి స్వాధీనం చేసి, నిరుద్యోగ యువతీ యువకుల పరిస్థితి గురించి వివరిస్తామనీ, మోర్చా ప్రధాన కార్యదర్శి తెలిపారు.



ప్రశ్నలు జవాబులు



అడ్వొకేట్

బి. భాస్కరరావు

ఎం. ఎ., ఎల్. ఎల్. బి.

ఎ. సువర్ణ, బెంగుళూరు–24.

ప్రశ్న: మావారు ఎన్.టి.సి. మిల్లులో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తూండేవారు. నెలకు రూ. 3200/–లు జీతం. 1983 మే 21వ తేదీన అఫీషియల్ డ్యూటీమీద కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్ళారు. డ్యూటీ పూర్తి చేసుకొని వరంగల్ తిరిగి రావడానికి గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి ఫస్టుక్లాస్ టిక్కెట్‌కొని, సికింద్రాబాద్ స్టేషన్ మొదటి ప్లాట్‌ఫారమ్‌మీద రాత్రి ఏడు గంటలకు రైలుకోసం వేచివున్నారు. సడన్‌గా ప్లాట్‌ఫారమ్‌మీద పడిపోయిన ఆయనను రైల్వే పోలీసులు చూసి వెంటనే ఆసుపత్రికి చేర్చారట. అక్కడ డాక్టరు ఆయనను పరీక్ష చేసి ఆయన చనిపోయారని చెప్పారు – రాత్రి పది గంటలకు మిల్లుకారులో నేను, మా అమ్మాయి సెక్యూరిటీ ఆఫీసరు తోడుతో బయలుదేరాము – మేము ఎంక్వయిరీలో విచారించగా ఆయన పోయారని చెప్పారు. మర్నాడు ఉదయం మిల్లు జనరల్‌మేనేజరు పోలీసులు రాసుకుంటారు జవాబు చెప్పండి అన్నారు – దుఃఖంలో నేను ఏం సమాధానం చెప్పానో నాకే తెలియదు. నేను చెప్పినదాన్నిబట్టి మావారు గుండెపోటువలన మరణించారని రాసుకున్నారు – మావారు పనిచేసే ఎన్.టి.సి. కంపెనీ మాకేవిధమైన నష్టపరిహారం చెల్లించాల్సిన రూలు లేదన్నారు – సంవత్సరం తర్వాత బి.ఎస్.సి. ప్యాసైన మా అమ్మాయికి వుద్యోగం ఇమ్మని అడిగినా ఇవ్వలేదు. మాకు ఏ విధమైన నష్టపరిహారం చెల్లించవలసిన రూలు లేదా? నా సందేహాలకు సమాధానం ఇవ్వవలసినదిగా కోరుచున్నాను.

జవాబు: మీవారు డ్యూటీలో వుండగా మరణించినట్లుగా భావించాలి. ఇక ఆయన గుండెపోటుతో మరణించినట్లు మీరు చెప్పినా మీ ఇంట్లో చనిపోలేదు గనుక ఆ విషయం మీకు తెలియదు. మీరు డాక్టర్ కూడా కారు. ఆ విషయం ఎక్స్‌పర్ట్ నిర్ధారణ చెయ్యాలి. డ్యూటీలో చనిపోయారు గనుక వరంగల్‌లోని వర్క్‌మెన్స్ కంపెన్సేషన్ కమీషనర్‌గారికి పిటిషన్ పెట్టండి. మీకు కంపెనీవారు కంపెన్సేషన్ నిరాకరించినప్పుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా అప్పీలు పెట్టండి. మీరు సంవత్సరంలో పల పిటిషన్ పెట్టారు గనుక మీ కుమార్తెకు కూడా వుద్యోగం ఇవ్వాలి. కంపెనీ వారికి పిటిషన్ పంపండి. కంపెనీవారు నిరాకరించినట్లయితే హైకోర్టులో రిట్‌పిటిషన్ వెయ్యండి. ఒక కేసులో సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న డ్రైవరు డ్యూటీలో వున్నప్పుడు కళ్ళుపోలేదు గనుక కంపెన్సేషన్ చెల్లించవలసిన అవసరం లేదని కంపెనీ వాదించింది. ఆ వాదన హైకోర్టు తిరస్కరించింది. ఆ తీర్పు మీకు అనుకూలంగా వుంటుంది. ఆ తీర్పు వివరాలు ఇవి:

సింగరేణి కోలెరీస్‌లో పనిచేస్తున్న డ్రైవర్ కంట్లో బొగ్గుపడింది. 12–8–79 తేదీన ఈ ప్రమాదం జరిగి కళ్ళుపోయాయి. సెలవుపెట్టలేదని కంపెనీవారు 19–9–79 నుంచి డ్రైవర్‌ను వుద్యోగం నుంచి తొలగించారు. కంపెనీ వారు కంపెన్సేషన్ నిరాకరించారు. 21–7–81 తేదీన డ్రైవర్ వరంగల్‌లో వున్న వర్క్‌మెన్స్ కంపెన్సేషన్ కమీషనర్‌కు పిటిషన్ పెట్టుకున్నాడు. డ్రైవర్ జీతం నెలకు రూ.400/–లు కనుక రూ.26,880/– కంపెన్సేషన్‌గా చెల్లించాలని కమీషనర్ వుత్తర్వులు జారీచేశారు. ఈ ఆర్డరుపై కంపెనీవారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు అప్పీలు పెట్టుకున్నారు. డ్రైవర్ కళ్ళు పోయినప్పుడు డ్రైవర్ డ్యూటీలో లేడని కంపెనీ వాదాన్ని హైకోర్టు తిరస్కరించింది. డ్రైవర్ జీతం నెలకు రూ. 800/–లు కనుక రూ. 33,600/–లు కంపెన్సేషన్‌గా చెల్లించాలని హైకోర్టు 1987లో తీర్పు చెప్పింది.

కాబట్టి మీవారు కూడా డ్యూటీలో వున్నప్పుడు మరణించినట్లు భావించి కంపెన్సేషన్ చెల్లించాలి. ఆలస్యం చెయ్యకుండా కంపెన్సేషన్ కొరకు పిటిషన్ పంపండి.

కె. రామచంద్రరావు, కాకినాడ.

ప్రశ్న: నేను ఒక రాష్ట్రప్రభుత్వ సంస్థలో రోజువారీ వేతనంపై 2న్నర సం. నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ నుంచి రాలేదని తొలగిస్తున్న సమయంలో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకొనడం జరిగింది. తీర్పు నాకు అనుకూలంగా వస్తుందా?

జవాబు: మీ కేసు హైకోర్టులో పెండింగులో వుండటం వలన సమాధానం చెప్పకూడదు. కండెంప్ట్ ఆఫ్ కోర్టు అవుతుంది. తీర్పు వచ్చేవరకు ఆగండి.

●

కూపన్

ఆంధ్రసచిత్రవారపత్రిక

ప్రశ్న పంపినవారి పేరు..

పూర్తి చిరునామా..

.... పిన్ కోడ్..

భాద్రపదంలో భద్రగణపతి

దివాణంలో వైవిధ్యపు ప్రకృతిలోవి
ఎంత పత్రి కోసినా ఎన్ని కాయలు పోగేసినా
ఇంకా రా రమ్మని పిలిచే సుందర వనం
బాటలో పల్లేరు లేసే క్షుద్రకారు అగడాలు
ఇంట్లో పూజ-బయట నవవినాయక సందర్శన
స్నేహితులతో నవరాత్రి పందిళ్లలో
అర్థరాత్రిదాకా సందడి
చివరగా నిండైన కోనేట్లో నిమజ్జనం
మళ్లీవచ్చే ఏటికోసం నిరీక్షణ
ఇదంతా గతకాలపు వైభవం
మండే ధరల స్పీడు యుగంలో
చొక్కా పట్టుకుని వసూలుచేసే చందాలు
వేరే పల్లేరు అక్కరలేని కంటకపు బాటలు
మొక్కుబడిగా పండుగ పబ్బాలు
దివాణంలేదు కాని సాక్షీభూతంగా మొండిగోడలు



తోట నరికేసి ప్లాట్లు విక్రయించగా
అక్కడా అక్కడా లేచిన ఇళ్లు
సంతలో పత్రి కాయల ధరల భగభగలు
మొదటిరోజు ఆర్భాటం రెండోరోజు నీరసం
మూడోరోజు నిమజ్జనం
పూడిపోయిన కోనేరు, తోటలేని మరుభూమి
గతకాలపు చరిత్రకి ప్రతీకలు
మన కక్కరలేని దేముడు అమెరికాలో సాక్షాత్కారం.
సర్వత్రా సర్వదా వినాయకుడు ప్రథమదేవుడే
దీక్షితారు కొలిచిన బొజ్జగణపతే
జగన్మాత ముద్దుల తనయుడే
చవితి చంద్రుని శాసించిన చండీప్రియుడే
భూప్రదక్షిణతో షణ్ముఖునోడించిన మరుగుజ్జే
అదిగో కొలవవలసిన మేండేటరీ దేముడే
అందుకే మనల్ని అనుగ్రహించాలని ప్రార్థన !

-డి.ఎల్.ఎన్. శాస్త్రి

హనీమూన్ ప్రారంభిస్తున్నామ్...

వి. జె. ప్రసాద్



"ఒరేయ్! కాముడూ! సామాన్లన్నీ లెక్క పెట్టావా? మొత్తం పదమూడు శాల్తీలుండాలి. సరిపోయేయిరా?"

'ఆఁ సరిపోయేయే బామ్మా! నువ్వూ, నేనూ, పెళ్ళికూతురూ కలిపితే పదహారు అవుతాం"

"ఒరే నా మతిమండా. నీ పెళ్ళికూతురు ఏదిరా? మరిచేపోయానూ! నీకైనా బుద్ధి లేదురా? చూసుకోవద్దా? అమ్మాయేదీ?"

"అది బండిలో నే ఉందే బామ్మా! దాన్ని వేగం పిలువ్వే? జనం మనల్నే చూస్తు న్నారే" అని చుట్టూ ఓసారి చూసి సిగ్గుతో మొహం దించుకున్నాడు కామేశ్వర్రావు ఉరఫ్ కాముడు.

"నీ సిగ్గు బొగ్గులవా! అమ్మాయిని నీతో దింపవద్రా? అమ్మాయ్! శాంతా! దిగమ్మా!"

"ఒసేవ్! సోదులూ! హారతి పళ్ళావే! ఒరేయ్! అమ్మాయి చెయ్యి పట్టుకోరా! అమ్మాయి! నీ కుడిపాదం ముందు పెట్టమ్మా! ఏమయ్యా! భీమశాస్త్రీ! మంత్రాలు చదవ్వయ్యా" అంటూ చకచకా ఆజ్ఞలు జారీ చేస్తూ, బహు పాత్రాభినయం చేస్తూ మనవణ్ని, మనవడి భార్యని గృహప్రవేశం చేయించారు బామ్మగారు!

"శాస్త్రీ! చీకటిపడగానే వచ్చేయ్! ఆ శుభకార్యం కూడా నీ చేతుల మీదుగా జరిగిపోవాలి" అని భీమశాస్త్రికి అర్డరిచ్చేటప్పటికి "అలాగేనమ్మా! తప్పకుండావస్తా!" అని శాస్త్రి బయలుదేరబోయాడు.

"ఆగవయ్యా! ఆగు! అడుగు ముందుకేసావా! నీ ప్రాణాలు దక్కవు" అని భీమశాస్త్రిని ఒక్క లాగు లాగేడు కామేశ్వర్రావు.

"ఏమే! బామ్మా! నీకు పెళ్ళికి ముందే చెప్పానా! ఇలా శుభాలూ, శోభనాలూ పెట్టొద్దని. నేనూ, నా పెళ్ళాం 'హనీమూన్' వెళ్తాం'. అని. మళ్ళీ యిదేమిటే? "శాస్త్రీ నువ్వు యీ రాత్రి వస్తే.....

నఖిలి, మింగేస్తాను జాగ్రత్త. వస్తావా?''

''రాను బాబూ! అమ్మా వస్తా!'' అని బయటికి పరుగెత్తేడు భీమశాస్త్రి 'బతుకుజీవుడా' అనుకుంటూ.

పాపం! బామ్మగారికి కొడుకూ, కోడలూ ఏక్సిడెంట్‌లో పోగా మిగిలిన వంశాంకురం యీ కాముడు.

కాముడ్ని చాలా ముద్దుగాపెంచింది.

కాముడు డిగ్రీ పాసయి బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు.

బామ్మ చాదస్తాలంటే వాడికి ఒళ్ళు మంట. కాని బామ్మ మాటని కాదనలేడు.

పెళ్ళాంతో హనీమూన్ గురించి నిద్దర్లో, మెలుకువలో కూడ కలలు కన్నాడు.

అందుకే ఈ ఒక్క విషయంలో పట్టు పట్టేడు కాముడు.

బామ్మగారు కాముడు మాట కాదనలేక ''సరే! నీ యిష్టం వచ్చినట్లు తగలడరా! నాకేం! అమ్మాయీ!రామ్మా!లో పలికెళ్దాం''. అని ముక్కుకుంటూ లోపలికి దారి తీసింది.

కాముడు మర్నాటి ''మదనపురం హనీమూన్ ట్రిప్'' గురించి కలలు కంటూ తెల్లవార్చేసేడు.

ఆ రాత్రి శాంతకి బామ్మగారి పక్కే శరణ్యం అయింది. పాపం!

ఉదయం కాముడు లేచేటప్పటికే బామ్మగారు ఆవకాయతో సహా పదకొండు సామాన్లు సర్దేశారు.

కొత్త దంపతులు గబ గబా రెడీ అయ్యేరు.

టాక్సీ ఇంటి ముందు రెడీగా ఉంది

''హనీమూన్ ప్రారంభ సమయే...''

అప్పటికే!

''ఒరేయ్ కాముడూ! శాంతా! రండర్రా! దుర్ముహూర్తం వచ్చేస్తోంది. సామాన్లు జాగ్రత్త! లెక్కెట్టుకోండి'' అని బామ్మగారు హడావిడి పడిపోతున్నారు.

కామేశ్వర్రావు ఆనందంగా శాంత చేయి పట్టుకుని నడిపించుకుంటూ, కారు తలుపు తీసి తను కూర్చుని శాంతని కూర్చోబెట్టబోయాడు.

'ఆగమ్మాయి! మగాళ్ళు ముందు కూర్చుంటారు. నువ్వు వెనకనెక్కు'' అని గదమాయించేరు బామ్మగారు.

శాంత సిగ్గుతో వెనక సీట్లో కూచుంది.

''డ్రైవర్! కారు పోనీ! బామ్మా వస్తామే!'' అని కాముడు ఆర్డరు జారీ చేసేడు అందంగా 'హనీ! మూన్ ఛలో!'' అని హమ్మింగిస్తూ.

'డ్రైవరూ ఆగవయ్యా! ఆగు!'' అని కేక వేసి బామ్మగారు అటూ, ఇటూ చూస్తున్నారు- కాముడు గుండెల్లో రాయిపడ్డది.

'అమ్మా! నేనొచ్చేసాను. దారిలో ఒకడు 'సాలిగ్రామ దానం' చేస్తానంటేనూ, వెళ్ళేను. అందుకు ఒక్క అయిదు నిమిషాలు లేటయ్యేను. ఇదిగో నా సామాన్లు. ఒక మూట, ఒక సంచి, ఒక ట్రంకు పెట్టె. డ్రైవరు బాబూ! సామాను కార్లో పెట్టు. 'కాంబాబూ! కొంచెం జరగవయ్యా!'' అంటూ ''బ్రాహ్మడు''.

''అమ్మా! ఆ మూడు రాత్రుళ్ళూ తంతు 'మదనపురం'లో నేను దగ్గరుండి శాస్త్రోక్తంగా జరిపిస్తా! నువ్వు నిశ్చింతగా ఉండు తల్లీ!'' బామ్మగారికి ఆదే నోటితో హామీ యిచ్చేశాడు.

భీమశాస్త్రి కారెక్కి ఓ చెంబుడు నీళ్ళు కారు ఇంజనులోను, స్టీరింగు మీద, దంపతుల నెత్తి మీద, డ్రయివరు నెత్తి మీద జల్లేసి, ''యికపద''మన్నాడు.

''ఓం! అవిఘ్నమస్తు! హనీమూన్ యాత్ర ప్రారంభ సమయే, శ్రీ మహా గణపతి పూజాం కరిష్యే' అని మంత్రాలు చదువుతూ డ్రైవరు పక్క కూర్చుని 'డ్రైవర్! ఇక కారు వెనక్కి చూడకుండా తీసుకు పోవయ్యా' అని ఆజ్ఞాపించాడు.

బామ్మగారు ఆనందంగా నిట్టూర్చారు.

కాని కాముడు జుట్టు పీక్కుంటూ 'హనీ మూన్ నహీ! ఛలో ఇంట్లోకి!'' అని ఇంట్లోకి లాంగ్‌జంప్ చేసేడు కారులో నుంచి తేలు కుట్టినట్లు ఒక్క ''లంఘనం'' వేసి!




రామాయణం ఎవరిసొమ్ము?

దేశంలోని టి.వి. ప్రేక్షకులను గతంలో ఆకట్టుకున్న 'రామాయణ్' నిర్మాతలు రామానంద్‌సాగర్ అండ్‌కో యిప్పుడు 'రామయణ్' పేరుతో ఫొటోలతో నిండిన 'కామిక్స్' పత్రికను వెలువరించారట. ఈ పత్రికను ఆపకుండా విడుదలచేసేందుకు చందమామ గ్రూప్ వారిని సాగర్ అండ్‌కోవారు అడిగారట.

ఈ కొత్త కామిక్స్ పత్రిక వెల ఐదురూపాయలు. రామాయణ్ సీరియల్ ద్వారా సొమ్ము చేసుకున్న సాగర్ అండ్‌కో ఈ 'కామిక్స్'ను ఎంతవరకు సొమ్ము చేసుకోగలరోనంటున్నారు అనేక మంది. మరి ఈ పత్రిక ఎంతవరకు విజయం సాధిస్తుందన్నది వేచిచూడాల్సిందే !

అతి త్వరలో, మీ బిడ్డ అవసరాలు మరియు మీ ఖర్చులు పెరగడం ప్రారంభమవుతుంది.



అదృష్టవశాత్తూ, యుటిఐ వారి బాలల కానుక వృద్ధి నిధి వుంది.

మీ బిడ్డకి సాధ్యమైన అత్యుత్తమ కానుక యివ్వండి. యూనిట్ ట్రస్ట్ వారి బాలల కానుక వృద్ధి నిధిలో* కనీసం రూ. 500/- డిపాజిట్ చేయండి.

నిశ్చింతగా వుండండి.

ప్రతి సంవత్సరమూ 12.5% డివిడెండ్ తప్పక లభిస్తుంది. ప్రతి 5 సంవత్సరాలకీ ఆకర్షణీయమైన బోనసు డివిడెండ్ కూడా లభిస్తుంది. మీ బిడ్డకి 21 సంవత్సరాలు వచ్చేసరికి, మీ 'చిన్న' కానుక చెప్పుకోదగినంత మొత్తంగా పెరుగుతుంది.

మీ బిడ్డ పెరుగుతున్న అవసరాలు మరియు మీ పెరుగుతున్న ఖర్చులు తీరడానికి సరిపోయేటట్లు సిద్ధంగా వుంటుంది.

ఇంకా వివరాలకు యుటిఐ కార్యాలయాలలో ఎక్కడయినా కాని, ఏజంట్లని లేక ముఖ్య ప్రతినిధులని లేక స్పెన్సర్ & కంపెనీ లిమిటెడ్ ఏ బ్రాంచినయినా కాని సంప్రదించండి. లేకపోతే ఈ కూపన్‌ని మీ సమీపంలో వున్న యుటిఐ బ్రాంచి ఆఫీసుకి పోస్టు చేయండి.

*గమనిక : CGGF (బాలల కానుక వృద్ధి నిధి)ని 15 సంవత్సరాల లోపున వున్న పిల్లలకీ కానుకగా యివ్వవచ్చు. కాలపరిమితి అయిన తర్వాత చెల్లించే మొత్తం మొదట కట్టిన కానుక మొత్తం మరియు స్వీకరించేవారి వయసుని అనుసరించి మారుతూ వుంటుంది.

UNIT TRUST OF INDIA H.O. Bombay
(A Public Sector Financial Institution)

Regional Office:
45, Second Line Beach, Madras 600 001.
Phone: 587433/580938

Branch Office:
29-3-12, Venkateswara Rao Street,
West of Rehman Park, Governorpet,
Vijayawada – 520 002. Phone: 63964

203/204, Moghul Court Complex, Basheer Bagh,
Hyderabad – 500 001. Phone: 240030

Our Chief Representatives in Andhra Pradesh

☐ GUNTUR • **K.B. Tilak,** Ph: 24964, 31839 ☐ WEST GODAVARI & KHAMMAM • **Y. Somasundara Rao,** Ph: 2440 (Tanuku) ☐ VIZAG & VIZIANAGARAM • **C. Narayanaswamy,** Ph: 63116 (Vizag) ☐ CUDDAPAH • **A.R. Krishna Reddy,** Ph: 2701 ☐ CHITTOOR • **K.V. Kotiveeraiah,** Ph: 22322 (Tirupati) ☐ EAST GODAVARI • **P. Venkataramana,** Ph: 76047 (Kakinada) ☐ NELLORE • **A. Sathyanarayana,** Ph: 2002 ☐ WARANGAL • **B.S.N. Murthy,** Ph: 8631 (Hanamkonda) ☐ MEDAK • **P.V. Krishna Reddy,** Ph: 2820 (Siddipet) ☐ KARIMNAGAR • **T. Ahalya Srinivas,** Ph: 2674 (Fertilizer City) ☐ ADILABAD • **Sanwal Ram Sah,** Ph: 91 (PP) ☐ SRIKAKULAM • **Visweswara Rao Chabolo,** Ph: 794, 393 (PP) ☐ MEHABUBANAGAR • **N. Venkatanarayana,** 10-87, BR Compound, Jadcherla ☐ KURNOOL • **T. Seetharamaiah Setty,** Ph: 22335 (PP) ☐ PRAKASAM • **M.V. Ramanaiah,** Ph: 3337, 3244 (Ongole) ☐ RANGAREDDY • **S. Veeraraghavalu,** 11-9-485-6-1, Plot-13, Lalitha Nagar, Hyderabad.

Sista's – UTI.1188.89.TE

పాత్రలు:- సిమ్మాద్రి, గుమ్మస్తా, గుర్నాధం, హెడ్ క్లర్క్, సూపరెంటెంటు, ఆఫీసరు, క్రొత్త వ్యక్తి, పోలీసులు, విజయలక్ష్మి.

(ఉదయం 9 గం. సమయం, ఆఫీసు నిశ్శబ్దంగా వుంటుంది. స్వీపరు సిమ్మాద్రి బల్లలు తుడుస్తూ వుంటాడు.)

సిమ్మాద్రి: సిలక కొట్టుడు కొడితే.... సిన్నదానా.... (పాడుకుంటూ దులుపు తుంటాడు గుర్నాధం ప్రవేశం)

గుర్నాధం: ఏం వాయ్ సిమ్మాద్రీ! చిలక కొట్టుడంటూ బల్లల మీద ధణు లెగర కొడుతున్నావ్.

సిమ్మాద్రి: హీ హీ హీ.... బల్లలు తుడుతున్నానండి.

గుర్నాధం: బల్లలు విరిగేలా ధణు లెయ్యడమేనా తుడవడమంటే.... సందు చివరకి వినబడుతోంది నీ చిలక్కొట్టుడు.

సిమ్మాద్రి: హీ హీ హీ.... ఆసికా లాడతన్నారయ్యగారు.

గుర్నాధం: వెధవా, నీతో నాకు ఆస్యాలేంట్రా, వెధవ్వాగుడూ నువ్వూను.

సిమ్మాద్రి: హీ హీ హీ....

గుర్నాధం: ఆపరా వెధవనవ్వు గుర్రం సకిలించినట్టు. వినలేక ఛస్తున్నా రోజూ.

సిమ్మాద్రి: (నిమ్మారంగా) టిపిస్టు యిజాలష్మిగారు నవ్వితె సిలక కులికి నట్టుందాది గాని నాన్నవ్వితె గుర్రం సకిలించినట్టె వుంటాది మరి.

గుర్నాధం: దుర్మార్గుడా! ఎంత నింద వేశావురా నా మీద... ఆఁ... ఇది నీ పుర్రెకు పుట్టిన బుద్దేనా, ఎవరన్నా అనుకుంటుంటె విన్నావా?!

సిమ్మాద్రి: హీ హీ హీ... అందరికీ తెలిసిన ఇసయమే గాదేటండీ.... కొత్తేం వుందండీ.... హి హీ...



హాస్య నాటిక

ఏ విజయలక్ష్మి?!

విజయకుమారి

గుర్నాధం: ఏడ్చావులే నోరుముయ్యి. (బర్రున కుర్చీ లాక్కుని కూర్చుంటాడు) ఇంకా ఎవరూ వచ్చినట్టు లేదే ఆఫీసంతా నిశ్శబ్దంగా వుంది.

సిమ్మాద్రి: ఎద్దు గుమ్మస్తాగారూ. సూరిసెంద్రరావుగారూ వచ్చినారండి.

గుర్నాధం: ఏరీ?



సిమ్మాద్రి: ఎద్దుగారు ఆరి గదిలో కూకొన్ని రామకోటి రాసుకుంతన్నారండి...: మరిగంటి సూరిసెంద్రరావుగారు సూరి నమస్కారాలు సేసుకుంతన్నారండి ఎనకరండో లో ..

గుర్నాధం: సూర్య నమస్కారాలా?! ఆఫీసులో సూర్యనమస్కారాలేంటోయ్ మతిలేని మాటలు.

సిమ్మాద్రి: హీ హీ హీ... అదంతెనండి... ఇంటికాడ మర్సిపోనారంటండి.... హి హి....

గుర్నాధం: (చిరాగ్గా) మొదలు పెట్టాడు మళ్లీ వెధవ నవ్వు. కడుపులో తిప్పుతోంది. టైపిస్టు విజయలక్ష్మి వచ్చినట్టు లేదే!

సిమ్మాద్రి: హి హీ హీ.... స్టెనో ఇజాలక్ష్మిగారి పెళ్ళి కెళ్ళారు గదండీ ఆఫీసులో అమ్మలంతా.... ఇయ్యాలొత్తారు... హి హీ...

గుర్నాధం: (విసుగ్గా) నిన్నెవరడిగారోయ్, అన్నిటిల్లో నేనని తయారవుతావు.

సిమ్మాద్రి: ఆ యమ్మని సూడందే వుండలేరయ్యగారు.... నాకు తెల్దేటి.... హిహీ....

గుర్నాధం: ఏడ్చావులే.... నీ పని చూసుకొ పో... ఆఫీసరుగారు వచ్చేస్తారిక.

సిమ్మాద్రి: (వాకిలి వైపు చూసి కంగారుగా ఆశ్చర్యంగా) అయ్‌గారో! కింగ్‌కాంగ్ బాబాయి లాంటి మడిసొత్తన్నారండి... ఎవరోగాని....

గుర్నాధం: ఎవరికోసమోలే.... నీకెందుకు.. నువ్వెళ్ళి పని చూసుకోపో.

(కొత్త వ్యక్తి ప్రవేశం. చూడ్డానికి కాస్త బెదురు పుట్టించేలా వుంటాడు.)

క్రొత్త వ్యక్తి: విజయలక్ష్మి వుందా? (వురిమినట్లు అడుగుతాడు.)

గుర్నాధం: ఈ ఆఫీసులో అష్టలక్ష్ముల్లా ఎనిమిది మంది విజయలక్ష్ము లున్నారు. ఏ విజయలక్ష్మండి?

క్రొత్తవ్యక్తి: ఏ. విజయలక్ష్మి.

గుర్నాధం: (కొంచెం గట్టిగా, వివరిస్తున్నట్లు) ఏ విజయలక్ష్మండీ?

క్రొత్తవ్యక్తి: (అదేవిధంగా వివరిస్తున్నట్లు) ఏ. విజయలక్ష్మండీ.

గుర్నాధం: (చిరాకూ, కోపం) ఏ విజయలక్ష్మి అని అడుగుతున్నాను....

క్రొత్తవ్యక్తి: (అంతకన్నా కోపంగా) నేను ఏ. విజయలక్ష్మి అని చెపుతున్నాను.

గుర్నాధం: (కోపంగా) నా మాట మీకు అర్థం కావడం లేదాంట .

క్రొత్తవ్యక్తి: నా మాటనీకు అర్థం కావడం లేదాంట...

గుర్నాధం: ....

క్రొత్తవ్యక్తి: (కోపంగా) ఏంటలా మిర్రిమిర్రి చూస్తావు తెగులు తగిలిన కోడిలా.... సమాధానం చెప్పవేం?

(హెడ్‌క్లర్కు ప్రవేశం)

హెడ్‌క్లర్కు: ఏమిటీ గొడవా? ఈయనెవరూ? ఏం కావాలండీ? (తనలో) ఎక్కడో చూసినట్లుందే మొహం....

క్రొత్తవ్యక్తి: విజయలక్ష్మి.

హెడ్‌క్లర్కు: ఏ విజయలక్ష్మి?

క్రొత్తవ్యక్తి: ఎ. విజయలక్ష్మి.

హెడ్‌క్లర్కు: (విసుగ్గా) బాగుంది వరస.

గుర్నాధం: (భయంగా, నెమ్మదిగా) ప్రొద్దున్న పేపరు చూశారా సీతాపతిగారూ....

హెడ్‌క్లర్కు: చూశాను. . ఏం?

గుర్నాధం: మొదటి పేజీలో ఫొటో ... (రహస్యం చెపుతున్నట్లు) పిచ్చాసుపత్రి నించీ ఓ పేషెంటు తప్పించుకు పో....

హెడ్‌క్లర్కు: (మధ్యలోనే అందుకొని) అదీ సంగతి.... ఎక్కడో చూసినట్లుందే అనుకుంటున్నానింకా.... బుర్ర మీసాలు, తుప్పతలా.

క్రొత్తవ్యక్తి: (పిచ్చి కోపంతో) ఎవర్రా పిచ్చాసుపత్రి నించీ పారిపోయొచ్చింది. నువ్వా.... నేనా.... రాస్కెల్.... (తన్న బోతాడు)

గుర్నాధం: తొందరగా పిచ్చాసుపత్రికి ఫోను చెయ్యండీ బాబూ.... (భయపడుతూ అంటాడు.)

హెడ్‌క్లర్కు: ఎబ్బెబ్బె.. . మీకు కాదుసార్.. . మీకుకాదు.... (గుర్నాధంతో) పిచ్చివాళ్లని పట్టుకొని వాళ్లముందే నీకు పిచ్చి అంటె మరీ పేట్రేగి పోరుటయ్యా గుర్నాధం

క్రొత్తవ్యక్తి: (ఆవేశంగా) నాకు.... నాకు.... పిచ్చంటార్రా.... ఎంత ధైర్యం' ఒరేయ్... నన్నింత అవమానం చేసిన మిమ్మల్ని... మిమ్మల్ని ఊరికే వదిలి పెట్టన్రోయ్... పోలీసు దెబ్బల రుచి

హెడ్‌క్లర్కు: [illegible] లాఠీ దెబ్బల్లో మతి

ఏ విజయలక్ష్మి!?

చలించి వుంటుంది.

సిమ్మాద్రి: ముందు వాళ్ళకి ఫోను చెయ్యండయ్యగారూ.... ఈ కోపంలో మన పీకలు పట్టుకున్నా....

క్రొత్త వ్యక్తి: ఎవరికిరా ఫోను.... నీ బాబుకా.... (పీక పట్టుకుంటాడు.)

సిమ్మాద్రి: చచ్చాను బాబోయ్... రచ్చించండి బాబో.... (వెర్రికేకలు పెడుతుంటాడు.)

హెడ్‌క్లర్కు: ఏ.... ఏయ్.... వదులు.... నీకే చెప్పేది.... (అయాసపడుతుంటాడు వదిలించడానికి)

(సూపర్నెంటు ప్రవేశం)

సూపర్నెంటు: (విసుగ్గా) ఏమిటోయ్ గొడవా....? ఏంటీ దెబ్బలాటా? ఇతనెవరు.... (తనలో) పారిపోయొచ్చిన ఖైదీ లాగున్నాడే...

క్రొత్త వ్యక్తి: విజయలక్ష్మి కోసం వచ్చాను.

సూపర్నెంటు: ఏ విజయలక్ష్మి?

క్రొత్త వ్యక్తి: ఏ. విజయలక్ష్మి.

సూపర్నెంటు: (అనుమానంగా చూస్తూ) ఏంటండీ సీతాపతిగారూ. ఏమిటితని వ్యవహారం.

హెడ్‌క్లర్కు: (గుసగుసగా) వాలకం.... వాటం.... సరిగ్గా సరిపోతుంది చూశారా....

సూపర్నెంటు: (విసుగ్గా) దేనికి సరిపోయేది?

హెడ్‌క్లర్కు: అదేనండీ పేపరు వార్త....

సూపర్నెంటు: (విసుగు, కోపం) నా పిండాకూడు, పిచ్చెక్కించక సరిగ్గా చెప్పండీ....

గుర్నాధం: అదేనండీ, మీరన్నమాటే (గుసగుసగా) పిచ్చాసుపత్రి నుంచొ హడు... పారిపోయొచ్చాడూ.... అవుటాని.... వివరాలతో.... పేపర్లో....

సూపర్నెంటు: వోహోహో... అర్థం అయింది... అర్థం అయింది... ఇంకా తమాషా చూస్తూ కూర్చున్నారా. బయటికి గెంటక.... సిమ్మాద్రీ!.... సిమ్మాద్రీ....

సిమ్మాద్రి: అయ్... ఏటండీ.... ఈడ్నే వున్నానండయ్‌గారూ...

క్రొత్త వ్యక్తి: (పిచ్చి కోపంతో) ఏమిటీ! నన్ను... నన్ను.... నౌకరుతో గెంటిస్తావ్రా.... ఎంత ధైర్యం! ఒక డి. ఎస్. పి.ని గెంటడానికి మీకెన్ని గుండెల్రా! మిమ్మల్నీ.... (పిడికిళ్ళు బిగించి బల్లమీద గుద్దుతాడు)

హెడ్‌క్లర్కు: [illegible] డి. ఎస్. ఏ. వా! మా నాయనే... [illegible]

గుర్నాధం: [illegible] అంటాడు.... (అంతా [illegible])

క్రొత్త వ్యక్తి: [illegible]

సూపర్నెంటు: [illegible] ఫోను చెయ్యండి. [illegible] కనబడగానే మాకు తెలియజేయండి అని...

క్రొత్త వ్యక్తి: [illegible] తల్లో జెజెమ్మకి చేసుకోండి ఫోను....

(కారు చప్పుడు. ఆగినట్లు డోరు తీసి వేసినట్లు)

సిమ్మాద్రి: (హడావుడిగా) పెద్దయ్యగా రొచ్చారు.... నెబొతన్నా....

సూపర్నెంటు: అరుగో ఆఫీసరుగా రొచ్చారులే.... నీ లాకప్‌లూ, టీ కప్పుల పైత్యం వదిలిస్తారు.

(బూట్లు టకటక లాడించుకుంటూ వస్తాడు ఆఫీసరు)

ఆఫీసరు: ఏమిటిది? అందరూ ఇక్కడ జేరారేంటి? ఆఫీసనుకున్నారా, చేపల మార్కెట్టనుకున్నారా.... (కోపంగా) ఎవరితను?

క్రొత్త వ్యక్తి: (అసలే కోపంమీదున్నాడేమో ఆఫీసరు మాటలకి మరింత మండిపడుతూ) నేనెవరైతె నీకెందుకు, విజయలక్ష్మి వుందా అని అడుగుతున్నాను....

ఆఫీసరు: (తీవ్రంగా చూస్తూ) ఏ విజయలక్ష్మి?

క్రొత్త వ్యక్తి: (అంతకన్నా తీవ్రంగా) ఏ. విజయలక్ష్మి!

హెడ్‌క్లర్కు: విన్నారుగా సార్. ఇదీ తంతు, ఇంకాసేపుంటె వీడి పిచ్చి మాకెక్కేలాగుంది.

క్రొత్త వ్యక్తి: రాస్కెల్ మళ్ళీ అదేకూత.... నిన్నూ.... నిన్నూ....

ఆఫీసరు: వదలండి... వదలండి... అ.... (అనునయంగా) మీరలా కుర్చీలో కూర్చోండి. మీ సమస్యేమిటో నేను పరిష్కరిస్తాగా....

క్రొత్త వ్యక్తి : నా సంగతి నువ్వు చూసేదేంటి మీ అందరి జాతకాలూ చూసి గాని పోనిక్కడనించి.... (హుంకరిస్తాడు)

ఆఫీసరు : గుర్నాధం ఓసారి నా రూమ్‌లో కిరా

(రూమ్ తలుపు తీసి మూసిన చప్పుడు)

ఆఫీసర్ : మీకేమైనా బుద్ధుందీ!

గుర్నాధం : ఎస్ సర్.

ఆఫీసరు : నా మొహం అతనెవరూ? గొడవేంటి ఇంతకీ...?

గుర్నాధం : ఈవేళ పేపరు చూశారా సర్

ఆఫీసరు : చూశాను

గుర్నాధం : అదే ఇది

ఆఫీసరు : ఏమిటోయ్ నీ మాటలు తలా తోకా లేకుండా. పేపరుకీ ఈ గొడవకీ సంబంధం ఏమిటీ?

గుర్నాధం : మొదటి పేజీలో ఫొటో వేసి పిచ్చాసుపత్రినించీ పేషెంటొహడు తప్పించుకుపోయాడు. చూసినవాళ్ళు మాకుగాని, పోలీసులకుగాని ఫోను చెయ్యండీ... అని

ఆఫీసరు : వోహ్... అతనా! అతన్నెలా రానిచ్చారయ్యా లోపలికి?

గుర్నాధం : తనే వచ్చాడండి గొప్ప పని వున్నట్లు. అదేమంటే అందర్నీ కరవొస్తున్నాడు, చావకొడతాను చెవులు మూస్తాను అంటూ...


ఆఫీసరు : సరె నేను పోలీసులకి ఫోన్ చేస్తాను. ఈలోగా అతనెక్కడకీ పోకుండా కాపలా కాయండి మంచి మాటలతో.

గుర్నాధం : ఎస్‌సర్.

(తలుపు తీసి వేసిన చప్పుడు. హాల్లో గొడవ పడుతున్న చప్పుడు)

గుర్నాధం : అయ్యయ్యో ఇంకా నిలబడే వున్నారా! కుర్చీలో కూర్చోండి సార్. వొరే సిమ్మాద్రీ, అయ్యగారికో స్ట్రాంగ్ కాఫీ పట్రా. ఫో ముందు... కాఫీ చాలా టిఫిను కూడా తెమ్మంటారా సార్

క్రొత్త వ్యక్తి : కాఫీ వద్దూ నీ శ్రాద్ధం వొద్దూ... మీ అందర్నీ లాకప్‌లోకి తోయించి తాట



వొలిపించి గాని మంచినీళ్ళు ముట్టుకోను... అఁ (ఆవేశపడతాడు)

(సిమ్మాద్రి కాఫీ గ్లాస్‌తో వస్తాడు)

సిమ్మాద్రి : ఇదిగో నయగారూ టాంగు టియ్య

క్రొత్త వ్యక్తి : నీ నెత్తిన పోసుకో

వేన్ ఆగిన చప్పుడు, బూట్లు టకటకలాడించుకుంటూ పోలీసులొస్తారు.

1 పోలీసు : (కోపంగా వగరుస్తూ) ఏడీ ఆ ఫుండాకో రెదవ

హెడ్ క్లర్కు : ఇదుగో ఇక్కడ కూర్చున్నాడు పళ్ళు కొరుక్కుంటూ (ఎగతాళిగా అంటాడు)

2 పోలీసు : ఏరా బచ్చా, మా ప్రాణాలు తీస్తున్నావుగదరా... రాత్రినించీ నీ కోసం వెదకని ఇల్లూ... గాలించని గల్లీ లేవు.

1 పోలీసు : మళ్ళీ మళ్ళీ పారిపోకుండా ఈసారి రెండు కాళ్ళూ విరగ్గొడితేగాని...

క్రొత్త వ్యక్తి : (ఆవేశంగా) ఏం కూస్తున్నారా పంది వెధవల్లారా, కళ్ళకి మన కొచ్చిందా... ఎవరనుకుంటున్నార్రా నన్ను... మీ వుద్యోగాలూడబీకి... మిమ్మల్ని....

2 పోలీసు : ఎంత బలమో దొంగ నా కొడుక్కి... అలిసిపోకుండా వున్నాడే! పదరా బామ్మర్దీ పిచ్చాసుపత్రిలో కుస్తీ పోటీ లున్నాయి. అక్కడ చూపిద్దువు నీ తడాఖా.

పోలీసు : ఆడితో సరసాలేంట్రా లాఠీతో రెండు వడ్డించి కంకణాలు తగిలించు. దార్లోకొస్తాడు.... (లాఠీతో కొట్టిన చప్పుడు)

క్రొత్త వ్యక్తి : (అమ్మో అబ్బా అని నెప్పులుపడుతూ వాళ్ళతో పెనుగులాడుతుంటాడు) (వేన్ వెళ్ళిన చప్పుడు)

సూపర్నెంటు : హమ్మయ్య వదిలాడు... ఎలాగైతేనేం....

హెడ్‌క్లర్కు : డి. ఎస్. పి. నని కలక్టర్‌నని... ఏం కధాకళి చేశాడులే.... (పడీ పడీ నవ్వుతుంటారంతా... విజయలక్ష్మి ప్రవేశం)

విజయలక్ష్మి: ఏమిటో తెగ నవ్వేసుకుంటున్నారంతా... ఏం జరిగిందేమిటి... నాక్కూడా చెపితే నేనూ నవ్వుతా...

హెడ్‌క్లర్కు : విజయలక్ష్మిగారూ జేడ్‌లక్... రెండు నిమిషాలు ముందు వచ్చి వుంటే మీకూ దొరికేది డి. ఎస్. పి. గారితో ఇంటర్వ్యూ... (మళ్ళీ అంతా నవ్వుతారు)

విజయలక్ష్మి : డి. ఎస్. పి.నా, అయితే వచ్చాడన్నమాట.....

గుర్నాధం : మమ్మల్నందర్నీ లాకప్పులో పెట్టి కాళ్ళు విరిచేస్తాన్.... మెడలు నరికేస్తాన్ అంటూ ఏం పోజులు... (మళ్ళీ అంతా నవ్వులు)

విజయలక్ష్మి : ఆయన తరహా అంతేలెండి.... ఏడీ నేనొచ్చేవరకూ ఎక్కడకి వెళ్ళొద్దన్నాగా!?

సూపర్నెంటు : (అనుమానంగా) ఎవరి మాటా మీరనేది!

విజయలక్ష్మి : మా మామయ్య గురించి.....

హెడ్‌క్లర్కు : (ఆశ్చర్యంగా) మీ మామయ్య!!

విజయలక్ష్మి : అఁ, ఇల్లు వెదుక్కోలేదని ఆఫీసు అడ్రసిచ్చాను. అసలే ఉగ్రనరసింహావతారం, రాత్రంతా ట్రైన్ ప్రయాణం, ఎంత చిరాగ్గా వున్నాడో ఏమో....

సూపర్నెంటు : (అనుమానంగా) అయితే ఇప్పుడు పోలీసులు పట్టుకెళ్ళింది మీ మామయ్యనే నంటారా!

విజయలక్ష్మి : (నవ్వి) డి. ఎస్. పి. నేంటి పోలీసులు పట్టుకు పోవడ మేంటి, సిల్లీ టాక్... ఆయన ముందు నిలబడి మాట్లాడగల ధైర్యం వుందా అని వాళ్ళకి...



గుర్నాధం : (నీరసంగా భయంగా) అయితే ఆయన నిజంగా మీ మామయ్యగారేనంటారా!?

విజయలక్ష్మి : ఎలా వున్నారో చెప్పండి పోనీ. అవునో కాదో చెపుతాను....

హెడ్‌క్లర్కు : గుబురు మీసాలు... ఎర్రటి కళ్ళు....

సూపర్నెంటు : రాక్షస పొదలాంటి తల.... ఉబ్బు కామెర్ల మనిషిలా ఉబ్బినట్టున్న మొహం...

సిమ్మాద్రి : తలకోనలో పులికూనలా పలకరించి నోళ్ళందర్నీ కరవొచ్చినాడండి అమ్మగారూ... హి హి.... ఎయ్యగారు మాట్లాడతా వుంటే హనజల్లు వచ్చేత్తేనండి... నేను దగ్గరే వున్నాను గాదండి.... నా సొక్కాయంతా తడిసి పోనాదండి.... హి హి హి.....

విజయలక్ష్మి : (నవ్వుతూ) ఇహ చాల్లెండి వర్ణన.... ఆయన మా మామయ్యే... నా పేరన్నా చెప్పలేదా నాకోసం వచ్చినట్టు.

హెడ్ క్లర్క్ : ఎవరడిగినా ఏ విజయలక్ష్మి అంటూ మమ్మల్నే....

విజయలక్ష్మి : (మధ్యలోనే అందుకొని) మరింకేం, నేనేగా ఈ ఆఫీసులో ఏ. విజయలక్ష్మిని. మా ఇంటిపేరు ఎ. నాపేరు....

గుర్నాధం : (వణుక్కుంటూ) అయితే ఆయన మీ మామయ్య అన్న మాట నిజమేనంటారు.......

సూపర్నెంటు : (భయంగా) డి. ఎస్. పి. అన్నది కూడా నిజమేనంటారు.

విజయలక్ష్మి : (సరదాగా) మీ కెందుకొచ్చిందా అనుమానం.......

హెడ్ క్లర్క్ : (ఏడుపుగొంతు) రామచంద్రప్రభో అయిపోయింది.... నా పని అయిపోయింది... ఇప్పుడేది దారి.....

సూపర్నెంటు : (ఏడుపుగొంతు) ఈ పాటికి అసలు సంగతి తెలిసే వుంటుంది.... శ్రీ కృష్ణజన్మస్థానం తప్పదు.... ఇంత బ్రతుకూ బ్రతికి... ఇప్పుడు.....

గుర్నాధం : (వణుకుతూ) లాకప్పులో లాఠీ దెబ్బలో....

సిమ్మాద్రి : (హడలిపోతూ) అయ్ బాబోయ్, అలాగయితే నన్నూ లాక్కుపోతారే బండయ్యగారో...

విజయలక్ష్మి : ఏం జరిగిందండి.... అంత

(77వ పేజీ చూడండి!)

సీరియల్

వజ్రసంకల్పం

శాతవాహన

(గత సంచిక తరువాయి)

బయటి నుంచి ప్రశాంతంగా కనిపిస్తున్న అడవి కడుపులో కార్చిచ్చు ప్రజ్వరిల్లుతోంది. జ్వాలా రూపంలో కట్టెల్ని కాల్చే కార్చిచ్చు కాదది. కలిసి మెలిసి ఆడుతూ పాడుతూ సహజీవనం సాగించాల్సిన ఆటవికుల గుండెల్లో ఒకరి పట్ల ఒకరికి రగుల్తున్న ద్వేషాగ్ని. ఆ ద్వేషాగ్నిలో పడి శలభంలా దగ్ధం కానున్నది.... రెండు అమాయక హృదయాలలో రెక్కలు విప్పి ఎగురుతున్న మధుర ప్రేమ.

చిన్నోడినీ చిన్నమ్మనీ ఒకే గుంజకు కట్టేశారు.

ఇద్దరి శరీరాల మీదా దుస్తులు లేవు. కానీ, వాళ్ళ శరీరాలలోని ఏ అవయవమూ కనిపించడం లేదు. ఇద్దరికీ ఒంటి నిండా దట్టంగా పసుపు పులిమేశారు. ఆపైన కుంకుమ ఎత్తిపోశారు.

పచ్చని పసుపు పైన ఎర్రని కుంకుమ. తల నిండా కుంకుమ. ముఖం నిండా కుంకుమ. భుజాల మీదా రొమ్ముల మీదా కుంకుమ.

ఎరుపు.

ఎరుపు.

ఎర్రని ఎరుపు.

గుండెల్లో ఎరుపు.

కళ్ళల్లో ఎరుపు.

మరి కాసేపట్లో వాళ్ళిద్దర్నీ అమ్మ వారికి బలి యివ్వబోతున్నారు.

ఒకర్ని పోలేరమ్మకూ- మరొకర్ని మాంకాళమ్మకూ.

ఇద్దరు దేవతలూ ఒకరే!

శక్తిస్వరూపిణులు!

అది తెలుసుకోలేని తుచ్ఛ మానవుడు మతం పేరుతో గొంతులు నులుముకోవడానికి సిద్ధపడుతున్నాడు.

> **రాకాసి స్వార్థం రాజ్యానికొస్తుంటే**
> **న్యాయ దేవతకు కొరత విధిస్తుంటే,**
> **ధర్మం పూరిస్తుంది సమర శంఖం!**
> **అవతరిస్తుంది వజ్రసంకల్పం!!**

నిన్న మొన్నటిదాకా ఆ రెండు గూడేలూ ఒకటి.

నిన్న మొన్నటిదాకా ఆ రెండు గూడేల ప్రజలూ ఒకరు.

నిన్న మొన్నటి దాకా వాళ్ళ మనసులన్నీ ఒకటి.

నిన్న మొన్నటి దాకా వాళ్ళ ఆచార వ్యవహారాలు ఒకటి.

మధ్యలో ప్రవేశించింది మలిన రాజకీయం.

మత గురువుల రూపంలో మతం పేరుతో ఆ రెండు గూడేల్నీ వేరు చేసింది.

నిన్న మొన్నటి దాకా వాళ్ళ మధ్య ఇచ్చి పుచ్చుకోవడాలుండేవి.

ఇప్పుడు కత్తి నూరుకోవడాలున్నాయి.

ఒక అజ్ఞాత వ్యక్తి తెర వెనుక వుండి ఈ రాజకీయం నడిపిస్తున్నాడు.

అది తెలుసుకోలేని అమాయక ప్రజలు కొట్టుకు చస్తున్నారు.

ఆ అజ్ఞాత వ్యక్తి పేరు-

వజ్రపాణి!

* * * *

"సిన్నీ! సావంటే నీకు బయ్యంగా వుందంటే?" అడుగుతున్నాడు చిన్నోడు.

చిన్ని ఏడుస్తూ నవ్వింది.

"లేదు మావా! నీతోటి సావైతే నాకు బయ్యం



వజ్రసంకల్పం

నేదు!"

"సంపే ముందుగాల్నైనా మనిద్దర్నీ వొకే సోటిట్టినారు!"

"అవును మావా! ఇంక మనం దొంగసాటుగా కలిసేపన్నేదు! ఇంకెవ్వరికీ బయ్యపడాల్సిన పన్నేదు!"

"సత్తెం జెప్పినవే!"

"మావా!"

"ఊ?"

"మన్ని సంపేసినాక యేటైతదిరా?"

"యేటైతదే! ఈ అడవి గిట్నే వుంటది! ఆ పోలేరమ్మ గిట్నే వుంటది! ఆ మాంకాళమ్మ గిట్నే వుంటది! మీ దొరా మా దొరా గిట్నే వుంటరు! ఆ పూజారయ్యలూ గిట్నే వుంటరు! అందురూ గిట్నే వుంటరు! అళ్ళెట్టుండరో సూసేందుకు నువ్వూ నేనే యీడుండం!".

"యాడుంటం మావా?"

"నాకెరిక నేదు! పోలేరమ్మకాడికే పోతమో మాంకాళమ్మ కాడికే పోతమో ! యాడికి బోయినా ఆ యమ్మనడుగతా! ఏంటి తల్లీ గిట్ల సేసినవ్వా అనడుగతా!"

"నేనేడుంటను మావా?"

"నువ్వేడుంటవే! నాకాడ్నే వుంటవు! నాతోటే వుంటవు!"

"సాలు మావా! ఆ మాట సెప్పినవు- సాలు!"

ఇంతలో గూడెం ప్రజల నృత్యం ప్రారంభమైంది.

రెండు గూడేల ప్రజలూ రెండు జట్లుగా యేర్పడి చప్పట్లు చరుస్తూ ఆ ప్రేమికుల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ నృత్యం చేస్తున్నారు.

ఆటవిక నృత్యం!

గుండెలు జలదరింపజేసే కరాళ నృత్యం!

నృత్యం చేస్తూ వాళ్ళ మీద కుంకుమ చల్లుతున్నారు.

దేవతలకు నరబలి యిచ్చే అవకాశాలు వాళ్ళకు ఎక్కువసార్లు రావు. వచ్చినప్పుడు పండగ.

ఆ పండగ పూట మైమరచి చేసే నృత్యమది.

ఒళ్ళెరగకుండా కల్లు తాగి చేసే నృత్యం.

ఒకప్పుడైతే ఆ రెండు గూడేలవాళ్ళూ ఒకే జట్టు ఆ నృత్యం చేసేవారు.

ఇప్పుడు రెండు జట్లుగా విడిపోయి చేస్తు

బలిచ్చే కార్యక్రమం ముగిశాక మరొక జరుగుతుంది.

మరింత కల్లు తాగుతారు.

మరింత మాంసం తింటారు.

అందరూ ప్రస్తుతం ఒకే చోట చేరి సంబరం జరుపుకోవడానికి కారణం వుంది.

మాంకాళమ్మ, పోలేరమ్మ ఒకే చోట ప్రతిష్ఠించబడ్డారు.

పూర్వం రెండు గూడేలవాళ్ళూ సహ జీవనం చేసే రోజుల్లో కలిసే పూజలు జరుపుకునేవారు. కలిసే సంబరాలు చేసుకునేవారు.

ఇప్పుడలా కాదు.

రెండు గూడేలవాళ్ళకీ వేర్వేరు పూజా సమయాలున్నాయి.

ఒక గూడెం వాళ్ళు పూజ చేసుకునే సమయంలో రెండో గూడెం వాళ్ళు ఆ దరిదాపుల కూడా వుండడానికి వీల్లేదు. రెండు గూడేల మధ్యా శతృత్వం రాజుకున్నాక పూజ విషయంలో వాళ్ళు పరస్పరం కుదుర్చుకున్న ఒప్పందమది.

చాలా రోజుల తర్వాత యిప్పుడు చిన్నోడూ చిన్నమ్మల మూలంగా ఒకే సమయంలో పూజలూ సంబరాలూ చేసుకుంటున్నారు.

బలిచ్చే కార్యక్రమం ముగిశాక, సంబరాలు పూర్తయ్యాక మొదలు కానుంది వాళ్ళ మధ్య యుద్ధం.

అనేక సంవత్సరాలుగా ఒకరి పట్ల ఒకరు శత్రుత్వంతో మరిగిపోతున్న ఆ రెండు గూడేల ప్రజల ద్వేషాగ్ని పరాకాష్ఠకు చేరుకోనుంది.

హఠాత్తుగా వాళ్ళ కరాళ నృత్యం ఆగిపోయింది.

ఆ భయంకర నృత్యం చూడకుండా అప్పటివరకూ కళ్ళు మూసుకుని వుండిపోయిన ఆ యిద్దరూ కళ్ళు తెరిచారు.

"సిన్నీ! అయిపోయింది! మన్ని బలిచ్చేత్తున్నారు!"

"ఇయ్యనీ మావా! ఎట్టైనా మనం ఒకటైతం!"

వాళ్ళు ఆ ఇద్దరి కట్లూ విప్పేశారు.

చిన్నోడి గూడెం వాళ్ళు చిన్నోడ్నీ, చిన్నమ్మగూడెం వాళ్ళు చిన్నమ్మనీ తలా ఒక వైపు లాక్కుపోసాగారు.

"మావా!"

చిన్నోడి వైపు ఆర్తిగా చూసింది చిన్నమ్మ.

చిన్నోడు తల తిప్పి ఆమె వైపు చూశాడు.

ఇద్దరి కళ్ళ నుంచి కన్నీరు జలజలా రాలిపోసాగింది.

కేరింతలు పెడుతూ వాళ్ళిద్దర్నీ దేవతల ఎదుటికి గోలగోలగా తీసుకు వెళ్లారు వాళ్ళు.

కాగడాల వెలుగులో పోలేరమ్మా మాంకాళమ్మల నేత్రాలు మెరుస్తున్నట్టుగా వున్నాయి.

పూజార్లు బిగ్గరగా మంత్రాలు చదవడం ప్రారంభించారు.

చిత్రమైన భాష!

ఆ భాషేమిటో రెండు గూడేల ప్రజలకూ తెలీదు. ఆ

ఇంత వరకూ సాగిన కథ-12: విశ్వధర వర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో బావి త్రవ్వుతుండగా అపురూపమైన వజ్రం దొరుకుతుంది. అతని దాయాది అయిన వజ్రపాణి-విశ్వధర వర్మ కొడుకు రాజేంద్ర వర్మను, అతని కుటుంబాన్ని దారుణంగా చంపి ఆ వజ్రాన్ని కాజేస్తాడు. విశ్వధర వర్మ చిన్న కొడుకు నరేంద్ర వర్మపై ఉరిశిక్ష మోపబడుతుంది. నరేంద్ర వర్మ భార్య కౌసల్య మగ బిడ్డను ప్రసవిస్తుంది. మనవడు పుట్టిన ఆనందంలో విశ్వధర వర్మ ధైర్యం పుంజుకొని వజ్రపాణి అంతంచూస్తానని బెదిరిస్తాడు. ఒక గూడెంలోని చిన్నోడు-మరో గూడెంలోని చిన్నమ్మ ప్రేమించుకుంటారు. వారిని పులి చంపబోగా వజ్ర కాయుడొకడు దాని అంతం చూస్తాడు. వేదల నోళ్లు కొట్టి డబ్బు సంపాదిస్తున్న పెద్ద మనుషులను పేకాటలో పట్టి గొట్టించి వారి దగ్గర్నుంచి డబ్బు రాబడుతుంటుంది పింకీ. ఈ పింకీని యిద్దరు రహస్యంగా గమనిస్తుంటారు.

వజ్రంలో ఎరుపు

మిరుమిట్లు గొల్పే కాంతులను వెదజల్లటం వల్లనే కావచ్చు. వజ్రాలలో ప్రత్యేకమయిన ఆకర్షకశక్తి ఉంది. అతి ప్రాచీన కాలం నుండి అవి అందరినీ సమ్మోహితులను చేస్తున్నాయి. భారతదేశంలో నవరత్నాలు పొదగబడిన ఆభరణం అతి విలువయినదిగా పిలువబడుతుంది. నవగ్రహాల శక్తి వీటికున్నట్లు వారు అభిప్రాయపడతారు. పూర్వం వజ్రాలను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలవారికి వజ్రాలను వేర్వేరుగా విభజించి వాటికి ప్రత్యేక శక్తులను ఆపాదించారు. బ్రాహ్మణ వజ్రాలకు విజ్ఞానం, అదృష్టం, మిత్రులు, సంపద ఉన్నట్లు, క్షత్రియ వజ్రాలకు ముసలితనం

వజ్రాల పుట్టుక గురించి ఆసక్తికరమైన గాథ

ధానీయని శక్తి, వైశ్యవజ్రాలకు విజయం, శూద్ర వజ్రాలకు అన్ని రకాల అదృష్టాన్ని కలుగజేస్తాయని వీరు నమ్మేవాళ్లు.

వజ్రంలో ఎక్కడయినా రక్తం రంగుకనబడితే ఆ వజ్రం ధరించిన వారికి ఆఖరికి యముడికైనాసరే, మరణం సంభవిస్తుందని నమ్మకం ఉంది. దైవానికి వజ్రాలు సమర్పించడం వల్ల భగవంతుడు ప్రసన్నుడవుతాడని, కోరిన వరాలు ప్రసాదిస్తాడని నమ్మేవాళ్లు.

అసలీ వజ్రాలు ఎలా పుట్టాయన్నదానిపై ఒక ఆసక్తికరమైన కథ పురాణాల్లో ఉంది. 'వల' అనే పేరుగల రాక్షసుడు దేవతలను బాధిస్తుంటే దేవతులు ఆ అసురుణ్ణి తమకు పవిత్రమైన జంతువు రూపంగా మారమని ప్రార్థించగా ఆ రాక్షసుడు

వజ్రసంకల్పం నేపథ్యంలో...

రంగు కనిపిస్తే యముడికైనా చావు తప్పదు...!?!

జంతురూపాన్ని ధరించాడట. ఆ జంతువును దేవతలు సులభంగా చంపివేయగలిగారట. ఆ రాక్షసుడి రక్తం పడిన సముద్రాలలో, నదులలో, అరణ్యాలలో రతనాలు, మణులు, కెంపులు పుట్టుకొచ్చాయనే కథ ప్రచారంలో ఉంది.

ఈ ఆభరణాలపై ముస్లింల ప్రభావం కూడా ఎక్కువగా ఉందనే చెప్పవచ్చు. మానవ రూపాలను ఆభరణాలపై చెక్కకూడదనే సిద్ధాంతం


దంతో నవరత్నాలు ముస్లిం ఆభరణాలలో చోటు సంపాదించుకున్నాయి. లాకెట్లు, కడియాలు, హుక్కాలు, కత్తులు, ఖడ్గాలపై వజ్రాలను తాపడం చేయడం మొదలుపెట్టారు.

ఆభరణాలపై ఎనామిల్ వాడుకలో నున్నట్లు 'తక్షశిల' కాలంలో ఆధారాలు కనిపించినా మొగలు సామ్రాజ్యంలో ఈ కళపై శ్రద్ధ పెరిగింది.

బ్రిటిషువారి రాకతో ఆభరణాలలో కూడా

వడం దీనికి ప్రధాన కారణం కావచ్చు. దక్షిణ భారతంలో షెడ్యూల్డ్ తెగలవారు సాధారణంగా వెండి నగలను ఎక్కువగా ధరించడం కనిపిస్తుంది. పశ్చిమ భారతంలో, ముఖ్యంగా మహారాష్ట్రలో వెండి ఆభరణాలకు అధిక ఆదరణ కలదు.

భారతదేశంలో మంచి రంగున్న స్త్రీలగా రాజస్థానీ స్త్రీలకు పేరు. వారు ఎంత పేదవారయినా వెండి, దంతంతో తయారుచేసిన ఆభ



ముస్లింలలో ఉండటం వల్ల, పూలు, లతలు, జంతువుల రూపాలు ఆభరణాలపైకి వచ్చాయి. చేప ఆకారంలో నున్న ఆభరణాలు, ముస్లింల పవిత్ర చిహ్నమైన నెలవంక, నక్షత్రం ఆభరణాలపైకి వచ్చాయి. హిందూరాజులు చిహ్నమైన పద్మం క్రమంగా కనుమరుగయి, కొందరు ఛాందస వాదుల ఇండ్లలోనే పద్మాకృతిలో ఆభరణాలు ఉండటం మొదలయింది.

ముస్లింరాజులు హిందూస్త్రీలను పెండ్లాడ

చాలా మార్పులు వచ్చాయి. ఫ్యాషన్లలో మార్పులు వచ్చాయి. సంపదలోతులతూగే స్త్రీలు మామూలుగా బంగారు నెక్లెసులు మాత్రమే ధరించే ఆచారం ఇదివరకుండేదికాదు. కానీ బ్రిటిషు వారి రాకతో 'సింపుల్'గా ఉంటూ అందంగా ఉండే వాటిని కూడా స్త్రీలు ధరించడం మొదలుపెట్టారు.

గ్రామీణ ప్రాంతాలలో వెండి ఆభరణాలకు ఎక్కువ ఆదరణ ఉంది. విలువ తక్కువకా

రణాలు, అత్యంత సుందరమయిన ఆభరణాలు ధరిస్తుంటారు. రాజస్థాన్ కళాకారులకు ఈ కళలో మంచిప్రావీణ్యం ఉంది.

ప్రస్తుతం భారతదేశంలో పూర్వం ఎక్కువగా ఆదరింపబడిన వడ్డాణం, ముక్కుపుడక, చెవిరింగులకు నెమ్మది, నెమ్మదిగా ఆదరణ తగ్గుతోంది. క్రొత్త కొత్త డిజైన్లతో ఆభరణాలు తయారుచేసే ప్రయత్నంలో ఉత్పత్తిదారులు ఆసక్తి చూపుతున్నారు. ●

ప్రజల్ని లొంగదీసుకోవడానికి ఆ పూజార్లు ఉపయోగించిన ఆయుధమది- వాళ్ళకు తెలియని భాష!

చిన్నోడినీ చిన్నమ్మనీ బలిపీఠం దగ్గరికి తెచ్చారు

ఇద్దరి తలలూ ఒకేసారి బలవంతంగా వంచబడ్డాయి.

తలార్ల చేతుల్లోని మచ్చు కత్తులు ఆకాశం వైపు లేచాయి.

"జై మాంకాళమ్మా!"

"జై పోలేరమ్మా!"

రెండు గూడేల ప్రజల కంఠస్వరాలు జయజయధ్వానాలు చేయడం ప్రారంభించాయి.

ఒక్క క్షణం!

అంతే!

ఆ ఒక్క క్షణం దాటితే తలార్ల మచ్చు కత్తులు ఆ ప్రేమికుల తలలు ఒకేసారి ఖండిస్తాయి.

కానీ, అలా జరగలేదు!

ఏమైందో తెలీదు!

ఎలా జరిగిపోయిందో తెలీదు!

హఠాత్తుగా భయంకరమైన సింహనాదం వినిపించింది.

అక్కడ చేరిన ప్రజలందరూ వులిక్కిపడి ఆ సింహనాదం వినిపించిన వైపు చూసే లోపల జరిగిపోయిందా సంఘటన.

చెట్ల గుబుర్లలోంచి ఒక్కసారిగా పిడుగులా వాళ్ళ మధ్యకు దూకిందొక కొండచరియ లాంటి ఆకారం. నేల అదిరినట్లైంది.

కాగడాల వెలుగులో పచ్చగా బంగారంలా మిలమిలా మెరిసిపోతోందా వ్యక్తి శరీరం!

ఆ వజ్రకాయుడి ముఖం కఠినంగా వుంది.

అతని కళ్ళు తీక్షణంగా వున్నాయి.

అనుకోకుండా హఠాత్తుగా తమ మధ్య దూకిన ఆ వజ్రకాయుణ్ని చూస్తూనే రెండు గూడేల ప్రజల్లోనూ హాహాకారాలు చెలరేగాయి.

"పులిరాజు!"

"పులిరాజు!"

"పులిరాజు!"

అందరి నోళ్ళలోనూ ఒకే మాట!

అందరి కళ్ళలోనూ ఒకే ఆశ్చర్యం!

వాళ్ళలా స్థాణువుల్లై చూస్తుండగానే ఆ వజ్రకాయుడి రెండు చేతులూ ఉక్కు ముక్కల్లా ఆకాశం వైపు లేచాయి.

వజ్రసంకల్పం

పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

వెంటనే ఆ కండలు తిరిగిన చేతుల్లోని నరాలు బుసబుసా పొంగాయి.

ఠీవిగా తల పైకెత్తి మరోసారి సింహనాదం చేశాడతను.

గుండెలు జలదరింపజేసే సింహనాదం!

అంతే!

ఆ మరుక్షణం రెండు గూడేల ప్రజలూ ఒక్కసారిగా అతని ముందు మోకరిల్లారు.

"పులిరాజా! కాపాడు!"

"పులిరాజా! కాపాడు.... కాపాడు..!"

భయభక్తులతో అందరూ ఒక్కుమ్మడిగా అరిచారు.

ఆ తర్వాత అందరి తలలూ అతని ముందు వాలిపోయాయి.

మళ్ళీ తలలు పైకెత్తి చూసే వేళకు ఆ వజ్రకాయుడు కనిపించలేదు. వాళ్ళందరూ ఒకే మారు నిట్టూర్చారు.

ఇది రెండవసారి!

మెరుపులా ప్రత్యక్షమై మెరుపులా అదృశ్యమై పోయాడు.

రణగొణ ధ్వనులతో ఆ ప్రదేశం నిండిపోయింది.

అందరి చూపులూ ఒకేసారి వధ్య శిలవైపు తిరిగాయి.

చూస్తూనే వాళ్ళు అదిరిపడ్డారు

వధ్యశిల ఖాళీగా వుంది!

అకస్మాత్తుగా ప్రత్యక్షమైన ఆ వజ్రకాయుడు తనతోపాటే చిన్నోడూ చిన్నమ్మని కూడా మాయం చేసుకుపోయాడు!

పులిరాజెందుకిలా చేశాడు?!

అనుకోకుండా దేవతలకు అపచారం జరిగిపోయింది.

రెండు గూడేల ప్రజలూ వణకడం ప్రారంభించారు.

* * * *

చిన్నోడు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

కళ్ళు తెరవగానే చివాల్న లేచి కూర్చున్నాడు.

అయోమయంగా ఒకసారి చుట్టూ పరికించి చూశాడు.

తనెక్కడున్నాడో అతనికి మాత్రం అర్థం కాలేదు.

అసలు బతికేవున్నాడా?

లేక, ఇది మరేదో లోకమా!

తనున్న ప్రదేశం అడవి మాత్రం కాదు.

ఏదో చీకటి గుయ్యారం.

తనకు కొంత దూరంలో గుడ్డి దీపం ఒకటి వెలుగుతోంది. దాని వెలుగులో తనున్న ప్రదేశం యేమిటో అతనికి లీలామాత్రంగా అవగాహన కలుగుతోంది.

ఏదో గుహ- కొండ గుహ!

అతనికి చప్పున చిన్నమ్మ గుర్తొచ్చింది.

ఆత్రంగా అటూ యిటూ చూశాడు

అప్పుడు గమనించాడు- చిన్నమ్మ తన పక్కనే కొద్ది దూరంలో పడుకొని వుంది. ఆమె కళ్ళు మూసుకొని వున్నాయి. పసుపు రాసి కుంకుమ పోసిన ఆమె నగ్నదేహం మీద ఎవరో పొడవాటి దుప్పటి కప్పారు.

ఆమెను చూస్తూనే అతనికొచ్చిన అనుమానం- ఇంతకీ చిన్నమ్మ బతికేవుందా?

తడబడుతూ ఆమె ముక్కు దగ్గర వేలెట్టి చూశాడు.

ఊపిరి ఆడుతోంది

చిన్నమ్మ నిద్రపోతోందంతే!

తేలిగ్గా నిట్టూర్చాడు.

ఆలోచించడానికి సమయం దొరికింది.

ఏం జరిగిందో అతనికి నెమ్మదిగా జ్ఞాపకం రాసాగింది.

వధ్యశిల దగ్గర అకస్మాత్తుగా ఆ వజ్రకాయుడు ప్రత్యక్షం కావడం.... రెండు గూడేల ప్రజలూ భయభక్తులతో అతనికి మోకరిల్లడం.... అన్నీ వర్సగా గుర్తొచ్చాయి....

ఆ తర్వాత....

ఆ తర్వాతేం జరిగిందో తనకు స్పష్టంగా గుర్తు లేదు.

ఆ వజ్రకాయుణ్ని చూడగానే అప్పటిదాకా మృత్యుదేవత వడిలో లాలింపబడుతున్న తనకు హఠాత్తుగా ప్రాణాలు లేచి వచ్చినట్టుగా అనిపించింది. పులి బారి నుంచి తమను రక్షించినట్టుగానే గూడెం ప్రజల బారి నుంచి కూడా తమనలాగే రక్షించడానికొచ్చిన దేవతా స్వరూపుడిలా ఆ వజ్రకాయుడు కనిపించాడు తనకు అంతలో ఎక్కణ్నుంచి తీశాడో ఎలా తీశాడో తెలీదు- ఓ పొడవాటి చేతి గుడ్డ తీసి తన ముక్కు దగ్గరుంచాడు. తియ్యని వాసన వేసింది. తను ప్రతిఘటించ లేదు. కళ్ళప్పగించి చూశాడంతే! అంతలోనే తనకు స్పృహ తప్పింది. ఆ తర్వాత యిదే తను కళ్ళు తెరవడం.

స్పృహ కోల్పోయాక తననా వజ్రకాయుడీ ప్రదేశానికెత్తుకొచ్చి వుండాలి. తనలాగే చిన్నమ్మనూ ఎత్తుకొచ్చి వుండాలి. అదేమంత పెద్ద ఆశ్చర్యంకాదు. మానవ రక్తం రుచి మరిగిన పెద్ద పులిని అవలీలగా తోక పట్టుకుని గాలిలో గిర గిరా తిప్పగలిగిన మహావీరుడికి స్పృహ కోల్పోయిన యిద్దరు వ్యక్తుల్ని రెండు భుజాల మీదా వేసుకుని ఎత్తుకు పోవడం పెద్ద సమస్య కాదు.

ఇప్పుడు తనేం చెయ్యాలి?

ఇక్కణ్నుంచి బయటికి వెళ్ళడానికి మార్గం కనిపించడం లేదు.

కనిపించినా చిన్నమ్మకు స్పృహ వచ్చేదాకా చేయగలిగిందేం లేదు. వేచి ఉండక తప్పదు.

(ఇంకా ఉంది)



సన్నీ-అమృతాసింగ్

'బేతాబ్' చిత్రం విడుదలైన రోజుల్లో సన్నీడియోల్-అమృతా సింగ్ ల 'వ్యవహారం' గురించి కథలు-కథలుగా పరిశ్రమలో చెప్పుకున్నారు. ఇప్పుడు ఒకరంటే ఒకరికి ముఖంమొత్తిందేమో 'ఆ' వ్యవహారాలకు దూరంగా వుంటూ మంచి స్నేహితులుగా మసులుతున్నారట. ఇటీవల ఒక కార్యక్రమంలో ఒకళ్లనొకళ్ళు ఎదురుపడ్డారటగాని సన్నీమాత్రం హలో అని వదిలేశాడట. అమృతా మాత్రం తన ఒంపుసొంపులు ఒలకపోస్తూ లండన్ నుంచి నాకేం పట్టుకురాలేదేం అని అడిగిందట. పలకరించటమే తరువాయి ... సన్నీ గతం ఒక్కసారి గుర్తుతెచ్చుకొని మన్మథలీలలు సాగించాడట....!



చైనావారు 'చాప్‌స్టిక్స్' (వెదురు పుల్లలు) సహాయంతో భోజనం చేస్తారు. భోజన సమయంలో వారు మంచినీరు త్రాగరు!

చైనాలో ఆకుపచ్చ తేయాకు పుష్కలంగా లభిస్తుంది. ఈ తేయాకులో మరుగుతున్న నీరు పోస్తే అదే తేనీరు అవుతుంది. దీనిలో పాలు, పంచదార కలుపకుండా అలానే త్రాగుతారు. ఇంటికి వచ్చిన అతిథికి మనం ముందుగా మంచినీళ్ళు ఇచ్చినట్లు వీరికి తేనీరు ఇవ్వడం సాంప్రదాయం!

కుటుంబంలోని సభ్యులంతా ఒకేసారి కలసి కూర్చుని భోజనం చేస్తారు. బీదవారు కూడా టేబుల్‌మీద భోజనం చేస్తారు. వండిన పదార్థాలను పెద్ద పెద్ద పింగాణీ పాత్రలలో టేబుల్ మధ్యలో పెడతారు. ఒక్కొక్కరు చిన్న పాత్ర, అడుగు పొడవుండే రెండు 'చాప్‌స్టిక్స్' తీసుకుంటారు. ఎవరికి కావలసిన వంటకాలు వాళ్ళు స్వయంగా వడ్డించుకొని వెదురు పుల్లలతో తింటారు.

మధ్య తరగతివారు 'నాలుగైదు' రకాల ఆహార పదార్థాలను తింటే, ధనవంతులు 'ఇరవై' రకాల వరకూ తింటారు. కోడి మాంసం, పిట్ట మాంసం, పావురాయి మాంసం, బాతు మాంసం, పంది మాంసం, కప్పలు - తరచుగా తినే మాంసాహారాలు. ఇవన్నీ ముక్కలు కోయకుండా అదే పరిమాణంలో వండుతారు.

వంటలు చేయడంలో చైనా వారు సిద్ధహస్తులు. మాంసాహార పదార్థాలను పోలిన శాకాహార పదార్థాలనుతయారు చేయడంలో కూడా వారికి వారే సాటి!!

—కుమారి పట్నాల అపర్ణ

నా లైఫ్‌నే ఒక 'పర్టీ'గా



-ఆత్రేయ

"మిసి" - సినీ - గేయాలు, పాటలు, మాటలు ఏవి రాసినా 'ఆత్రేయ' బాణీ వేరు - "మనసున్న మనిషికీ సుఖము లేదంతే - మనసు గతి యింతే"నంటూ మనసునులేపే పాటలు ఎన్నో రాసిన సుప్రసిద్ధ సినిమా రచయిత శ్రీ 'ఆత్రేయ'తో యిక్కడ యింటర్వ్యూ యిస్తున్నాము -ప్రత్యేకంగా సచిత్ర వార పత్రిక పాఠకులకోసం వారు స్పష్టంగా అన్ని ప్రశ్నలకు సమాధానాలు యిస్తున్నారు. గమనించండి.

ఎడిటర్

"నవ్వినా యేడ్చినా కన్నీళ్లే వస్తాయి
ఏ కన్నీ వెనకాల యేముందోతెలుసునా?"

ఇదొక్కటే పది కావ్యాలపెట్టు. కాళి దాసువింటే కౌగిలించుకొనేవాడు.. "-1986 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన ఆత్రేయ నాటకోత్సవాల్లో ఆత్రేయ పాటల విశిష్టత గురించి ప్రసంగిస్తూ డా. సి.నా.రె. చెప్పిన మాటలివి!

సినిమాలమీద మనసున్న ఏ మనిషికైనా ఆత్రేయ పాటల్లోని పంక్తులు ఎన్నో కొన్ని నోటికి రాకుండా వుండవు. అంత తేలి కైన మాటలతో పాటలు రాయడం మాటలు కాదు.

నాటకరంగం

ఒక అడుగు నాటకరంగం మీద మరో అడుగు చలన చిత్రరంగం మీద పెట్టి - తన చమత్కారాలతో అప్తుల అంతరంగాల్లో నిలిచి పోయిన త్రివిక్రమమూర్తి ఆత్రేయ.


పోయిన నాటక రచనలు పోగా 'ఎన్జీవో' 'భయం'వంటి పది నాటకాలు 'ప్రగతి' 'ఎవరు దొంగ' వంటి 15 నాటికలు ఆస్తిగా మిగుల్చు కొని నాటక రచయితగా 'ట్రెండ్ సెట్టర్'గా పేరొందిన ఆత్రేయ సినిమాలకు రాకపూర్వం ఆంధ్ర నాటక కళా పరిషత్‌లో వరసగా మూడు సంవత్సరాలు బహుమతులందుకొని 'హ్యాట్రిక్' సాధించిన నటుడు, దర్శకుడు కూడా!

ఈ రచయిత 'ఆత్రేయ నాటకాలు - పూర్వాపరాలు' అనే సిద్ధాంత వ్యాసం రాసి ఎం. ఫిల్ డిగ్రీ తీసుకోగా ప్రస్తుతం శ్రీమతి ఆదుర్తి వెంకట నాగశోభ మద్రాసు విశ్వ విద్యాలయంలో డా. జి.వి. యస్.ఆర్. కృష్ణమూర్తిగారి పర్యవేక్షణలో 'ఆత్రేయ కణ్ణ దాసన్‌ల పాటలు - ఒక తులనాత్మక పరి శీలన' అనే అంశం మీద పి.హెచ్.డి.కోసం పరిశోధన చేస్తున్నారు. ఇటీవల సార్వత్రిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారు నాటక చలన చిత్ర రంగాలలో విశిష్టమైన కృషి చేసి నందుకు ఆచార్య ఆత్రేయకు గౌరవ డాక్టరేట్ నిచ్చి సత్కరించారు.

కిళాంబివారు

ఆత్రేయుడు అంటే చంద్రుడని అర్థం. ఆయన అంత ఆహ్లాదకరమైన పాటలు రాశారు. కాని ఆత్రేయ అనేది ఆయన అసలు పేరు కాదు. తల్లిదండ్రులు పెట్టిన పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. 'ఆత్రేయస' గోత్రీకులైన ఆచార్యులుగారు నర సింహాచార్యులలోని 'ఆచార్య' పదాన్ని ముందు

ఇంటర్వ్యూ చేస్తున్న పైడిపాలతో శ్రీ ఆత్రేయ



పెట్టుకొని 'ఆచార్య ఆత్రేయ' అయ్యారు. 7-5-1921న నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట తాలూకా మంగళంపాడు లో ఆయన జన్మిం చారు. హైస్కూల్ చదువు చిత్తూరులోను, ఇంటర్మీడియట్ 'రాయవెల్లూరు'లోని ఊరీస్ కళాశాలలోను అభ్యసించారు. టీచర్ ట్రెయి నింగ్, క్విట్ ఇండియా ఉద్యమం సంద ర్భంగా కారాగారవాసం, కొన్ని చిరుద్యోగాలు - ఆయన పూర్వాశ్రమంలోని కొన్ని తీపి చేదు గుర్తులు.

మాటలకు దొరకని ఆ మాటల మేటి, పాటల పేటి మనసు తెలుసుకొనే ప్రయత్నం- ఈ ఇంటర్వ్యూ.

ఇంటర్వ్యూలంటే?

ప్ర : మీతో నాకు కొంత పరిచయం వున్నా, ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకు లకోసం మిమ్మల్ని ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చెయ్యాలనుకొంటున్నాను.

జ: వద్దు. నన్ను వదిలెయ్యండి. నాకు ఇంటర్వ్యూలంటే భయం. నేనెప్పుడూ ఏ ఉద్యోగంకోసం ఇంటర్వ్యూలకు వెళ్లలేదు.

ప్ర : ఇది మిమ్మల్ని భయపెట్టే ఇంటర్వ్యూ కాదని అభయమిస్తూ - మీ అభిమానులకోసం నాలుగు ముక్కలు చెపుతా రని ఆశిస్తాను.

జ : నా అభిమానులకు తెలియాల్సింది - నా రచనల గురించే కాని- నా గురించి కాదు.

మొదటిరచన ఢంకాబ్రోగించింది

ప్ర : అదే అడుగుతాను. మీ రచనా వ్యాసంగం ఎపుడు ఎలా ప్రారంభమయ్యింది?

జ :నా మొదటి రచన చిత్తూరులో హైస్కూల్లో చదివే రోజుల్లో 'దేవుళ్లదంతా అన్యాయమే' అనే భావంతో రాశాను. (వ్యాసమో, కథో - గుర్తులేదు) అది 'ఢంకా' అనే పత్రికలో ప్రచురింపబడింది.

ప్ర : రచనలు చెయ్యడానికి మీకు ప్రేరణ ఏమిటి?

జ : నాకేదో తెలుసుననే అజ్ఞానం. అది ఇతరులకు చెప్పాలనే ఆరాటం.

నాటకం మనసుకు హత్తుకోవాలి



ప్ర : నాటకరంగంలో నటుడుగా, దర్శకుడుగా రచయితగా - ఏ పాత్ర మీకు తృప్తిని కలిగించింది?

జ : ఏ కళాకారుడికీ ఎందులోనూ సంతృప్తి అనేది కలగకూడదు. కలిగితే ఆగిపోతాడు. నేను ఆగిపోదల్చుకోలేదు.

ప్ర : ప్రస్తుతం వస్తున్న నాటకాల మీద మీ అభిప్రాయం?

జ : టెక్నిక్ పెరిగిపోతోంది. అది అనుక్షణం ప్రేక్షకుడికి 'ఇది నాటకం' అని గుర్తు చేస్తోంది. అలా గుర్తుచేసే నాటకంలో ప్రేక్షకుడు తాదాత్మ్యాన్ని పొందలేడని నా అభిప్రాయం.

ప్ర : కొత్తగా వస్తున్న 'స్ట్రీట్ ప్లేస్' ఎలా వుంటున్నాయి?

జ : బావుంటున్నాయి. కాని హాస్యం పాటలు ఎక్కువై, చూసిన వాళ్లు హాయిగా నవ్వుకొని పోతున్నారు. మనసుకు హత్తుకోవడం లేదేమోనని నా అనుమానం!

ప్ర : నాటకానికి యిప్పుడు తగినంత ఆదరణ లేకపోవడానికి కారణం ఏమిటి?

జ : సినిమాలలా నాటకాలకు ప్రత్యేకంగా ప్రదర్శనశాలలు లేకపోవడమే.

'దీక్ష'

ప్ర : మీరు రచన చేసిన మొదటి చిత్రం ఏది? మొదటి పాట ఏది?

జ : మొదటి చిత్రం దీక్ష. మొదటి పాట 'పోరా బాబూ పో...పోయి చూడు లోకంపోకడ...!'

ప్ర : ట్యూన్‌కి పాట రాయడం అనేది అప్పటికే ఉందా?

జ : ఉంది. సుబ్బరామన్, ఎమ్మెస్ విశ్వనాథన్ వంటి ఒకరిద్దరు అప్పటికే ట్యూన్ లిచ్చేవారు.

ప్ర : ట్యూన్‌కి పాట రాయడం, పాట రాసి ట్యూన్ చెయ్యడం ఏ పద్ధతి మంచిది ?

జ : రెండోదే మంచిది. అలాగని ట్యూన్‌కి రాసిన వాటిలో కూడా మంచివి లేకపోలేదు. ఉదాహరణకు 'మరో చరిత్ర', 'అభినందన'.

ప్ర :తేలికైన పదాల్లో బరువైన భావాన్ని పొదిగే విద్య మీ ప్రత్యేకత. అది మీకు ఎలా అలవడింది?

జ : (నవ్వుతూ) నాకు అంతకంటె భాష రాదు గనుక.


ప్ర : 'మనసు' మీద యిన్ని పాటలు ఎందుకు రాయాలని పించింది?

జ : మనిషికి మనసే ముఖ్యం గనుక.

ప్ర : మీ మీద 'కణ్ణదాసన్' ప్రభావం ఎక్కువగా వుందంటారు. మీ సమాధానం?

జ : ఉన్నమాట ఒప్పుకోవడం లోకువ కాదుగా?

చిత్రాల్లో 'జయభేరి'



ప్ర : మీరు మాటలు, పాటలు రాసిన సినిమాల్లో మీకు బాగా నచ్చిన వేవి?

జ : అర్ధాంగి నుండి ప్రేమనగర్ వరకు (మూగమనసులు వాటి మధ్యదే) చాలా వున్నాయి. కాని చలనచిత్ర సమీక్షకుల అభిప్రాయంలో 'జయభేరి' అన్నిటికన్నా మిన్న.

ప్ర : తెలుగు సినిమారంగంలో నాలుగు దశాబ్దాలపాటు నిలబడిన ఏకైక రచయిత మీరు. మీ దృష్టిలో సినిమా పాటల రచనలో నాటికీ నేటికీ వున్నతేడా ఏమిటి? ఇప్పటి పాటల మీద మీ అభిప్రాయం ఏమిటి?


జ : చాలా పెద్ద ప్రశ్న. (అంటే పెద్ద జవాబు రాయాల్సిన ప్రశ్న) అంత పెద్ద జవాబు నేనెప్పుడూ పరీక్షల్లో కూడా రాయలేదు. (ఆయన పరీక్షల్లో రెండేళ్లు తప్పారట!)

ఇంతకు ముందు ఆంధ్రపత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో డా. సి. నారాయణరెడ్డి గారు చాలా వివరంగా చెప్పారు. అంతకంటె చెప్పేదేమీలేదు. (అంటూ నేర్పుగా తప్పించుకున్నారు. అలా తప్పించుకోవడంలోనే వుంది - జవాబు !)



"ఇంటర్వ్యూ లంటే.... భయం"

"కణ్ణదాసన్ ప్రభావం వుంది"



సినీ గేయాలు- కొన్ని మనీ గేయాలు!

ప్ర : మీరు ఇంతవరకు రాసిన సినిమా పాటలను సంపుటిగా తీసుకొచ్చే అభిప్రాయం ఉందా?

జ : ఉంది. నేను కొన్ని మంచి సినీ గేయాలు రాశాను. కొన్ని మనీ గేయాలు రాశాను. అవి సంపుటి కాదు. సంపుటాలు కావచ్చు. 'నా పాట నీ నోట పలకాలి' అని పేరు మాత్రం పెట్టడం జరిగింది.

ప్ర : సినిమా పాటల పై పరిశోధన చెయ్యడంపై మీ అభిప్రాయం?

జ : సినిమా పాటల్లో సాహిత్యం వుండదనుకొనే పండితులకది సమాధానమవుతుంది.

ప్ర : ప్రతి కవికి 'లైఫ్ వర్క్' అని పేర్కొనే రచన ఒకటి వుంటుంది. అలాంటిది మీరేమైనా చేశారా? చేస్తారా?

జ : నా 'లైఫ్'నే ఒక 'వర్క్'గా చేస్తున్నాను.

ప్ర : మీరు సభల్లోనూ, సన్నిహితుల మధ్య చక్కని ఛలోక్తులు విసురుతుంటారు. ఈ ముఖాముఖీలో కూడా ఆ ధోరణే కనిపిస్తుంది. మరి మీ సినిమా సంభాషణల్లో ఆర్ద్రతకున్నచోటు చమత్కారాని కుండదు - ఎందుకని?

జ : ఛలోక్తులు, చతురోక్తులు ఒక్కసారి నవ్వుకొంటే తీరిపోతాయి.. ఆర్ద్రత హృదయాన్ని కదిలించి కరిగించి మెదడును ఆలోచింప చేస్తుంది.

ప్ర : కవిగా మీ జీవితాశయం ఏమిటి?

జ :నేను రాసేది కవిత్వమైతే కడదాకా రాస్తూనే వుండాలని !

కొస మలుపు: ఇంతలో ఆయనకేదో ఫోను వచ్చింది. ఫోను మాట్లాడివస్తూ - 'ఏం లేదు వాళ్ల సినిమా పూర్తయిందట. అమ్మ లేదట. అందుకే వాళ్లను 'నిర్‌మాత' అన్నారు....!' అంటూ ఓ ఛలోక్తి రుచి చూపించారు.

కొస మెరుపు: ఆత్రేయగారు కొన్ని సినీ గేయాలు మరికొన్ని మనీ గేయాలు రాశా నన్నారు. కాని ఆయన గేయాలు 'హనీ గాయాలు' అన్నారు మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రి !

ఇంటర్వ్యూ : పైడిపాల

అదండీ కథ

యం.కె.వి. సీతారామ్

కాలేజి మొత్తంమీద రాజారావంటే తెలియనివారు లేరనే చెప్పాలి! బహుశా మీకు తెలిసే వుంటుందనుకుంటా! (పొరపాటున మీ పేరు కూడా రాజారావు కాదు కదా!)

రాజారావు నాకు మిత్రుడు, బయుట ఎలా అల్లరి చేసినా నా దగ్గర పిల్లే. నేను ఎంత చెబితే అంతే! అలాగని నేనేమీ కాలేజి ప్రిన్సిపాల్‌ని కాను, రాజారావేమీ లెక్చరర్ అంతకంటే కాదు. మేం ఇద్దరం ఓ.వి.యన్. కాలేజీ స్టూడెంట్స్‌మి!

చలాకీగా తిరిగే 'రాజారావు' మంచం మీద జబ్బు పడ్డాడని తెలిసి వాళ్ళింటికి పరిగెట్టాను! చెప్పొద్దూ మంచంమీద నీర్సంగా



వున్నాడు. బత్తాయి తొనలు చప్పరిస్తున్నాడు. నన్ను చూసి చిన్నగా నవ్వి కూర్చోమన్నాడు.

కళ్ళు లోపలికి వెళ్ళి,కొద్దిగా చిక్కినట్టు కన్పడుతున్నాడు. పైన ఫ్యాను తిరుగుతున్నా ఒళ్ళంతా చెమటతో తడిసిపోయివుంది.

'ఎంత చలాకితనం, అలాంటిది, ఇలా మంచంమీద దిగులుగా వుండేసరికి నాకే బాధ అన్పించింది.'

మొన్నటికి మొన్న ఆ రాధని ఏడ్పిస్తున్నప్పుడు ఎంత ఎంజాయ్ చేశాం. ఆ ముందురోజు క్రొత్త కుర్ర లెక్చరర్ ప్రకాశాన్ని ఎలా అదరగొట్టేశాడు, తన అద్భుత ఉపన్యాసంతో! తన గర్ల్ ఫ్రెండ్ 'లలిత'ని ఏడ్పించినందుకు సుందరానికి బట్టలిప్పించి మొత్తం కాలేజీ గ్రౌండంతా అందరిముందు ఎలా పరిగెట్టించాడు (చాలా చిన్న గ్రౌండ్ లెండి!). ఆ చలాకీతనం మచ్చుకయినా కన్పడ్డంలేదు 'రాజారావు' ముఖంలో.

"ఏరా అలాగున్నావు?" అడిగాను.

"ఎలా వున్నాను, బాగానే వున్నాను."

మాతిలోంచి వచ్చినట్టు వచ్చింది సమాధానం, రాజారావు ద్వారా.

"ఏం ఏదైనా గొడవ జరిగిందా, చెప్పు, మన గూండా గ్యాంగుని పంపించి..."

"సారీరా, నేనేం మాట్లాడదల్చుకోలేదు" అన్నాడు ముఖంపైకి దుప్పటిని లాక్కుంటూ.

"పోనీ, నీ గర్ల్‌ఫ్రెండ్, అదే నా

చెల్లెలు'లలిత'కి నాళ్ళింట్లో పెళ్ళి సంబంధాలు చూడ్డంకాని, ఆమె నీతో ఏమైనా గొడవలు పెట్టుకోవటంకాని ఏమైనా జరిగిందా" అనుమానంగా అడిగాను.

"దయచేసి....

"నిన్నేమీ అడగొద్దు అంటావు? ఎలా? కష్టాల్లో వున్నట్టు నీ ముఖంలో బాధ స్పష్టంగా కన్పడుతోంది, నువ్వు రెండ్రోజులుగా ఎవరికీ కన్పడని నీ ముఖం గురించి 'క్లియర్'గా తెలుస్తూనేవుంది. చెప్పు,కారణం చెప్పు, లేకుంటే నామీద ఒట్టే!" (ఒట్టులమీద నమ్మకం లేకపోయినా, స్నేహితుడు కష్టాల్లో వున్నప్పుడు 'సెంటిమెంట్'కి ప్రాధాన్యతనివ్వమని అదేదో తెలుగు సినిమాలో డైలాగు వుంది. అది గుర్తొచ్చింది).

"చెప్పక తప్పదంటావా...."

"చెప్పమనే కదరా అడుగుతున్నాను..." అన్నాను సీరియస్‌గా.

మంచం మీద నుంచి లేచి, బీరువాదగ్గరకెళ్ళి బీరువా తీస్తున్నాడు.

చెపుతానని, బీరువా దగ్గరకెళ్ళి....

"ఇదిగో చూడరా..."అంటూ ఓ చిన్న పుస్తకాన్ని అందించాడు.

"ఆటోగ్రాఫ్ బుక్, ఏం...?"

"ఎందుకిలా వున్నావని అడిగావే, జవాబుగా ఇది చూడమన్నాను" గొంతులో రవ్వంత సీరియస్ కన్పడుతోంది స్పష్టంగా.

వరుసగా పేజీలు తిరగేస్తున్నాను.

"నిండు నూరేళ్ళు, కలకాలం బ్రతకాలని...అవినాశ్."

"వుయ్ ఎంజాయ్ అవర్ సెల్ఫ్, బట్ డోంట్ ఎంజాయ్ విత్ లైఫ్.... లలిత"

"శుభాభినందనలతో"....ప్రిన్సిపాల్, ఓ.వి. యన్. కాలేజి.

"సాగరమనే జీవితం ముందుంది, సాగిపో ఈదుకుంటూ..." -కుమారి అంజాత".

"విష్ యు హేపీ లైఫ్ ఇన్ యువర్ ఫ్యూచర్ కెరియర్" -శర్మిల

"నందనం లాంటి కాలేజిలో విచిత్రంగా కలిశాం. మళ్ళీ మన కలయిక ఏనాటికో మిత్రమా..." -మధుభాషిణి

"ఐ లవ్ యూ..." -అపూర్వ

వరుసగా పేజీలు తిరగేస్తున్న నేను ఆ పేజి వచ్చేసరికి రాజారావు వైపు చూశాను. రాజారావు కళ్ళలో జీరలు!

"మీరు గాడిదలా వున్నారని నేను, కాదు ఎలుగ్గొడ్డులా వున్నారని మా ఫ్రెండు వాదించుకుంటున్నాం. అందులో కరక్టు ఎవరంటారు?"

క్రింద సంతకంగాని, పేరుగాని లేదు!

మరో పేజీ తిప్పాను.

"ప్రతి అడ్డమైన అడ్డగాడిద కూడా మగాడట, ఇలా అడ్డమైన వాళ్ళలో నువ్వు ప్రథముడవట! మా ఫ్రెండు చెప్పింది!"

క్రింద సంతకం లేదు, పేరు కూడా లేదు!

కాని.... ఆ హేండు రైటింగ్ నాకు బాగా గుర్తు!

అది.... లక్ష్మిదే!

"ఎవరు రాసారంటావు?" అడిగాను.

"అదే అర్థం కావట్లేదు, ఇంతవరకూ నన్ను మెచ్చుకునే వారి సంఖ్య ఎక్కువనుకున్నాను, కాని...."

ఒకే ఒక నిముషం రాజారావు చెప్పిన మాటలు విని అసహనంగా ఇంటికి వచ్చాను.

"లక్ష్మీ..."

"నేనో మాట చెబుదామనుకుంటున్నానురా అబ్బాయ్" అమ్మ అంది.

"చెప్పమ్మా"

"మరేం లేదు, కోడలు పిల్ల లక్ష్మిని కాలేజి మాన్పించేద్దామనుకుంటున్నాను. అదే అడిగాను 'లక్ష్మి'తో తను సరేనంది మరి నీ అభిప్రాయం!"

"నేను కూడా 'సరే'నే, అయితే ప్రయివేటుగా కట్టమను మొత్తం మీద ఆ బి.కామ్ పూర్తి చేసేయాలి."

మనసు తృప్తిగా వుంది.

మరెప్పుడూ రాజారావును కలువలేదు. కలవను కూడా! ఎందుకో, బహుశా ఈపాటికి మీకు తెలిసే వుండాలి.

●

బుజ్జిగాడి యోగం



"ఏమండీ"

"...... ....."

"ఏమండోయ్, వింటున్నారా? అప్పుడే పడుకున్నారా ఏమిటి?"

"అబ్బబ్బా, లేదులేవే! ఏవిటి సంగతి?"

"వో మాట చెప్పనా?"

"చెప్పు"

"కోపగించుకోరు కదా"

"లేదులే, చెప్పు"

"బుజ్జిగాడికి స్కూల్ రిక్షాని మాన్పించేద్దామనుకుంటున్నా"

"వాడెలా వెళ్తాడు?"

"నడిచి పోతాడు, స్కూలేమంత దూరంగా లేదు కదా"

"అది నిజమే.... అయితే అంత బరువున్న పుస్తకాల సంచో...?"

"సంచిని నేను తీసికుంటాను."

"విడిచి రావటానికి నువ్వెళ్తావా?"

"ఆఁ తప్పేముంది? నేను విడిచి వొచ్చేదాకా బేబీ దగ్గిర మీరెలాగూ వుంటారు కదా"

"సర్లె.... అయినా ఇదంతా ఎందుకె లేనిపోనిది"

"ప్రతినెలా ఇరవై రూపాయలు ఆదా చేయొచ్చండీ"

"ఆ డబ్బులేం జేస్తావ్?"

"ఎక్కువ పాలను తీసికుంటాను, బేబీ తాగిన తర్వాత బుజ్జిగాడికి వొక గ్లాస్ పాలు కూడ మిగలటం లేదు."

"...... ....."

"మాట్లాడరేమండీ... నేనేమయినా తప్పుగా మాట్లాడానా?"

"లేదు... రిక్షాని మాత్రం మాన్పించాల్సొస్తుంటది."

"అయితే ఇంకేం. బుజ్జిగాడి కోసం వొచ్చే నెల నుంచి ఎక్కువ పాలు తీస్కోవచ్చు"

"ఎక్కువ పాలు తాగే అదృష్టం బుజ్జిగాడికి లేదేమో!"

"ఎందుకూ" అంటూ ఆవిడ మంచంపై దిగ్గున లేచి కూచొంది.

"వొచ్చేనెల నుంచి పరంధామయ్య ఇంటి అద్దె పెంచుతామన్నారు."

"పెంచుతా మన్నారా? ఎంత?"

"ఇరవై రూపాయలు!!!"

– విద్యారణ్య కామ్లేకర్

సీరియల్

ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



(గత సంచిక తరువాయి)

ఇంత వరకూ సాగిన కథ-17: పాంచాల దేశాధీశుడు ద్రుపదుడు కుమార్తె ద్రౌపదిని పాండవులు పెళ్లాడతారు. పట్టాభిషేకానంతరం ధర్మరాజు-ద్రౌపదిని, మిగిలిన సోదరులను తీసుకొని ఖాండవప్రస్థం చేరుకుంటాడు. నారదుడి సలహాపై ధర్మరాజు రాజసూయ యాగం నిర్విఘ్నంగా కొనసాగిస్తాడు. మయసభలో తనకు జరిగిన అవమానానికి ప్రతీకారంగా దుర్యోధనుడు పాండవుల సంపదనంతటినీ జూదంలో గెలుచుకోవటమే కాకుండా పాండవులను, ఆఖరికి ద్రౌపదిని కూడా గెలుచుకుంటాడు. తన దాసి అయిన ద్రౌపదిని నిండు కొలువులో వస్త్రాపహరణం చేయించి అవమానిస్తాడు. ఈ దారుణం విని కలత చెందిన ధృతరాష్ట్రుడు వారికి దాస్య విముక్తి కల్పిస్తాడు. తిరిగి అనుద్యూతంలో ఓడిపోయిన ధర్మరాజు అడవుల పాలవుతాడు. పాండవుల అరణ్యవాసం సందర్భంగా సూర్యభగవానుడు అక్షయపాత్రను ప్రసాదిస్తాడు.

మరునాడు ప్రొద్దున్నే పాండవులు కూడా బయల్దేరారు. ముందుకు పోతున్నకొద్దీ అరణ్యం మరింత చిక్కగా వుంది. దోవకడ్డంగా వున్న చిన్న చిన్న గుట్టల్ని ఎక్కుతూ దిగుతూ, చెట్ల నీడన అలసట తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఓ నీటి చలమ దగ్గరకు వచ్చాక భీముడు 'మీరంతా ఇక్కడే కూర్చుని వుండండి. ఇక్కడెక్కడయినా చెట్లకు పండిన ఫలాలుంటే తెస్తాను' అని వెళ్ళాడు.

ద్రౌపది నిట్టూరుస్తూ చుట్టూ చూసింది. నాలుగైదు ఎత్తయిన చెట్లు పక్క పక్కనే వుండి పెద్ద పెద్ద కొమ్మలతో అల్లిబిల్లిగా అల్లుకుని ఆకుపచ్చటి కుటీరంలా వుంది.

వెళ్ళి అక్కడ కూర్చుంది.

ప్రయాణపు బడలిక సగం తగ్గినట్టనిపించింది.

'ధర్మ పుత్రా! మనమింకా ఎంత దూరం వెళ్ళాలి?'

'మరో నాలుగు క్రోసులు నడిస్తే ద్వైత వనం వస్తుంది. ఈ సాయంత్రానికి కొని అక్కడికి చేరం... ....'

....

ద్రౌపదికి ఏడుపొచ్చింది.

అన్నా తండ్రీ గుర్తుకొచ్చారు. ఎవరన్నా పుణ్యాత్ములు కామ గమన విద్యతో తనను పాంచాల దేశం చేరిస్తే బాగుండనుకుంది....

అంతలో భీముడు వచ్చాడు. అతని చేతిలో మిగల పండిన పండ్లున్నాయి. అవేవీ తినాలనిపించలేదు. లేచి వెళ్ళి మడుగులోని నీళ్ళు దోసిళ్ళలోకి తీసుకుని తాగింది. మళ్ళీ వచ్చి లతా కుటీరంలో కూర్చుంది. నడిచి నడిచి పాదాలు ఎర్రగా మోదుగు పువ్వుల్లా వున్నాయి.

నేనింకా నడవలేను అందామనుకుంది.

కాని ప్రయోజనం....

అర్జునుడు, ద్రౌపది మొహంలో అసహనాన్నీ, బాధనీ చూసి కళ్ళతోనే సానుభూతిని ప్రకటించాడు. వనమూలికలూ, ఆకులూ రాతి మీద నూరి ఆ పసరును ఆమె పాదాలకు పూశాడు. ద్రౌపది కళ్ళలో గిర్రున నీళ్లు తిరిగాయి. నేల రాలిన ఆకుల మీద అక్కడే సొమ్మసిల్లి పడుకుంది. పడుకోగానే నిద్ర పట్టిందామెకు. మెలుకువ వచ్చేసరికి చాలా పొద్దు పోయింది. అర్జునుడు ఆకు దొన్నెలతో నీళ్లు తీసుకొచ్చాడు. అవి త్రాగాక మళ్లీ నడక.

చీకటి పడుతూండగా ద్వైతవనం దరిదాపులకు వెళ్లారు.

'...... ఈ అరణ్యం చాలా భయంకరంగా వుంటుంది. ఇక్కడ సింహ, శరభ, శార్దూలాలు, అడవి ఏనుగులు ఎక్కువగా వుంటాయి. చాలా జాగ్రత్తగా వుండాలి. పైగా ఇలాంటి చోట్ల రాక్షసులు కూడా వుంటారు' అన్నాడు ధర్మరాజు తమ్ముల వంక చూస్తూ.

ఆ మాటలు వినగానే వాళ్ళు ఆయుధ హస్తులై నిలబడ్డారు.

ధర్మరాజు మట్టినేల మీదపడుకున్నాడు.

ద్రౌపది చెట్టుకానుకుని కూర్చుంది.

రాత్రి అవుతున్నకొద్దీ చలి ఎక్కువైంది.

అర్జునుడు చితుకులు పోగుచేసి నిప్పు చేశాడు. ఆ వెచ్చదనం హాయిగా అనిపించింది ద్రౌపదికి.

* * * * * *

మరునాడు ద్వైతవనం చేరుకునేసరికి మధ్యాహ్నమైంది. ఓ చెట్టు నీడన కూర్చున్నారందరూ.

ద్రౌపదికి అసహనంగా వుంది.

'ధర్మరాజా! మీ పెద్ద తండ్రి తన

కొడుకులకు బుద్ధి చెప్పకోలేక మిమ్మల్ని స్థితికి తెచ్చాడు. తన కొడుకులకూ మీకూ వున్న తారతమ్యం తెలిసుండికూడా దుర్యోధనుడు మీకు అపకారం చేస్తుంటే ఆయన వారించకపోయాడు. ఆ గ్రుడ్డి రాజు గుండె ఇనుమో పాషాణమో తెలియడం లేదు. మీ మీద దుర్యోధనుడి కంటే ధృతరాష్ట్రుడికే అసూయ, ద్వేషం ఎక్కువలా వుంది. చంద్రకాంత సౌధాల్లో విహరిస్తూ, హంసతూలికా తల్పాల మీద శయనిస్తూ, బంగారు సింహాసనాలపైన కూర్చుని నరపతుల సేవలందుకుంటూ వుండే మిమ్మల్ని అడవులపాలుచెయ్యాలనే కొడుకుతో కలిసి ఆ ముసలివాడు నాటక మాడాడు.

ఆ నాటకాన్ని ప్రతిఘటించలేక, అదేదో మంచితనమనుకుని చేతులు ముడుచుకుని అడవుల్లో తిరుగుతూ ధూళి దూసర దేహాలతో మీరూ మీ తమ్ములు నలుగురూ బికారుల్లా ఎలా వున్నారో చూసుకోండి. రాళ్లూ, ముళ్లూ గుచ్చుకుని రక్తంతో మీ పాదాలు ఎలా ఎర్రబడ్డాయో చూడండి...'

అని చటుక్కున కిందకు వంగి ధర్మరాజు పాదాల కింద తన అరచేతులు వుంచింది.

ఎర్రగా పాద ముద్రలు పడ్డాయి.

'.... ప్రతినిత్యమూ పసిడి పాత్రలలో పదివేల మంది బ్రాహ్మణు లకు అన్నదానం చేసే మీరు ఇప్పుడిలా కందమూలాలతో పొట్ట నింపుకుంటుంటే నాకు ఎలా వుంటుంది చెప్పండి? పదివేల ఏనుగుల బలంతో విలసిల్లే భీమసేనుడు ఈ కారడవులలో కాయగూరలు తింటూ ఎముకల పోగయ్యాడు. సహస్ర బాహువులుగల కార్త వీర్యార్జునునికంటే బలవంతుడైన అర్జునుడు ఈ ఘోరారణ్యాలలో మృగాలతో పాటు అడవి మనిషిలా తిరుగుతున్నాడు. సుకుమార శరీరులు నకుల సహదేవులు నారచీరల్లో ముష్టికొచ్చిన వాళ్ళలా వున్నారు. వాడిన వాళ్ల మొహాలు చూడండి...' అంటూ ద్రౌపది అర చేతుల్లో ముఖాన్ని దాచుకుని భోరున ఏడ్చింది.



రమాప్రభ

భలేమనిషి

"దొడ్డమ్మగారూ!"

"ఎవరూ? ఓహో-పక్కింటి కొత్త కోడలా! రామ్మా."

"మరేం....మా అత్తగారు-"

"ఇంత చల్లని వేళలో ఆమె గురించి ఎందుకు లేమ్మా."

"మా అత్తగారు-"

"శూర్పణఖ....గయ్యాళిగంప."

"అదికాదండీ....మా అత్తగారు-"

"రాక్షసి, తాటకి, పూతన, అపరకాళికాదేవి-"

"మా అత్తగారు-"

"నీలాంటి బంగారు కోడలని పొందడానికి పూర్వజన్మలో ఎలాంటి నోమునోచిందో గాని, ఈ జన్మలో ఆమె తేనె పూసిన కత్తి. పిప్పళ్ళ బస్తా. దరిద్రపు పీనుగ."

"అదికాదు దొడ్డమ్మగారూ! నే చెప్పేది పూర్తిగా వినండి. మా అత్తగారికి మందులు తెప్పించాలి. మొన్నమీరు నా దగ్గర చేబదులుగా తీసుకున్న పది రూపాయలిచ్చేస్తారేమోనని.....మరేం అనుకోకండి."



"అనుకోవడమేమిటే సుప్పనాతి! చేబదులు నువ్వొచ్చి అడిగేవరకు నేనివ్వననుకున్నావా? ఎంత నంగనాచివే ! నీ కన్నా మీ అత్తయ్యే నయం. అంతటి మహాలక్ష్మికి నీలాంటి పాపిష్టికోడలు ఎక్కడ దాపరించిందే! నన్ను నిలవేసి బాకీ అడుగుతావా! నీ ముష్టి పది రూపాయలను త్వరలోనే నీ మొహాన పారేస్తాలే-వెళ్ళిరా!"

జి.వి.జి.

ధర్మరాజు మౌనంగా వున్నాడు.

'మీ కళ్ళలో నీరు కూడా ఇంకిపోయింది. మీ మనసు రాయయిపోయింది' అంది ద్రౌపది బాధ ఆపుకోలేక.

అప్పటికీ ఏం మాట్లాడలేదు యుధిష్ఠిరుడు.

'మీ తమ్ముళ్ళను చూస్తేనైనా మీకు శత్రువులను వధించాలనిపించడం లేదా! రాజైన వాడికి క్షమ ఎంత అవసరమో పౌరుషమూ, తేజమూ కూడా అంతే అవసరం. నా మాట వినండి. అనుక్షణం శాంతం శాంతం అనే ప్రభువుకు భృత్యులు భయపడరు. పైగా హేళన చేస్తారు.

ఒక్క అపరాధమైతే పోనీలే అని క్షమించి వూరుకోవచ్చు. ఆ దుర్యోధనుడు చేసే పాపిష్టి పన్నులకు అంతంటూ వుందా? అలాంటి వాణ్ణి అసలెందుకు క్షమించాలి?.... ధర్మపుత్రా! ప్రతాపం చూపించాల్సిన సమయంలో పిరికిపందల్లా చేతులు కట్టుకుని కూర్చోడం తగదు. కొంచెం పౌరుషం తెచ్చుకుని మీరు ఒక్కసారి 'ఊ' అనాలే కాని మీ తమ్ములు ఆ కౌరవులందర్నీ నామరూపాలు లేకుండా చెయ్యగలరు. రాజేంద్రుడవై నువ్వు సుఖపడు. మాకు సౌఖ్యాలు కలిగించు. ఈ వనవాస క్లేశాల నుంచి మాకు విముక్తి కలిగించు....' అని ద్రౌపది తన మనస్సులో వున్న బాధంతా వెళ్ళగ్రక్కింది.

ధర్మరాజు ఆమె ముఖంలోకి ఒకసారి చూసి కనురెప్పలు దించుకున్నాడు.

'రాజనందినీ! క్రోధం మనిషికి మంచిది కాదు. క్రోధంగలవాడు ధర్మార్థ కామాలను నిర్వహించుకోలేడు. వివేకం నశిస్తుంది. ఒక్కొక్కప్పుడు తానేం చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలోకి దిగజారి ఆత్మహత్య కూడా చేసుకుంటాడు. క్రోధం విజ్ఞులకు ఉచితం కాదు. క్షమ వల్లనే మనిషి ఉన్నతుడవుతాడు. క్షమ వల్లనే మనిషి కీర్తి ప్రతిష్ఠ లార్జించుకుంటాడు. క్షమవల్లనే చరా చర ప్రపంచమంతా సాగుతోంది. కొంచెం ఓర్పు వహించు. మంచి కాలం రాకపోదు' అన్నాడు ధర్మరాజు ద్రౌపదిని మందలిస్తూ.

ద్రౌపది రోషంగా నిట్టూర్చి 'శత్రువుల పట్ల కూడా శాంతం వహించడం మంచిది కాదని మాత్రమే చెబుతున్నాను. ఆ తరువాత మీ ఇష్టం...' అంది. ధర్మరాజు మాట్లాడలేదు.

అంతలో భీముడు ముందుకు వచ్చి 'అసలెందుకు ఓర్పు వహించాలి? రాజ్యం మనకు పితృ పితామహక్రమంలో సంక్రమించింది. ధృతరాష్ట్రుడు కాని, దుర్యోధనుడు కాని వాళ్ళ సొమ్మేం మనకు దోచి పెట్టలేదే! సింహాల నోటి దగ్గరున్న మాంసాన్ని నక్కలు అపహరించినట్లు మన రాజ్యాన్ని కౌరవులే కాజేశారు. అసలు ఆనాడే జూద గృహం దగ్గరే వాళ్ళను చంపి పారేసి వుంటే ఈనాడు మనం ఇలా అడవుల పాలు కాకుండా వుండేవాళ్ళం. కాని... అప్పుడు నీ ముఖం చూసి వూరుకున్నాం. నీ మాటకు బద్ధులమై శాంతం వహిస్తే కౌరవులు మనల్ని చేతగాని వాళ్ళ కింద జమకట్టారు. శత్రువులను జయించడం, ఏ భయాలూ లేకుండా ప్రజలను రక్షించడం, తగిన అర్థులక్కు దానాలు చెయ్యడం ఇవీ ఉత్తమ క్షత్రియ ధర్మాలు, రాజైనవాడు కేవలం ధర్మమే కావాలని కోరుకోవడం ఉచితం కాదు. అప్పుడప్పుడు కొంచెం వంచన చెయ్యడం, బెదిరించడం కూడా అవసరం. దేవతలు రాక్షసులను జయించడానికి లక్ష మోసాలు చేశారు....' అని కొంచెంసేపు ఆగాడు.

ధర్మరాజు నవ్వుతూ 'తమ్ముడూ! నువ్వు చెప్పదలుచుకున్నది అంతేనా ఇంకేమైనా వుందా' అన్నాడు.

'దుర్యోధనుడ్ని దెబ్బకొట్టాలి. ఊపిరి తిరక్కుండా దెబ్బకొట్టాలి. కౌరవ సామ్రాజ్యాన్ని కూల్చెయ్యాలి. ఆ శకునిగాడ్ని ముప్పుతిప్పలు పెట్టాలి. దుశ్శాసనుడి రొమ్ముచీల్చి రక్తం తాగాలి' అన్నాడు భీముడు దృఢంగా. ధర్మరాజు ఆలోచనే వేరు.

పన్నెండేళ్లు అరణ్యవాసమూ, ఒక ఏడు అజ్ఞాతవాసమూ చేస్తానని పెద్దల ఎదుట ప్రతిజ్ఞ చేశాడు. గుణవంతుడైన వాడు రాగ, క్రోధాలకు లోబడి అశాశ్వతమైన సంపదకోసం ఆశపడి సత్యమూ, ధర్మమూ తప్పడం ఎంతవరకూ సబబో ఆలోచిస్తున్నాడు.

రాజ్యమూ, పుత్రులూ, ధనమూ కీర్తి ఏవీ సత్యంతో సమానంకావని అతని నమ్మకం. ధర్మరాజు తమ్ముణ్ణి శాంతింపచేసేందుకు ప్రయత్నిస్తూ 'ధృతరాష్ట్రుని

కొడుకులు వందమందీ నువ్వనుకుంటున్నంత పరాక్రమహీనులు కారు. పైగా వాళ్ళకు న్యాయం, ధర్మం అనేవి ఏకోశానా లేవు. అవకాశం దొరికితే ఎంత ఘోరమైనా చేస్తారు. తొందరపడి మనం వాళ్ళమీదకు దండెత్తిపోకూడదు. పైగా మనం జయించిన రాజులందర్నీ దుర్యోధనుడు చేరదీశాడు...' అన్నాడు.

భీముడికి ఏమనాలో తోచలేదు.

మౌనంగా వుండిపోయాడు.

*　*　*

ఒకరోజు-,

ధర్మరాజు లతా కుటీరం ముందు దర్భాసనంమీద కూర్చుని వున్నాడు.

వేద వ్యాసుడు వచ్చాడు.

ధర్మరాజు ఆయనను అర్ఘ్యపాద్యాదులతో సత్కరించాడు. వ్యాసుడు యుధిష్ఠిరుడ్ని ఆశీర్వదించాడు. అంతలో పాంచాల పుత్రి వచ్చి ఆయనకు నమస్కరించింది.

'దీర్ఘసుమంగళీ భవ' అని దీవించాడు. ఆ తరువాత వ్యాసుడూ, ధర్మరాజా కుటీరం దాటి బయటకు వెళ్ళారు. ద్వైత వనం దట్టంగా వుంది. నాలుగడుగులు వేశాక 'ధర్మరాజా! కౌరవులతో యుద్ధమంటూ జరిగితే భీష్మ, ద్రోణాది వీరులను ఎలా జయించడమా అని విచారిస్తున్నావు. అవునా? నువ్వేం దిగులుపడకు. నీకు ప్రతిస్మృతి అనే యోగలబ్ధమైన విద్యను ఉపదేశిస్తాను. నువ్వు దానిని అర్జునుడికి బోధించు అతను దానిని ఉపాసించి తపస్సుచేసి దేవతలనూ, పరమేశ్వరుణ్ణీ ప్రత్యక్షం చేసుకుని దివ్యాస్త్రాలు సంపాదిస్తాడు. నారాయణ సఖుడైన నరుడే అర్జునుడు. అతనికి సాధ్యంకానిదంటూ వుండదు...' అని కృష్ణ ద్వైపాయనుడు ధైర్యం చెప్పాడు.

ధర్మరాజు కృతజ్ఞతగా చేతులు జోడించాడు.

'శుచివై వెంటనేరా. నీకు ప్రతిస్మృతి విద్యను ఉపదేశిస్తా' అన్నాడు వ్యాసుడు.

ధర్మరాజు పరుగులాంటి నడకతో వెళ్ళాడు. ఏటిసీటిలో మునకలు వేసి సూర్యభగవానుడికి నమస్కారం చేసి గిర్రున వెనక్కివచ్చాడు.

వటవృక్షం కింద బండమీద కూర్చున్నారిద్దరూ.

ప్రతిస్మృతిని ఉపదేశించాడు వ్యాసుడు. సన్నటి వెలుగు కిరణమొకటి లోపలికి లోలోపలికి చొచ్చుకుపోయినట్టయింది. ధర్మరాజుకు శరీరంలోకి కొత్తశక్తేదో ప్రవహించినట్టనిపించింది. యోగం తాలూకు ప్రభావం ఇంతలా వుంటుందంటే నమ్మశక్యంకానంత తేజోమయంగా వుంది అతని మనస్సు.

'మహాపురుషా! యోగలబ్ధమైన ప్రతిస్మృతి విద్యను మీ నుంచి అందుకుంటున్నకొద్దీ నా అర్భక దేహానికి నూతన శక్తేదో వస్తోంది. కాని, ఒక్కోసారి భరించలేనంత దుర్భరంగా వుంటోంది. నన్ను ఐహిక స్థితికి తెచ్చి కాపాడవల్సింది మీరే' అని వ్యాసుడి పాదాలు తాకాడు.

ఆయన ధర్మరాజును ఆలింగనం చేసుకుని 'ప్రతిస్మృతిని అకళింపు చేసుకునేందుకు మీకంటే విజయశీలురెవరున్నారు? రాబోయే కురుపాండవ సంగ్రామంలో

ద్రౌపది

అర్జునుడు శత్రువులను నిర్జించి తీరతాడు. మీకు శుభమవుతుంది' అన్నాడు.

ధర్మరాజు సంతోషంలో తలమునకలవుతూండగా 'నాయనా! మీరు ఈ వనం వదిలి మరో చోటుకి వెళ్ళండి. ఇక్కడ మీరు చాలాకాలం వుండడం వలన మృగాలన్నీ నశించిపోయాయి. తరులకు ఫలపుష్పాలు తరిగి పోయాయి. మీ అగ్ని కార్యాలతో ఇక్కడి ఓషధులన్నీ క్షయమై పోయాయి' అన్నాడు వ్యాసుడు.

ధర్మరాజు తలెత్తి చూసేసరికి అక్కడ లేడాయాన. అప్పటికే అంతర్హితుడయ్యాడు. మరో చోటు చూసుకుందామని లేచిన ధర్మరాజుకి అర్జునుడు ఎదురుబడ్డాడు. తమ్ముడికి ఏదో చెప్పబోయి ఆగిపోయాడు యుధిష్ఠిరుడు.

* * * * * *

పాండవులు మళ్ళీ కామ్యక వనాన్ని చేరుకుని, సరస్వతీనదీ తీరంలో ఏటీరం ఏర్పరుచుకున్నారు. ఆ ప్రాంతం మరీ నిర్జనంగా వుండక అప్పుడప్పుడు మునులూ, మునికుమారులూ కనిపిస్తుంటారు. ఎత్తుగా పెరిగిన మద్దిచెట్లు, రావిచెట్లు, మర్రి, శింశుపవృక్షాలు చల్లటి నీడనిస్తాయి. గుబురు, గుబురుగా పెరిగిన చంద్రకాంత మొక్కలు ఎర్రటి పూలు పూసి కామ్యకవనాన్ని దీపాలతో వెలిగించినట్టుంటోంది.

ఆ చెట్ల మధ్య తమ్ముడితో నడుస్తూ ఒకసారి 'అర్జునా! నిన్నొక మహాకార్యంలో నియోగించాలనుకుంటున్నాను' అన్నాడు ధర్మరాజు.

'అన్నయ్యా! నీ ఆజ్ఞను శిరసావహించడానికి సిద్ధంగా వున్నాను' అన్నాడు అర్జునుడు.

'.......విజయా! మనం ద్వైతవనంలో వున్నప్పుడు వేదవ్యాస మహర్షి వచ్చారు గుర్తుందా? ఆయన నాకు ప్రతిస్మృతి అనే విద్యను ఉపదేశించాడు. దానివల్ల ఈ ప్రపంచంలో ఏది ఎందుకు జరుగుతుందో తెలుస్తుంది. ఆ విద్యను నీకు ఉపదేశించమని మహర్షి ఆనాడే నాతో చెప్పారు. నువ్వా మంత్రాన్ని అనుష్ఠించి, ఆయుధాలు ధరించి,' ఉత్తరదిశగా వెళ్ళి తపోబలంతో ఇంద్రుణ్ణి ప్రసన్నం చేసుకో, పూర్వం దేవతలందరూ వృత్రాసురునికి భయపడి వాళ్ళ తమ ఆయుధాలన్నీ ఇంద్రునికి సమర్పించారుట. ఆయన అనుగ్రహంవల్ల అవన్నీ నీకు లభిస్తాయి. తరువాత ఇంద్రోపదేశాన్ననుసరించి ఈశ్వరుడ్ని ప్రార్థించు. ఆయన వల్ల మనకు అభీష్టసిద్ధి కలుగుతుంది' అని చెప్పాడు ధర్మరాజు. విజయుడు మహదానందంతో ఆ విద్యను గ్రహించాడు.

ఇంద్ర సమాగమానికి వెళ్తూ సోదరులకూ, ధౌమ్యుడికీ ప్రదక్షిణాలు చేసి తలెత్తి ఒకసారి ద్రౌపది వైపు చూశాడు అర్జునుడు.

ద్రౌపది కళ్ళనిండుగా నీళ్ళున్నాయి.



విజయుడు చలించిపోయాడు. మౌనంగా ఆమెనే చూస్తూ నిలబడ్డాడు.

పాంచాల పుత్రి కూడా మూగగా కన్నీళ్లతోనే వీడ్కోలు చెప్పింది. నిశ్శబ్దానికి మించిన భాషలేదు. అది వ్యక్తం చేసినంత గొప్పగా ఏ భాషా తన భావాన్ని ప్రకటించలేదు. కలయికలో ఆనందాన్నీ వీడ్కోలులో విషాదాన్నీ నిశ్శబ్దం చెప్పినంత బాగా మరేదీ చెప్పలేదు. అర్జునుడు కదిలి వెళ్ళిపోయాడు.

హిమవత్పర్వతం చేరి

అక్కడ నుంచి గంధమాదనం దాటి దుర్గమారణ్యాలు అధిగమించి

అహోరాత్రాలూ శ్రమించి

చివరికి ఇంద్రకీల పర్వతం చేరుకోబోయేసరికి అక్కడ ఒక వృద్ధతాపసి కనిపించి 'నాయనా! విల్లూ, బాణాలూ, కత్తీకటార్లూ పట్టుకుని వచ్చావు. ఎవరు నువ్వు? ఇక్కడ అస్త్రాలతో పనేమీ లేదే! కోపతాపాలూ, రాగద్వేషాలూ మాని ముక్కుమూసుకుని తపస్సు చేసుకునే మునులుండే చోటు ఈ క్షత్రియ వేషమేమిటి? అని పలకరించాడు.

అర్జునుడు మాట్లాడలేదు.

తపస్వి వంక తేరిపారచూశాడు.

పింగళ వర్ణంతో, జటాజూటంతో, బ్రహ్మతేజంతో ప్రకాశిస్తున్నాడాయన.

గొంతునిండా మర్యాద, మన్నననింపుకుని 'వత్సా! తేజస్సులో ఓ జస్సులో నీ అంతవాడ్ని చూడలేదు నేను. నీకు కాబట్టి చెబుతున్నాను. ఇది శాంతివనం. కోప తాపాలువదలి, ధనుర్బాణాలు విడిచి ఉత్తమగతులు పొందు' అన్నాడు.

అర్జునుడు సమాధానం చెప్పలేదు. తపస్విని కన్నార్పకుండా చూశాడు. ఏదో అనబోయి మళ్ళీ మానుకుని ధనుర్బాణాలను చేతుల్లోకి తీసుకుంటూ 'మీరు ఎన్నైనా చెప్పండి- నిరాయుధంగా నేను వుండేది లేదు' అన్నాడు. ఆ కంఠంలో పట్టుదల నిబ్బరం చూసి తపస్వికి ఆశ్చర్యం వేసింది. కొద్దిసేపు మౌనంగా వుండి అతరువాత నెమ్మదిగా తపస్వి తన నిజరూపం బయటపెట్టాడు.

అర్జునుడు తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. విభ్రాంతుడై పోయాడు.

శచీపతి సహస్రాక్షుడై సాక్షాన్నాహోజిష్ణువై సాక్షాత్కరించాడు.

అర్జునుడు ఇంద్రుడికి చెయ్యెత్తి మొక్కాడు.

'వత్సా! నువ్వు నా బిడ్డవి. నిన్ను చూసిపోదామని స్వర్గం నుండి వచ్చాను. నీకేం కావాలో కోరుకో.' అన్నాడు ఇంద్రుడు.


నాకు దివ్యాస్త్రాలుకావాలి అన్నాడు అర్జునుడు.

'.... భోగాలు అడుగు. భాగ్యాలు కావాలను, ఉత్తమ లోకాలుకోరుకో. అంతే కాని అస్త్రాలవల్ల ఏమిటి ప్రయోజనం?'

(ఇంకా వుంది)







గణపతులెందరు ?
వారి భార్యలెందరు ?

సామాన్యంగా ప్రజలు గణపతి ఒక్కడే అని భావిస్తుంటారు. శివ పురాణం చదివిన వారికి 21 మంది గణపతులున్నారని తెలుస్తుంది!

ఆ గణపతుల పేర్లు, వారి భార్యల పేర్లు వినాయకచవితి సందర్భంగా తెలుసుకుందాం !...



	గణపతి పేరు	భార్య పేరు
1.	లక్ష్మీగణపతి	జయలక్ష్మి
2.	సిద్ధిగణపతి	సిద్ధిబుద్ధి
3.	చింతామణి గణపతి	విజయలక్ష్మి
4.	ఏకదంత గణపతి	సిద్ధి
5.	వక్రతుండ గణపతి	నవరత్నలక్ష్మి
6.	లక్ష్మీప్రదగణపతి	వరలక్ష్మి
7.	నింబగణపతి	బుద్ధిలక్ష్మి
8.	లంబోదరగణపతి	సిద్ధవిద్య
9.	ఋణవిమోచనగణపతి	సౌభాగ్యలక్ష్మి
10.	శుక్లగణపతి	బుద్ధిలక్ష్మి
11.	ధూమ్రగణపతి	సిద్ధిలక్ష్మి
12.	కృష్ణాగణపతి	సువర్ణదేవి
13.	రక్తవర్ణగణపతి	పద్మాదేవి
14.	సువర్ణగణపతి	రజితదేవి
15.	విష్ణుగణపతి	ప్రజాదేవి
16.	నిర్విఘ్నగణపతి	అతిప్రజ్ఞాదేవి
17.	వికటగణపతి	జ్ఞానదేవి
18.	బాలచంద్రగణపతి	చంద్రముఖి
19.	సర్వాంబరగణపతి	సంహారదేవి
20.	గణాధిపతి	శాంతాదేవి
21.	భద్రగణపతి	లోకమాత





– కె. సత్యనారాయణ

శ్రీవారి ప్రేమలేఖ

కుసుమ

ఫోస్ట్!..అన్న కేకతో పుస్తకం చదువుతున్న రాజేశ్వరమ్మగారు గుమ్మంలో పడి వున్న కవరును తీసుకున్నారు.

అడ్రసు చూస్తే అది తనకే! తనకైతే "ఇంకెవరు రాస్తారు? ఆయనే అయుంటారు." అనుకున్నారు.

కవరు చించి ఉత్తరం చదువుకున్నారు. చదువుతూంటే ఆమె ముఖంపై చిరు చెమటలు పట్టాయి.


గదిలోకి వెళ్లి తిరిగ్గా మరోమారు ఆ ఉత్తరం చదువుకున్నారు. ఈ మారు ఆమెకి కంగారూ కలుగలేదు, చెమటలూ పట్టలేదు. పైగా పెదవులమీద చిరునవ్వు చిందులు వేసింది. ఉత్తరం మడిచి సూట్‌కేసులో భద్రపరుస్తూ, "ఈ వయసులో ఈయనకి ఈ తరహా ఉత్తరాలేమిటి? పైగా తను జవాబు కూడా వ్రాయాలట. వెళ్తున్నప్పుడు క్షేమ సమాచారములు తెలుపుతూ ఎప్పటికప్పుడు వుత్తరాలు రాయుండి, అన్న మాట వాస్తవమే! ఆయనగారు కూడా తనని జవాబులు రాయమని మాటి తీసు కున్నారు కూడా. "బాబోయ్ నేను ఎవరికీ ఉత్తరాలేరాయును, చాకలి పద్దుకు తప్పించి మరి దేనికీ పెన్ను ముట్టనిదాన్ని, నేనేం రాస్తాను! మీ క్షేమ సమాచారములు తెలుపుతూ మీరే రాద్దురూ!" అంది తను.

శాస్త్రిగారితో ఆమె వివాహం 16వ ఏట జరిగింది. అప్పటికి ఆయన చదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరారు. అనుభవం, తెలివితేటలు, స్వయం కృషితో ఆయన అంచెలంచెలుగా ఒక పెద్ద కంపెనీకి "ఎమ్.డి."గా స్థిరపడ్డారు.

ఆయన అదృష్టమో ఏమోగానీ వున్న వూర్లోనే ఉద్యోగం. రాజేశ్వరమ్మగారి పుట్టిల్లు కూడా అదే వూరుకావడాన వారు ఇద్దరూ ఎప్పుడూ ఓ వారంకన్నా దూరంలో ఉండటం జరగలేదు. వారికి ఒక కూతురు, ఒక కొడుకు. కొడుకు U.K.లో పెళ్లి చేసుకొని సెటిల్ అయిపోయాడు. కూతురు నిర్మల హైదరాబాద్‌లో భర్త, ఇద్దరు పిల్లలతో వుంటోంది.

శాస్త్రిగారు రిటైర్ అయ్యాక మరొక పెద్ద ఫర్మ్‌లో అడ్వైజర్‌గా వుంటున్నారు. ఎప్పుడూ బిజీగా వుండే వ్యక్తి కావడాన ఖాళీగా గడపలేక ఇలా చేరారు.

వుద్యోగరీత్యా ఓ నెల రోజులు ఢిల్లీలో వుండవలసి వచ్చింది శాస్త్రిగారికి. అంతకుముందు ఎప్పుడైనా ఇలా పైవూరు వెళ్లాల్సివస్తే భార్యను కూడా తీసుకువెళ్లేవారు. ఈ మారు ఆమె ఆరోగ్యం అంతబాగుండకపోవడంవల్ల ఆమెని కూతురు దగ్గర హైదరాబాద్‌లో దించి వెళ్లారు.



"గణపతీ సమస్తు భ్యమ్"
కె. బి. నాయుడు (ఎ. పి. ఓ. యు.) (టైపు చిత్రం)

గడియారపు గంటలతో ఆమె తేరుకుని వంటగదిలోకి ప్రవేశించేరు. నిర్మల కూడా ఆమె వెనుకే వంటింట్లోకి వచ్చింది. తల్లీ, కూతుళ్లు పనుల్లో పడిపోయారు.

టిఫిన్లు, రాత్రి భోజనాలు కూడా పూర్తయిపోయాయి.

అందరూ ఎవరి గదుల్లో వారు పడుకున్నారు.

రాజేశ్వరమ్మగారు మనుమల గదిలో వాళ్లకి కథలు చెప్తూ పడుకున్నారు. పిల్లలు కాసేపట్లోనే నిద్రలోకి ఒరిగిపోయారు. ఆమెకు మాత్రం ఎంత ప్రయత్నించినా నిద్రాదేవి కరుణించడంలేదు. మదిలో భర్త రాసిన వుత్తరమే మెదులుతోంది.

ఏనాటి ముచ్చట్లు అవన్నీ! తమ పెళ్లయిన కొత్తలో ఒక రోజు కోసం ఆయన పై వూరు వెళ్తే తను ఎంత ఏడ్చేసింది.

ఆ వియోగం ఎన్ని యుగాలవరకో అనిపించింది.

ఎర్రబడ్డ తన కళ్లను చూసి తన చిన్నాడబడుచు ఎంత ఆట పట్టించిందో!

పాతికేళ్లనాటి మధురస్మృతులు మదిలో ఇప్పుడే జరుగుతున్న అనుభూతి!

ఎప్పుడూ ఆఫీసు పని అంటూ బిజీగా వుండే ఆయన్ని, తనని పట్టించుకోడంలేదని ఈ మధ్య ఎంత సాధిస్తోంది!

దగ్గరగా వుంటే అనుభూతులు అంతర్గతంగా వుండిపోతాయి గాబోలు. ఆమె కళ్లు చెమర్చాయి.


ఆయన ఉత్తరానికి జవాబు రాయాలి! ఓ నిశ్చయానికొచ్చాక ఆమె మనసు కుదుటపడి నిద్రలోకి ఒరిగిపోయారు.

నాలుగు రోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం వంట చేస్తూ "నిర్మలా! ఓ కవరుంటే కావాలే! మీ నాన్నగారికి ఉత్తరం రాయాలి" అన్నారు.

"అమ్మా! కవర్లు అయిపోయాయి. సాయంత్రం మీ అల్లుడుగారితో చెప్పి రేపు తెప్పిస్తాలే. రాద్దుగాని. రెండు రోజుల క్రిందటే విశేషాలన్నీ నాన్నగారికి నేను రాసాను కదా! తాపీగా రాయొచ్చు."

రాజేశ్వరమ్మగారి మనసు చిన్నబుచ్చుకుంది.



అప్పుడే నాలుగు రోజుల నుండి రాయాలనుకున్న వుత్తరాన్ని మనసులోనే రాసేసుకుంటున్నారు. ఇంకా పేపరు మీద పెట్టడానికి వీలు కుదరడంలేదు.

మరునాడు అల్లుడుగారు అలవాటు ప్రకారం కవర్లు తేవడం మరచిపోయారు. మాటిమాటికీ అడగాలన్నా గుర్తు చెయ్యాలన్నా మొహమాటం. నిర్మల ఏం అనుకుంటుంది. అమ్మకి రాసే విశేషాలువేరే ఏం వుంటాయి అనుకుంటుందేమో.

తను జవాబు రాయాలనుకుంటూ అప్పుడే పది రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు పోస్టులో మళ్లా రెండు ఉత్తరాలు ఒకటి కూతురుకి, ఒకటి రాజేశ్వరమ్మగారికి వచ్చేయి.

ఆ రాత్రి పిల్లలకి అలవాటుగా కథలు చెప్పి నిద్రపుచ్చేక వుత్తరంరాయాలని సంకల్పించారు.

కాగితం, కలం కావాలికదా, అవి ఎక్కడ నుండి వస్తాయి? ఎదురుగా పిల్లలు హోం వర్క్ పూర్తిచేసి వదిలేసిన పుస్తకాలు పెన్ను కనిపించాయి. వాటిలోంచి ఓ రెండు కాగితాలు పెన్ను తీసుకొని రాయడానికుపక్రమించారు.

తీరా కాగితాలు పెన్ను పట్టుకుందేగాని అన్నీ సందేహాలే! ఏమని "అడ్రస్" చెయ్యాలి? ఇంట్లో అయితే "ఏమండీ" అంటుంది. మరి ఉత్తరంలో? "శ్రీవారికి" అని రాస్తే? అబ్బె. అదిఎబ్బెట్టుగా తోస్తోంది. ఇంకా వేరే ఏమైనా రాయాలన్నా మరీ పుస్తకాల భాషలా వుంది.

ఆఖరికి "ఏమండీ" అని రాయడానికే నిశ్చయించుకున్నారు. క్షేమ సమాచారములతో ప్రారంభించిన ఉత్తరం నమస్కారములతో ముగించి ఆయన కిష్టమైన పిలుపుతో సంతకంచేసి, ఓ మారు మొదటి నుండీ చదువుకున్నారు. ఆమెకి ఆశ్చర్యం వేసింది. తనేనా ఈ ఉత్తరం రాసింది అని.

మరునాడు ఎలాగైనా ఆ ఉత్తరం పోస్టు చేయించాలని జాగ్రత్తగా మడిచి పెట్లో చీరల మధ్య పెట్టేశారు.

* * * * *

ఆ రోజు శుక్రవారం. రాజేశ్వరమ్మగారు తలకి స్నానం చేశారు. పచ్చటి పసిమిరంగులో వున్న మొఖానికి చిటికెడు పసుపుతో మరి కాస్త ఛాయ వచ్చింది ఆమెకి. పట్టుచీరె కట్టుకుని కాసంత కుంకుమతో, పూలసజ్జతో, దేముడి గదిలోకి వెళ్తున్న ఆమెకి బైట కారు ఆగిన శబ్దం అయి "ఎవరు వచ్చారు చెప్మా ఉదయమే!" అనుకుంటూ వాకిట్లోకి వచ్చేరు.

వచ్చిన వ్యక్తిని చూసి ఆమె ఆశ్చర్యానికీ, ఆనందానికీ అవధుల్లేకపోయాయి.

చిరునవ్వులు చిందిస్తున్న శాస్త్రిగారు.

"అలా చూస్తూ నిలబడిపోయావేం రాజీ! గేటు తెరు!" అన్న మాటలకి తేరుకుని "నిర్మలా! మీ నాన్నగారు అప్పుడే వచ్చేశారే!" అంటూ ఓ కేక పెట్టి గబగబ గేటు తెరిచారు.

"ఏం? తొందరగా వచ్చేశానా? పోనీ మళ్లీ వెళ్లిపోనా?" అనిచిలిపిగా నవ్వుతున్న శాస్త్రిగారి చేతిలో సూట్‌కేస్ అందుకుని,

"చాల్లెండి, మీరు, మీ హాస్యాలు. ఇంకా అనుకున్న ప్రకారం మీరు రావడానికి మరో వారం పడుతుందికదా! సడన్‌గా వచ్చేశారని అలా అన్నాను కానీ."

ఇంతలో నిర్మల "అదేంటి నాన్నగారు ఇలా సడన్‌గా వచ్చేశారు? మొన్న రాసిన లెటర్‌లో కూడా వచ్చేస్తున్నట్టు రాయలేదే!"

"అదేంటమ్మా! నువ్వుకూడా మీ అమ్మలాగే అడుగుతున్నావే! పని పూర్తయిపోయింది. వచ్చేశాను."

ముగ్గురు నవ్వులతో సామాన్లు తీసుకొని లోనికి వెళ్లేరు.

కాఫీలు, స్నానాలు, భోజనాలు, అల్లుడుగారితో పిచ్చాపాటీలు ముగిశాక, శాస్త్రిగారు డిక్లేర్ చేశారు, ఆ రాత్రి బండీకే భార్యను తీసుకొని తమ వూరికి వెళ్తున్నట్లు.

కూతురు, అల్లుడు, ఎంతపట్టుబట్టినా పనివుందనీ, అర్జంటుగా వెళ్లితీరాలని ఆ రాత్రి బండీకే బయలుదేరి వెళ్లిపోయారు.


ఉదయం ఎనిమిదిగంటలకల్లా ఇల్లు చేరుకున్నారు. తాళాలు తీసుకొని ఇంట్లో అడుగుపెట్టేసరికి ఇల్లంతా దుమ్ముతో నిండి వుంది. పని మనిషికి కబురు చేసి తనూ ఓ చీపురు పట్టుకొని పని ప్రారంభించేరు రాజేశ్వరమ్మగారు.

శాస్త్రిగారు స్నానం ముగించుకొని అలవాటు ప్రకారం అర్జంటు అంటూ కార్లో ఆఫీసుకు వెళ్ళిపోయారు.

రాజేశ్వరమ్మగారు పని మనిషికి బట్టలు వేసి వుతికించాలని పెట్టెలు తెరిచి ఒక్కొక్కటి తీస్తుంటే చీర మడతలలో తను పెట్టిన ఉత్తరం బైటపడింది.

"అయ్యో! ఈ ఉత్తరం ఆయనకు అందజేయకుండా అయిపోయిందే!" అనుకుని బాధపడ్డారు.

ఎలాగైనా ఈ లెటర్ ఆయనకి అందజేయాలి. పోనీ మామూలుగా చేతికిచ్చేస్తే! ఛ...ఛ...ఆ థ్రిల్ వుండదు. మరి ఎలా?



ఆమె మదిలో మెరుపులా ఒక ఆలోచన మెదిలింది. పనిమనిషిని కేకవేసి చకచక బట్టలు వేసేశారు.

* * * * *

శాస్త్రిగారు ఆఫీసు పని ముగించుకొని ఒంటిగంటకు భోజనానికి వచ్చారు. తిరిగ్గా ఇద్దరూ ఢిల్లీ కబుర్లు చెప్పుకుంటూ భోజనానికి ఉపక్రమించారు.

"ఏమైనా రాజీ- నీ చేతి వంట అమృతం అనుకో! ఇరవై రోజులు ఆ హోటల్ కూడు తినలేక ఎంత అవస్థ పడ్డానో..ఎంత ఫైవ్ స్టార్ హోటల్ అయినా ఆ రుచులు, ఆ ఆర్టిఫిషియాలిటీ అవన్నీ నాకు పడవు సుమా...హాయిగా కమ్మగా మనింట్లో ఇలా ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ తిన్న ఆనందం ఎలా వస్తుంది చెప్పు." అన్నారు.

"అవును మరి. మనకు వయసు మీరి పోతోంది. ఆ హోటల్ భోజనాలు ఏం పడతాయి చెప్పండి. అయినా ఈ మారు ఈ కాన్ఫరెన్సులు, మీటింగులు అంటూ పై వూళ్లకు వెళ్లే మాటైతే ఉద్యోగానికి రిజైన్ చేసేయండి" అన్నారు ఆమె.

ఆయన ఓ చిరునవ్వు నవ్వేసి "అన్నట్లు ...రాజీ.. నా వుత్తరాలకు జవాబు రాయలేదే ఒక్క ఉత్తరమైనా రాస్తావనుకున్నాను సుమా. అయినా మీ ఆడవాళ్లకి నలభై దాటగానే సెన్సాఫ్ హ్యూమర్, రొమాన్సు కొద్దిగా నైనా వుండవోయ్. ఎంతసేపూ పైవూరు వెళ్ళిన భర్తని భోజనం జాగ్రత్త, మందులు వేసుకోండి, నిద్ర సరిగా పొండి, ఇవేగానీ, మీరు ఇంకేం ఆలోచించరు. అవే జీవిత పరమావధి అయినట్టు."

"చాల్లెండి. ఎవరేనా వింటే నవ్వగలరు. అరవై దాటుతున్నాయ్. సెన్సాఫ్ హ్యూమరట, రొమాన్సట, వెనకటికి మీలాంటి ముసలాళ్లే, "తాతా పెళ్లాడుతావా" అంటే పిల్లనిచ్చేవాళ్లుంటే తప్పకుండా అన్నాట్ట బొక్కినోరు సవరించుకొంటూ, అలా వుంది మీ వరస."

"రాజీ..నువ్వు మరిచిపోయావు గాని.. ఆ రోజుల్లో మనం ఎలా వుండేవాళ్లం. నిన్ను వారానికి ఒక సినిమాకు తీసుకెళ్లకపోతే, ఎంత పేచీ పెట్టేదానివి. అలిగి సత్యాగ్రహం చేసేదానివి కాదూ! ఆ అలకలో అసలే చిన్నదైన నీ నోరు మరీ దమ్మిడీలా చేసేసి నన్ను గిలిగింతలు పెట్టేసేదానివి. బైటికెళ్లినప్పుడు నేను నీకు నచ్చినట్టు ట్రిమ్ గా తయారవకపోతే

"మై క్యా కరో రాం....ముఝే బుడ్డా మిల్గయా.."అంటూ పాడేదానివి కాదూ! నీకు మాత్రం అప్పుడప్పుడు అవన్నీ గుర్తురావూ.... వయసు శరీరానికి గాని మనసుకి కాదు కదా"

ఇలా కబుర్లతో భోజనాలు ముగించుకొని అలసి వున్నారేమో బాగా నిద్రపోయారు.

* * * * *

మర్నాడు సాయంత్రం శాస్త్రిగారు ఆఫీసు నుండి వచ్చి సోఫాలో రిలాక్సయి, రాజీ... కాఫీ..అంటూ కేక వేశారు. కాఫీ కప్పుతో ఆమె వచ్చేరు.

కాఫీ తాగుతున్న శాస్త్రిగారి దృష్టి టీపాయ్ మీద నున్న కవరు పై పడింది.

"ఏమిటోయ్ ఏదో లెటరొచ్చినట్లుందే" అంటూ కాఫీ కప్పు ఆమెకి అందించేసి కవర్ ఓపెన్ చేసి చదవడం ప్రారంభించారు.

రాజేశ్వరమ్మగారు ఖాళీకప్పుతో కిచెన్లోకి వెళ్లిపోయారు.

లెటర్ చదవటం యాదాలాపంగా ప్రారంభించిన శాస్త్రిగారు, పై వాక్యాలు, సంబోధన చదివేసరికి ఒక్కమారు అలర్టుగా అయిపోయి చాలా శ్రద్ధగా చిరునవ్వులు చిందిస్తూ ఆ లేఖని చదవడం ముగించేరు.

వుత్తరం మడిచి కవర్లో పెట్టి నిశ్శబ్దంగా కిచెన్ వైపు అడుగులు వేసేరు.

సింక్ లో కప్పులు కడుగుతున్న ఆమె భుజాలపై సున్నితమైన చేతుల స్పర్శ!

ఆమె ముఖం పదహారేళ్ల పిల్లలా సిగ్గుతో ఎర్రగా కందిపోయింది.

శాస్త్రిగారు ఆమెను తనవైపుకు తిప్పుకుని సున్నితంగా ఆమె ముఖం పైకెత్తారు.

"యూ....నాటీ గర్ల్...." అంటూ..

ఇద్దరికీ ఆపుకోలేనంత నవ్వు....

కళ్లంట నీళ్లు....

రెండు నిముషాల తరువాత ఆ ఉద్వేగం నుండి తేరుకున్నారు ఇద్దరూ.

శాస్త్రిగారు గంభీరంగా,

"రాజీ....ఈ రోజు ఈ ఆనందానికి కారణ మేమిటో తెలుసా? ఇన్నాళ్లకి నా గర్ల్ ఫ్రెండ్ దగ్గరనుండీ ప్రేమలేఖ అందుకున్నానోయ్!" అన్నారు.

"పోదురూ బడాయి! పదిహేను రోజుల క్రిందటనే నా బోయ్ ఫ్రెండ్ దగ్గర నుండీ నేనూ ఓ లెటర్ అందుకున్నాను." అన్నారు నవ్వుతూ.

ఇద్దరి నవ్వులతో వాకిట్లో వున్న పారిజాతాలు కూడా శృతి కలిపి వారి ఆనందాన్ని పంచుకున్నాయి. ●

టి. వి. విశ్వామిత్రుడిగా భీష్ముడు



త్వరలో టి. వి. ద్వారా ప్రేక్షకులను అలరించబోతున్న 'విశ్వామిత్ర' సీరియల్ లో టైటిల్ పాత్రను 'మహాభారత్' లో గంగా తనయుడు భీష్ముడిగా నటిస్తున్న ముఖేష్ ఖన్నా పోషిస్తున్నాడట.

ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకుడు డాక్టర్ దాసరి నారాయణరావు ఈ సీరియల్ కు నిర్మాత, దర్శకుడు కూడా.

ఒక్కొక్క భాగం 45 నిముషాల సేపు ప్రసారమయ్యే ఈ సీరియల్ ను 15 భాగాలుగా తీస్తున్నారు.

'మహాభారత్'లో భీష్ముడిగా తనదంటూ ఒక ప్రత్యేకమైన తరహాలో నటిస్తున్న ముఖేష్ ఖన్నా, ఈ సీరియల్ లో తన పాత్రకు న్యాయం చేకూర్చగలడని ఆశిద్దాం!

రచయితలకి సూచనలు

ఆంధ్ర సచిత్రవారపత్రికకి పరిశీలనార్థం తమ రచనలని పంపే వారు ఈ కింది సూచనలని గమనించ కోరుతున్నాము.

రచనలు కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్ పెన్‌తో రాయాలి కాగితానికి రెండు వైపులా రాసి ఉన్న రచనలని పరిశీలించటం జరగదు.

పరిశీలనకి పంపే రచనలు కథలైతే 10 అరఠావు పేజీలకి మించకుండా ఉంటే మంచిది. వ్యాసాలు 3 అరఠావు పేజీలు మించరాదు. వ్యాసాలు పంపేవారు వాటికి సంబంధించిన బొమ్మలు లేదా ఫోటోలు జతపరిచి పంపటం అవసరం.

రచనలు స్వంత రచనలై ఉండాలి అనువాదాలు, అనుసరణలు, కాపీ రచనలు పంపరాదు. ఆ మేరకి రచయిత(త్రి) హామీ పత్రం రాసి సంతకం చేసి రచనతో పాటే పంపాలి.

రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే రాసి ఉండాలి. వ్రాత ప్రతి మీద రచయిత(త్రి) పూర్తి చిరునామా స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయాలి.

కథల పరిశీలనకి 1–2 నెలలు, నవలల పరిశీలనకి కనీసం 6 నెలలు పట్టవచ్చును పరిశీలన అయిన తర్వాత ఏ విషయం ఆయా రచయిత(త్రు)లకి తెలియచేయటం జరుగుతుంది. ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపకోరేవారు తమ రచనతో పాటే స్వంత చిరునామా కల, తగినన్ని తపాలా బిళ్ళలు అతికించిన కవరు జత పరచి పంపాలి. లేకపోతే వాటిని తిప్పి పంపటం సాధ్యం కాదు. రచనలు తిప్పి పంపే విషయంలో తగిన జాగ్రత్త తీసుకోటం జరుగుతుంది కానీ పోస్టులో పోయే వాటి విషయంలో మేము బాధ్యతని స్వీకరించలేము. వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకీ ఆవకాశం లేదు

రచనలు పంపిన వారు తమ చిరునామా మారిన సందర్భంలో వెంటనే ఆ విషయాన్ని మా కార్యాలయానికి తెలియ చేస్తూ ఒక కార్డు రాయటం అవసరం.

ఉత్తరాలు, తదితర పాఠకుల శీర్షికలకి రాసే వారు కూడా తమ పేరు, పూర్తి చిరునామా ఇవ్వాలి. రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి లేకపోతే వాటిని పరిశీలించటం జరగదు.

పరిశీలనకి పంపే రచనలని "సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520003" అనే చిరునామాకి పంపాలి కవరు పైభాగంలో శీర్షిక పేరు రాయటం మంచిది

– సంపాదకుడు

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...ఆరుదవ భాగము

(గత సంచిక తరువాయి)



(ఇంకావుంది)

సీరియల్

శత్రుసంహారం

లల్లాదేవి

(గత సంచిక తరువాయి)

ఇంత వరకూ సాగిన కథ-13: పరమ వీర చక్ర అవార్డు గ్రహీత మహేష్ చంద్ర కొడుకు రాహుల్ వైమానిక దళంలో పైలట్‌గా చేరుతాడు. తల్లి, భార్య కారు ప్రమాదంలో మరణిస్తారు. కుమార్తె సుషుమ్న దగ్గరున్న ఎలక్ట్రానిక్ ఇండికేటర్ వంటి పరికరం వల్లనే సంపత్ మాస్టారి కుటుంబం విచ్ఛిన్నమైందని తెలుసుకున్న రాహుల్ తన కుటుంబ సభ్యుల మరణానికి సంబంధించిన వివరాలను సేకరిస్తుంటాడు. కారవెల్లి విమాన ప్రమాదానికి సంబంధించిన బ్లాక్‌బాక్స్‌లోని ఇండికేటర్‌ను దొంగిలించిన దుండగుల కోసం దర్యాప్తు జరుపుతున్న ఎ.ఎస్.పి. కారంత్ హత్యకు గురవుతాడు. దుండగులను పట్టుకునేందుకు ఒక వైపు పోలీసులు దర్యాప్తు జరుపుతుండగా మరో వైపు సుషుమ్నను దుండగులు ఎత్తుకుపోతారు.

"అంకుల్ మీరు నన్ను ఎక్కడకు తీసుకుపోతున్నారు?" అడిగింది సుషుమ్న.

"నోరు మూసుకో! మాట్లాడావంటే చీరేస్తాను" అన్నాడు యిబ్రహీం.

"నా మీద కోపం ఎందుకు అంకుల్? మీరు మంచివారు కారా?" జాలికలిగేలా అతని గడ్డం పట్టుకుని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నకి ఎలాంటి సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. మౌనంగా ఉండిపోయాడు. చూపులు మరల్చుకున్నాడు యిబ్రహీం!

"అంకుల్! మీరు నాతో పలకరా! ఈ మిక్కీమౌస్ యిచ్చేస్తాను. నాతో మాట్లాడతారా?" అంది మళ్ళీ.

"ఇలారా! వచ్చి నా ప్రక్కన కూర్చో!" అంది పీయూష! కదిలే జీపులోనే అతని తొడలమీద అడుగువేసి ఆమె ప్రక్కకు వచ్చి కూర్చుంది. కుదుపులకి తూలిపోకుండా చేయి అడ్డు పెట్టాడు.

రాయిలా బిగుసుకున్న గుండెలు! ఎడారిలాంటి ఆలోచనలు! అయినా యిబ్రహీం పసిపాప స్పర్శలో ఏదో హాయిని చవిచూచాడు. తిరిగి వెంటనే అతని హృదయం కరుడుకట్టిపోయింది.

"తన లక్ష్యాన్ని సాధించుకునేందుకే ఆమెను బ్రతికి ఉండనివ్వాలి. ఆశయం తీరదనుకున్నప్పుడు నిర్దాక్షిణ్యంగా చంపెయ్యాలి" అని ఆలోచించాడు కర్కశంగా! జాలి ఉంటే నేరస్తులకి ఓటమి తప్పదు.

"అంటీ! మీరు మంచివారా?" అని అడిగింది సుషుమ్న.

"నీకు ఎలా ఉన్నాను?"

"మంచివారులాగే ఉన్నారు."

"అలాగే అనుకో!"

"నన్ను డాడి దగ్గరకు తీసికెళ్ళిపోతారా?"

"అవునమ్మా! అలాగే తీసుకుపోతాం. మరి నువ్వు మాట్లాడకుండా కూర్చుంటావా?"

"అలాగే అంటీ!" మిక్కీమౌస్‌ని గుండెలకు ఆనించుకుని కూర్చుంది సుషుమ్న! కారు జూబిలిహిల్స్ వైపుగా వెడుతోంది.

ఒక అందమయిన లొకేషన్ ఎంపిక చేశారు. అక్కడ ఒంటి స్తంభం మేడలాంటి ఏకాంత భవనం నిర్మాణం జరిగింది. దేవీ ప్రసాద్ ముఖ్య అనుచరుడు కైలాష్ ఛద్దా పథకం అది.

ఆ భవనానికి చాలమంచి ప్రాముఖ్యత ఉంది. నేరస్తులకి కావలసినచోటు అది. ఆ ప్రాంతాలలో చాల గోరీలున్నాయి. సైతానులు తిరుగుతాయని వినికిడి. ఎవరూ ఆ వైపుకురారు. వచ్చినా లోపలివారు త్వరగా పారిపోయేందుకు ప్రక్కనే పెద్ద వ్యాలీ ఉంది. అందుకే అక్కడ ఎంపిక చేశాడు కైలాష్ ఛద్దా!

ఆ యింటి ముందు జీపు ఆగింది. తారురోడ్డు లేదు. కొంతదూరం మట్టి దారిలో రావటం వల్ల శరీరాలు దుమ్ము కొట్టుకున్నాయి.

ఆ యింటి చుట్టూ ఎత్తయిన రాళ్ళమీద ఒక్కొక్కరు చొప్పున ఆయుధాలతో ఉన్నారు. వరండాలో నలుగురున్నారు.లోపల మరికొందరున్నారు.

ముందుగా పాపని తీసుకుని పీయూష లోనికి వెళ్ళింది. ఆ పాప ఎవరో అర్థంకాక అందరూ వెర్రి ముఖాలేసుకు చూస్తున్నారు. ఇల్లు సిద్ధం అయింది. ఇంకా నిపుణులు రాలేదు. వారు వచ్చాక కెమికల్ వెపన్స్ తయారీకి పథక రచన జరుగుతుంది. ఓ విశాలమయిన గదిలో కూర్చుని ఉన్నాడు ఛద్దా!

"వెరిగుడ్. పాపను తీసుకువచ్చారన్నమాట! కర్ఫ్యూ అంటే సహజంగా ప్రజలు అందరూ భయపడతారు. కాని అది మనకొక మంచి అవకాశం! ఇలాంటి సమయంలోనే కావలసిన పనులు సులభంగా చేసుకోవచ్చు. మామూలు సమయంలో ప్రతినేరమూ అధికారుల దృష్టిని ఆకర్షిస్తుంది. వారు పని చేసేందుకు సావకాశముంటుంది. కాని ఈ సమయంలో జరిగిన నేరాలు చాలభాగం గుంపులో గోవిందా!" అంటూ నవ్వాడు ఛద్దా. పీయూష కూడనవ్వింది. అతని ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంది. సుషుమ్నని తన దగ్గరే కూర్చో పెట్టుకుంది.

"కాని ఈ అమ్మాయి కోసం మనం చాల సమయం ఖర్చుపెట్టుకోవాల్సి వస్తుందనుకుంటాను. ఈ పిల్ల చాల అమాయకురాలు" అంది.

"సహజంగా చిన్న పిల్లలు అమాయకంగా

ఉంటారు. నువ్వే చూచుకో!" అన్నాడు వద్దా.

"అలాగే!" అంటూ పాపను తీసుకుని మరో గదిలోకి వెళ్ళిపోయింది పీయూష! ఇప్పుడామెకు తృప్తిగా ఉంది.

"బేబి! ఈ బొమ్మ అంటే నీకు చాల యిష్టమా? ఏదీ చూడనివ్వు" చేతులు చాచిందామె! బేబి భయాన్ని మర్చిపోయి నవ్వింది.

"అవును! మిక్కీ మౌస్ అంటే నాకు చాల యిష్టం. ఎందుకంటే డాడి దీన్ని నాకు కొని యిచ్చారు. నన్ను పప్పాదగ్గరకు తీసుకుపోతారా ఆంటీ?" బొమ్మను యివ్వకుండా ఎదురు ప్రశ్న వేసింది.

"తీసుకుపోతాను. కాని కొంతసేపు మాతో ఉండాలి."

"నేనుండను. నన్ను వెంటనే తీసుకుపొండి."

"మారాం చేశావంటే చెవిమెలివేస్తాను" అంది పీయూష. మెషమ్మ నన్నగా ఏడుపురాగం ప్రారంభించి క్రమంగా దాన్ని పెంచి పెద్దదిగ మార్చింది ఆ భవనంలో అందరికీ విన్పించేలా!

"చాక్లెట్ యిస్తాను. ఊరుకుంటావా?"

"నాకేమీవద్దు పప్పాయే కావాలి" ముంజేతులతో నలుముకున్నందువల్ల కళ్ళు ఎర్రబడ్డాయి.

"మంచి అమ్మాయివి కదూ!? ఊరుకో!' మాటల్లోకి దించాలని ప్రయత్నం.

"నేనూరుకోను. ఈ...ఈ... నాకు పప్పాకావాలి."

"ఎంతసేపూ డాడి గురించి అడుగుతావేం? మమ్మి వద్దా?"

"మమ్మి చనిపోయిందిగా! తిరిగి రాదట. అస్సలు రానేరాదట."


"ఎవరు చెప్పారు నీకు అలా అని."

"ఆంటీ చెప్తూ ఉంటారు ప్రతిరోజూ!"

"ఆంటీ అంటే ఎవరు?"

"తన్వి ఆంటీ! మా మమ్మికి సిస్టర్ ఆంటీ!"

"ఓ అలాగా! ఇంకా ఏం చెప్పింది" నెమ్మదిగా ఆ పిల్ల రాగం మర్చిపోయి మాటల్లో పడుతున్నందుకు సంతోషిస్తూ అడిగింది.



వేలు



అతి తెలివి

"మానవుని చంద్రగ్రహానికి పంపారేగాని, సూర్యగ్రహానికి ఎందుకు పంపలేదో!"

"అది మండుతున్న గోళం."

"ఐతే, రాత్రిపూట పంపొచ్చుగా?"

అదీ అర్థం

"ఇదేవిటి ఈ సారాయి దుకాణం ముందు 'ఇంటికి చేర్చబడు సదుపాయము గలదు' అని బోర్డు పెట్టారు. వీళ్ళు సారాయి ఇంటికికూడా సప్లయ్ చేస్తారేమిటీ?"

"అదికాదు ధాని అర్థం. సారాయి తప్ప తాగి ఇక్కడ పడిపోయిన వారిని వాళ్ళ ఇంటికి చేర్పించే ఏర్పాటు ఇక్కడ ప్రత్యేకం!"

జి. ఎ. జి.

"గ్రానీ కూడ ఇంకెన్నటికి తిరిగి రారట" ఫ్రాక్ అంచులతో తడితడిగా ఉన్న చెంపలు తుడుచుకుంది సుషుమ్న.

"రాకపోతేనేం? నేను ఉన్నాగా భయ పడకు."

"నువ్వు నా కొద్దు! పప్పాయేకావాలి" అంటూ మళ్ళీ కధ మొదటికి తీసుకు వచ్చింది సుషుమ్న. అంతసేపూ వారి మధ్య జరుగు తున్న సంభాషణలో ఎవరునెగ్గుతారా? అని చూస్తూ నిలబడ్డాడు ఛద్దా!

తల ఎత్తి విసుగ్గా అతని వంక చూచింది పీయూష. నవ్వాడు. వారి దగ్గరగా వచ్చాక అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

"చిన్న పిల్లలు గారం చేస్తే మరింత బిగి సిపోతారు. భయపెట్టి నోరు మూయించాలి" అన్నాడు సలహా ఇస్తున్నట్లు. "అదేమిటో చేసి చూపరాదూ?" అప్పటికే విసిగిపోయి ఉన్న పీయూష నోరు జారింది. ఛద్దా బేబినీ రెండు చేతులతో వీలయినంత పైకి ఎత్తేశాడు.

భయంతో కళ్లు మూసుకుంది పీయూష!

బేబి భయంతో కెవ్వుమని అరిచింది. బొమ్మలా బిగుసుకు పోయింది.

"ఛద్దాసాబ్! పసిపాపని చంపటం ఎందుకు. దింపెయ్యండి" పీయూష కళ్ళు తెరిచి పాపవంక భయం భయంగా చూస్తోంది.

"నీకు చాల జాలిగా ఉందనుకుం టాను?" క్రూరంగా అడిగాడు.

"జాలికాదు. ఒక మంచి అవకాశం చేజారిపోతుంది."

"ఈపాప బ్రతికి ఉండి మనకు చేయ గలసాయం ఏముంది?"

"మనకు కావలసిన రహస్యం పాప దగ్గరే ఉంది."

"చెప్పదుకదా? ప్రయోజనం ఏముంది?"

"ఒకవేళ రాహుల్ వస్తే పాపను చూపాలి కదా! పాపను చూపందే చెప్పనంటాడనుకో! ప్లానంతా తలక్రిందులు అవుతుంది" కైలాష్ ఛద్దా ఆవేశం క్రమంగా దిగిపోయింది.

పాపను క్రిందికి దింపేసి క్రూరంగా చూస్తూ నిలబడి పోయాడు. ఆ లేత శరీరం భయంతో వొణు కుతోంది. మిక్కీమౌ స్‌ని మరింత బలంగా గుండెలకు హత్తుకుని భయంగా చూస్తోంది.

"నాకు అప్పగించానన్నావు కదా! ఈ విషయంలో మళ్ళీ ఎందుకు కల్పించుకుంటావు? నేను చూచుకుంటాను. పసివాళ్ళని లాలించాలి. కాని భయపెట్టకూడదు. నువ్వు వెళ్ళిపో!" [illegible]

ఛద్దా అరక్షణం ఆలోచించి వెళ్ళిపో యాడు.

"చూడు బేబీ! నీకు చాల భయమే సిందా?" దగ్గరగా తీసుకుంది.

"అవును. ఆ అంకుల్ మంచి వారు కాదు."

"అవునమ్మా! మంచివారు కాదు. నేను చెప్పినట్టు వింటావా?"

"మీరు చాల మంచివారు ఆంటీ! మీరు చెప్పినట్టే వింటాను. ఈ మిక్కీమౌస్ కూడ యిచ్చేస్తాను. నన్ను పప్పాదగ్గరకు తీసుకు పోండి ఆంటీ! తీసుకు పోతారా?"

"నిన్ను వెంటనే పప్పా దగ్గరకు తీసు కుపోతాను. మరి చెప్పినట్టు వినాలి నువ్వు. వింటావు కదూ?"

"వింటాను. మీరు నిజంగా మంచి వారే!"

"ఇండికేటర్ నీకు దొరికింది కదా? ఎక్కడ దాచావు?"

"అదేమిటో నాకు తెలియదు. నాకెవరూ ఇవ్వలేదు"

"ఉందమ్మా! నీ దగ్గరే ఉండాలి"

"ఇండికేటర్ అంటే ఏమిటి ఆంటీ? ఇలాంటి టాయ్‌కదూ!" అంటూ మిక్కీమౌ స్‌ని ముందుకు చాచి చూపించింది.

"కాదమ్మా! ఎలక్ట్రానిక్ కాలిక్యులేట ర్‌లా ఉంటుంది."

"కాలిక్యులేటర్ అంటే ఏమిటి ఆంటీ?"

"అదికూడ తెలియదా?" అంటూ విసుగ్గా తలవాల్చేసింది పీయూష! కాస్సేప యాక మరో ఆలోచనతో కళ్ళు మెరిశాయి.

"ఆరోజు యాక్సిడెంట్ జరిగింది. గుర్తుందా బేబీ?" అంది.

"అవును. మమ్మీ పోయారు. గ్రాన్నీ పోయారు."

"యాక్సిడెంట్ ఎలా జరిగిందో గుర్తుందా?

"ఓ అబ్బాయి వచ్చాడు. మమ్మీతో తగువు పెట్టుకున్నాడు. డ్రయివర్‌ని కొట్టి ప్రక్కకు త్రోసేశాడు ఆంటీ! అతను గుడ్ బాయ్ కాదు."

"అవునుబేబి. అతను బాడ్‌బాయ్! ఆ తరువాత ఏం జరిగింది?" అనునయించి అడిగింది పీయూష.

"అతను కారుని ఓ చెట్టుకి గుద్దించే శాడు. మమ్మీ గ్రానీ క్రింద పడిపోయారు. నేను మధ్యలో ఉన్నాను కదా! అలాగే ఉండిపోయాను" తన ప్రయత్నం సఫలమవు తున్నందుకు సంతోషించింది.

"మరి తరువాత కారు దిగిపోయావు కదా !" అంది.

"అవును. మమ్మీని పిలిచాను. పల కలేదు. గ్రానీని పిలిచాను. పలకలేదు. ఆంటీని పిలుచుకురావాలని బయల్దేరాను" ఆ పసి మనులోని జ్ఞాపకాలను కొనియాడుకుంది పీయూష !

"వెరీగుడ్ ! అప్పుడు నీచేతిలో ఒక వస్తువు ఉంది కదూ!"

శత్రుసంహారం

"అదంతా నాకు జ్ఞాపకం లేదు ఆంటీ !"

"సరే! అలా నడిచి నీవు ఎంత దూరం పోయావు"

"చాలా దూరం పోయాను ఆంటీ ! కాని మా ఇల్లు కన్పించలేదు"

"ఓ! దారి తప్పావన్నమాట ? మరి ఇంటికెలా చేరుకున్నావు ?"

"ఆంటి వచ్చి తీసుకుపోయారు."

"అప్పుడు నువ్వు ఎక్కడ వున్నావు"

"ఒక అబ్బాయి నాకు బిస్కట్లు ఇచ్చాడు, అక్కడ వున్నాను."

"అప్పుడు నీ చేతిలో ఏముంది ?"

"బిస్కెట్లు ఉన్నాయి" మళ్లీ తల పట్టుకుంది పీయూష !

"అవి కాక మరింకేమీ లేవా బేబీ !" విసుగు దాచుకుంది.

"ఏమో అదంతా నాకు తెలియదు."

"అసలు విషయం మినహాయించి మిగిలిన కథ అంతా బాగానే చెప్పావు ?" అక్కసుగా పళ్లునూరిందామె.

"మీరుకూడా మంచివారు కారా ఆంటీ ?" పెద్దగా ఏడ్వేయటానికి తుఫాన్ మూచనలా పెదవులు వొంపు తిరుగుతున్నాయి.

"చెప్పకపోయినా చాలు ! ఏడవకమ్మా, ఏడవకు. ఏడిచావంటే మీ పప్పా దగ్గరకు తీసుకుపోను" అంది. ఈ మంత్రం బాగానే పనిచేసింది. ముఖంలో తుఫాన్ కళ తగ్గిపోయింది.

తన ప్రయత్నం ఫలించనందుకు ఉస్సూరని నిట్టూర్చింది. తల పట్టుకుని కుప్పకూలిపోయింది పీయూష !

* * * *

నగర వీధుల్లో జనసంచారం ప్రారంభమయింది.

ప్రజల ఇబ్బందులు తీర్చటం కోసం పగటిపూట కొద్ది గంటలు కర్ఫ్యూ సడలించారు. కాని జనం భయం ఇంకా తగ్గలేదు. ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని తెరిచారు. కొన్ని తెరవలేదు. వ్యాపార సంస్థలు పూర్తి విశ్వాసాన్ని పొందలేక షాపుల్ని మూసేశారు.

నగరం నాలుగు మూలల్నుంచి ఎన్నో వార్తలు వస్తున్నాయి. వాటిలో కొన్ని నీలి వార్తలు కూడా కలిసిపోతున్నాయి. జరిగిన విధ్వంస కాండ తాలూకు చిహ్నాలు ఇంకా వీధుల్లో కనిపిస్తున్నాయి.

రాహుల్ అమిత వేగంగా నడుస్తున్నాడు. మనిషి పూనకం వచ్చిన వాడిలా అయ్యాడు. అతని ముఖం ఆవేశంతో నిండిపోయి వుంది. ఏదైనా వాహనం కోసం ప్రయత్నించాలన్న స్పృహ కూడా కలగలేదు. జీవితంలో మిగిలి వున్న ఒకే ఒక్క ఆశ బేబి ! ఏ క్షణంలో అయినా చంపివేయగలిగిన కిరాతకుల చేతికి చిక్కిపోయింది. ఆమెను కాపాడుకోవాలి. వారడిగిన వస్తువు తన దగ్గర లేదు.

లేదని చెప్పినా నమ్మదగిన స్థితిలో వారు లేరు. ఒక ఎ. ఎస్. పి. ని చంపి, ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు నగరంలో ఇంత బీభత్సాన్ని సృష్టించగలిగిన వారు చేయలేనిదేముంటుంది ?

ఇరవై నాలుగ్గంటలలోగా అప్పగించాలట ఈ లోగా వారు బేబీని ఏమీ చేయకపోవచ్చు. తిరిగి ఆ సమయానికి తనకి ఫోన్ రావచ్చు. అప్పుడు ఒక చోటు నిర్ణయిస్తాను. ఈలోగా బేబీని అక్కడికి తీసుకుపోతారు. పోలీసులకి చెప్పినా ఆ స్థితిలో ప్రయోజనం ఉండదు. చేయగలిగింది ఏదైనా ఉంటే ఈ లోగానే చేయాలి.

కాని పని ఎక్కడ ప్రారంభించాలి అనేది ప్రశ్నార్థకంగానే ఉండిపోయింది. పూర్తి ఆవేశంతో ముందుకు పోతున్నాడు. పోలీస్ స్టేషన్ల

శత్రుసంహారం

కిటకిటలాడిపోతున్నాయి. పోలీసులు వందలాది మందిని తీసుకువచ్చి ప్రశ్నిస్తున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఇసుకవేస్తే రాలనంత జనం.

డిటెన్షన్‌లో ఉన్నవారు, ప్రశ్నించటం కోసం పిలిపించినవారు, కంప్లయింట్స్ ఇచ్చేందుకు వచ్చినవారు రకరకాల మనుషులు !

పోలీసులు హడావిడిగా ఉన్నారు. వైర్‌లెస్ నిర్విరామంగా పనిచేస్తూనే ఉంది. జిల్లాల నుంచి అదనపు బలగాలు వచ్చి దిగాయి. రాష్ట్రంలోని ప్రత్యేక బెటాలియన్లు వచ్చినా చాలలేదు.

కాస్సేపు వారిమధ్య తిరిగాడు రాహుల్ నగరంలో కర్ఫ్యూ విధించిన కాళరాత్రి జరిగిన ఘోరాలు ఒక్కొక్కటే బయటపడుతున్నాయి. తప్పి పోయిన పిల్లలు చాలామంది ఉన్నారు. కుటుంబంలోని వారంతా చనిపోగా ఒంటరిగా మిగిలిపోయిన పిల్లలూ ఉన్నారు.

వారందరినీ చూచి వచ్చాడు రాహుల్ బేబీ జాడ లేదు. ఆ రాత్రి తనకు కనిపించిన నేరస్థులు ఎవరూ అక్కడ లేరు. అసలు నేరస్థులు ఎప్పుడూ పోలీసులకి అంత సులభంగా దొరకరు.

కర్ఫ్యూ సమయంలో జరిగిన ఘోరాలు ఒక్కొక్కరూ చెపుతూ ఉంటే వినేవారి గుండెలు కరిగిపోతున్నాయి. బ్రతుకు కలలు చెదిరి పోతున్నాయి. అందరిలోనూ జీవితానికి భద్రత ఏముంది ? అన్న ఆలోచన ఒక్కటే !

కొందరు వ్యాపారులు సంవత్సరాల తరబడి కష్టించి పిచ్చికగూళ్లులా పెంచుకున్న వ్యాపారాలు కూలాయి. సున్నాలు మిగిలాయి. డబ్బు ఉన్నవారి బాధలు అన్నీ ఒకరకం !

డబ్బు లేని వారి బాధలు అనేక రకాలు. ఎవరికి వారికే ప్రత్యేక రకం ! చాలా సేపు వారిమధ్య తిరిగాడు. కరుణామయమయిన ఆ కథలు విన్నాడు. గుండెలు ద్రవించాయి. కాని ఆ రాత్రి తాను చూచిన మనుషులలో ఒక్కరు కూడా పోలీసులు పట్టి తెచ్చిన వారిలో కన్పించలేదు.

నగర పోలీస్ కమిషనర్ తన ప్రత్యేక ఛాంబర్ వొదిలేసి ఒక పెద్ద హాలులో దర్బారు చేసి కూర్చున్నారు. చుట్టూ పోలీస్ ఆఫీసర్స్ ఉన్నారు. నగరంలో నాలుగు మూలల నుంచీ వచ్చే వార్తల్ని విశ్లేషిస్తున్నారు.

క్రయిమ్ నేచర్‌ని బట్టి ఎవరు చేసి ఉంటారో ఊహించేందుకు ప్రయత్నిస్తున్నారు. చాలా హడావిడిగా ఉన్నారు కమీషనర్. కొద్దిపాటి అడ్డంకుల్ని తప్పించుకుని లోనికి వెళ్లాడు రాహుల్.

ప్రజలసమస్యల్ని కమిషనర్‌గారు స్వయంగా వినేందు కోసం ఆ తలుపులన్నీ తెరవబడ్డాయి. అందువల్ల సులభంగా వెళ్లగలిగాడు.

కమీషనర్ రాహుల్‌ని గుర్తించారు.

"ఇప్పుడు మీ ఆరోగ్యం ఎలా వుంది ?" అని ప్రశ్నించారు కరచాలనం చేస్తూ ! గౌరవించి కుర్చీ యిచ్చారు. మిగిలిన ఆఫీసర్స్ రాహుల్‌ని వింతగా చూస్తున్నారు. కమీషనర్ చాల బిజీగా ఉన్న సమయంలో కూడ అంత ప్రాధాన్యత యిచ్చిన ఆ వ్యక్తి ఎవరో అక్కడున్నవారిలో చాలమందికి తెలియదు. ముఖాలు చూచుకున్నారు.

"మీరు నర్సుల ప్రాణాలు కాపాడారనే అనుకోవాలి. ఎందుకంటే వారు డిటెయిన్ అయిన ప్రాంతంలో చాల ఘోరాలు జరిగాయి. ప్రస్తుతం వారంతా క్షేమంగా యిళ్ళకి చేరుకున్నారు."

"మనం వెళ్ళిన వీధిలో వివరాలు పూర్తిగా తెలిసాయా?"

"ఎనిమిదిమంది చనిపోయారు. యిరవై యిళ్ళు తగలబడ్డాయి. వీధి అంతా పూర్తిగా దోచుకున్నారు. దోచుకున్న సొమ్ము యిరవై లక్షల దాకా ఉంటుంది. నష్టం కోటి రూపాయలు."

ఆ మాటలు వింటూ అలసటగా కళ్లు మూసుకున్నాడు రాహుల్.

"....కాని మీ పాప సంగతి యింతవరకూ తెలుసుకోలేకపోయాం. మీరు పోలీసులకి ఎంతో సహకరించారు. అందువల్ల మాకు ప్రత్యేక శ్రద్ధ ఉంది మీగురించి. ముగ్గురు మెన్‌తో ఒక స్క్వాడ్‌ని పంపాను. కాని దురదృష్టవశాత్తు మీ పాప గురించి వారేమీ రిపోర్టు తీసుకురాలేకపోయారు." అంటూ ముగించారు నగర పోలీసు కమీషనర్.

రాహుల్ కన్నులు చెమరించాయి. మిగిలి ఉన్న ఒకే ఒక్క జీవితాశ! తన జీవితానికి అర్థం కల్పించగలిగిన ఒకే ఒక్క వెలుగు కిరణం ఆమె!

ఇంక అక్కడ ఉండాలనిపించలేదు. తనకు వచ్చిన టెలిఫోన్ కాల్ గురించి వారికి చెప్పి చర్చించి ప్రయోజనం లేదు. నగరంలో పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. సమస్య అంటూ లేనివారు ఎవరూ లేరు.

సముద్రంలో మునిగిపోయిన సూదికోసం వెదకాలి. ఆశ చిరంజీవి !

"సరే! మీ ప్రయత్నం మీరు చేయండి. నా ప్రయత్నం నేను చేస్తాను." పూడుకుపోతున్న కంఠస్వరంతో చెప్పాడు రాహుల్ !


"మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేరుగా నన్ను కాంటాక్టు చేయండి. భగవంతుడు అంతా మీకు మంచి చేయాలని కోరుకుంటున్నాను. విష్ యూ బెస్టాఫ్ లక్" అంటూ వీడ్కోలు యిచ్చారు కమీషనర్..

"థాంక్ యూ సర్" వెలుపలకు నడిచాడు. స్పెషల్ బెటాలియన్ పోలీసులు ఇంకా చౌకులదగ్గర గుంపులుగా ఉన్నారు.

పాఠశాలలు తెరవలేదు.

బేబిని దొంగిలించటంలో తనని ఫోన్‌లో బెదిరించే అమ్మాయి పాత్ర ఉందని తనకి తెలుసు. ఆ కాళరాత్రి యిబ్రహీంతో మాట్లాడుతూ ఉండగా ఆమె పేరు పీయూష అని కూడ తెలిసింది.

వారందరికి శ్రీ మహాదేవి అలయన్స్ సంస్థతో సంబంధాలున్నాయి అనేది విదితమయిపోయింది. ఈ డొంకంతా కదపాలంటే



యిబ్రహీం అనే తీగ పట్టుకునిలాగాలి. తనకు తెలిసిన అవకాశం అదొక్కటే. యిబ్రహీం శివాలయంలో ఉద్యోగికి మిత్రుడు ! నేరుగా ఆలయం దగ్గరకు చేరుకున్నాడు. తలుపులు మూసి ఉన్నాయి. ఆలయ ముఖమంట పంలో బాసికం పట్టువేసి కూర్చుని ఉన్నాడు పూజారి! ప్రదక్షిణ చేసేందుకోసమయి అల యంచుట్టూ తిరిగివచ్చాడు రాహుల్. ఆ సమయంలో మెలుకువగా చూచి గుర్తించాడు. యిబ్రహీం అక్కడ లేడు. అతను ఉండే గది తలుపులు వెలుపలనించి మూసి ఉన్నాయి. కార్యాలయం మూసి ఉంది.

సమాచారాన్ని సంపాదించుకునేమార్గాన్ని వెతుక్కుంటూ ముఖమంటపంలోకి వచ్చాడు అర్చకుడున్నా ఆలయం తలుపులు మూసే ఉన్నాయి. అతనిముందు ఓ ఉద్ధరిణీ, పంచపాత్ర ఉన్నాయి.

ఒక వ్యక్తి తనవైపు రావటం చూచి చేతిలో ఉన్న జపమాలని త్రిప్పటం మానేశాడు. క్రిందినించిపైకి పరీక్షగా చూచాడు.

"ఈరోజు ఆలయం మూసివేయమని ట్రస్ట్ బోర్డు తీర్మానించింది. మీరెందుకు వచ్చారో అడగవచ్చునా ?" అన్నాడు ముందుగానే!

"అవును. సైతానులు కళ్ళు తెరిస్తే దేవాలయాల తలుపులు మూసుకుంటూ కష్టాలు గట్టెక్కిస్తాడని అందరూ కొలుస్తారు దేవుణ్ణి! సైతానుల బెడదకి ఆ దేవుడికే కష్టం వేసి కళ్ళు మూసుకుంటే మాలాంటి మామూలు మనుషులేం చేయగలరు పూజారిగారూ!"

"అది తప్పదు బాబూ ! దేవుడు కళ్ళు తెరిచేవరకే సైతానులు నర్తిస్తాయి."

"నేను దర్శనానికి రాలేదు. యిబ్రహీం కోసం వచ్చాను" ఆ పేరు వింటూనే ఉలిక్కిపడ్డాడు పూజారి.

"ఇదివరకు కూడ నువ్వు అతని గురించి అడిగావనుకుంటాను" అన్నాడు.

"అవును ఒకసారి వచ్చాను."

"అతను నీకు బంధువా ?"

"నాకు కావలసిన మనిషి ప్రస్తుతం అతడే!"

"బాబూ ! నాదగ్గరకు వచ్చినప్పుడు నువ్వు ఏ విషయమయినా నిరభ్యంతరంగా మాటాడవచ్చు. కాని అతని గురించి మాత్రం ప్రశ్నించకు. ఎందుకంటే యిబ్రహీం గురించి నాకేమీ తెలియదు" అతని గురించి మనసులో ఉన్న భయాన్ని దాచుకోవాలని ప్రయత్నించాడు.

కాని ఆ భయం కాస్తా బయటపడిపోయింది. రాహుల్ కి అర్థమయింది.

"పోనీ అతను ఉండేది ఎక్కడో చెప్పండి. ఇంటి అడ్రస్."

"ఇంకెప్పుడూ నా దగ్గర అతని గురించి మాట్లాడనంటే చెప్తాను" రాహుల్ అంత బాధలోనూ నవ్వుతున్నాడు.

కష్టాల్లో యిరుక్కోకుండా సుఖంగా బ్రతకాలని పిరికితనాన్ని ఆశ్రయిస్తారు మనుషులు! కాని ఆ పిరికితనంవల్లే జీవితం ఓటమికి గురి అవుతుంది. అంతేకాదు. మనస్తాపం కూడ పెరుగుతుంది.

"అలాగే పంతులుగారూ! ఇంకెప్పుడు మీదగ్గర అతని గురించి మాట్లాడను. యిల్లు ఎక్కడో చెప్పండి" అన్నాడు బ్రతిమాలే ధోరణిలో !

"చెప్తాననుకో! ఆ మహానుభావుడు ఇంటిదగ్గర ఉంటాడనే నమ్మకం ఏముంది నాయనా?" అన్నాడు మళ్లీ సందేహిస్తూ !

"అదంతా నేను చూచుకుంటాను. మీరు చెప్పండి."

"ఏం చూచుకుంటావు బాబూ ! కోపం వస్తే కొంపలమీదపడి దాదాగిరి చేస్తాడు. అడ్రస్ నేను యిచ్చానని అతనితో చెప్పవు కదా!?"

"ప్రామిస్ చేస్తున్నాను. అతనితో మీగురించి చెప్పనే చెప్పను"

"ఇంతకూ నువ్వు పోలీసు ఉద్యోగివా

"కాదులే చెప్పండి సార్ ! త్వరగా పోవాలి" అన్నాడు రాహుల్. పూజారి చివరిసారిగా చుట్టూ తలత్రిప్పి చూచాడు. ఆ ప్రాంతాలలో తామిద్దరూ తప్ప మరొక మనిషి లేడనే నిర్ధారణకి వచ్చాక నెమ్మది అయిన స్వరంతో చెప్పటం ప్రారంభించాడు.

"ఈ ఎదురువీధిలో కుడిచేతిప్రక్క అయిదో యిల్లు. చాల భయంకరమయిన చోటు. నువ్వు వెళ్ళదలుచుకుంటే జాగ్రత్తగా వెళ్లాలి" అని చెప్పటం ముగించి తల ఎత్తి చూచాడు.

అప్పటికే చాల వేగంగా మెట్లు దిగిపోతున్నాడు రాహుల్ !!

(ఇంకా ఉంది)

రాజేంద్రప్రసాద్



"ట్యూబ్ లైట్ లు"

కొందరు ట్యూబ్ లైట్ లు ఉంటారు. వాళ్ళు ఒక జోక్ కు మూడుసార్లు నవ్వుతారు....

ఎలాగంటారా?

మొదట ఆ జోక్ ను వినగానే మామూలుగా నవ్వేస్తారు. అసలందులోని జోక్ ఏమిటో వివరించాక రెండోసారి నవ్వుతారు. చివరికి ఆ జోక్ అర్థమైనప్పుడు మూడోసారి ఫకాలున నవ్వేస్తారు!

పొదుపరితనం

కేషియర్ కేశవయ్య తనకు సెలవు కావాలని చీటీరాసి తీసుకొచ్చి, మేనేజర్ టేబుల్ మీద ఉంచాడు. మేనేజర్ ఎగాదిగా చూస్తూ, "ఏమిటయ్యా! రెండు నెలల క్రితం మీ అత్తగారు చచ్చారని పదిరోజులు లీవు తీసుకున్నావ్. పోయిన నెలలో మీ పిల్లలకు మశూచికం అంటూ వారం రోజులు లీవు తీసుకున్నావ్. మళ్ళీ ఇప్పుడెందుకు లీవు?" అని అడిగాడు.

"పెళ్ళి చేసుకోబోతున్నా సార్!" అన్నాడా కేషియర్.

ఆ మేనేజర్ ట్యూబ్ లైటు. అందుకే చెప్పిన అనుమానం కల్గలేదు. తాపీగా ఆ సెలవు చీటీని చేతికందుకుని, "అదికాదు కేశవయ్యా! ఇటీవల కాగితం ధర విపరీతంగా పెరిగిపోయినందువల్ల బాగా పొదుపు చేయాలని ఒక సర్క్యులర్ ను నోటీస్ బోర్డులో వేయించానా? ఈ లీవ్ లెటర్ ను ఠావుసైజు కాగితంమీదరాసి తెస్తావా? ఎంత వేస్ట్? ఈ కాగితాన్ని చించిపారేసి, వేరే చిన్న కాగితంమీద రాసి తీసుకురా. శాంక్షన్ చేస్తా!" అన్నాడు.

జి. వి. జి.

క్షమాపణ చెప్పుకోడం కూడా ఒక కళే!

తప్పులు చేయడం మానవ సహజం. కాని చేసిన తప్పులను ఒప్పుకోవడం, లేక బాధ్యత వహించడం అన్నది చాలా మంది చేయలేరు. చాలా మటుకు చేసిన తప్పులకు తగిన సాకులను వెదకి అందునుంచి తప్పుకోటానికి ప్రయత్నాలు చేస్తుంటారు. మనం చేసే పొరపాటు పనుల వల్ల లేక మాట్లాడే మాటలవల్ల, ఎదుటి వారి వస్తువులు పాడవటం, మనసులు బాధ పడటం జరుగుతుంది. అలాంటి సందర్భాలలో క్షమాపణ చెప్పుకోవటం కనీస నాగరిక లక్షణం. కాని చెప్పుకునే తీరులోనే తేడాలుంటాయి. ఏ సందర్భంలోనైనా ఎవరికైనా క్షమాపణ చెప్పుకునే టపుడు పాటించాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.



గోడకి సారీ!

క్షమాపణ చెప్పుకునేటప్పుడు ఏ గోడకో, బల్లకో చెబుతున్నట్టుగా ఎటో



చూస్తూ చెప్పడం కాకుండా ఏవ్యక్తి నుద్దేసించి చెబుతున్నామో ఆ మనిషి కళ్లలోకి సూటిగా చూస్తూ హృదయాన్ని కదిలించే నిజాయితీతో క్షమాపణ చెప్పడం అన్నది అతి ప్రధానమైనది. ఇలా చేసినపుడు ఆ క్షమాపణ వాక్యాలు, దాని వెనుకనున్న భావం ఆ వ్యక్తులకే చెందాలన్న భావం కల్పించడానికి వీలవుతుంది. ఇది విజయవంతంగా క్షమాపణ చెప్పుకోవడానికి ప్రథమసోపానం. అధికార స్థానంలో ఉన్నవారు సాధారణంగా తమ క్రింది ఉద్యోగుల తప్పులకు వాళ్లను పిలిచి చీవాట్లేయడం మామూలే. ఒక్కొక్కసారి అలాంటి పొరపాట్లకు మూలకారణం పై అధికారే అని ఋజువౌతూంటుంది. అలాంటపుడు అధికారియైన వ్యక్తి తన క్రింది ఉద్యోగిని పిలిచి క్షమాపణ చెప్పుకోవడం కనీస మర్యాద. ఇది ఎంత మంది చేయగలుగుతున్నారు? అలా చేయాలని అనుకునే వాళ్లు ఆ చేసేదేదో మొక్కుబడి తీర్చుకున్నట్లుగా కాకుండా నిజాయితీతో చేసినపుడు క్రింది ఉద్యోగికి తన బాస్‌పై గౌరవం పెరుగుతుంది. అంతే కాని వాళ్లని పిలిపించి ఏదో అర్జెంటు ఫైలు ముందేసుకుని దాన్లోకి చూసుకుంటూ తనక్షమాపణను చెప్పడం వల్ల ఏ మాత్రం దాని ప్రభావం ఉండదు.

సే 'సారీ'! బి హ్యాపీ !!

డబ్బు నష్టం

కాని కొన్ని పొరపాట్ల వల్ల ఎదుటివారికి ఆర్థిక నష్టం కలుగుతూ ఉంటుంది. దానికి కావల్సిన డబ్బు పారేస్తే పోతుందిలే అనుకుంటారు కొందరు. ఉదాహరణకి ఎవరింటికైనా పిల్లలతో వెళ్లామనుకోండి. మన పిల్లలు ఆ యింటిలోని ఖరీదైన సోఫాసెట్టును ఏ బ్లేడుతోనో కొయ్యడం లాంటి పనులు చేసినపుడు ఆ ఇంటివాళ్లు మనసు చివుక్కుమంటుంది. మనం వాళ్ల ఎదుట పిల్లల్ని కోప్పడినా, చాలా పొరపాటు జరిగిందని వందసార్లు అన్నా ఏమీ ప్రయోజనం ఉండదు. ఆ స్వంతదారు



పైకి ఏమీ అనలేకపోయినా లోపల చాలా బాధపడతాడు. ఇలాంటప్పుడు ఒట్టి మాటలతో కాక ఆ సోఫా కొన్న కంపెనీవాళ్లతో దాన్ని బాగుచేయడానికి తగిన ఏర్పాటు చేసి, దానికయ్యే రిపేరు ఖర్చును మనమే కట్టడం ద్వారా మన క్షమాపణలోని నిజాయితీని చేతల్లో నిరూపించుకోవచ్చును..

పొరబాట్లు జరిగిన వెన్వెంటనే అంటే

ఆలస్యం లేకుండా క్షమాపణ చెప్పుకోవడం అన్నది ముఖ్యంగా అతి సన్నిహితుల మధ్య అత్యవసర మయిన విషయం. అంతే కాని సాకులతో తప్పించుకోవడం, చేసిన తప్పును సమర్థించుకోడానికి ప్రయత్నించడం లాంటి వాటివల్ల మనం చెప్పే క్షమాపణ వాక్యాలు పేలవంగా మారి ఎదుటి వ్యక్తిని క్షమించనీయకుండా చేసి, ఇద్దరి మధ్య ఉన్న మనస్తాపం మరికొంతకాలం పొడిగించ బడుతుంది. కొంతమందికి నోటితో కాకుండా కాగితంమీద క్షమాపణలు తీసు




కోవడం ఇష్టంగా ఉంటుంది. ఇలా రాసివ్వడం కూడా ఒకందుకు మంచిదే. దాన్ని ఒక్కొక్కసారి తిరిగి చదువు కోవటంవల్ల రాసిన వారి మాటలలోని నిజాయితీతో ఎదుటివాళ్లు వారి తప్పును తేలికగా క్షమించడానికి అవకాశముంది. పైగా అది ఒక ఋజువుగా మిగిలిపోతుంది.

కొంతమంది తగాదాలను మితిమీరి పెరగనీకుండా ఉండడానికి చేసిన పొరబాటు పనికి కాని అడిన ఘాటకు వెంటనే క్షమాపణ చెప్పుకుని ఆ విషయాన్ని అక్కడ తుంచేస్తారు. వీరు నిజంగా బ్రతక నేర్చినవారు.

ఒక వ్యక్తి ఒకసారి పొరపాటు చేసి క్షమాపణ చెప్పుకున్న తరువాత అతి ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే అదే పొరపాటును తిరిగి చేయకుండా ఉండడం. ఒకవంక క్షమాపణలు చెబుతూనే మరోవంక మళ్లీ మళ్లీ ఆ పొరబాటును చేయడం వల్ల ఆ క్షమాపణకు విలువ లేకుండా పోతుంది. ముఖ్యంగా మతిమరుపు ఉన్న వ్యక్తులు కొన్ని వ్యసనాలకు అలవాటైన వ్యక్తులు చేసే పనులివే. కనుకనే వాళ్లకి ఎదుటి వాళ్ల సానుభూతి అంతంతమాత్రంగానే లభిస్తూ ఉంటుంది.


క్షమాపణలు చెప్పుకోవడంలో పద్ధతులున్నట్లే ఎదుటి వాళ్లు మనకి చెబుతున్న క్షమాపణా వాక్యాలను స్వీకరించడంలో కూడా నైపుణ్యాన్ని చూపాల్సి ఉంటుంది. ఉదాహరణకు పిల్లలు పొరబాట్లు చేసి దానికి క్షమాపణ చెప్పుకునేటప్పుడు తల్లి, తండ్రి వాళ్లని మెచ్చుకొని, పిల్లలు తమ పొరబాట్లను దాచుకోవాల్సిన అవసరం లేదన్న విషయాన్ని తమ మాటలలో చూపించాలి. కొంతమందికి హృదయంలో ఉన్న పశ్చాత్తాపం మాటలతో తెలియచెప్పటం చేతకాకపోవచ్చు. అలాంటప్పుడు మనమే వారిని అనునయించి వారి పశ్చాత్తాపాన్ని, మనం గ్రహించిన విషయాన్ని తెలియజేసి వాళ్ల మనసులోని భారాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తే ఇద్దరి మధ్య ఉన్న బంధం మరింత గట్టిపడుతుంది. "టు ఎర్ర్ ఈజ్ హ్యూమన్ అండ్ టు ఫర్‌గివ్ ఈజ్ డివైన్" అని అన్న పెద్దల వాక్యంలోని సారాన్ని



ఇలా చేయడం ద్వారా నిరూపించిన వారవుతారు.

ఒక్కొక్కసారి మనలోని క్షమాగుణం ఒక పాలు ఎక్కువైతే ఎదుటివాళ్లకి చులకనైపోవడం కూడా జరుగుతుంది. ఈమధ్య శ్రీలంకలోని తమిళుల సహాయం కోసం ఆహార పదార్థాలు పంపాలని భారతదేశం చేసిన ప్రథమ ప్రయత్నంలో, అహింసా విధానమని, సామరస్యంగా ప్రయత్నాలు జరిగినపుడు దాన్ని చేతకానితనంగా భావించి నావలను అటకాయించి వెనక్కి పంపించారు. కనుక అతి క్షమాగుణం కూడా ఒక్కొక్కసారి బెడిసి కొడుతుంది. ఎదుటివాళ్ల యోగ్యతనెరిగి మన ప్రవర్తనను మలుచుకోవాలి. కనుకనే నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు అన్నాడు సుమతీ శతకకారుడు.

కె. ఎస్. శాంతలక్ష్మి
(అనంతపురం)



శ్రీ గణేశ స్మరణమ్

"ప్రాతస్మరామి గణనాథమనాథబంధుం
సింధూరపూర్ణ పరిశోభిత గండయుగ్మం
ఉద్దండ తీక్షణ పరిఖండన చండదండ
మా ఖండలాది సురనాయక బృందవంద్యం"
గౌరీతనయా గజాననా
గంగా తనయా వరాననా
ఇద్దరు తల్లుల ముద్దు బిడ్డడవు
ఉద్ది ఎరుగనీ గణాధినేతవు---గౌరీ
అరవిరవిచ్చిన పరిమళ సుమములు
విరియగాచినవి ఎన్నో వరుసలు
గరికల్లు, జిల్లేడు మారెడు రకములు



"శశివర్ణం చతుర్భుజం..."
(వి. వాసవి. ఏలూరు)

హృదయ పుష్పముతో చేర్చిన వివిగో!---గౌరీ
విద్యల కెల్లను ఆదిదేవుడవు
విక్రమానికీ ఆరాధ్యుడవు
అష్టసిద్ధులకు యిష్టదేవుడవు
ప్రమథ గణమ్ముల పెద్దవాడవు---గౌరీ
స్వర్గమర్త్య పాతాళమ్ముల
సాధించిన నీ కీడు లేరని
లేనేలేరని గాథలు పలుకును
వాదములేదు - వరప్రసాదుడవు!

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

ఏ విజయలక్ష్మి!?

(45 వ పేజీ తరువాయి)

భయపడుతున్నారు... ఏమిటిదంతా నాకేం అర్థం కావడం లేదు.

హెడ్ క్లర్క్ : మీకర్థం కాదండీ, మీకర్థం కాదు. తరుణార్చుని మా చేతులో మా గొయ్యి తవ్వకున్నాం.......

గుర్నాధం : (ఉక్రోషంగా) అసలిదంతా మీ ఇంటి పేరు మూలాన వచ్చింది "ఏ" అని అంటుంటి ప్రశ్నిస్తున్నారనుకున్నాం గాని.....

సిమ్మాద్రి : టిపిస్టు ఇజాలక్ష్మిగారండవే గాని ఎ. ఇజాలక్ష్మిగారని ఎవరికీ తెలియక పోయే- అసలు గుర్నాదంగాబుగారిక్కూడా...

గుర్నాధం : నువ్వు నోరు ముయ్యరా రామాయణంలో పిడకల వేటలా నీ వాగుడొహటి.....

సూపర్నెంటు : అసలా వెధవ పేపరు చూడకుండా వున్నా బాగుండేది. ఆ ఫొటో కనపడేదీగాదు... అనుమానం వచ్చేదీ గాదు...

హెడ్క్లర్క్ : మనిషి చూడబోతే పారిపోయొచ్చిన బందిపోటు దొంగలాగున్నాడాయె....

విజయలక్ష్మి : 24 గంటలు ట్రైన్ ప్రయాణం చేసిన వాళ్ళు అలాక్కాక కడిగిన ముత్యాల్లా వుంటారటండీ! అయినా ఆయన అంద చందాలకీ మీ భయానికీ సంబంధం ఏమిటిటా.... (పోలీస్ వేన్ వస్తున్న చప్పుడు)

గుర్నాధం : (ఉలిక్కిపడి) అదుగో పోలీసులు రానే వస్తున్నారు... విజయలక్ష్మిగారూ ఇవి కాళ్ళుగావు.... నన్ను రక్షించే భారం మీదే (ఏడుపు గొంతు)

హెడ్ క్లర్క్ : విజయలక్ష్మిగారూ ఇవి చేతులు కావు.... ఎలా చెపుతారో ఏం చెపుతారో నన్ను కాపాడే భారం మీది. (ఏడుపు గొంతు)

విజయలక్ష్మి : ఇదేంటండీ కాళ్ళొకళ్ళు చేతులొకళ్ళు... పడిపోయే లాగున్నాను. వదలండి.....

సూపర్నెంటు : అమ్మాయ్. నా కూతురులాంటి దానివి. గడ్డం పుచ్చుకు బ్రతిమాలుకుంటున్నా, తల్లి తల్లి నన్నీ కష్టంలోంచి గట్టెక్కించే భారం నీదే....

విజయలక్ష్మి : మీ గొడవ మీదే గాని నా సంగతి ఆలోచించరేం! తలా వోపక్కా కదలకుండా... వదలండి.....

ముగ్గురూ : మీరు ఊఁ అనే దాకా వదలం... వదలంగాక వదలం...

విజయలక్ష్మి : ఏమిటండి ఈ అఘాయిత్యం... వదలండి ముందూ....

క్రొత్త వ్యక్తి : (పిడుగులా ఘర్జిస్తూ) ఏరీ ఆ పుండాకోరెధవలు! ఎక్కడ ఆఁ ఆఁ నా మేనగోడలి మీదే అత్యాచారమా... ఎన్ని గుండెల్రా మీకు... ఏయ్ 104... 401 ముందు వీళ్ళని... ఈ దగుల్బాజీ వెధవల్ని... నా కళ్ళ ముందే కీళ్ళు విరగ్గొట్టి అనక జైల్లో పారెయ్యండి... ఆఁ.. (ఆవేశపడుతుంటాడు)

ముగ్గురూ : (గగ్గోలుగా) విజయలక్ష్మిగారూ...

విజయలక్ష్మి : ఉండు మామయ్యా, నీవంతా తొందర. వాళ్ళు నన్నేం చెయ్యడంలేదు గాని నిదానించు.

క్రొత్త వ్యక్తి : తొందరంటావేంటమ్మా. ఈ రాస్కెల్సు... అనాపరకా ఆవారాగాళ్ళు నన్ను.. నన్నెంత అవమానించారో తెలిస్తే... తెలిస్తే. నువ్వింత....

విజయలక్ష్మి : కాస్త నీ ఆవేశం తగ్గించుకుని నేను చెప్పేది కూడా విను... అసలేం జరిగిందంటే.....

మా ఇంటిపేరు ఎ అని వీళ్ళకు తెలియదు. వాళ్ళు ఏ విజయలక్ష్మీ అని ప్రశ్నిస్తుంటే నువ్వు ఏ విజయలక్ష్మీ అని తిరిగి ప్రశ్నిస్తున్నావనుకున్నారు. దానికి తోడు రైలు ప్రయాణంవల్ల నలిగి పోయిన బట్టలు చెరిగిన తలా చూసి ఏదేదో ఊహించేసుకున్నారంతే..... సందర్భానికి తగినట్లే పేపర్లో ఫొటో చూడ్డం వల్ల మరీ అనుమానం పెరిగి పోయింది.... ఇప్పుడు నువ్వెవరివో తెలిశాక చూస్తున్నావుగా నా కాళ్ళూ గడ్డాలూ పట్టుకుని ఎలా బ్రతిమాలు కుంటున్నారో.

క్రొత్త వ్యక్తి : (పెద్ద పెట్టున నవ్వుతాడు) వోరి బడుద్దాయిలూ! ఎ తెచ్చినతంటానా ఇదంతా అలా అయితే నీ కివ్వాలమ్మాయ్ ఫనిష్మెంటు.... ఆఁ... (పెద్దగా ఇల్లెగిరి పోయేలా నవ్వుతాడు)

ముగ్గురూ : (ఆశగా) అలా అయితే మమ్మల్ని క్షమించేసినట్లేనా సార్.....

క్రొత్త వ్యక్తి : (పెద్దగా నవ్వుతూ) అట్లే... అట్లే.....

సిమ్మాద్రి : మరి నన్ను గూడానాండి అయ్యగారూ... ఎడెడ టియ్యగూడా తెచ్చినాను మీకు.....

క్రొత్త వ్యక్తి : అలాగయితే నిన్ను స్పెషల్గా క్షమించేశారా సిమ్మాద్రీ...... (పెద్ద పెట్టున నవ్వుతాడు)
(అందరూ నవ్వుతుండగా తెర) ●

బహుమతి పొందిన లేఖ

జన్మదిన శుభాకాంక్షలు

18-8-89 సంచిక నటి భాగ్య ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్రుల అభిమాన పత్రిక "ఆంధ్ర సచిత్ర వారపత్రిక" మమ్మల్ని అడుగడుగునా ఆనందంతో ముంచివేసిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఇది పొగడ్త గాదు- నా మనసులోని మాట.

"దెయ్యాల కథల పోటీ" పెడుతున్నట్లు ప్రకటించి మా చేత "బాబోయ్" అనిపించారు. "దొంగల రాజ్యంలో", "భలే పెళ్ళి" చదువుతున్నంత సేపు, క్షణం క్షణం ఆనందం అన్నట్టుంది మా పరిస్థితి.

"వీక్లీ పోస్ట్"ని మీరు ప్రోత్సహిస్తున్న తీరును చూస్తుంటే "నేటి ఉత్తరాల రచయితలే" రేపటి "నవలా రచయితలు" అన్నట్టుంది. మీరు కనీసం పది మందికి "వీక్లీ పోస్ట్"లో స్థానం కల్పించాలని మనవి.

ఈ మధ్య ప్రవేశ పెట్టిన "మాటకారుల పేజీ"లో ఒక చిన్న మార్పు చేస్తే బాగుంటుందని నా ఆలోచన. మీరు ఇచ్చే షరతుకు లోబడి పదములు వ్రాసి పంపమని చెప్పారు. మీరు ఇచ్చిన షరతుకు లోబడే అనేక పదాలు ఉండటానికి అవకాశం ఉన్నది. అప్పుడు చాలామంది ఎక్కువ పదాలు వ్రాయడం, వారందరి పేర్లు పత్రికలో వేయవలసి రావడం జరుగుతుంది. ఇలా ఎక్కువ సంఖ్యలో పాఠకుల పేర్లు పత్రికలో వేస్తే అది మిగతా పాఠకులకు అసౌకర్యంగా ఉండడం తప్పనిసరి. కాబట్టి "పై షరతులకు లోబడి ఉన్న పదము ఏదో ఒకటి ఇదే సంచిక లోనిది వ్రాసి పంపండ"ని, ఇలా చేయడం వల్ల పాఠకుడు (రాలు) పూర్తి పత్రిక చదవడం జరుగుతుంది.

సీరియల్, కథలకు సంబంధించిన బొమ్మలు ఈ మధ్య ఆకర్షణీయంగా ఉన్నాయి. కళాకారులకు నా అభినందనలు.

నేనున్నది మదనపల్లి ఐనా చదవురీత్యా 'నంద్యాల'లో ఉంటున్నాను. ఇక్కడ నుండి 'నంద్యాల'కు రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు నా చేతిలోని మన 'పత్రిక'ను చూడటం, ఇప్పించుకొని చదివిన తరువాత ఆశ్చర్యపోవటం జరిగింది. వాళ్ళు దాదాపు ఐదేళ్ళకు ముందు పత్రికను చూస్తూ నిలిపేశారట. ఇప్పుడు చూస్తూనే ఎగిరి గంతేసినంత పని చేశారు. వాళ్ళు మళ్ళీ పత్రిక పాఠకులయ్యారు. ఇలా దాదాపు ఆరు మందిని, నా రూమ్మేట్స్ మరో ముగ్గురిని 'పత్రిక' పాఠకులుగా చేసి నేను 'పత్రిక' పాఠకుడ్నని పించుకున్నాను.

ఈ కాలం పాఠకులు ప్రతి పేజీలో 'వెరైటీ'ని కోరుకుంటున్నారు. కనుక వారి అభిరుచి మేరకు మీరు పత్రికకు అన్ని హంగులు కల్పించండి. 'భళారే చిత్రం' ఈ మధ్య ప్రచురించడం లేదు ఎందుకని?

'సంపాదకీయం', 'తాజాకాలమ్' వ్యాసాలను ప్రతి ఒక్కరు చదివి తీరవలసినవిగా ఉన్నాయి. వ్రాస్తున్న మహానుభావులకు వందనాలు. పత్రిక ఇంతగా ఎదగడానికి కారణాలు- ప్రతి పాఠకుడిని దృష్టిలో ఉంచుకోవటం, వారి సలహాలను పాటించటం, సంపాదకుల కృషి. "కృషితో నాస్తి...." సూక్తిని నిజం చేసింది మన ఆంధ్ర సచిత్ర వారపత్రిక. "శత్రు సంహారం" సస్పెన్స్‌తోనూ, వజ్ర సంకల్పం ఆసక్తితోనూ, వినోదభరితంగా భలేపెళ్ళి సాగు తున్నాయి. కథల 'ఎన్నిక'లో బెస్ట్ అనిపించుకొంది పత్రిక.

వారం వారం ప్రత్యేక వ్యాసాలతో ఏదో ఒక వ్యాధి గురించి విపులంగా తెలియ చేస్తూ పాఠకులకు సలహాలు సూచనలు ఇస్తున్నారు- థ్యాంక్స్.

ఎనభై ఒక్క వసంతాలు పూర్తి చేసుకొని ఎనభై రెండులోకి అడుగు మోపబోతున్న పత్రికకు నా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

– పి. కరీంఖాన్, మదనపల్లి రోడ్ (ఆర్. యస్.)

> **ఈ వారం సలహా**
>
> హైదరాబాద్ సికిందరాబాద్‌లకు మీరు ఉత్తరాలు రాస్తే చిరునామా యింగ్లీష్‌లో లేదా ఉర్దూలో రాయండి లేదా మీ లెటర్స్ డెడ్ లెటర్ ఆఫీసు చేరే ప్రమాదం వుంది.

వీక్లీ పోస్ట్

(4 వ పేజీ తరువాయి)

కొత్త ఉద్యమం?!

మొన్నీమధ్య ఆంధ్రవారపత్రిక తాజాకాలం చదువుతూ వుంటే అనిపించింది!

ఈసారి, కేంద్రంలో ప్రధాని పదవి, రాష్ట్రాలలో ముఖ్యమంత్రి పదవులు వెనుకబడిన వారికి కేటాయిస్తే బాగుంటుందని (ఎవరు గెల్చినా సరే) ఇటువంటి అవకాశం యిస్తే- ప్రపంచ చరిత్రలోనే ఒక సంచలనం కలుగుతుంది!

ప్రస్తుతం వెనుకబడిన వారి గురించి ఆలోచిస్తున్న నాయకులు ఈ విషయం ఆలోచించి, ప్రధాని, ముఖ్యమంత్రి పదవులు (అన్ని రాష్ట్రాలలో)- వెనుకబడిన వారికి ఇవ్వాలని, అది కూడా ముందుపడిన జాతుల మీద 25 శాతం ఓట్లు వచ్చినా, ఆపదవులు వారికే ఇవ్వాలని కోరుతూ వున్నాను- ఈ రకంగా అయినా ప్రధాని కావాలని కలలుకన్న బాబూ జగ్‌జీవన్‌రామ్ (ఆశ)యం నెరవేర్చిన వారం అవుతామని అనుకుంటున్నాను.

– గీతా సుబ్బారావ్ (హైదరాబాద్)

Editorial Adviser: *S. RADHAKRISHNA*, Editor: *VEERAJI*,
Printed and Published by *S. NAGESWARARAO* for Nageswara Rao Estates Ltd.,
at the Andhra Patrika Press, Gandhi Nagar, Vijayawada-520003.
Phones: Editorial: 75667, Business: 61247, 61248.



ALLWYN
QUARTZ
ఆల్విన్ క్వార్ట్జ్:
మీ వలె విశిష్టమైనది!
మీకు మీ ప్రత్యేకమైన జీవన శైలి, ప్రత్యేకమైన జీవితపు విలువలు వున్నాయి. కాలంతో కదిలే ప్రపంచంలో కాలం మీ ప్రక్కన వుండటంతో మీరు విశిష్ట వ్యక్తిగా నిలబడతారు.
కాలం పరీక్షకి నిలిచిన ఆల్విన్ క్వార్ట్జ్ గడియారాలు. ప్రపంచపు మేటి సాంకేతిక విజ్ఞానంతో సృష్టించబడిన గడియారాలు. అందమైన గోల్డ్ లేక నాజూకుగా వుండే స్టెయిన్‌లెస్ స్టీల్ కేసులలో అత్యుత్తమ కాలసూచిక వుంటుంది. మూవ్మెంట్లోనే కాక మీరు ఊహించలేనంత ఆశ్చర్యం కలిగించే 250 మోడల్స్‌లో మీకు నచ్చిన గడియారాన్ని ఎన్నుకోండి. ఆల్విన్ ప్రతి గడియారమూ మీ వలె ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగి వుంది.
Time
FOR THE NEW GENERATION
ALLWYN
Manufactured under licence from
SEIKO
R K SWAMY/HAL/6959/TEL

సాహితీ పజిల్

గెల్చుకోండి రు.200/-

గళ్ల నుడి కట్టు -18


ఆధారాలు

నిలువు		అడ్డం	
1.	ఆకారం వచ్చినా కాంక్ష మారలేదు	1	అచ్చేసి వదలిన పొత్తు
2	నీతులు వల్లిస్తాడు– కాని లోపల ఉన్నాడు దుర్మార్గుడు	3.	పండుగనే ఇలా అంటారు
3.	కళ్ళు బుళ్ళు కలిస్తే ఇదవుతుంది	5	బహిష్కరించటం
4.	ముఖ్యంగా దీన్ని పూర్తిచేసి సాహిత్యాన్ని పెంచుకోండి	6	పగలును మొదలు మారిస్తే విలాసాలు
5	ఇది ఏ చేతిలో వేవున్నది	8	ఈనాములో అటు నుండి జొన్నచేను కోస్తే చిగురించింది
7	గుట్టును మారిస్తే కొండ	10	జనమేజయుడి తండ్రి
9	విజ్ఞానం, వినోదం అందించే దీన్ని స్థాపించిన దేశోద్ధారకుడు	11.	అటు నుండి మామగారు
12.	నీరు దీనివెంట పోతుంది	13	కలవరపడకండి బతవుంది
14	మ్రొక్కిన ఈయని వేల్పు	15	బంగారమాయరా కోదండపాణి
15	ఈ వారం పత్రిక వచ్చిందనగానే మిరిది తీస్తారు	17	పలావులో బలమున్నది
16	కులుకులాడిలో ఇది కనిపిస్తుంది	18	కుట్టటం కాదు ఆభరణం
17	పేలాలను ఇలా అంటారు	19	కవులు వీటిని తుమ్మెదల వరుసతో పోలుస్తారు

ఆధారాలున్నాయి. నుడికట్టు గళ్ళు నింపండి! ఈ కూపన్ కత్తిరించి మీ చిరునామా రాసి పంపండి! ఆల్ కరెక్ట్ సొల్యూషన్ పంపినవారికి రు. 200/– లు బహుమతి లభిస్తుంది– ఒకరికన్నా ఎక్కువమంది కరెక్టు ఆన్సర్‌లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే!

–ఎడిటర్

ముగింపు తేది : 29-9-'89



కూర్పు : పింగళి వి. కృష్ణారావు

ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపినవారి పేరు : ....

పూర్తి చిరునామా : ....

.... పిన్‌కోడ్..............



బొమ్మల బ్రహ్మ 'బాపు'కు కళాప్రపూర్ణ

ఆంధ్రా యూనివర్శిటీ గౌరవ పట్టాలు ప్రదానం చేయనున్న ప్రముఖులలో "బాపు" పేరుండటం కొంచెం ఆలశ్యంగా జరిగినా అందరికి అమితానందం కలిగించే విషయం. ఆంధ్ర విశ్వ విద్యాలయం 61వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని 'కళాప్రపూర్ణ' బిరుదులను అందుకుంటున్న ప్రముఖులు వీరు : శ్రీ బాపు, పార్లమెంటు సభ్యుడు, నటుడు శ్రీ రావు గోపాలరావు, ఫిలిమ్స్ డివిజన్ మాజీ సంగీత దర్శకుడు శ్రీ వై. విజయరాఘవరావు.

ఆంధ్ర విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. రామకృష్ణారావు, మాజీ ఎం. పి. ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, ఆంధ్ర విశ్వ విద్యాలయం మాజీ హిందీ ప్రొఫెసర్ శ్రీ జి. సుందరరెడ్డి, డాక్టర్ కోరుకొండ సుబ్బరాజు, బంగ్లాదేశ్‌లో మాజీ యు. ఎన్. డి. పి. నిపుణుడు ప్రొఫెసర్ జి. పార్థసారథి, శ్రీ డి. సన్యాసి, నాదస్వర విద్వాన్ శ్రీ దోమాడ చిట్టిఅబ్బాయి, 'ప్రజాబంధు' సంపాదకుడు శ్రీ ఇ. ఎ. చిన్నయ్య, డాక్టర్ త్రిపురనేని వెంకటేశ్వరరావులకు కళాప్రపూర్ణ ప్రదానం చేస్తారు.

క్రీడా ప్రపూర్ణ సి. ఎస్. నాయుడు

కెప్టెన్ సి. ఎస్. నాయుడుకు క్రీడా ప్రపూర్ణ బిరుదును, యు. జి. సి. ఛైర్మన్ ప్రొఫెసర్ యశ్‌పాల్, ఇండియన్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ (బెంగుళూరు) డైరెక్టరు ప్రొఫెసర్ సి. ఎన్. ఆర్. రావు, ఓషన్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ ఎ. కె. గౌర్‌లకు డి. ఎస్సీ గౌరవ పట్టాలను ప్రదానం చేస్తారు.

36

పాఠకులకో సవాల్!

బంద్ లు చెయ్యి భోజనం మానేయ్! నే మాత్రం దిగను కాక దిగను.

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలేగాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్ట వచ్చినట్లుండరాదు... కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!– ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం.

29-9-'89 లోగా అందేలాగా రిపార్టీలు పంపించాలి!

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక– మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేకపోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహ పడక మళ్లీ ప్రయత్నించండి!

–ఎడిటర్

అయ్యో రామా! మీరా? మీసం తీసేస్తే బృహన్నలనుకున్నా!

★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:

"ఈ మధ్య సంపెంగనూనె దొరక్క మీసం తీసానులే...!"

– పి. శ్రీనివాసులు (అనంతపురం)

★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:

"టి. వి. భారతంలో భీముణ్ని చూళ్లేదా?"

– టి. రాంప్రసాద్ (ప్రొద్దుటూరు)

మరి కొన్ని వాగ్బాణాలు

"మీసాలు గుచ్చుకుంటున్నాయి అన్నావుగా.... అందుకు!"

– కె. బి. కృష్ణ (పలాస) మాధవ్ (హైదరాబాద్)

"పెడదామంటే నిమ్మకాయలు దొరకటం లేదు!"

– అడివి అప్పన్న (అమ్మనబ్రోలు)

"అలాగైనా బాగుండేది. నీ కోసం యిలా వచ్చే బాధ తప్పేది."

– కె. విజయభాస్కర్ (కొల్లూరు)

"ఇంకానయం 'శిఖండి' అనుకోలా!"

– జి. సత్యం (సూళ్లూరుపేట)

లక్కీ పేర్లు

ఎ. జె. కుమార్ (భీమవరం), అల్లాడి శారద (హైదరాబాద్), ఎస్. సత్యశ్రీ (బి. కొండపాడు), ఈశ్వరి (సికింద్రాబాద్), సిహెచ్. శ్రీధర్ (అనపర్తి), కంకటి శంకర్‌రావు (సిర్పూర్ కాగజ్‌నగర్), ఎం. ఎ. శకుంతలా కళ్యాణి (విశాఖపట్నం), ఎ. ఎల్. రాఘవరావు (కొత్తగూడెం), వి. అప్పారావు (నౌపడా), ఎల్. వరహాలమ్మ (వెంకమ్మపేట), షేక్ బాబ్జీ (మార్టేరు), ఎం. సీతన్నాయుడు (మచిలీపట్నం), సిహెచ్. చిన తిరపతయ్య (కొత్తపల్లి), ఎం. సిద్ధార్థకుమార్ (లేబూరు), బి. దేవానందం (మద్రాసు).



సినిమా... సినిమా...

—జి.వి.జి.

చిరంజీవి, రవిరాజా కాంబినేషన్‌లో స్కంధ ఆర్ట్స్ చిత్రం

"ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ పిక్చర్ బెంగుళూరులో ఆగస్ట్ 7 నుంచి మూడు రోజులపాటు షెడ్యూల్ జరిగింది," అన్నారు రవిరాజా పినిశెట్టి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో పి. రామచంద్రారెడ్డి నిర్మించే స్కంధ ఆర్ట్స్ చిత్రంలో చి..., రాధిక, అమల, రావుగోపాలరావు, సత్యనారాయణ, గొల్లపూడి మారుతీరావు, అల్లు రామలింగయ్య, కోట శ్రీనివాసరావు, సుధాకర్, ప్రసాద్‌బాబు, బ్రహ్మానందం, దివ్యవాణి తారాగణం సత్యానంద్ మాటలు, వేటూరి పాటలు, రాజ్-కోటి సంగీతం, లోక్‌సింగ్ ఛాయ, చంటి శిల్పం, ఎస్. బి. చక్రవర్తి సూపర్‌వైజింగ్ డైరెక్షన్, ఎ. మ...వరావు సంయుక్త దర్శకత్వం, వి. మో... ప్రొడక్షన్, పుల్లారావు సహకార దర్శకత్వ వెల్లెస్వామి కూర్పుతో టి. ప్రభాస్ కుమార్ రెడ్డి సహనిర్మాత "సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 10 వరకు ప్రతినెలా మొదట పది రోజులు జరిగే నాలుగు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది." అన్నారు నిర్మాత పి. అమరనాధరెడ్డి.

చిరంజీవితో రమాఫిలిమ్స్ కౌబాయ్ చిత్రం

"సినిమా స్కోప్-స్టీరియోఫోనిక్ సౌండ్ సిస్టమ్ చిత్రం ఉత్తరభారతంలోని రాజస్థాన్ తదితర ప్రాంతాలలో ఔట్‌డోర్ షూటింగ్ జరుపుతాం చిరంజీవి సరసన రాధతోపాటు మరో నాయిక ఉంటుంది" అన్నారు కైకాల సత్యనారాయణ ఈయన సమర్పించే రమా ఫిలిమ్స్ కౌబాయ్ చిత్రానికి రాజ్ కోటి సంగీతం, కె. ఎస్ హరి ఛాయ, భాస్కరరాజు శిల్పం, సలీం నృత్యాలు, రాజు సాహసాలు, నాగేశ్వరరావు కూర్పుతో కె మురళీమోహనరావు దర్శకుడు. కె. నాగేశ్వరరావు నిర్మాత ●

శ్రీదేవి కబుర్లు

★ నా చిన్నతనంలో మా అమ్మ స్కూలుకి తీసుకు వెళ్ళినట్లే -షూటింగ్‌కు తీసుకు వెళ్ళేది. క్లాసులోకి వెళ్ళినట్లే సెట్‌లోకి వెళ్ళేదాన్ని డైరెక్టర్ ఏడవమంటే ఏడుపు-నవ్వమంటే నవ్వు- కూర్చోమంటే కూర్చునేదాన్ని! షూటింగ్‌కి వెళ్తే. అమ్మ మంచి బట్టలు కొనేది! రకరకాల మంచి తినే పదార్థాలు పెట్టేది! అంతే నాకు తెలుసు!

★ ఇవాళ నెంబర్ వన్ హీరోయిన్ అంటున్నారు ఇంత కొద్ది కాలంలో ఈ స్థాయికి ఎలా వచ్చానో నాకే ఆశ్చర్యం!

★ ప్రేమించడం అంటే తెలుసు! కానీ, నేను ఇంతవరకూ ప్రేమలో పడలేదు! నేను ప్రేమించేది మా అమ్మని! నా వృత్తిని!! అంతే!

★ 150 చిత్రాలకు పైగా నటించాను కానీ. నాకు ఆనందాన్ని తృప్తిని యిచ్చిన పాత్ర యింతవరకూ లభించలేదు! ఈ పాత్ర శ్రీదేవి తప్ప మరెవరూ ఇంత గొప్పగా నటించలేరు అని జనం చెప్పుకోవాలి! అలాంటి పాత్ర కావాలి నాకు!!

★ ఫిలిం ఇండస్ట్రీ చాలా మంచిది! వచ్చే జన్మలో కూడా నేను నటిగానే పుట్టాలని మనసారా కోరుకుంటున్నాను.

—గీ